# సారంగపాణి పదములు

పరిష్కరణ - పీఠిక

ఆచార్య గల్లా చలపతి

ప్రచురణ
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
2013

**SĀRANGAPĀṆI PADAMULU** **(Telugu)**
Edited with Introduction

By
**Prof. Galla Chalapathi**

©All Rights Reserved

T. T. D. Religious Publications Series No. 929

First Edition : 2013

Copies : 1,000

*Published by :*
**M.G. Gopal,** I.A.S.,
**Executive Officer,**
**Tirumala Tirupati Devasthanams,**
**Tirupati - 517 507.**

*Cover Design :*
**B. Guru Kumar Reddy**
Chief Editors' Office.

*DTP :*
**Chief Editors' Office.**

*Printed at :*
**Tirumala Tirupati Devasthanams Press, Tirupati.**

# పదార్చన

సంసారం ఒక వృక్షమైతే, అందులో సత్ సాహిత్యం, సత్ సాంగత్యం అనేవి రెండు అమృత ఫలాలంటారు జ్ఞానులు, అనుభవజ్ఞులు. పదకవుల సంకీర్తనా వృక్షం నిండుగా అమృతఫలాలే ఉన్నాయి. ఆ సుమధుర ఫలాలను ఆరగించడానికి అలవాటు పడిన మనసుకు మరెందులోనూ తృప్తి, ఉపశమనం లభించదు. అంతటి శక్తివంతమైనవి సంకీర్తనలు. వాటిని నిశ్చలమైన మనస్సుతో వింటే, యుగయుగాలనాటి ఆ శ్రీహరి లీలల్ని ప్రత్యక్షంగా చూస్తున్న దివ్యానుభూతి కలుగుతుంది. చుట్టూ అలముకొన్న భయంకరమైన సమస్యల చీకట్లన్నీ పటాపంచలై జ్ఞానజ్యోతితో గమ్యాన్ని దర్శిస్తున్న స్ఫూర్తి కలుగుతూ ఉంటుంది.

పదకవితా పితామహుడైన అన్నమయ్య అందించిన సంకీర్తన గానామృత ఝరి కలియుగప్రత్యక్షదైవాన్నే కదిలించింది, కరిగించింది. మృదుమధురమైన పదజాలంతో మాటల్నే పాటలుగా మలచి, తనదైన వాణిలో, బాణిలో ఏడుకొండలవాడిని మెప్పించిన పరమభాగవతోత్తముడు అన్నమయ్య. ఒక చోట పరబ్రహ్మ, ఒకనోట కోనేటిరాయడు, మరోచోట చిన్నికృష్ణుడు ఇలా వేవేల రూపాలలో ఆ స్వామిని దర్శించి దర్శింపజేసి, తరించి తరింపచేసిన పదకవితా సమ్రాట్టు అన్నమయ్య. ఈ కోవకే చెందిన మరో పదకవి **సారంగపాణి.** క్షేత్రయ్య తర్వాత వచ్చిన పదకర్తలలో సారంగపాణి ప్రముఖుడు. ఈయన కూడా అన్నమయ్య బాటలోనే శృంగార, ఆధ్యాత్మిక పదాలను రచించి చిత్తూరు జిల్లా, తిరుపతి పుణ్యక్షేత్రానికి సమీపంలో ఉన్న కార్వేటినగర వేణుగోపాల స్వామికి అంకితమిచ్చాడు. తెలుగువారి మధురభక్తితత్త్వానికి, రాయలసీమ రసికజనుల నుడికారానికి వారధివంటివాడు సారంగపాణి.

శ్రీవారి స్థిర సంపదల్లో ఒకటైన పదసాహిత్య సంపదను కాపాడడంలో మున్ముందు తరాలకు అందించడంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఎప్పుడూ అగ్రగామిగానే ఉంటోంది. అన్నమాచార్యులు, ఆళ్వార్లు, తరిగొండ వెంగమాంబ మొదలైన మహాభక్తుల పేరిట వివిధ వాఙ్మయ ప్రాజెక్టులు

నెలకొల్పి, వారి సాహిత్య పరిమళాలను నలుదిశలా వ్యాపింపజేస్తున్నది. ఈ కృషిలో భాగంగా ఇటీవల ఆచార్య గల్లా చలపతిగారు చేసిన తాళ్లపాక అన్నమాచార్యచరిత్ర వ్యాఖ్యానాన్ని కూడా తి.తి.దే. ప్రచురించింది. ఈ వ్యాఖ్యానం విశేష పాఠకాదరణను పొందింది.

కేవలం శ్రీవారిని స్తుతించిన వాగ్గేయకారులనే కాకుండా శ్రీవారి ఆలయపరిధిలోని ఇతర ఆలయాలలో ఉన్న అర్చామూర్తులను కొలిచిన పదకర్తల వాఙ్మయాన్ని కూడా ప్రచారంలోకి తీసుకురావడం కూడా ఎంతో అవసరం. అందులో భాగంగా కార్వేటినగర వేణుగోపాలునికి తన పద పుష్పాలతో కైంకర్యం చేసిన పరమభాగవతోత్తముడైన అయిన సారంగపాణి సాహిత్యాన్ని పాఠకలోకానికి అందించవలసిన అవసరం ఉంది.

భగవత్సాయుజ్య ప్రాప్తికి కలియుగంలో కీర్తనం సాధనం. తదనుగుణంగానే వేణుగోపాలుని తన పదాలతో సంకీర్తించాడు సారంగపాణి. ఆయన తన పదాల్ని ఆత్మనివేదనకే పరిమితం చేసుకోలేదు. ఆంతరంగిక పరిధులు ధాటి విశ్వాంతరంగికవిషయవీథుల నధిగమించి విశ్వవిభుని లీలా వైభవానికి దర్పణం పట్టాయి ఆయన పదాలు. ఈయన మొత్తం 400 లకు పైగా పదాలు రచించినా, ప్రస్తుతం 210 పదాలు మాత్రమే లభిస్తున్నాయి. ఈ పదాలను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ విశ్రాంతాచార్యులు **ఆచార్య గల్లా చలపతి** గతంలో సప్రమాణంగా పరిష్కరించి విపులపీఠికతో ముద్రించారు. ఆ గ్రంథానికి తిరుమల తిరుపతి దేవస్థానం పాక్షిక ఆర్థికసహాయాన్ని అందించింది కూడా. మళ్ళీ ఇన్నేండ్ల తర్వాత తి.తి.దేవస్థానమే ఈ గ్రంథాన్ని **ఆచార్య గల్లా చలపతి** గారి అదనపు సమాచారంతో మరింత నిర్దుష్టంగా మీ ముందుకు తెస్తున్నది. పదసాహిత్యారాధకు లందరూ ఈ గ్రంథాన్ని ఆదరిస్తారని ఆకాంక్ష.

**కార్యనిర్వహణాధికారి,**
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

# ముందుకు వెళ్లేముందు

చిత్తూరుజిల్లాలోని కార్వేటినగరం ఒకప్పటి ప్రముఖ సంస్థానానికి కేంద్రం. కార్వేటినగర సంస్థానాధీశులైన వేంకటపెరుమాళ్రాజు, కార్వేటిరాజుల ఆస్థానాలను అలంకరించిన సారంగపాణి పండితుడుగా, వైణికుడుగా, అభినయాచార్యుడుగా, వాగ్గేయకారుడుగా ప్రసిద్ధిపొందినాడు. క్షేత్రయ్యకు త్యాగరాజస్వామికి మధ్యకాలంలో వర్ధిల్లిన సారంగపాణి కార్వేటినగర వేణుగోపాలస్వామికి అంకితంగా కొన్ని వందలపదాలు రచించాడు. కాని దొరికి ప్రచురింపబడినవి 210 పదాలు మాత్రమే. ప్రతిపదంలో 'వేణుగోపాల' పదముద్ర కనిపిస్తుంది.

శృంగార, దేశీయ, జాతీయ, కీర్తన పదాలుగా విభక్తమైన సారంగపాణి పదాలలో శృంగార, భక్తి, వైరాగ్య, తాత్త్విక, ధార్మిక, నైతికవిషయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ విషయాలు తనకాలంలో ఎలా అవాంఛనీయంగా పరిణమిస్తున్నాయో, పర్యవసానంగా సమాజంలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకొంటున్నాయో చూపడం వాగ్గేయకారుడైన సారంగపాణి తన కర్తవ్యంగా భావించాడు. శృంగారం ధార్మిక, నైతిక విషయాలను ఎలా కలుషితం చేసిందో చూడమని వేణుగోపాలునికి పదాల ద్వారా విన్నవించుకొన్నాడు. ఆంగ్లసంస్కృతి దేశీయ, సామాజిక, సాంస్కృతికవ్యవస్థను నిర్వీర్యం చేసిన విషయాన్ని తన పదాలలో స్పష్టం చేశాడు.

జాతీయపదాలలో సారంగపాణి తన కాలంలో సంభవించిన కరువు వల్ల జనజీవనం ఎలా చితికిపోయిందో చూపాడు. తిరునాళ్లు, సంతలు జరిగే సందర్భాలలో గ్రామీణ ప్రజల సంబరాలు ఎలా ఉంటాయో తెలుపుతూ గ్రామీణసంస్కృతిని అతి సహజంగా చిత్రించాడు. పామరులైన పల్లెప్రజలు మాట్లాడుకొనే తీరులను, వాళ్లు మాట్లాడే వాడుకభాషలోనే రచించి పాఠకులకు అప్పటి తెలుగు నుడికారపుసొంపును, మాధుర్యాన్ని చవిచూపాడు. అలా పాత్రోచితభాషకు కావ్యగౌరవం కలిగించాడు. అప్పటి సామాజికవ్యవస్థను అద్భుతంగా చిత్రించిన సారంపాణిపదాలు తెలుగువారందరికీ అవశ్యపఠనీయాలు.

ఇంత ప్రఖ్యాతి వహించిన ఈ సారంగపాణిపదాల్ని అనేక పూర్వప్రతుల్ని పరిశీలించి సప్రమాణంగా, నిర్దుష్టంగా **ఆచార్య గల్లాచలపతి** గారు పాఠకలోకానికి అందించారు. ఈ పరిష్కృత గ్రంథానికి వీరు రాసిన పీఠిక అనుపమానమైనది. సారంగపాణికాలం నాటి ఎన్నో సామాజికాంశాల్ని పరిశోధక పాఠకులకు కరతలామలకం చేశారు చలపతిగారు.

తిరుమలతిరుపతిదేవస్థానం ప్రచురణల ప్రతిష్ఠను ఈ గ్రంథం పెంపొందిస్తుందనడంలో ఎలాంటి విప్రతిపత్తి లేదు. ఈ అపురూపగ్రంథాన్ని తెలుగుభాషాప్రేమికులు, ప్రత్యేకించి పదసాహిత్యజిజ్ఞాసువులు ఎంతగానో అభిమానిస్తారని నా ఆకాంక్ష.

**డా॥ సి.శైలకుమార్**
ప్రధానసంపాదకులు, తి.తి.దే.,
తిరుపతి

# విషయ వివరణ


| | | |
|---|---|---|
| | మున్నుడి | i-iv |
| | పీఠిక | 1 |
| 1. | పదసాహిత్యం | 2 |
| 2. | పదం – నిర్వచనం | 3 |
| 3. | పదం – కృతి – కీర్తన | 6 |
| 4. | వాగ్గేయకారుడు | 9 |
| 5. | పల్లవి – అనుపల్లవి | 10 |
| 6. | భక్తి ఉద్యమం – పద కవిత | 13 |
| 7. | తెలుగులో పద కవులు | 18 |
| 8. | తత్త్వ కర్తలు | 24 |
| 9. | యక్షగాన కవులు | 27 |
| 10. | క్షేత్రయ్య యుగం | 29 |
| 11. | సారంగపాణి | 35 |
| 12. | సారంగపాణి దేశం | 37 |
| 13. | సారంగపాణి కాలం | 39 |
| 14. | వేణుగోపాల పదముద్ర | 43 |
| 15. | సారంగపాణి పదాల స్వభావం | 47 |
| | 1. శృంగార పదాలు 2. దేశీయ పదాలు | |
| | 3. జాతీయ పదాలు 4. కీర్తనలు | |
| 16. | సారంగపాణి భాష | 76 |
| 17. | ప్రతులు – పరిష్కరణ, | 82 |
| | సారంగపాణి పదాలు | 87 |
| | ముఖ్యమైనపదాలకు అర్థాలు | 329 |
| | జాతీయాలు – సామెతలు | 378 |
| | పదాల అకారాదిపట్టిక | 384 |

# మున్నుడి

చిత్తూరుజిల్లా దక్షిణప్రాంతంలో పుత్తూరుకు పశ్చిమంగా ఉన్న కార్వేటినగరం ఒకప్పటి సంస్థానం. దక్షిణభారతదేశంలో ఉండిన ప్రసిద్ధసంస్థానాలలో ఇది ఒకటి. మొదట కార్వేటినగరం కార్వేడు లేక కార్వీడు అనేపేరుతో ఒక పల్లెటూరు. కార్వీడు అంటే అడవిపల్లె (అడవిప్రాంతంలోని పల్లె) అని అర్థం. ఇక్కడ ఒక సంస్థానం ఏర్పడిన తరువాత కార్వీడు కార్వేటినగరంగా రూపొందింది. పట్టణవాతావరణం ఏర్పడింది. కొంతభాగం చిత్తూరుజిల్లాలోను, కొంతభాగం ఆర్కాటుజిల్లాలోను విస్తరించిన ఈ సంస్థాన స్థాపకుడు మొదటి వేంకటపెరుమాళ్రాజు. నగరనిర్మాణం ఆ రాజుతోనే మొదలైంది. 1719–1732 మధ్యకాలంలో ఆయన సంస్థానాధిపతి. అప్పటినుండి కార్వేటినగరసంస్థానం సుమారు 150 సంవత్సరాలు వర్ధిల్లింది. కార్వేటినగర సంస్థానాన్ని పాలించిన మాకరాజు వేంకటపెరుమాళ్రాజు ఆస్థానకవి, పండితుడు, వైణికుడు, విద్యాధికారి సారంగపాణి. పెరుమాళ్రాజు కొడుకు కార్వేటిరాజు ఆస్థానాన్ని కూడా సారంగపాణి అలంకరించాడు. కార్వేటినగర సంస్థానాధీశులు ప్రజాహితకార్యాలలోనే గాక సంగీతసాహిత్యాది కళలను పోషించడంలో కూడా శ్రద్ధ చూపారు.

సారంగపాణి కార్వేటినగరంలో కొలువై ఉన్న వేణుగోపాలస్వామికి అంకితంగా కొన్ని వందల పదాలు రచించినట్లు తెలుస్తున్నది. అయితే దొరికినవి 210 మాత్రమే. పల్లవి, అనుపల్లవి, చరణాలతో కూడి లక్షణానుసరణంగా రచింపబడిన సారంగపాణిపదాలు ఉత్తమ సాహిత్యస్థితిని కలిగి ఉన్నాయి. ఆ పదాలలోని విషయాలను పరిశీలిస్తే అప్పటి సామాజిక, సాంస్కృతిక అంశాలు స్పష్టంగా కనిపిస్తాయి. సారంగపాణి కాలం నాటికి దేశీయమైన పాలనావ్యవస్థ – ముఖ్యంగా రాచరిక వ్యవస్థ పతనస్థితిలో పడిపోయింది. దీనికి ప్రధానకారణం ఆంగ్లేయులపెత్తనం దేశమంతటా విస్తరించడం. దక్షిణ భారతదేశమంతా ఆంగ్లేయుల 'ఈస్ట్ఇండియాకంపెనీ' పాలన కిందికి వచ్చింది. తంజావూరు, మధుర సంస్థానాలు కూడా పతనస్థితికి చేరుకొన్నాయి. 'ఈస్ట్ఇండియాకంపెనీ' చేసిన మైసూరుయుద్ధాలలో నైజాంనవాబులు ఆంగ్లేయులకు సహాయం చేయడమేగాక రాయలసీమ మండలాలను స్వాధీనం చేశారు. అందుకే అవి దత్తమండలాలని పిలవబడినాయి. అప్పటినుండి కంపెనీపాలకులు దేశీయసంస్థానాల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం మొదలైంది. సంస్థానాధీశులను నయాన, భయాన లొంగదీసుకొనే ప్రయత్నం జరిగింది.

కంపెనీ ఉద్యోగులుగా ఎందరో శ్వేతజాతీయులు ఇంగ్లాండునుండి వచ్చి ఇక్కడ స్థిరపడినారు. వాళ్ల రాకతో, వాళ్ల జీవనవిధానంతో ఒక కొత్తనాగరకత ప్రారంభమైంది. దేశీయపద్ధతులు, సంప్రదాయాలు, సంస్కారరీతులు విలువను కోల్పోవడం ప్రారంభమైంది. (ఆంగ్ల) దొరల, దొరసానుల సంస్కృతి వ్యాపించింది. దేశీయులలో కొందరు వాళ్ల సంస్కృతికి అలవాటుపడి దొరల ప్రాపకం కోసం వెంపరలాడడం మొదలైంది. దేశీయుల విషయాలలో దొరలు కలగజేసుకోవడం వల్ల సమాజ నడతలో మార్పులు చోటుచేసుకోసాగాయి. అందువల్ల ప్రజల ఆహారవిహారాలలోను, కట్టుబొట్టులలోను, ఆలోచనావిధానంలోను గణనీయంగా మార్పులు రావడం కనిపించింది. ఈమార్పులన్నిటికి ప్రధానకారణం ఆంగ్లేయులప్రాబల్యం బలపడడం, దేశీయపద్ధతులు బలహీనపడడం. రాజ్యకాంక్షతో, తామే పెత్తనంచేయాలనే పట్టుదలతో ఆంగ్లేయులు సంస్థానాధీశులను కట్టడిచేసి, మాయోపాయాలతో వాళ్ల స్వేచ్ఛను హరించి పాలనను స్తంభింపజేశారు. వచ్చేరాబడిలో అధికశాతం దండుకోవడం ఆరంభించారు. సంస్థానాలు ప్రజావసరాలను తీర్చలేని పరిస్థితి ఏర్పడింది. సంస్థానాధికారులు యథాశక్తిగా ప్రజాహితకార్యాలు చేపట్టినా అంతం మాత్రంగానే కొనసాగాయి. ఈ పరిస్థితులతోపాటు అప్పుడు సంభవించిన కరువుకాటకాలవల్ల సామాన్యప్రజలు ఎన్నో అవస్థలకు లోనైనారు. వర్షాభావం, నీటికరువు, పశుగ్రాసం కరువు, పంటలు వేయలేని వేసినా పండని పరిస్థితులవల్ల పస్తులుండవలసిన పరిస్థితి దాపురించింది. మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ప్రజలు కూడా క్షామాగ్నికి శలభాలైనారు. ఉన్నదంతా ఇతరప్రాంతాలవారికి అమ్ముకోవలసిన దుస్థితి సంభవించింది.

ఆంగ్లేయుల దృష్టి దేవాలయాల ఆదాయవనరులపై పడడంతో దేవాలయాల నిర్వహణ కుంటుపడింది. కరువుకాటకాల సమయాల్లో ప్రజలను కొంతవరకైనా ఆదుకొంటూ ఉండిన ఆలయాలు ఆదాయం లేనివైనాయి. గుట్టుగా, పవిత్రంగా, ప్రాపంచికవ్యవస్థకు లోనుకాకుండా బతుకుతూ దైవకైంకర్యాలలో తలమునకలవుతూ దేవాలయాల్లో ఉంటూ ఉండిన దేవదాసీలకు దేవాలయాలలో జీవనభృతి కొరవడింది. బతకడం కోసం ఇతరవృత్తులు వెదుక్కొంటూ వీళ్ళు వీధులపాలు కావలసిరావడంతో పవిత్రమైన దేవదాసీవ్యవస్థ పతనమైంది. దేవదాసీలు సానులుగా ముద్రపడ్డారు. కొందరు అప్పటికి సంపన్నులైన పురుషపుంగవుల నాశ్రయించారు. కొందరు కొన ఊపిరితో కొనసాగుతూ ఉండిన సంస్థానాలలోని అధికారుల ప్రాపకం కోసం ప్రయత్నించారు. అధికారుల అండదండలు దొరికినవాళ్లు అధికారుల అవసరాలను తీరుస్తూ, వాళ్ల వల్ల దక్కిన అధికారంతో కొరత లేకుండా బతకడం నేర్చుకొన్నారు. అలాంటి స్త్రీల బంధువులు ఆ స్త్రీల అధికారాలను అడ్డం పెట్టుకొని బతికారు. ముఖ్యంగా అలాంటి స్త్రీల తమ్ముళ్లు అక్కల ప్రాబల్యాన్ని ఉపయోగించుకొంటూ విలాసజీవితం గడిపారు. ఇలాంటి విషయాలను కార్వేటినగరసంస్థానంలో కూడా సారంగపాణి గమనించాడు. ఆస్థానకవిగా సంస్థానంలోను, నగరంలోనే కాకుండా చుట్టుప్రక్క ప్రాంతాలలో కూడా తాను గమనించిన అంశాలను పదాలకెక్కించాడు. సానివ్యవస్థ పొందిన వికృతపు చేష్టలను తన పదాలలో అతిసహజంగా వర్ణించి ఆ వ్యవస్థను నిరశించాడు.

దేవదాసీవ్యవస్థనుండి భ్రష్టత్వం పొంది సానులైన మరికొందరు ఆంగ్లదొరల పంచన చేరారు. దొరలు ఉద్యోగరీత్యా సంసారాలను వదలిపెట్టి ఇంగ్లాండునుండి ఒంటరిగా వచ్చినవారు కావడంవల్ల కొందరు ఇలాంటి స్త్రీలను చేరదీశారు. సంసారాలతో వచ్చిన మరికొందరు తమ ఇండ్లలో పనిచేయడానికి సానులను ఉపయోగించుకొన్నారు. ఈ సానులు ఆ దొరల భార్యలను 'దొరసానులు' అని పిలిచేవారు. 'దొరసాని' లోని సానిశబ్దం అప్పటికి వేశ్య అనే అర్థంలో స్థిరపడి వేశ్య అంగడిసరుకుగా మారిపోయింది. ఈ సాంఘికస్థితిని గమనించిన



ఆంగ్లేయులు తమ భార్యలను 'దొరసానమ్మగార్లు' అని పిలవాలని కట్టడిచేశారు. పట్టణాలలో దొరల దగ్గర ఉండిన స్త్రీలు కష్టాలులేకుండా, కొరతలు లేకుండా, సుఖంగా బతుకుతున్నారని భావించి కార్వేటినగరంలోని, చుట్టుపక్క పల్లెలలోని స్త్రీలు పట్టణాలకు వలసలు వెళ్లడం చూచి సారంగపాణి ఎంతో నొచ్చుకున్నాడు. ఒక భార్యను ఇంట్లో ఉంచుకొని ఇతర స్త్రీలతో సహవాసం చేయడం అప్పటి పురుషులు సాంఘికహోదాగా భావించిన రోజులవి. ఉన్నదంతా తమ భర్తలు సానులకు దోచిపెడుతుంటే కులస్త్రీలు ఏమీచేయలేక మౌనంగా కన్నీరు కార్చారు. ఎన్నాళ్లు పల్లెటూళ్లలో ఉన్నా ప్రయోజనం లేదని, పట్టణాలకు వెళితే సరదాలు తీరడమేగాక సుఖజీవనం లభిస్తుందని ఆలోచనచేసిన కొందరు కుటుంబస్త్రీలు కూడా సంసారాలను వదలి స్వైరవిహారం చేసిన సందర్భాలు సారంగపాణి కంటబడ్డాయి. సమాజం అలా భ్రష్టుపట్టిపోతున్నదని ఎంతగానో వగచి ఆ విషయాలను తన పదాలతో ప్రస్తావించాడు. పదాలద్వారా అవాంఛనీయ మార్పులకు లోనవుతున్న సమాజస్థితిని ప్రజల దృష్టికి తెచ్చాడు. దేశీయతను, సంప్రదాయాన్ని సడలిపోకుండా గౌరవిస్తూ, పరనాగరికత కలిగించే ప్రలోభాలకు లొంగవద్దని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో సహకరించమని స్ఫూర్తిని కలిగించాడు.

సారంగపాణి శృంగార, దేశీయ, జాతీయ, కీర్తన అంశాలకు సంబంధించిన విషయాలతో పదాలు రచించాడు. ఆయావిభాగాలకు చెందిన పదాలన్నీ 'వేణుగోపాల' పదముద్రతో భాసిస్తూ ఆయనకు గల భక్తితాత్పర్యాలను వ్యక్తంచేస్తున్నాయి. పదనిర్మాణంలోను, వర్ణ్యవస్తువును ఆవిష్కరించడంలోను, రాగతాళ ప్రస్తారంలోను, రసపోషణ విషయంలోను సారంగపాణి లక్షణానుగుణంగానే కనిపిస్తాడు. అయినా పదాలన్నిటా సామాజికాంశాలకే పెద్దపీట వేశాడు. ఆయన వాగ్గేయకారుడుగానే గాక సమకాలీన సామాజిక వ్యవస్థను విశ్లేషించే ఒక సంస్కరణవాదిగా కూడా పేరుపొందాడు. అప్పటికి పద్యకవులలో గాని, పదకవులలోగాని సామాజికాంశాలను అంత గొప్పగా పట్టించుకొన్న వారు తక్కువే.

'జాతీయం' అనే విభాగం కింద సారంగపాణి రాసిన 17 పదాలున్నాయి. ఆపదాలలో అప్పటి కరువు పరిస్థితులు, భిక్షగాండ్ల బెడదలు, పల్లెటూళ్లలో జరిగే తిరనాళ్లు, సంతలు, పామరవిటుల – వేశ్యల సంబంధాలు యథాతథంగా చిత్రింపబడినాయి. ఆ పదాలలో వాడబడిన భాష అప్పటి వ్యవహారభాషే. వివిధ సందర్భాలలో పామరులైన పల్లెజనం వాళ్లకు అలవాటైన భాషలోనే మాట్లాడుకోవడం సహజం. పామరుల భాషమీద ఏ ఇతర భాషల ప్రభావమూ పడదు. వీళ్లతో కలసిమెలసి ఉన్నా పండితులు పామరుల వ్యవహారంలోని పదాలను తమ రచనలలో వాడుకోరు. సారంగపాణి మాత్రం పట్టుబట్టి జాతీయపదాలను (142 నుండి 157 వరకు గల పదాలు) పామరుల వ్యవహారభాషలోనే రచించాడు. పామరులు మాట్లాడేభాష జాతికి సహజమైనదని, అచ్చ తెలుగు నుడికారం కలిగి అప్పటి సంస్కృతిని చక్కగా వివరిస్తుందని నమ్మినవాడు సారంగపాణి. అలాంటి భాషను దూరం చేసుకొంటే సంస్కృతిలోని ఒక పార్శ్వాన్ని పోగొట్టుకొన్నట్లు అవుతుందని కూడా అభిప్రాయపడినాడు. అందువల్లనే పామరప్రజలు మాట్లాడే భాషలోనే పదాలు రచించి తన భాషాప్రియత్వాన్ని వెల్లడించాడు. ఆ 17 పదాలలోని భాషాపదాలు ఇప్పటి వ్యవహారంలో లేకపోవడం వల్ల అర్థం చేసుకోవడంలో కొంత క్లిష్టత ఏర్పడుతున్నది. ఆ భాషా స్వరూపాన్ని గురించి కొంత అవగాహన కలిగి పదాలను అర్థవంతంగా విభజించుకొని ఆలోచిస్తే సులభంగానే బోధ కలుగుతుంది. అప్పటి గ్రామీణసంస్కృతి పఠితల మానసాలను తాకి ఆనందపరవశులను చేస్తుంది. పాత్రోచిత భాషాసిద్ధాంతస్పృహ కలగక ముందే సారంగపాణి ప్రజల స్వభావాలకు తగిన భాషను వాడి ఒక నూతనమార్గ ఆవిష్కర్త అయినాడు.

కొద్ది పదాలలో అన్ని ప్రత్యేకతలను చూపించిన సారంగపాణి క్షేత్రయ్యకు, త్యాగయ్యకు మధ్యకాలంలో జీవించి పదికాలాలపాటు శాశ్వతంగా నిలవగల సాహితీ సంపదను ఇచ్చిపోయాడు. ఆ పదాలలో కొన్ని పల్లెప్రాంతాల వృద్ధుల నోళ్లలో ఇప్పటికీ నానుతూనే ఉన్నాయి. అయినా అవి సారంగపాణివని వాళ్లకు తెలియదు. కొన్ని సినిమాలలో వాడుకోబడి వినిపిస్తున్నాయి. కేవలం చదివి ఆనందించడానికే కాకుండా నృత్యగీతాలుగా కూడా సారంగపాణి పదాలు పేరుపొందాయి. కార్వేటినగర సంస్థానంలో ఆయన నాట్యాచార్యుడుగా కూడా సేవలందించినట్లు చెపుతారు. అందుకే కాబోలు ఆయన పదాలకంత విలువ కలిగింది. కార్వేటినగరంలో సారంగపాణి అర్చించి తరించిన వేణుగోపాలస్వామి దేవాలయం ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానాల నిర్వహణలో ఉంది. ఆ స్వామికి అంకితమైన పదాలు తి.తి.దే. స్వీయముద్రణగా ప్రకటింపబడడం సంతోషించదగిన అంశం.



# నెనరు

సారంగపాణిపదాలు ఒక గ్రంథంగా ఏడుసార్లు ముద్రింపబడినాయి. ఆ ప్రతులలో దొరికిన వాటిని చూచి ఒక పరిష్కృతప్రతిని తయారుచేసి తి.తి.దే. ఆర్థికసహాయంతో నేను 1994లో ఎనిమిదవసారి ముద్రించాను. అందులో చేర్చవలసిన అంశాలు కొన్ని మిగిలిపోయాయి. ఇప్పుడు ఆ గ్రంథాన్ని తి.తి.దే. స్వీయముద్రణగా గ్రహించి ప్రచురిస్తున్నందుకు పదసాహిత్యాభిమానులు ఎంతో సంతోషపడాలి. ఈ ప్రతిలో మునుపటిప్రతిలో చేర్చడానికి అప్పుడు వీలుగాని కొన్ని అంశాలను చేర్చడం జరిగింది. గ్రంథం చివర అవసరమైన పదాలన్నిటికి అర్థవివరణలను చేర్చడం జరిగింది. జాతీయ పదాల (142–157)లోని భాష అవగాహనకు సరిగా లొంగకపోవడం వల్ల ఆ పదాలకు అక్కడక్కడనే భావ వివరణలు చేర్చబడినాయి. చివర పదాల అకారాది పట్టిక కూర్చబడింది.

ఈ గ్రంథప్రచురణకు తమ ఆమోదాన్ని తెలిపిన వారు తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీఎల్వీసుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్., సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ పి.వెంకట్రామిరెడ్డి, ఐ.ఏ.ఎస్., గార్లు. సాహిత్యాభిమానులైన ఈ ఇరువురు మహాశయులకు, సప్తగిరి మాసపత్రిక ప్రధాన సంపాదకులు డా॥ సి.శైలకుమార్, సంపాదకులు డా॥ కె.రాధారమణ, ఇతర సంపాదకవర్గానికి, తి.తి.దే. ప్రెస్సు మేనేజరు శ్రీ వి.సాంబశివరావు గారికి ధన్యవాదాలు.

తిరుపతి
తేది : 10–03–2013







# పీఠిక

కవిత్వం ఒక ఉత్తమకళ. ఆ కవిత లౌకికజీవిని సత్వభావసంపన్నమైన ఆధ్యాత్మికత వైపు కొనిపోవుట భారతీయసాహిత్యలక్షణం. ఈ లక్షణాన్ని తనలో ఇముడ్చుకొన్న పదకవిత సాహిత్యంలోని ఇతర ప్రక్రియలన్నిటిలో ముఖ్యమైనదిగా కనిపిస్తుంది. పదకవితా పితామహుడైన అన్నమయ్యకు (1408 – 1503) ముందుకాలం నుండీ పదకవిత వెలసి తెలుగుసాహిత్యాన్ని సుసంపన్నం చేసింది. అప్పటినుండి ఇప్పటివరకు ఎందరో పదకవులు వెలసి అసంఖ్యాకమైన పదాలను రచించారు. వాసికెక్కిన పదకవులలో అన్నమయ్య తరువాత క్షేత్రయ్య (1600–1660), త్యాగయ్య (1767 – 1847) ముఖ్యులు. చిత్తూరు మండలాంతర్గతమైన కార్వేటినగరసంస్థాన పోషితుడైన సారంగపాణి క్షేత్రయ్యకు తరువాత, త్యాగయ్యకు ముందు జీవించి పదములు రచించిన ప్రముఖుడు. 'పద'మనే మాటకు పారమార్థికంగా చోటు, స్థానం అని అర్థం. జీవి నివసించడానికి ఆధారమైంది స్థానం. స్థానగతుడైన జీవి ఎన్నో ద్వంద్వాలను ఎదుర్కోవలసి వస్తుంది. ఈ ద్వందాలలో జీవితానికి సంబంధించిన శృంగార వైరాగ్యదశలు అపరిహార్యం. భారతీయుల ఆలోచనల ప్రకారం ఇహపరాలు సత్యం. ఒకరకంగా ఇహానికి శృంగార భావాలతోను, పరానికి వైరాగ్య భావాలతోను సంబంధ ముంటుంది. అసాధారణమైన తపస్సంపన్నులు శృంగారస్థితితో సంబంధం లేకుండానే వైరాగ్యస్థితికి చేరుకొని జీవితధ్యేయాన్ని దర్శిస్తారు. సాధారణ మానవుడు శృంగారజీవితానుభవాలతో దాని అనిత్యను తెలిసికొన్న తరువాతనే వైరాగ్యభావాల కలవాటు పడతారు. జీవులను దైవాభిముఖంగా పయనింపచేసి వారిలో భక్తిని అంకురింపచేయడమే పదసాహిత్యం లేక కీర్తనా సాహిత్య ధ్యేయం. ఈ కారణం చేతనే పదాలలో శృంగార, ఆధ్యాత్మికభావాల వర్ణన ఎక్కువగా చోటుచేసుకొన్నది. పదాల ద్వారా జీవులను పరమపదం చేర్చడానికి పదకవులు ప్రయత్నించారు. జీవి పరమాత్మ సాక్షాత్కారం కోసం పడే తపనను, ఆర్తిని తెలపడానికి ఈ పదాలు వాహికలు కాబట్టి వీటిలో ఆయా పదకర్తల ఆత్మీయాంశ ఎక్కువగా ఉంటుంది.

# పదసాహిత్యం

పదాలు, కీర్తనలు జానపదుల అలిఖితసాహిత్యంలో చేరతాయి. వ్యాకరణాలంకార శాస్త్రపరిచయం లేని పామరులు తమ మానసికభావాలైన శృంగార వైరాగ్యాలను పాటలుగా కట్టి పాడుకోవడం ప్రాచీనకాలం నుండి ఉంది. వారికి తెలియకుండానే ఈ పాటలలో ఛందోఽలంకారాది లక్షణాలు కుదురుకోవడం వారి ప్రతిభకు తార్కాణం. తెలుగులో నన్నయ్యభట్టు కాలంనుండి సాహిత్యం కనిపిస్తున్నది. నన్నయ సృష్టించిన తెలుగుసాహిత్యం లిఖిత సంప్రదాయానికి సంబంధించింది. దీనికి సమాంతరంగా మౌఖికసాహిత్య సంప్రదాయం కూడా ఉండేది. ఈ సంప్రదాయంలో అవిరళంగా ప్రచారంలో ఉండి వివిధ సందర్భాలలో పాడబడుతూ వుండిన ఎన్నోరకాల పాటలను పాలకురికి సోమన తన 'బసవ పురాణం'లో గ్రంథస్థం చేశాడు. పామరుల పాటలకు సాహిత్యగౌరవం కలిగింది కూడా సోమన కాలంలోనే. మార్గ, దేశికవితా రీతులలో పద్యం మార్గకవితా రీతికి, పదం దేశికవితారీతికి చెందుతాయి. పదపద్య కవితలలో పదకవిత్వమే మొదట పుట్టిందని పండితుల అభిప్రాయం. పదకవిత్వంనుండి పద్యకవిత్వం పుట్టిందన్నా అంగీకరించక తప్పదు. " ప్రాచీన మానవుడు తనకు కలిగిన సుఖదుఃఖాది అనుభూతులకు అనుగుణంగా ఆడి పాడుకోవడంలోనే ఈ పదకవిత పుట్టింది. అదే కాలాంతరంలో సంస్కరింపబడి, దానినుండి విడివడి పద్యకవితగా, ప్రౌఢకవితగా పండితులచే అంగీకరించబడి, నిబద్ధం చేయబడి గౌరవపాత్రమైంది. పదకవితకు ఇంత గౌరవాదరాలు లేకపోయినా తనదారినది నడుస్తూనే ఉంది. వికాసం చెందుతూనే ఉంది. సామాన్య ప్రజల మన్ననలకు పాత్రమవుతూనే ఉంది. చివరికి పండితులచే సమాదరింపబడి రాజగౌరవ పురస్కారమైంది."[1]

పదకవిత, పద్యకవిత సమాంతరంగా వివిధకాలాలో అభివృద్ధి చెందినా భాషాపరంగా, ఛందఃపరంగా, వస్తుపరంగా ఈ రెండు కవితా సంప్రదాయాల మధ్య గణింపదగిన తారతమ్యం కనిపిస్తుంది. పామరసాహిత్యాన్ని జానపద సాహిత్యమని, అక్షరాస్యుల లిఖితసాహిత్యాన్ని శిష్టసాహిత్యమని సాహిత్య

1.గంగప్ప ఎస్.సారంగపాణి పదసాహిత్యం. 1980 పుట 16.



చరిత్రకారులు భావిస్తారు. ఈ రెండు శాఖలలో వేరువేరుగానే పరిశోధనలు జరుగుతున్నాయి. పదకవిత జానపదసాహిత్య పరిధిలో చేరినా దానికొక ప్రత్యేకత ఉంది. ఇది సంగీత సాహిత్యాలను సమంగా పొదుగుకున్న ప్రక్రియ. అందువల్ల పదకవితను జానపదసాహిత్యానికి, శిష్టసాహిత్యానికి మధ్యగల వారధిగా గ్రహించవచ్చు."సంగీత సాహిత్యాలకు కూడా అదొక సేతువు. వాగ్గేయకారులు మనకందించిన మహాసంపద పదకవిత. జానపదసాహిత్యమే పదకవితకు పుట్టిల్లు. శిష్టసాహిత్యం మెట్టినిల్లు. ఇది ప్రధానంగా పదకవితలోని విశిష్టత"[1] అన్న ఆచార్య, జి.యన్.రెడ్డిగారి మాటలను బట్టి పదకవితను శిష్టసాహిత్య స్థాయికి ఎదిగిన సాహిత్యప్రక్రియగా గుర్తించవచ్చు.

# పదం - నిర్వచనం

'పదం' అంటే సాధారణంగా 'పాట' అనే అర్థం. పదకవులందరూ పదం, పాట శబ్దాలను ఒకే అర్థంలోనే వాడుకొన్నారు. పదం రాగతాళాలతోగాని, లేక స్వర రహితంగాగాని ఉండవచ్చు. దేశికవితా ప్రక్రియలైన ఆశు, మధుర, చిత్ర, విస్తరములలో పదం మధుర కవితారీతికి చెందింది. యక్షగానాదులు మధుర కవిత్వ విభాగం కిందికి వస్తాయి. యక్షగానాదులకు జక్కుల పాటలని నామాంతరం.

యక్షగానములవంటి మధురకావ్యాలు చాల ఉన్నాయి. జాజరపాట, వెన్నెలపాట, అర్థచంద్రికలు, త్రిభంగులు, మటిమరేకులు, విరాళపదములు, అల్లోనేరేళ్ళు, గొబ్బిపాటలు, ధవళములు, ఏలలు, సువాలలు, చిలుకపదాలు, తుమ్మెదపదాలు, ఏకతాళి (ఎగతాళి), తందానపదాలు, జోలలు, జక్కులరేకులు, దరువులు, చందమామ పదాలు, నట్టొట్లు, సుద్దులు, కూనరాగాలు, చిందులు, జక్కిణి, మంగళహారతులు, జావళీలు, గీతార్థములు, కందార్థములు, సీసార్థములు, మొదలైనవన్నీ మధురకావ్య ప్రక్రియలు[2]. వీటికి పదకవితలని పేరు. లలితములైన దేశిపదములతో మనోహరార్థాలను ప్రతిపాదించే మాధుర్యలక్షణం వీటిలో

1.డా॥ ఎస్.గంగప్పగారి "తెలుగులో పదకవిత" అన్న గ్రంథానికి వ్రాసిన 'అభినందన'లో.
2.సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారి 'కావ్యాలంకారసంగ్రహ వివరణ' నుండి. పుట.255.

నిండుగా ఉంటుంది. దేశి సంగీత సాహిత్యాలకు సమప్రాధాన్యం గలిగి జానపదుల భావాలను స్నిగ్ధంగా, మనోహరంగా మాధుర్యలక్షణశోభితంగా ప్రకటించేది పదసాహిత్యం.

పదసాహిత్యం ప్రాచీనకాలం నుండి వ్యాప్తిలో ఉందనటానికి భరతుని నాట్యశాస్త్రంలో పదనిర్వచన ముండడమే తార్కాణం.

**"గాంధర్వం యన్మయా ప్రోక్తం, స్వరతాళ పదాత్మకం**
**పదం తస్యభవేద్వస్తు స్వరతాళాను భావకమ్,**
**యత్కించి దక్షీర కృతం తత్సర్వం పద సంజ్ఞితం**
**నిబద్ధం చానిబద్ధంచ తత్పదం ద్వివిధం స్మృతమ్ ॥**[1]

స్వరతాళపదాత్మకమైంది గాంధర్వం. అంటే పదం పాడుకోవడానికి వీలుగాఉంటుంది. స్వరతాళానుభావకమైన పదమే వస్తువు. అనగా ఒకపదంలో ఒక వస్తువు వర్ణించబడుతుంది. మరొక పదంలోని వస్తువుతో దీనికి సంబంధ ముండదు. పదములన్నీ ముక్తకాలే. ఈపదం నిబద్ధమని, అనిబద్ధమని రెండు రకాలు. నియతాక్షర సంబంధంతో ఛందోయతి సమన్వితమై రాగతాళములతో కూడిన పదం నిబద్ధపదం. యతిపాద నియమం లేనిది, అనియతాక్షరములతో కూడినది అనిబద్ధ పదం. పదకవులో తాళ్ళపాకకవుల పదాలన్నీ నిబద్ధాలే. సారంగపాణిపదాలలో అనిబద్ధపదాలు కూడా ఉన్నాయి. భరతుని నిర్వచన వివరణ ప్రకారం స్వరతాళాత్మకమై, ముక్తకమై, నిబద్ధానిబద్ధమై పాడడానికి అనుకూలంగా ఉండేది పదమని స్పష్టపడుతుంది. అన్నమాచార్యుల 'సంకీర్తన లక్షణాన్ని' తెలుగులో వ్రాసిన తాళ్ళపాకచినతిరుమలాచార్యులు

**'అందరిలో ఁబదమార్గ, ఛ్ఛందో మూధాత్మ కవిత చందంబుల గో**
**విందపదభక్తి విరహిత, మందుని ధర్మక్రియా క్రమంబున నడఁగున్.'**

*(సంకీర్తనలక్షణంలో 19 వ పద్యం)*

అనే పద్యంలో 'పదం' దేవస్తుత్యాత్మకంగా కూర్చిన పాటగా ఉండాలని అభిప్రాయపడ్డాడు. దీనిని బట్టి పదంలోని వస్తువు దైవస్తుతితో భక్తిరస నిర్భరంగా

1. భరతుని నాట్యశాస్త్రం. 32వ అధ్యాయం. 25. 26 శ్లోకాలు.



ఉండాలని అర్థమవుతుంది. మొదట పదాలు దేవస్తుత్యాత్మకంగానే ఉద్భవించినా తరువాత తరువాత సాంఘిక ప్రయోజనాలను గూడా దృష్టిలో ఉంచుకొని శృంగార, వైరాగ్య, నీతిబోధకాలు గూడా అయ్యాయి. అన్నమయ్య మాటల కొత్త కూర్పులు–

**"శ్రుతులై, శాస్త్రములై, పురాణకథలై, సుజ్ఞాన సారంబులై**
**యతిలోకాగమ వీధులై, వివిధ మంత్రార్థంబులై, నీతులై**
**కృతులై, వేంకటశైలవల్లభ రతిక్రీడా రహస్యంబులై**
**నుతులై................................"** వెలసినట్లు

*(సంకీర్తనలక్షణంలో 12 వ పద్యం)*

చెప్పబడింది. పదాలలోని వస్తువులు ఎన్ని రకాలుగా మారినది పై పద్యం సూచిస్తుంది. ఈ పద్యంలో అన్నీ ఒక ఎత్తు. 'వేంకటశైలవల్లభ రతిక్రీడా రహస్యంబులు' అన్నది మరొక ఎత్తు. పదాలలో శృంగారవిషయాలు కూడా ఉంటాయని, అవి అలౌకికంగా, దేవతాపరంగా ఉండాలని నియమం కనిపిస్తుంది. పదకవులలో ఈ నియమాన్ని అన్నమయ్య, రామదాసు తప్ప మిగిలిన వాళ్ళెవరు పాటించలేదు. దైవాంకితాలేగాక నరాంకితమైన పదాలను కూడా పదకవులు రచించడం చేత వీరి పదాలలో లౌకికశృంగారం, పైగా వేశ్యాశృంగారం కూడా పోషించబడింది. వీరు లౌకికశృంగారాన్ని వర్ణించినా అది ఉపాధేయం కాదని, నైతికవర్తన కలిగి, జీవితసత్యం తెలుసుకోవాలని భంగ్యంతరంగా ధ్వనింప చేయడం గమనింపదగిన విషయం.

స్వరతాళానుగుణమై, నిబద్ధానిబద్ధమై, శృంగార, నీతి, వైరాగ్యాది వస్తు గర్భితమైన పదాన్ని అనేకులు అనేకరకాలుగా నిర్వచించారు. పదానికి పాట, కృతి, సంకీర్తన అన్నవి సమానార్థకాలుగా వాడబడినాయి. వీటి నిర్వచనాలు, పరస్పరసంబంధాలు తరువాత వివరించబడతాయి. ముందు పదానికి సాహిత్య విమర్శకులు ఇచ్చిన నిర్వచనాలను పరిశీలిద్దాం. సంగీత సాహిత్యవేత్తలలో అగ్రగణ్యులైన రాళ్ళపల్లిఅనంతకృష్ణశర్మగారు పదాన్ని ఇలా నిర్వచించారు. "శృంగారమయమై , ఎక్కువగా విలంబనకాలమందు, క్వచిత్తుగా మధ్యమ కాలమందు నడచుచు పల్లవానుపల్లవములు మూడింటికి తక్కువగాని చరణములు గలిగి ప్రాచీనరక్తి రాగములలో చేయబడిన గేయరచనకు 'పదములని'

పేరు"[1] పల్లవి, అనుపల్లవి, చరణములు నియతంగా ఉండటం పదానికి ప్రధానమైన లక్షణం. 'పాడదగిన కావ్యానికి పదమని పేరు' అన్న పింగళి లక్ష్మీకాంతంగారి నిర్వచనంలో పదానికి కావ్యత్వం ఆపాదింపబడింది. ఆవేశపూరితుడైన జానపదుడు పదాన్ని ఆడుతూ పాడతాడు. శాస్త్రీయంగా విశ్లేషించినపుడు ఇందులో 'అడుగు వేయడం, రాగం తీయడం, మాటలను పలకడం'అనే మూడంశాలు గోచరిస్తాయి. శాస్త్రపరిభాషలో ఈ మూడింటికి 'నృత్యము,గీతము, శబ్దము' అని పేర్లు. కాలక్రమంలో వేర్వేరు శాఖలుగా విడిపోయిన ఈ మూడూ పదనిర్మాణంలో భాగాలుగా ఉండటాన్ని పరిశీలిస్తే పదసాహిత్య విశిష్టత వ్యక్తమవుతుంది. ప్రాచీనపదకర్తలందరూ ఆడి పాడినవారే.

పదానికి అనుకూలంగా అడుగువేయడం ఆయా పదకర్తలకు సంబంధించిన విషయం...ఇక పదంలో భాషాపరంగా మాటలకూర్పు, సంగీత పరంగా రాగలక్షణనిర్దేశం చేసే సంగీతపుకూర్పు ఉంటాయి. సంగీతశాస్త్ర పరిభాషలో పదంలోని మాటలకూర్పును 'మాతువు' అని, సంగీతపుకూర్పును 'ధాతువు' అని వ్యవహరిస్తారు. వాక్కారుడు, గేయకారుడు అయినవాడు 'వాగ్గేయకారుడు'. వాక్కును - సంగీతాన్ని లేక మాతువును - ధాతువును కూర్చగలవాడు వాగ్గేయకారుడవుతాడు. ఈ యర్థంలో అన్నమయ్య, రామదాసు, క్షేత్రయ్య, సారంగపాణి, త్యాగయ్య మొదలైన వారంతా వాగ్గేయకారులే.

## పదం - కృతి - కీర్తన

పద కృతి కీర్తనల నిర్వచనాలను, పరస్పర సంబంధాలను వివరించడానికి ముందు ఈ మూడింటి మీద రాళ్ళపల్లివారి అభిప్రాయం తెలుసుకోవడం అవసరం. "సంగీత రచనా ప్రధానములగు త్యాగయ్యగారి రచనలవంటి వానిని 'కృతు' లనుచున్నాము. భక్తిప్రధానములగు రామదాసు పాటలవంటివి 'కీర్తనములు' అనుచున్నాము. సంగీత సాహిత్యములు రెండును చౌకరకములైన దేశీయ రాగములలో చిల్లరశృంగారపు మాటల గూర్చిన పాటలను 'జావళ్ళు' అనుచున్నాము. కృతులందువలె సాహిత్యమును గాని, కీర్తనలందువలె సంగీతమును గాని దిగమ్రింగుటకు పదములలో అనుమతిలేదు. రెంటికిని

1. 'క్షేత్రయ్య పదములు' వ్యాసం. ఆంధ్రపత్రిక 1942-43.పుట.15



సమాన ప్రాధాన్యమీయగల సంగీతశిల్పికి తప్ప తక్కినవారి కిందులో ప్రవేశము లేదు."[1] భక్తి ప్రధానములైనవి కీర్తన లైతే అన్నమయ్య శృంగారసంకీర్తనలు కీర్తనలు కాక పోవలసివస్తుంది. అయినా వాటిలో మధురభక్తి అంతర్వాహినిగా ఉండటంవల్ల అవి కీర్తనలే. క్షేత్రయ్యపదాలకు పచ్చి శృంగారాత్మక పదాలని లోకంలో ఒక అభిప్రాయముంది. క్షేత్రయ్య పదాలలో వైరాగ్యవాసనలు గూడా ఉన్నాయి. భక్తిప్రధానములైన రామదాసుకీర్తనలలో శృంగారముంది. ఇలా ఆలోచిస్తే వస్తురీత్యా శృంగార, నీతి, వైరాగ్యభావాలు కృతులలో, కీర్తనలలో, పదాలలో ఉంటాయి. 'కృతి' లో సాహిత్యం గౌణంగా, సంగీతం ప్రధానంగా ఉంటుంది. వాడిన మాటలు సంగీతవాహికలుగా ఉంటాయి. కీర్తనలో సాహిత్యం భక్తిప్రధానంగా ఉంటుంది. కీర్తనలోని వస్తువు పౌరాణికమైనదిగాను, దైవాంకితంగానే గాక భగవద్భక్తుల స్తుత్యాత్మకంగా గూడా ఉంటుంది. ఇందలి సంగీతం సాహిత్యాన్ని మించకుండా, దానికి లోబడే ఉంటుంది. పద నిర్వచన వివరణకు క్రింది ఆంగ్లపంక్తులను పరిశీలించడం అవసరం.

"Pada is a scholarly composition. The term pada is sometimes used to signify any devotional composition..... to understand a pada aright and to enter truly into its spirit, one must have some knowledge of Nayika and Nayaka (Loved and the lover) Lakshanas............ most pada compositions admit of dual meaning; the outward sringara meaning and the inward philosophical meaning. The pada has the divisions - pallavi, anupallavi and charana. There maybe three and more charanas. The music is slow and flows in a natural manner. The diction is simple."[2]

పై ఆంగ్ల పంక్తులలో గల వివరణ ప్రకారం పదంలో నాయికా నాయక గతమైన శృంగారం వర్ణించబడుతుందని, అది పైకి లౌకిక శృంగారంగా కనిపించినా అందులో వేదాంత పరమైన భావాలుంటాయని తెలుస్తున్నది. ఈ

1. 'క్షేత్రయ్య పదములు' వ్యాసం. ఆంధ్రపత్రిక 1942-43.పుట.15
2. Sambamurthy. P. South Indian music series 1-4. P.45.

నిర్వచనం ప్రకారం పదం శృంగార ప్రాయంగానే ఉంటుంది. అందుకే క్షేత్రయ్య పదాలంటే శృంగారమే జ్ఞాపకమొస్తుంది. అన్నమయ్య శృంగారసంకీర్తనలకు 'అన్నమయ్య పదములు' అని కూడా పేరుంది. గ్రామ్యగాన పద్ధతి గలిగి సరళమైన వ్యావహారికభాషలో శృంగారాత్మకంగా సాగే తేలిక పదాన్ని జావళి అంటారు. ఈ యర్థంలో క్షేత్రయ్యపదాలను జావళీలు అనికూడా అనవచ్చు. మాతువు, ధాతువుల భేదాలను బట్టి పదం ఇన్ని రకాల పేర్లతో పిలువబడుతున్నప్పటికి, అన్నిటిలో పల్లవి, అనుపల్లవి, చరణాలు నియతంగా ఉండటం వల్ల వీటన్నిటిని ఒకే ప్రక్రియ అనగా పదకవితాప్రక్రియ లోనే చేర్చవలసి ఉంటుంది.

అన్నమయ్య పదసాహిత్యం శృంగారాధ్యాత్మిక కీర్తనల రూపంలో కనిపిస్తే ఆయన కుమారుడైన పెదతిరుమలాచార్యుల పదసాహిత్యం కూడా శృంగార సంకీర్తనలు, అధ్యాత్మ సంకీర్తనలు అని రెండు విధాలుగా కనిపిస్తుంది. పెద తిరుమలయ్య రచించిన వైరాగ్య భావాలను ప్రకటించే వచనమాలికా గీతములు కూడా పదములే. తాళ్ళపాక కవుల సంకీర్తన సంప్రదాయం ఆంధ్రదేశానికి కొత్తదికాదు. క్రీ.శ.14వ శతాబ్దికి చెందిన సింహగిరికృష్ణమాచార్యులు ఈ సంప్రదాయానికి ఆద్యుడు. ఈయన సంకీర్తనాత్మక వచనాలను రచించాడు. ఇతడు రచించిన 'సింహగిరినరహరివచనములు' చూర్ణికలనెడి వచన భేదములని అన్నమయ్య వివరించినాడు. ఇతని వచనములకు 'విన్నపాలు' అనిగూడా పేరు. వైష్ణవతత్త్వ ప్రతిపాదకములైన సింహగిరినరహరివచనములు సుమారు 4 వేలకు పైగా కృష్ణమాచార్యునిచే రచించబడినవని అంచనా. కృష్ణమాచార్యుల వచనములు అనిబద్ధపదములు. గురులఘునివేశ నియమంగాని, అక్షరసంఖ్యా నియమంగాని లేకుండా వృత్తబద్ధం కాకుండా రసాభివ్యక్తి కోసం అక్షరాల కూర్పుగలది అనిబద్ధపదం లేక చూర్ణిక. ఆంధ్రదేశంలో తరువాత ఏర్పడిన భక్తి సాహిత్య ఉద్యమానికి సింహగిరినరహరివచనములు ప్రేరకాలు. "తాళ్ళపాక పెదతిరుమలయ్య వంటి వచనకావ్యకర్తలకే గాక, అన్నమయ్య, పోతన వంటి వారికి కూడా కృష్ణమాచార్యుని రచనా పద్ధతి, భావములు అనుకరణీయము లైనవి."[1]

1. నాగయ్య, జి.తెలుగు సాహిత్యసమీక్ష Vol I తిరుపతి, 1990 పుట.307.



## వాగ్గేయ కారుడు

పదకవియే వాగ్గేయకారుడు. ఇతనికి సంగీత సాహిత్య జ్ఞానం మెండుగా ఉంటుంది. వాక్కును, గేయాన్ని (వాక్ + గేయం) కూర్చే నేర్పుగలవాడు వాగ్గేయకారుడు. లాక్షణికులు పదములోని సాహిత్యాంశమును 'వాక్' అని, సంగీతాంశమును 'గేయ'మని వ్యవహరించారు. మొదట వచనమని, తరువాత సంకీర్తనమని, ఆ తరువాత కృతియని నామాంతరములు గల పదము నేటి వ్యవహారమున గేయము. (గేయమనగా గీయమానమైనది - పాడబడునది.) గీయమానమైన కీర్తనయే భక్తుని హృదయమును పరమాత్ముని పాదసన్నిధికి చేర్చునది. 'పదగతే' అని అమరకోశం చెపుతుంది. అందువల్ల అలా తీసుకొని పోయేదే పదం.

వాగ్గేయకారుని లక్షణాలను చెప్పిన లక్షణగ్రంథాలలో ప్రసిద్ధమైనది 13వ శతాబ్దినాటి శార్ఙ్గదేవుని 'సంగీతరత్నాకరం'.

**'వాఙ్మాతురుచ్యతే గేయం ధాతురిత్యభిధీయతే,**
**వాచం గేయంచ కురుతే య స్సః వాగ్గేయకారః'**

అని వాగ్గేయకారునికి సంగీతరత్నాకరంలో ఇచ్చిన నిర్వచనం. ఈ గ్రంథంలో చెప్పబడిన వాగ్గేయకార లక్షణాలు దీనికి వ్యాఖ్యాతలైన కల్లినాధుని బట్టి, (సర్వజ్ఞ) సింగభూపాలుని బట్టి భాషాపరంగా ఐదు విధాలుగా ఉంటాయి. 1. శబ్దాను శాసనజ్ఞానం (భాషా వ్యాకరణ పరిజ్ఞానం) 2. అభిదాన ప్రవీణత (నిఘంటువుల పరిచయం) 3. ఛన్దఃప్రభేద విదిత్వం (మార్గదేశిఛందోజ్ఞానం) 4. అలంకారకౌశలం (శబ్దాలంకార, అర్థాలంకార ప్రయోగనైపుణ్యం) 5. అశేష భాషా విజ్ఞానం (భాషాపరమైన సంపూర్ణపాండిత్యం) ఈ లక్షణాలే గాక వాగ్గేయకారునికి శృంగారాది రసాలు, విభావ అనుభావ సంచార్యాది భావవిశేషాలు తెలిసిన రసభావపరిజ్ఞానం ఉండాలి. శ్రావ్యంగా పాడగలిగిన శక్తి ఉండాలి. దేశిరాగాదులుగా చెప్పబడిన శ్రీరాగాదులు చక్కగా తెలిసి ఉండాలి. శీఘ్రంగా గీతాలను నిర్మించే ప్రతిభావంతుడై ఉండాలి. పలువిధాలైన గీత ఛాయలను అనుకరింపగల గీత నిర్మాణశక్తి (పదాంతర విదగ్ధత) ఉండాలి. అన్నిటిని మించి పూర్వాపర వినిశ్చయం కొరకు చిత్తైకాగ్రత ఉండాలి. ఇవి ఉత్తమవాగ్గేయకారుని లక్షణాలు.

వాగ్గేయకారులలో ఉత్తమ మధ్యమాధమ భేదాలు, వారి లక్షణాలు ప్రాచీన సంగీతశాస్త్రగ్రంథాలలో చెప్పబడినాయి. ధాతు, మాతువులను సమానంగా కూర్చగలిగిన వస్తుకవి లేక కథాకవి అయిన వాడు ఉత్తమవాగ్గేయకారుడు. ఇతని పదరచనలలో ప్రౌఢి కూడా ఉంటుంది. ధాతువును సమృద్ధిగా కూర్చగలిగి 'మాతువు' రచనలో మందకొడిగా ఉండేవాడు, 'ధాతుమాతువులు' రెండూ తెలిసినా పదరచనలో ప్రౌఢి చాలనివాడు మధ్యమజాతి వాగ్గేయకారుడు. 'మాతువు' ను రమ్యంగా నిర్మింపగలిగి, 'ధాతు' విషయంలో మందకొడిగా ఉండేవాడు అధమజాతి వాగ్గేయకారుడు. ఇతరులు నిర్మించిన ధాతువున 'మాతు' రచన చేసేవాడు మిక్కిలి అధముడు. ఇట్టి వానిని సంగీతరత్నాకరం 'కుట్టికారుడు' అని పేర్కొన్నది. ధాతుమాతువులను నేర్పుగా కూర్చగలిగే వాగ్గేయకారునికి 'ఉభయకారుడు' అని కూడా పేరు. ఉభయకార శబ్దమే 'బయకార'గా మారింది. 'రాయబయకార' అనేది రాజాస్థానాలలో ఉండిన వాగ్గేయకారులకు బిరుదు వాచకమైంది. తెలుగులో ఎందరో పదకవులు వెలశారు. వీరిలో అన్నమయ్య, పెదతిరుమలయ్య, రామదాసు, క్షేత్రయ్య, సారంగపాణి, త్యాగయ్య, మొదలైన వారంతా ఉత్తమ వాగ్గేయకారులు.

## పల్లవి – అనుపల్లవి

పదానికి (పాటకు) పల్లవి ప్రాణం వంటిది. పల్లవిలో సూచించిన వస్తువును చరణాలలో విస్తృతపరచడానికి ఉపయోగపడేది అనుపల్లవి. సాధారణంగా పదానికి మూడు చరణాలుంటాయి. పల్లవి, అనుపల్లవి, చరణాలు – ఇది పదనిర్మాణం. అన్నమయ్యకు ముందు పదకవులని చెప్పదగిన వాగ్గేయకారులు లేరు. అయితే ఇతనికంటె ముందు వచనరచనకు, భజన సంకీర్తన పద్ధతికి ప్రథమాచార్యుడైన సింహగిరికృష్ణమాచార్యులు కనిపిస్తాడు. ఈయన వచనాలలో పల్లవి అనుపల్లవులు లేవు. 'ఓంనమోనారాయణ, నమో లక్ష్మీవల్లభా' – అనాథపతీ సింహగిరి నరహరీ నమోనమో దయానిధీ' మొదలైన మకుటాలు కనిపిస్తాయి. కృష్ణమాచార్యుని వచన సంకీర్తనలు అనియత పదాలైన చూర్ణనామక వచనాలని ముందే చెప్పబడింది. అందువల్ల పద విభాగలైన పల్లవి, అనుపల్లవి, చరణాలు అన్నమయ్య సంకీర్తనలలోనే మొదటిసారిగా దర్శనమిస్తున్నాయని భావించవచ్చు. 'సంకీర్తనలక్షణం'లో పల్లవి ఇలా నిర్వచించబడింది.



**'పదముల యర్థముఁ బల్లవి, పదలక యన్నిఁటికి నేకవాక్యతఁ జేయన్**
**గుదిగ్రుచ్చినట్లు తగులై, పదము తుదిన్ మరియు మరియుఁ బల్లవి యలరున్'.**

*(సంకీర్తనలక్షణంలో 39 వ పద్యం)*

పదంలోని చరణాల అర్థానికి దూరం కాకుండా, వాటన్నిటిని తగులుకొని ఉంటూ, అభిప్రాయాన్ని ఒక కొలికికి తెస్తూ, మాటిమాటికి ఆవర్తింపబడుతూ పదం చివర ఉండేది పల్లవి. తాళ్ళపాకవారి సంకీర్తనలలో నియతంగా పల్లవి కనిపిస్తుంది. కాని అనుపల్లవి బొత్తిగా లేదని చెప్పలేము గాని చాల అరుదుగా కనిపిస్తుంది. అందువల్ల 'అనుపల్లవి' 'సంకీర్తనలక్షణం'లో వివరింపబడలేదు. చరణాల అర్థమంటే పదాని కంతటికీ సంబంధించిన అర్థముగావచ్చు. ఒక చరణం చివరన ద్యోతకమయ్యే అర్థమూ గావచ్చు. సాధారణంగా ఒక పదంలో మూడు చరణాలుంటాయి. పదాన్నంతటిని ఒక మహావాక్యంగా గ్రహిస్తే చరణం ఒక అవాంతర వాక్యమవుతుంది. పల్లవి ప్రతి చరణంలోని మాటల అర్థాలకు చరణాంతంలో ఏకవాక్యత కూరుస్తుంది. అలాగే పదంలోని అన్నిచరణాల అర్థాలకు కూడా ఏకవాక్యత కూరుస్తుంది. అందువల్లనే పల్లవి ప్రతి చరణంలోను, పదాంతంలోను ఆవృత్తమవుతుంది. ప్రతిచరణంలోను నాలుగు పాదాలుంటాయి. నాలుగో పాదం తరువాత పల్లవి పొసగి వస్తుంది. కొందరు పదకర్తలు చరణంలోని రెండు పాదాలకు కూడా పల్లవిని పలికించారు."ఈ పల్లవి పుట్టు పూర్వోత్తరాలు సంగీత విద్వాంసులకే తీరనిసమస్యగా ఉన్నాయంటారు. తాళ్ళపాకఅన్నమయ్యగారి సంకీర్తనల్లో పల్లవి ఉంది. కొన్నింటిలో అనుపల్లవి కూడా ఉంది. రామ క్రియారాగం (రూపకతాళం) లో కూర్చిన 'భక్తికొలది వాఁడే పరమాత్ముఁడు' అనే సంకీర్తనలో ఈ మాటలే పల్లవి. 'భుక్తి ముక్తి తానే యిచ్చు – భువి పరుమాత్ముఁడు' అనేది అనుపల్లవి. అంటే అన్నమయ్యనాటికి 'పల్లవి' పాదు కొన్నది.'అనుపల్లవి' పాదుకొంటున్నదని ఊహించవచ్చు".[1] తాళ్లపాకకవుల పదముల లోనే పాదుకుంటుండిన 'అనుపల్లవి' తరువాత పదకవులైన క్షేత్రయ్య, సారంగపాణి మొదలైనవారి పదములలో నియతముగా వాడబడింది. పల్లవిలో అంకురితమైన భావం చరణాలలో పెరిగి పుష్పఫలభరితం కావడానికి దోహదం

1. సాళ్వకృష్ణమూర్తి అనువాద, వ్యాఖ్యానాలలో కూడిన The tunes of Divinity - Sankirtana Laksanamu by Tallapaka Chinatirumalayya, Madras1990- p.167.

చేసేది అనుపల్లవి. ఇది పల్లవి తరువాత ఆవృత్తమవుతూ పల్లవికి చరణాలకు మధ్య వంతెనవలె ఉపకరిస్తుంది. ఈ యంశం ఈ క్రింది సారంగపాణిపదములో చూడవచ్చు.

**పిలుచుక రావమ్మ – సామి నీవేళ** ॥పల్లవి॥
**నెలతా యీ పండు వెన్నెల తాళజాలనిక** ॥అనుపల్లవి॥

**పాలు మాలుచు కమ్మవిల్తుని**
**పాలు సేయక మేని సొమ్మొక**
**పాలు నీకిచ్చేను గూట దీ**
**పాలు బెట్టే వేళకైన** ॥పిలుచుక॥

ఈ పదంలో నాయిక నాయకుని తీసుకొని రమ్మని తన నర్మసఖిని బతిమాలు కొంటూ ఉంది. 'పిలుచుక రావమ్మ – సామి నీ వేళ' అనే పల్లవి నాయకునిపై నాయికకు గల వ్యామోహాన్ని స్పష్టపరస్తున్నది. ఆ వ్యామోహానికి గల కారణం అనుపల్లవిలోని 'నెలతా ఈ పండువెన్నెల తాళజాలనిక' అన్న విషయం. తరువాతి చరణంలో నాయిక నర్మసఖిని బతిమాలుతూ 'గూట దీపాలు పెట్టకముందే పిలుచుకువస్తే తనమేని సొమ్ములలో సగం ఇస్తానని' ఆశపెట్టడం నాయకుడు రాకపోతే నాయిక విరహవ్యథాభరవివశాంగి అవుతుందన్న విషయం చూపబడింది. ఇట్లు ఈ పదంలో పల్లవి, అనుపల్లవి, చరణం పరస్పర భావ స్ఫోరకాలై రసపుష్టి కలిగిస్తున్నాయి. ఇలాగే పల్లవి, అనుపల్లవి, చరణాల పరస్పరానుబంధానికి అన్నమయ్య, క్షేత్రయ్య మొదలైనవారి పదములలో అన్నీ దృష్టాంతాలవుతాయి. పదకవులందరిలో చరణాల సంఖ్య నియతంగా కనిపించదు. సాధారణంగా ప్రతి పదానికి మూడు చరణాలుంటాయి. అయితే అన్నమయ్య పదాలలో రెండు చరణాల పదాలు గూడా ఉన్నాయి. అన్నమయ్య రెండునుంచి పది చరణాల వరకు గల పదాలు రచించాడు. క్షేత్రయ్య పదాలలో సాధారణంగా మూడు చరణాలు మాత్రమే కనిపిస్తాయి. సారంగపాణి మూడు నుండి పది చరణాలు గల పదాలు గూడా రచించాడు. ముఖ్యంగా భక్తిభావనిర్భరమైన కీర్తనలలో చరణాల సంఖ్య మూటిని దాటడం కనిపిస్తుంది.



శతకాలలో మకుటాలున్నట్లు పదాలలో ముద్రలుంటాయి. ఎవరికి అంకితంగా పదం రచింపబడుతుందో అతని పేరును ఆపదంలో స్మరించడాన్ని, అతని నామాంకితంగా పదరచన చేయడాన్ని పదముద్ర అంటారు. అన్నమయ్య పదాలు శ్రీ వేంకటేశ్వరముద్రాంకితాలు. క్షేత్రయ్యవి మువ్వగోపాల నామాంకిత పదాలు. సారంగపాణివి వేణుగోపాలనామాంకిత పదాలు. త్యాగయ్యవి శ్రీరామాంకిత పదాలు. ప్రతిపదకవి తమ ఉపాస్య దైవాంకితం గానో, జ్ఞానబోధ చేసిన ఆచార్యాంకితంగానో, పోషించిన రాజాంకితంగానో పదాలు రచించారు. యాగంటివారు, వీరబ్రహ్మం, (1604–1683) దూదేకుల సిద్ధయ్య (జ. 1665) మొదలైన కొందరు పదకవులు ఆత్మముద్రాంకితంగా కూడా రచనలు చేశారు. 'దండిగ శంకరదాసుమయ్యను దలచి – బండారు బసవన్న బొందవే మనసా' అనే యాగంటి లక్ష్మయ్యపదం, 'ఓం నమః శివాయ సిద్ధమైన పదవి – ఓంకారమేదిరా ఓరీ' అన్న వీరబ్రహ్మం గారి పదం దీనికి ఉదాహరణలు. నామాంకితముద్రలను కొందరు అనుపల్లవిలో చూపిస్తే మరికొందరు పదంలోని చివరి చరణంలో చూపించారు. అన్నమయ్య సంకీర్తనలలో శ్రీ వేంకటేశ్వర నామం నియతంగా చివరి చరణంలోనే కనిపిస్తుంది. క్షేత్రయ్య పదాలలో మువ్వ గోపాలముద్ర కొన్నిట పల్లవిలో, కొన్నిట అనుపల్లవిలో, కొన్నిట చివరి చరణంలో వాడడం క్షేత్రయ్య ప్రత్యేకత. సారంగపాణి గూడా వేణుగోపాలముద్రను పల్లవిలోను, అనుపల్లవిలోను చివరి చరణంలోను అనియతంగా వీలునుబట్టి పదంలోని అర్థస్వారస్యాన్ని బట్టి వాడుకున్నాడు. త్యాగయ్యకీర్తనలన్నీ శ్రీరామముద్రాంకితాలైనా చివరి చరణాలలో 'త్యాగరాజసన్నుత', 'త్యాగరాజనుత' అనే మకుటాలు కనిపిస్తాయి. పదకర్త లందరూ, పారమార్థిక చింతన గలవారే కాబట్టి వారి పదములలో వారి వారి ఆత్మ ప్రత్యయాన్ని బట్టి నామాంకిత ముద్రలుండడం గమనింపదగిన విషయం.

## భక్తి ఉద్యమం – పద కవిత్వం

భక్తి మానసికభావం. 'ప్రీతిరూప మనుధ్యానం భక్తిరిత్యభిధీయతే' అని భక్తి నిర్వచనం. భారతదేశంలో ఋగ్వేదకాలంలోనే ప్రకృత్యారాధన కనిపిస్తున్నది. ఇష్టమైన తత్త్వాన్ని లేక రూపాన్ని అనవరతం భావించడం, ఆ భావాన్ని స్వాభావికంగా తన భాషలో చెప్పుకోవడం మానవస్వభావం.

భక్త్యావేశాన్ని ప్రకటించడానికి వాహిక భాష. భక్తి సాహిత్యమే పదసాహిత్యంగా మారింది. ఈ రకంగా చూచినపుడు వేదసూక్తులే మొదటి పదాలనిపిస్తాయి. క్రీ.శ.ఒకటవ శతాబ్దంనాటికే ఉత్తరభారతంలో ఎందరో విదేశీయులు వచ్చి స్థిరపడి భారతీయులతో కలసిపోయారు. వాళ్లుగూడా భారతీయసంస్కృతికి అలవాటు పడినారు. క్రీ.శ.తొమ్మిదవశతాబ్దంనాటికి మహమ్మదీయులు భారతదేశంమీద దండయాత్రలు చేయడం, హిందూ దేవాలయాలను ధ్వంసం చేయడం జరిగింది. ఈ కాలం నుండి మహమ్మదీయులు అధికసంఖ్యలో ఇక్కడికి రావడం, ఇస్లాంమతాన్ని ప్రచారం చేయడం కనిపిస్తుంది. మహమ్మదీయ ఫకీరులు తమ బోధనలద్వారా హిందువులను ఆకర్షించి వాళ్ళను బలవంతంగా మహమ్మదీయులుగా మార్చడం మొదలుపెట్టినారు. వారిలో సాత్త్వికులైన కొందరు మహమ్మదీయ మతాచార్యులు ఏకేశ్వరోపాసనను సూఫీతత్త్వంద్వారా ప్రచారం చేయడం ప్రారంభించారు. వేదోపనిషత్తులలో నిక్షిప్తమైన భారతీయాత్మకు అవైదికమతాలైన జైన, బౌద్ధాల బోధనలమధ్య చిక్కుకోవడమేగాకుండా, ఇస్లాం మతప్రచారంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఆనాటి ప్రభుత్వాలు దీనిని ప్రతిఘటించాయి. హిందూ మతాచార్యులు మార్గాంతరాలను అన్వేషించారు. మతాభినివేశం గల మేధావులు గొప్ప భక్తిఉద్యమాన్ని లేవదీశారు. అప్పటికి ఉత్తరభారతదేశంలో శైవారాధన, వైష్ణవారాధన ఇంచుమించు సమానంగానే ఉన్నప్పటికీ వైష్ణవం సరికొత్త తరహాలో ఒక భక్తిఉద్యమంగా పాదుకొన్నది. భారతీయ భాషలలో భక్తిగీతాలు రచింపబడినాయి.

ముందుచూపిన చారిత్రక కారణాలే గాకుండా భారతదేశంలో భక్తిసాహిత్యం పుట్టడానికి జైన బౌద్ధుల తాత్త్విక గీతాలే కారణమని కొందరు నమ్ముతారు.

"...... in the west of India the Jain mystics were producing this kind of electric literature, in the east the Buddhists of Sahaja cult were composing in symbolic language philosophical songs called 'Charya-gitas; as padas these charya gitas were all set to music and in a way, may be considered to have paved the way for the emergence of the Hindu saints and their songs in the Indian languages."[1]

1. Raghavan, V. The great Integrators - The saint singers of India. 1966, page.19.



అనే ఆంగ్ల పంక్తులు ఈ సందర్భంలో గమనింపదగినవి. ఇటువంటి భక్తిగీతాలకు వంగదేశం ముఖ్యక్షేత్రమైంది. సేనవంశపు రాజైన లక్ష్మణసేనుడు క్రీ.శ.1116 నుండి 1160 వరకు గౌడదేశాన్ని పాలించాడు. ఇతని ఆస్థానకవియైన జయదేవుడు రాధాకృష్ణుల ప్రేమను 'గీతగోవిందం' అనే సంస్కృత కావ్యంలో మధురంగా గానంచేశాడు. ఇది భక్తిపరమైన శృంగారకావ్యం. భక్తిపరమైన శృంగారమే మధురభక్తి. మధురభక్తి ప్రధానమైన రచనలలో ఇదే మొదటిది. రాధాకృష్ణుల ప్రేమ జీవేశ్వరుల సంబంధాన్ని తెలియజేస్తుందంటారు పండితులు. జయదేవుని తరువాత సంస్కృతంలో పేర్కొనదగిన మధురకవి, వాగ్గేయకారుడు లీలాశుకుడు. ఇతడు రచించిన 'కృష్ణకర్ణామృతం'లో భక్తిపరిపూర్ణశ్లోకాలు ఈనాటికీ సంగీత సభలలో, భజనకూటాలలో ఆలపింపబడుతున్నాయి. ఈ విధంగా సాగిన మధుర కవితాస్రవంతిని కృష్ణభక్తి ప్రవాహంగా మార్చినవాడు వల్లభాచార్యుడు. "ఇతని 'అష్టచాప్' అనే ఎనమండుగురు శిష్యులలో ముఖ్యుడు సూరదాసు. హిందీలో కృష్ణభక్తితో మైమరచి ఇతరులను మురిపించిన వాడితడు. సూరదాసు పదాలు భక్తిరస ఘుటికలు. వంగదేశంలో వల్లభాచార్యుని తరువాత కృష్ణభక్తిపారమ్యం పొందినాడు చైతన్యస్వామి (1486-1534). చైతన్యస్వామి సంస్కృతంలో రెండు స్తోత్రాలు మాత్రమే పాడినా, ఆయన శిష్యులు వంగ, సంస్కృతభాషలలో కృష్ణభక్తి సాహిత్యాన్ని సృష్టించారు. విద్యాపతి మైథిలీభాషలో క్రీ.శ.14 వ శతాబ్దంలో రాధాకృష్ణభక్తి ప్రతిపాదకాలైన ఎన్నో పదాలు రచించాడు. ఇతడు మన క్షేత్రయ్యతో అన్ని విధాల సరితూగగల వాగ్గేయకారుడు. విద్యాపతి పదాలను చైతన్యస్వామి ఆలపించి తన్మయత్వం చెందేవారట. వంగభాషలో కృష్ణపదాలు రచించిన మరొక పదకర్త చండీదాసు."[1]

ఈ విధంగా ఉత్తరభారతదేశంలో అంకురించిన కృష్ణభక్తి మరికొందరు భక్తకవుల రచనలద్వారా బాగా పరిపుష్ఠమై ప్రచారం పొందింది. జ్ఞానదేవ, నామదేవులు మహారాష్ట్రంలో క్రీ.శ.13-14 శతాబ్దాల మధ్య వర్ధిల్లిన భక్త కవులు. నామదేవుడు అభంగ వృత్తాలనబడు భావగీతికలను రచించాడు. ఈ ప్రాంతపు మరొక భక్తకవి తుకారామ్. పండరిపురమున వెలసిన విట్ఠలుని మీద

1.గంగప్ప, ఎస్. తెలుగులో పదకవిత, గుంటూరు, 1983 పుట 23.

ఎన్నో భక్తి కీర్తనలు పాడిన వాడితడు. మీరాబాయి (16వ.శ) గొప్ప కృష్ణ భక్తురాలు. రాజ్థసాన్‌కు చెందిన ఈమె రాజస్థానీ, గుజరాతీ, హిందీ భాషలలో ఇరవై వేలకుపైగా కృష్ణభక్తి పరమైన కీర్తనలు రచించి తరించింది. ఈ కీర్తనలలో మీరాబాయి శ్రీకృష్ణుని ప్రేమతత్వాన్ని ప్రచారం చేసింది. హిందీలో కీర్తనలు రచించిన కబీరుదాసు ఈ సందర్భంలో పేర్కొనదగినవాడు. కంచెర్లగోపన్న (రామదాసు) గురువితడే. భక్తిపూరితమైన వాతావరణంతోపాటు సంకీర్తన వాఙ్మయం కూడా అభివృద్ధి చెంది ఒక పెద్ద భక్తిఉద్యమం ఏర్పడింది. వైష్ణవమతానురక్తి, కృష్ణభక్తి కారణాలుగా ఈ ఉద్యమం నడిచింది.

దక్షిణదేశంలో – ముఖ్యంగా తెలుగుదేశంలోని పదసాహిత్య ప్రక్రియ ఉత్తరదేశంలో ప్రచలితంగా ఉండిన కీర్తన పద్ధతి, భజనపద్ధతుల సమాహారం. మీరాభజనలు, కబీరుగీతాలు భక్తిసాహిత్యంలో ప్రసిద్ధాలేగదా ! ఉత్తరదేశం నుండి కృష్ణభక్తి దక్షిణదేశానికి వ్యాపించిన సందర్భంలోనే తెలుగులో తొలిభక్తి రచన 'సింహగిరి నరహరివచనాలు' ఆవిర్భవించింది. ఆ తరువాత పదకవితా ప్రక్రియలో చెప్పుకోదగినంత సాహిత్యం వచ్చింది. అంతకు ముందు కాలం నుండి దక్షిణదేశంలో కూడా భక్తిబీజాలు వెల్లివిరియడం కూడా దీనికి కారణం.

"The cycle came (from north) full round and reached South India. Through music, dance and dance - drama, the influence of Jayadeva spread southwards and in Telugu, Kannada, Tamil and Malayalam. Universal stories and plays on devotional themes were composed in Sanskrit and these languages. Kirtana and Bhajana flowed from Maharastra chiefly and from Bengal to some extent, so that on a soil already the seed -bed of Bhakti, the flow of these fresh waters from other areas, fed to a rich new crop of devotional music and dance - drama"[1] అన్న ఆంగ్ల వాక్యాలలో ఉత్తరదేశంలో ప్రచారమందుండిన నృత్య సంగీత రూపకాలు దక్షిణానికి వ్యాపించి అప్పటికే ఇక్కడున్న భక్తిభావాలను ప్రజ్వలితం చేశాయని చెప్పబడింది.

1. Raghavan, V. The great Integrators - The saint singers of India. 1966, page.19.



క్రీ.శ. 12వ శతాబ్ది నాటికే తమిళదేశంలో శైవానికి, వైష్ణవానికి ఎంతో ప్రాధాన్యం ఏర్పడింది. శైవమతాచార్యులకు నాయన్మారులని, వైష్ణవ మతాచార్యులకు ఆళ్వారులని వ్యవహారం ఏర్పడింది. నాయన్మారులుగాని, ఆళ్వారులుగాని ప్రత్యేకంగా గ్రంథాలు రచించకపోయినా భక్తిరసనిర్భరములైన గీతముల నెన్నిటినో రచించారు. "ఆ భక్తిగీతాలే తరువాతి కాలమున సంకలనము చేయబడి గ్రంథరూపమున వెలువడెను. శైవగీత కదంబమునకు 'తిరుమరై' అనియు, వైష్ణవగీతికా సందోహమునకు 'నాలాయిర ప్రబంధము' అనియు వ్యవహార నామములు కలిగెను. కనుక శైవ వైష్ణవ మతాచార్యుల యుగమున ప్రచారములోనికి వచ్చిన తమిళ సాహిత్యము మధురగేయమయమై భక్తిరస ప్రపూర్ణమై యున్నదనుట సమంజసం. ఆళ్వారులును, నాయన్మారులును సంస్కృత భాషాభిజ్ఞులైనను భక్త్యుద్రేకమున వారు ప్రజల భాషలయందే గీతములు పాడిరి."[1] ఈ కాలానికి కొంచెం ముందుగా కర్ణాటకదేశంలో బసవేశ్వరునిచే స్థాపితమై ప్రచారం చేయబడిన లింగాయతుల వీరశైవం ఆంధ్రదేశంలో వ్యాపించింది. క్రీ.శ. తొమ్మిది – పది శతాబ్దాలలో తూర్పుచాళుక్యుల ప్రోత్సాహంతో ఎందరో శైవులైన బ్రాహ్మణులు సాగర తీరాంధ్ర దేశానికి వలసవచ్చి రాజుల దగ్గర పురోహితులుగా, దేవాలయాలలో పూజారులుగా కుదురుకున్నారు. విశిష్టాద్వైత మత ప్రవక్తయైన భగవద్రామానుజముని ప్రేరణతో శ్రీరంగంనుండి భట్టరు వంశీయు లెందరో ఆంధ్రదేశానికి వచ్చి వైష్ణమత ప్రచారంచేశారు. ఈరకంగా ఆంధ్రదేశానికి మూడు వైపులనుండి మూడురకాలలైన మత ప్రేరణలు వచ్చి తరువాత వెలసిన భక్తి సాహిత్యానికి ఒక పూర్వరంగం సిద్ధపరిచాయి. ఇటువంటి ప్రేరణతో పుట్టిన సింహగిరి నరహరివచనాల తరువాత వైష్ణవభక్తి పరంగా, శైవభక్తిపరంగా ఆత్మప్రబోధాత్మకంగా ఎందరో భక్తి కవితలను వెలయించారు. పరమార్థ సాధకుడైన వానికి భక్త్యావేశం సహజ లక్షణం. అటువంటి భక్తకవి తనకు కలిగిన పారమార్థిక భావాలను నిరాటంకంగా సాగే తన భాషా వాహిక ద్వారా ప్రచారం చేస్తాడు. సంకీర్తన, కృతి, పద నామాంతరాలుగా గల పదసాహిత్య ప్రక్రియ దేశి సాహిత్యోద్యమంలో పుట్టిన కవితా ప్రక్రియ. స్తుత్యాత్మక రచనలు చేసిన వారందరూ పదకవితా ప్రక్రియనే ఎన్నుకున్నారు.

1. రాధాకృష్ణశర్మ, చల్లా. తమిళసాహిత్యము – దక్షిణభారత సాహిత్యములు, పుట. 24.

## తెలుగులో పదకవులు

తెలుగులో పదకవిత్వం (సంకీర్తన వాఙ్మయం) కృష్ణమాచార్యుల సింహగిరి నరహరి వచనములతోనే ప్రారంభమైంది. పన్నెండు పదమూడు శతాబ్దాలలో దేవాలయాలలో సంకీర్తనలను గానం చేసేవారు. ఆనాటికి తెలుగుదేశంలో భాగవత సంప్రదాయం ఏర్పడింది. కృష్ణమాచార్యుల తరువాత చెప్పుకోదగిన పదకర్తలు యాగంటివారు. యాగంటికవులు శైవులు. నేటి కర్నూలు జిల్లా బనగానపల్లి తాలుకాలో యాగంటిపల్లె ఉంది. బహుశః యాగంటివారు కర్నూలు జిల్లాకు చెందిన వారేమో ! యాగంటిపదాలలో యాగంటి గురుడు, యాగంటి శివుడు, యాగంటి లింగడు, యాగంటి శంభుడు, యాగంటి హరుడు, మొదలైన ముద్రలుండడం వల్ల యాగంటి పదాలు వ్రాసిన కవులు ఒకరా, పలువురా అన్న అనుమానం కల్గుతుంది. యాగంటిపదాలు ఎక్కువగా యాగంటి లక్ష్మయ్య పేరు మీద ప్రచారంలో ఉన్నాయి. శైవసంబంధమైన యాగంటిలక్ష్మయ్య పదాలకు సంబంధించిన ఆరు తాళపత్ర ప్రతులు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధనా సంస్థలో ఉన్నాయి. యాగంటిలక్ష్మయ్య కృష్ణమాచార్యులకు, అన్నమాచార్యులకు మధ్యకాలంలో జీవించినట్లు పండితుల అభిప్రాయం.

శ్రీనాథుని కాలంలో పదకవిత లుండినట్లు, అతనికి పదకవిత మీద చులకన భావం ఉండినట్లు, శ్రీనాథునిదిగా చెప్పబడుతున్న క్రింది చాటువును బట్టి తెలుస్తుంది

**"ముది విటులు విధవ లంజలు**
**పదకవితలు మారు బాస బాపన వారల్**
**చదువని పండితవర్యులు**
**కదనాస్థిర వీరవరులు కడిది పురమునన్."**

ఈ పద్యం శ్రీనాథుని దైనప్పటికి పదకవితను శ్రీనాథుడు హేళన చేశాననడం నమ్మశక్యం కాదు. దీనికి కారణం పల్నాటివీరచరిత్రను, పల్నాటివీరుల కథలను ఓరుగల్లులో ప్రదర్శించే వారని క్రీడాభిరామం చెపుతున్నది. పల్నాటి వీర చరిత్రను శ్రీనాథుడు మంజరీ ద్విపదలలో రచించాడు. "మంజరీ ద్విపద కావ్యాలన్నీ కూడా దేశి రాగ వైఖరులతో తాళముతో ఇతర అంగముల మేళవింపుతో



పాడుకొనుటకే పుట్టెను".[1] శ్రీనాథునికి పదకవితపై అభిమానం ఉందనడానికి అతని భీమేశ్వర పురాణంలోని

**"కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు**
**గాంధర్వమున యక్షగాన సరణి"**

అనే పదాన్ని బట్టి గూడా తెలుస్తుంది. నేటి సంగీతరూపకాలే నాటి యక్షగానాలు. యక్షగానానికి గేయప్రబంధము అని కూడా పేరు. ఈ విధంగా చూస్తే శ్రీనాథుని కాలంలో పదకవితావాఙ్మయం ఉండే ఉంటుంది. 'ఆంధ్ర వాగ్గేయకారచరిత్ర'లో బాలాంత్రపురజనీకాంతరావుగారు పదసాహిత్యాన్ని కొన్నియుగాలుగా విభజించుకొని ఆయా యుగాలలో ఉండిన పదకవుల జీవితాలను, రచనలను, పరిశీలించారు.[2] డా॥ఎస్. గంగప్పగారు ఈ క్రింది విధంగా విభజించారు.[3]

1. అన్నమాచార్య పూర్వయుగం (1400 వరకు)
2. అన్నమాచార్య యుగం (1400–1600)
3. క్షేత్రయ్య యుగం (1600–1750)
4. త్యాగయ్య యుగం (1750–1850)
5. ఆధునిక యుగం (1850 నుండి...)

ఈ విధంగా పదసాహిత్య చరిత్రను విభజించి పరిశీలించడం శాస్త్రీయంగా ఉంది.

## 1. అన్నమాచార్య పూర్వయుగం

ఈ యుగం సుమారు శ్రీనాథునికాలం వరకు విస్తరిస్తుంది. ఈ యుగంలో మొదటి సంకీర్తనాచార్యుడుగా కృష్ణమాచార్యులు, తరువాత తత్త్వాలు వ్రాసిన యాగంటికవులు ప్రముఖంగా కనిపిస్తారు. అయితే తెలుగులో గ్రంథ రచన ప్రారంభమైనప్పటి నుండి దేశి కవితా స్వరూపం సాక్షాత్కరిస్తుంది. నన్నయ్యకు ముందే శాసనాలలో తరువోజలు, మధ్యాక్కరలు, ద్విపదలు, సీసాలు, రగడలు

1. వేంకటకృష్ణారావు, భావరాజు. శ్రీనాథుని పల్నాటి వీరచరిత్ర. కిన్నెర, డిసెంబరు. 1949. పుట. 58.
2. రజనీకాంతరావు, బాలాంత్రపు. ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర. విజయవాడ, 1958 పుటలు 82-85.
3. గంగప్ప, ఎస్. తెలుగులో పదకవిత. పుట. 43.

మొదలైన దేశీయబంధములో పాడుకోడానికి వీలైన పదాల్లాంటి పద్యాలు కన్పిస్తాయి. నన్నయ్య ద్విపదను తన భారతంలో వాడుకోకున్నా తద్వికారమైన తరువోజను గ్రహించాడు.

నన్నెచోడుడు తన కుమారసంభవంలో దేశికవితను పేర్కొన్నాడు. దేశికవితా శాఖకు సంబంధించిన ఆనాటి గేయ పద్ధతులను గూడా కొన్నిటిని చూపించాడు. ఈశ్వరుని స్తుతించే అంకమాలికలు (3-38),కల్లు దించువారి గౌడుగీతికలు (6-45), శబర కామినుల దంచుపాటలు (రోకటిపాటలు) (6-47), స్త్రీలు పాడే ఊయలపాటలు (4-89) మొదలైన దేశి వరుసలు కుమారసంభవంలో పేర్కొనబడినాయి. ఇవన్నీ ఆనాడు ప్రచారంలో ఉండినవే. ఇదే విధంగా పాల్కురికి సోమన బసవపురాణంలో ఆనాటి ప్రచారంలోని తుమ్మెద పదాలు, గొబ్బిపదాలు, వెన్నెలపదాలు, జోలపాటలు, కోలాటపాటలు, చాగుభళాలు మొదలైనవి కనిపిస్తాయి. సోమనాథుని అక్షరాంక పంచప్రకారాది గద్యములు, బసవాష్టక, గంగోత్పత్తి, సద్గురు చెన్నబసవ రగడాదులు ఆనాటి ప్రసిద్ధములైన గేయకృతులుగానే భావించాలి. సోమనాథుని సమకాలికుడైన చక్రపాణిరంగన శివదీక్షను పొంది నయనరగడ, నమశ్శివాయరగడలను రచించాడు. 342 పాదములు గల నయనరగడకు 'శివభక్తిదీపిక' అని గూడా పేరు. ఇందులో ప్రతి పాదము చివర 'కంటి' అనే మకుటముంటుంది. శివమంత్ర వర్ణనగల నమఃశ్శివాయ రగడలో 108 పాదాలు, ప్రతిపాదంలో నమశ్శివాయ అనే మకుటం కనిపిస్తాయి. "కృష్ణమాచార్యులు 'సింహగిరి నరహరి వచనముల'నే గాక రామనామ, నృసింహనామము లనబడు రగడలను గూడా రచించినట్లు తెలుస్తుంది."[1] నాచన సోమనాథునిదిగా చెప్పబడుతున్న 'వసంత విలాసం' అన్న ప్రబంధంలో ఒక జాజరపాట ప్రసక్తి కనిపిస్తుంది.

**"వీణగానం వెన్నెలతేట**
**రాణమీరగా రమణులపాట**
**పేరు చెప్పిన పిన బ్రహ్మణువీట**
**జాణలు మెత్తులు జాజరపాట."**

ఈ జాజరపాట తేటతెలుగులోని పదకవితగానే ఉండి ఉంటుంది.

1. ఆనందమూర్తి, వేటూరి, తాళ్ళపాకకవుల పదకవితలు- భాషాప్రయోగవిశేషాలు. ద్వితీయ భాగం. పుట. 9.



"ఎఱ్ఱాప్రెగ్గడ సంగీత రసికుడట. పోతన 'గోవిందు మీద పాటలు, చాలునంకించి పాడెదు పాటలు' పేర్కొన్నాడు. శ్రీనాథుడు జాజరలనబడే చర్చరీ గీతాలను, పల్నాటివీరగాథల్ని పేర్కొన్నాడు. దేశీయరచన యక్షగానరీతిని ప్రశంసించాడన్న విషయం పూర్వోక్తం. మడికిసింగన 'చతురలీలలనాటి సంకీర్తనము' చేసిన వైఖరిని ప్రస్తుతించాడు. ఆవెనుక తాళ్ళపాక వారి సమకాలికులు, ఆ తరువాత తెలుగుకవులు తమ సంగీతపాండిత్యాన్ని ప్రకటించుకొన్నారు."[1] .......ఈ రకంగా అన్నమాచార్యపూర్వయుగంలో తరువాత ప్రఖ్యాతమైన పదసాహిత్య ప్రాదుర్భావానికి కావలసినంత నేపథ్యం కనిపిస్తుంది. దైవస్తుత్యాత్మక వచనాలు రచించి పాడిన కృష్ణమాచార్యులే ఈ యుగానికి వేగుచుక్క. ఇతనికి ముందే సంస్కృతంలో జయదేవుని గీతగోవిందం, లీలాశుకుని కృష్ణకర్ణామృతం వెలసి తెలుగుదేశంలో ఏర్పడిన భక్తికవితా ఉద్యమానికి దోహదంచేసి పద రచనలకు ప్రేరణ కలిగించాయి. వీటిని గురించి కొంత ముందు ప్రస్తావించబడింది.

## 2. అన్నమాచార్య యుగం

అన్నమయ్యే తెలుగులో పదకవితకు ఆద్యుడు, సార్వభౌముడు. అన్నమాచార్యులు, ఆయన సంతతి వారు రచించిన పదసాహిత్యమే గాక తొలి యక్షగానకర్తల రచనలు, తత్త్వకర్తల తత్త్వాలు ఈ యుగం కింద పరిశీలింప బడతాయి. రెండు వందల సంవత్సరాలు విస్తరించిన ఈయుగంలో యుగకర్త కాదగిన లక్షణాలు అన్నమయ్యకు తప్ప మరెవ్వరికీ లేవు. అన్నమయ్య రోజు కొకటికి తక్కువ కాకుండా 32,000 సంకీర్తనలు రచించినట్లు చెప్పబడుతున్నది. ఆయనే శ్రీవేంకటేశ్వరుని ఆలయప్రాంగణంలో సంకీర్తనభండారాన్ని (తాళ్ళపాక అర) నెలకొల్పినట్లు కూడా తెలుస్తుంది. ఈ సంకీర్తనలను అన్నమయ్య కుమారుడైన పెదతిరుమలాచార్యులు రాగిరేకుల మీద చెక్కించడం ప్రారంభించాడు. అన్నమాచార్యులు అహోబిలంలోని ఆదివన్ శఠకోపయతి శిష్యులైనందున కొన్ని సంకీర్తనల రాగిరేకులు అక్కడికి పోయినట్లు తెలుస్తున్నది. కొన్ని తంజావూరు చేరినట్లు తలంపబడుతోంది. ఏమైనా సంకీర్తనలన్నీ ఈనాడు లభ్యపడవు. పెదతిరుమలాచార్యులు, అతని కుమారుడైన చినతిరుమలాచార్యులు కూడా

1. గంగప్ప ఎస్.తెలుగులో పదకవిత. గుంటూరు 1983. పుట.46-47

సంకీర్తనకర్తలే. ప్రస్తుతం తాళ్లపాకవారి సంకీర్తనలలో 14,911 మాత్రం దొరుకుతున్నాయి. సంకీర్తనలనేగాక అన్నమయ్య సంస్కృతంలో వేంకటాచల మహాత్మ్యం, తెలుగులో ద్విపదరామాయణం, పంద్రెండు ఇతర శతకాలు రచించాడు. వీటిలో వేంకటాచలమాహాత్మ్యం, వేంకటేశ్వరశతకం లభిస్తున్నాయి. అన్నమయ్య సంస్కృతంలో 'సంకీర్తనలక్షణం' రచించినట్లు తెలుస్తున్నది కాని అది అలభ్యం, "అన్నమాచార్యులు పదకవితా పితామహుడని, సంకీర్తనాచార్యుడని, హరికీర్తనాచార్యుడని పిలవబడుతున్నాడు. కన్నడభాషలో పురందరదాసులవారికి, ప్రాకృతభాషలో వేంకటముఖికి దారిచూపిన సంకీర్తన వాఙ్మయానికి అన్నమాచార్యులు వ్యవస్థాపకుడైనాడు. అన్నమాచార్యులవారు పండుముసలిగా ఉన్న కాలంలో పురందరదాసులవారు యువ సమకాలీనుడుగా వారిని తిరుపతిలో దర్శించారు. అంతేగాదు, అన్నమయ్యగారి రచనలను తమ కన్నడ రచనల్లో అనుకరించారు కూడా. వారి మాళవి రాగంలోని రచన 'శరణు శరణు సురేంద్ర వందిత శరణు శ్రీపతి సేవిత' అనే రచన అన్నమయ్యగారి మాళవిరాగంలోని రచన 'శరణు శరణు సురేంద్రసన్నుత శరణు శ్రీసతివల్లభా' అనేదాన్ని అనుకరించింది."[1] అన్నమయ్య సంకీర్తన వాఙ్మయంచేత ప్రభావితుడైన పురందరదాసును కర్నాటక సంగీతానికి 'పితామహుడు' గా చెపుతారు.

అన్నమయ్యకు తిరుమాలంబ, అక్కలాంబ అని ఇద్దరు భార్యలు. వీరిలో తిరుమలాంబ విదుషీమణి. మంజరీ ద్విపదల్లో 'సుభద్రాకల్యాణం' అనే గేయకావ్యం రచించిన ఈమె తెలుగులో మొదటి కవయిత్రి. ఈమెకు నరసింగన్న అనే కొడుకు ఉండినట్లు అతడే కవికర్ణరసాయనకర్త సంకుసాల నృసింహకవి అని తెనాలి రామకృష్ణకవిదిగా తలపబడుతున్న క్రింది చాటువును బట్టి కొంద రూహిస్తున్నారు.

**చిన్నన్న ద్విపద కెరగును**
**పన్నుగ పెద తిరుమలయ్య పదమున కెరగున్**
**మిన్నంది మొరసె నరసిం**
**గన్న కవిత్వంబు పద్య గద్య శ్రేణిన్.**

1. సాళ్వ కృష్ణమూర్తి అనువాద వ్యాఖ్యానాలతో కూడిన తాళ్ళపాక చినతిరుమలాచార్యుని సంకీర్తన లక్షణం. భూమిక. పుట. XIII-XIV



ఈ పద్యంలోని పెదతిరుమలయ్య అన్నమయ్యకు అక్కలాంబ వలన కలిగిన కుమారుడు. చిన్నన్నకే చినతిరువేంగళనాథుడని పేరు. ఇతడు పెద తిరుమలయ్య కుమారుడు. నరసింగన్న అన్నమయ్య కుటుంబీకుడు కాదు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు రామకృష్ణుని చాటువును, అష్టమహిషీకల్యాణ పీఠికను ఆధారం చేసుకొని నరసింహకవి అన్నమయ్య పుత్రుడని అభిప్రాయపడినారు. సుంకసాల తిరుమలకవి తన 'భాగవతవైభవము' అనే ద్విపదగ్రంథములో తాను నరసింహకవి మనుమడనని–

**"సుంకసాల కులాబ్ధి సోమనిష్కామ**
**పంకజోదరపాద భక్త్యేకధామ**
**నమితి విద్వజ్జన నరసింహపౌత్ర**
**రమణీయ గుణగణ రఘునాథ పుత్ర**
**తిరుమల శుభనామ ధేయప్రణీత**
**వరకావ్యమగు భాగవత వైభవమున"**

అనే ద్విపదపంక్తులలో చెప్పుకున్నాడు. "ఇందు పేర్కొనబడిన నరసింహుడెవరు? 'సుంకసాల' అని తిరుమల కవి పేర్కొని యుండుటచే ఇతడే సుంకసాల నరసింహకవి యని చెప్పవచ్చును. సుంకసాల సంకుసాల అయిఉంటుంది. నరసింగన్నకు నారాయణుడు అప్పలార్యుడు, అన్నమార్యుడు అను మువ్వురు కొడుకులున్నట్లు అష్టమహిషీ కల్యాణ పీఠికలో కలదు. కాని 'భాగవత వైభవ' పీఠికలో రఘునాథుడొకడే కొడుకున్నట్లు చెప్పబడినది. దీనిని బట్టి అన్నమాచార్యుని కుమారుడు నరసింగన్న, సంకుసాల నరసింహ కవి వేర్వేరని తెలుచున్నది."[1]

**తిమ్మాంబకు నాత్మ సంభవుండు**
**పాడఁజెప్పఁగ వర్ణ పద్ధతి నీడు**
**జోడు లేఁడన సభఁ జొచ్చి వాదించి**
**పరఁగిన ధీశాలి ప్రతివాద దైత్య**
**నరసింహుఁడనగల్గె నరసింహ గురుఁడు."**

(అష్టమహిషీకల్యాణ పీఠిక)

1. చలపతి. జి. కవికర్ణరసాయనము – విశిష్టాద్వైత సమన్వయము. తిరుపతి. 1984. పుట. 4.

ఈ పీఠికలో చెప్పబడిన 'పాడడంలోను, చెప్పడంలోను సభలో వాదించడంలోను ధీశాలి' యైన నరసింగన్న, విశిష్టాద్వైతమతం పునాదులపైన కవికర్ణరసాయనమనే ప్రబంధం నిర్మించిన నరసింహకవి ఒక్కరే కావడం అసంభవం. పెదతిరుమలాచార్యులు సుమారు క్రీ.శ.1473-1553 మధ్యకాలంలో జీవించినవాడని చెప్పవచ్చు. అన్నమయ్య మరొక భార్యయైన అక్కలమ్మ కొడుకితడు. 'కవితార్కికకేసరి', 'శరణాగతవజ్రపంజర' అనే బిరుదులుగల ఇతడు గొప్ప పండితుడు. తండ్రి ప్రోత్సాహంతో ఇతడు కూడా కొండలరాయని మీద రోజుకొక సంకీర్తన చొప్పున రచించినాడట. సంకీర్తనలనే గాక వైరాగ్యవచనమాలికాగీతాలు (శ్రీ వేంకటేశ్వరవచనాలు), శృంగార దండకము, చక్రవాళమంజరి, శృంగార వృత్త శతకము, వేంకటేశ్వరోదాహరణం, నీతిసీసశతకము, సుదర్శనరగడ, రేఫఱకారాలు, ఆంధ్రవేదాంతము (భగవద్గీత), ద్విపద హరివంశము (ఇది అలభ్యం) అనేవి కూడా రచించాడు. అన్నమయ్య తరువాత పదకవితా ప్రవాహాన్ని బాగా ప్రవహింపజేసినవాడు పెదతిరుమలాచార్యులే. ఆ తరువాత ఈ మార్గాన్ని అనుసరించినవాడు ఇతని పెద్దకుమారుడు చినతిరుమలాచార్యులు (1493-1553).

చినతిరుమలాచార్యులకు తాతగారైన అన్నమయ్య చేతనే బ్రహ్మోపదేశం పొందే అదృష్టం కలిగింది. 'అష్టభాషాకవిచక్రవర్తి' అనే బిరుదు వహించిన ఇతడు గొప్ప విద్వాంసుడు. ఈయన కూడా తాత తండ్రులలాగే శృంగార, అధ్యాత్మ సంకీర్తనలు రచించి ఉత్తమ పదకవిగా పేరుపొందాడు. తెలుగులో 'సంకీర్తనలక్షణం' అనే గ్రంథాన్ని, అష్టభాషాదండకాన్ని కూడా రచించాడు. చిన తిరుమలాచార్యుల తమ్ముడైన చినతిరువేంగళనాథుడు (చిన్నన్న) అష్టమహిషీ కళ్యాణం, పరమయోగివిలాసం, ఉషాపరిణయం, అన్నమాచార్యచరిత్ర అనే గ్రంథాలు వ్రాశాడు. ఇతడు రోజుకు వెయ్యి ద్విపదలు కూర్చగల దిట్ట అట!

## తత్త్వకర్తలు

తాళ్ళపాకకవుల తరువాత క్షేత్రయ్య వరకు గల మధ్యకాలంలో ఎందరో పదకర్తలు పదసాహితీలతను పరిపోషించారు. వారిలో మొదట చెప్పదగిన వారు పోతులూరి వీరబ్రహ్మం, అతని శిష్యుడు దూదేకుల సిద్ధయ్య. తత్త్వకర్తలని వీరికి పేరుంది. వీరబ్రహ్మం క్రీ.శ.17 వ శతాబ్దానికి చెందినవాడు. ఇతడు



గొప్ప తాత్త్వికవేత్త; సంస్కరణాభిలాషి. ఇతడు రవ్వలకొండ, యాగంటి గుహలలో ఉంటూ రచించిన కాలజ్ఞానతత్త్వం ప్రమాణగ్రంథం. వీరబ్రహ్మం విగ్రహారాధన, జాతిభేదములు, జాతరలు, జంతుబలులు మొదలైన వాటిని నిరసించాడు. శివకేశవుల భేదాన్ని, మతభేదాలను పాటించని బ్రహ్మం సర్వమానవ సమానత్వాన్ని బోధించాడు. అతని శిష్యవర్గంలో బ్రాహ్మణులు మొదలు హరిజనుల వరకు సర్వులూ ఉండేవారు.

**'చెప్పలేదంటనక పొయ్యేరు - జనులార గురుని చేరి మ్రొక్కితె బ్రతుక నేర్చేరు'.**
**'ఇల్లు వాకిలి నాది ఇల్లాలు నాదనుచు - ఏల భ్రమసితివయ్యో మనసా'**
**'చెడు గుణంబుల జిక్కి చెడిపోకె మనసా - చేరి సద్గురుని సేవించవే మనసా'**
**'చిల్లర రాళ్ళను మొక్కుచునుంటే - చిత్తము చెదురా ఒరేఒరే'**

మొదలైనవి వీరబ్రహ్మం ప్రసిద్ధ తత్త్వాలలో కొన్ని.

బ్రహ్మంగారి శిష్యులలో దూదేకులసిద్ధయ్య ప్రసిద్ధుడు. ఇతడు మహమ్మదీయుడైనా వైరాగ్యం కలిగి అప్పటికే తత్త్వకర్తగా ప్రసిద్ధికెక్కిన బ్రహ్మంగారి నాశ్రయించి అతని శిష్యుడైనాడు. స్వమతస్థుల కోపానికి గురియైనా ఇతడు లెక్కచేయలేదు.

**'ఏ కులమని నను వివరమడిగితే యేమని దెల్పుదు లోకులకూ-**
**పలుగాకులకూ, దుర్మార్గులకూ, యీ దుష్టులకు'**
**'ఏల దేహము పనికిరాని దెందుకీ మోహము-**
**జాలమనె సంసారబంధములోన జిక్కి మూలమెరుగని'**

ఇత్యాది తత్త్వములతో సిద్ధయ్యకు దేశంలో ప్రచారముంది. వీరబ్రహ్మం, సిద్ధయ్యల గురుశిష్య సంబంధం గొప్పది. 'బ్రహ్మం వంటి గురువు, సిద్ధయ్య వంటి శిష్యుడు' లేరని చెప్పడం ఈనాటికీ ఉంది.

## భద్రాచల రామదాసు (1620-1680)

భద్రాచల రామదాసని పేరుపొంది నాటినుండి నేటివరకు ఆంధ్రదేశం లోనే గాక యించుమించు భారతదేశమంతటా పరమభక్తాగ్రేసరుడుగా పేరుపొందిన ఈ వాగ్గేయకారుని అసలు పేరు కంచెర్లగోపన్న. ఇతని కీర్తనలను గానం చేయని రామమందిరాలు గాని, రామమందిరాలు లేని గ్రామాలుగాని

ఆంధ్రదేశంలో లేవంటే అతిశయోక్తి కాదు. గోల్కొండ రాజ్యం లోని నేలకొండ పల్లెలో లింగనమంత్రికీ కామమ్మకు పుత్రుడై జన్మించిన గోపన్న 1650 నాటికి తానీషా కొలువులో తహసిల్‌దారుగా చేరి వసూలు చేసిన పన్ను ధనంతో భద్రాది రాముని ఆలయం నిర్మించినట్టు చరిత్ర చెపుతుంది. చిన్నతనంలోనే వైష్ణవదీక్ష తీసుకొని తన జీవితాన్ని రామభక్తికి అంకితం చేసుకొన్న పుణ్యపురుషుడితడు. రామదాసు నూటికి పైగా కీర్తనలను, దాశరధీశతకాన్ని రచించాడు.

రామదాసుకీర్తనలు భక్తిరసస్ఫోరకంగా, గానపద్ధతికి అనుకూలంగా ఉంటాయి. అయినా కర్నాటకసంగీతవిద్వాంసులు రామదాసుకీర్తనలను ఎక్కువగా ఆదరించినట్లు కనపడదు. "ఆ కీర్తనలలో ఆ విద్వాంసుల విద్వత్ప్రకర్షకు అవకాశం తక్కువై, వాటి సంగీతరచన సరళ స్పష్ట లయాన్వితమై, సూటియైన భావస్ఫురణతో సామాన్య జనానికి కూడా అందుబాటులో ఉండేటంత సుగమంగా ఉండడమే ఇందుకు బహుశా కారణం కావచ్చును."[1] సంగీత విద్వాంసులు ఆదరించకున్నా రామదాసుకీర్తనలు 'లోకుల రసనలె ఆకులుగా' దేశంలో ప్రచారం పొంది భక్తుల హృదయాలను తన్మయం చేస్తున్నాయి. మన సంగీత చరిత్రలో 'ఆనందభైరవి' రాగాన్ని మొట్టమొదట ఉపయోగించిన వాగ్గేయకారుడు రామదాసేనని బాలాంత్రపురజనీకాంతరావుగారు అభిప్రాయపడుతున్నారు. రామదాసుకీర్తనలలో ప్రముఖమైనవన్నీ ఆనందభైరవిరాగంలో పాడబడడం కూడా దీన్ని నిరూపిస్తుంది.

**'పలుకే బంగారమాయెనా కోదండపాణి'**
**'ఏటుబోతివో రామ ఏటుబోతివో'**
**'రాముని వారము మాకేమి విచారము'**
**'కలియుగవైకుంఠము భద్రాచలనిలయము'**
**'ఎందుకు కృపరాదు శ్రీరాములు' –**

ఇత్యాది కీర్తనలన్నీ రామదాసు రచించిన ఆనందభైరవిరాగ కీర్తనలు.

**'తారక మంత్రము కోరిన దొరికెను' – ధన్యాసి– ఆది**
**'తక్కువేమి మనకు రాముండొక్కడుండు వరకు'– నాదనామక్రియ –ఆది**

1. రజనీకాంతరావు, బాలాంత్రపు. ఆంధ్రవాగ్గేయకారచరిత్రము పుట. 216



**'ఏ తీరుగ నను దయ జూచెదవో ఇనవంశోత్తమ రామా'– నాదనామక్రియ–ఆది**
**'గరుడగమన రారా నను నీ కరుణ నేలుకోరా' – యమునాకల్యాణి–ఆది**
**'రక్షించే దొరవని నమ్మితి – ఇపుడు శిక్షింప నేనేమి జేసితి'– బిలహరి–ఆది**
**'శ్రీరామ నీ నామమేమి రుచిరా' – గౌళిపంతు–ఆది**
**'సీతారామస్వామి నేజేసిన నేరంబేమి' – సావేరి–ఆది**
**'ఇక్ష్వాకు కులతిలక ఇకనైన పలుకవే' –కాంభోజి–ఆది**
**'నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి' –కల్యాణి–ఆట**
**'సకలేంద్రియములార ఇపుడు సమయము గాదు' – కాంభోజి–జంపె**
**'అంతా రామమయం జగమంతా రామమయం' – వరాళి–ఆది**

ఈ కీర్తనలన్నీ భజనగోష్ఠులలో శ్రవణపర్వంగా నేటికీ మనం వినేవే. రామదాసు కీర్తనలను చదివినపుడు, పాడినపుడు, వినినపుడు మనకు పులకాంకురాలు పుడతాయి.

## యక్షగాన కవులు

తెలుగులో యక్షగానరచన క్రీ.శ.16 వ శతాబ్ది ప్రారంభం నుండే జరిగినది. యక్షగానం చతుర్విధకవితలలో మధుర కవితాశాఖకు సంబంధించినది. యక్షగాన లక్షణాలను చెప్పిన మొదటి లక్షణగ్రంథం చిత్రకవి (16 వ.శ పూర్వార్ధం వాడు) పెద్దన రచించిన లక్షణసారసంగ్రహం. ఇందులో రగడ భేదాలను త్రిపుటాది తాళాలకు ఎలా వాడుకోవచ్చునో చెప్పబడింది. 'యక్షగానంబునన్ వెలయు పదంబులు, దరువులు, ఏలలు, ధవళంబులు, మంగళ హారతులు, శోభనంబులు, ఏకపద, ద్విపద, త్రిపద, చతుష్పద, అష్టపదులు నివి యాదిగా గల్గునన్నియు లయ ప్రమాణంబుల నొప్పి మృదు మధుర వచన రచనల ప్రసిద్ధంబైన యని మధుర కవిత్వంబులు' అని చెప్పి యక్షగానం పదకవితా భేదంగా పేర్కొన్నది వార్తాకవి రఘునాథయ్య లక్షణదీపిక. అందువల్ల యక్షగాన కర్తలను గూడా పదకర్తలతో పాటు సంప్రదించవలసి ఉంది. మొదట గానాత్మకంగా గేయరూపమున ఉంటూ (క్రీడాభిరామం), తరువాత సంవాదరూపం దాల్చి (సుగ్రీవ విజయం), ఆ తరువాత యక్షగానం వీధినాటకంతో అభేదం పొందింది.

తెలుగులో యక్షగానముల ప్రస్తావన వచ్చినపుడు శ్రీకృష్ణలీలాతరంగిణి కర్త నారాయణతీర్థులను (1580–1680) ప్రస్తుతించ వలసి ఉంది. ఇతడు తెలుగు వాడని కొందరి అభిప్రాయం. జయదేవుడే నారాయణతీర్థులుగా అవతరించాడని ప్రతీతి. శ్రీకృష్ణలీలాతరంగిణి సంస్కృతంలోని యక్షగాన మంటున్నారు రజనీకాంతరావుగారు. ఇతడు తెలుగులో 'పారిజాతాపహరణం' అనే యక్షగానం రచించాడు. ఇతని శిష్యుడు సిద్ధేంద్రయోగి (1600–1700) కూచిపూడి భాగవత మేళాలకు ఆద్యుడు. నారాయణతీర్థుల తరంగములు తమకు పూర్వముండిన సంకీర్తన సౌరాభాన్ని మోసుకొని, తర్వాతి యుగ లక్షణమైన యక్షగాన స్వరుపాన్ని పదిలపరచుకొని, జయదేవాదుల భక్తి శృంగార భావాలను పులుముకొని తరువాతి పదకర్తలను, యక్షగాననిర్మాతలను ప్రభావితం చేశాయి. ప్రోలుగంటి చెన్నశౌరి రచించిన 'సౌభరిచరిత్ర' అనే జక్కుల కథ తెలుగులో మొదటి యక్షగానం. కందుకూరి రుద్రకవి 'సుగ్రీవవిజయం', క్రాంజి వెంకటాద్రి 'వాసంతికా పరిణయం', బాలపాపాంబ 'అక్కమహాదేవచరిత్ర', కంకంటిపాపరాజు 'విష్ణుమాయా నాటకం', టేకుమళ్ల రంగశాయి 'జానకీ పరిణయం' మొదలైనవి క్రీ.శ.1600 ప్రాంతమున రచింపబడిన యక్షగానములలో చెప్పదగినవి. తంజావూరు, మధురనాయక రాజుల కాలంలో యక్షగానవాఙ్మయానికి మంచి వికాసం కలిగింది. తంజావూరు నాయక రాజులైన రఘునాథనాయకుడు, విజయ రాఘవనాయకుడు స్వయంగా కవులై యక్షగానాలు రచించారు. వీరి ఆస్థానములలో ఉండిన కవులందరూ యక్షగానాలు రచించినవారే. క్షేత్రయ్య ఈ కాలపువాడే. ఈ కాలపు యక్షగానాలకు నాటకంవలె రంగస్థలం పై ప్రదర్శింపబడుటచే నాటకాలని పేరేర్పడినది. ఆ కవులు వీటిని నృత్య నాటికలుగ, గేయ ప్రబంధాలుగ పరిగణించారు."ఈ యక్షగాన నాటకములందలి దరువులకు తాళప్రాధాన్యము తగ్గి క్షేత్రయ్య పదములవంటి పదములు జానపదగేయములును చేరినవి. సంధివచనముల సంఖ్య తగ్గి పాత్రలు వచనమున పరస్పరము సూటిగా సంభాషించు పద్ధతి యెక్కువగా పాటింపబడినది."[1] యక్షగాన ప్రక్రియలో కలిగిన ఈ పరిణామం క్షేత్రయ్య పదములలో బాగా కనిపిస్తుంది.

1. నాగయ్య,జి.తెలుగు సాహిత్యసమీక్ష రెండవ సంపుటం. తిరుపతి 1985 పుట.239.



ఇలాగే నాయకరాజుల తరువాత తంజావూరును పాలించిన మహారాష్ట్రుల కాలంలో కూడా యక్షగాన రచన జరిగింది. షహాజీ (1684–1712) స్వయంగా ఇరవై యక్షగానాలు రచించాడు. మధురను పాలించిన విజయరంగచొక్కనాథ నాయకుని (1706–1782) కాలంలో తిరుమలకవి 'చిత్రకూటమాహాత్మ్యం' అనే యక్షగానాన్ని రచించాడు. పుదుక్కోట కోటిరాయ రఘునాథ తొండమాన్ (1769–1789) ఆస్థానకవియైన నుదురుపాటి వెంకన 'పార్వతీ కళ్యాణం' అనే యక్షగానాన్ని రచించాడు. తెలుగులో యక్షగానరచన ప్రారంభమైన కొన్ని సంవత్సరముల తరువాత కన్నడదేశంలో కూడా యక్షగానం బహుళప్రచారం పొందిన ప్రక్రియగా మారింది. యక్షగానం తెలుగుదేశం లోనే పురుడు పోసుకొని, తమిళ, కన్నడ దేశములకు వ్యాపించింది. ఈ విధంగా మధురకవితాశాఖకు చెందిన యక్షగాన ప్రక్రియ దక్షిణదేశమంతటా వ్యాపించి దేశిప్రక్రియయైన పదకవితను సుసంపన్నం చేసింది.

## క్షేత్రయ్య యుగం

పదకవితా పితామహుడైన అన్నమయ్య తరువాత అంతటి వాగ్గేయకారుడు పదకవితా చక్రవర్తి క్షేత్రయ్య. క్షేత్రయ్య కాలంనుండి త్యాగయ్యకాలం వరకు వెలసిన పదకవులలో ఒజ్జబంతి క్షేత్రయ్య. అన్నమయ్య సంకీర్తనలలో సాహిత్యానికి ప్రాధాన్యమెక్కువ. సంగీత సాహిత్యాలకు సమప్రాధాన్య మివ్వడమే గాకుండా అభినయాన్ని కూడా జోడించిన పదకర్త క్షేత్రయ్య. క్షేత్రయ్య పదాలు మధురభక్తి ముదురు పాకాన పడి లౌకిక శృంగార స్ఫోరకాలుగా కనిపిస్తాయి. అందువల్ల పదమంటే శృంగారపదమని, క్షేత్రయ్య శృంగారపదకర్త అని సామాన్యుల అభిప్రాయం. అయినా తరచిచూస్తే శృంగారంలోనూ భక్తిభావాలు గోచరిస్తాయి.

క్షేత్రయ్య మొదటి పేరు వరదయ్య. ఇతడు కృష్ణాజిల్లాలోని 'మొవ్వ' గ్రామ నివాసి. క్షేత్రయ్య ఇంటి పేరు కూడ మొవ్వయే. ఆ గ్రామంలో క్షేత్రయ్య వంశీయులు ఇప్పటికీ ఉన్నారు. అక్కడే మువ్వగోపాలుని కోవెల ఉంది. క్షేత్రయ్య పదాలన్నీ మువ్వగోపాల ముద్రాంకితాలే. చిన్నతనంలో క్షేత్రయ్య అల్లరిగా తిరుగుతూ ఒక యోగివల్ల గోపాల మంత్రోపదేశం పొంది, నియమనిష్ఠలతో గోపాలుని అనుగ్రహం పొందాడు. ఆయన అనుగ్రహంతో సంస్కృతాంధ్ర భాషలలో సంగీతాభినయాలంకారాది శాస్త్రాలలో పాండిత్యం సంపాదించి

శృంగారపదాలు చెప్పడం మొదలుపెట్టాడు. మువ్వగోపాలాంకితం గానే గాక ఇతర రాజుల ముద్రలతోగూడా క్షేత్రయ్య పదాలు రచించాడు. తాను దర్శించిన రాజులలో కొందరిపై చెప్పిన పదాలను క్షేత్రయ్య క్రింద పదంలో తెలియజేశాడు.

**వేడుకతో నడుచు కొన్న విటరాయడే ॥పల్లవి॥**

**ఏడు మూడు తరాలనుండి- ఇందున్న కాణాచట**
**గూడుకొని మా మువ్వ-గోపాలుడే విభుడు ॥అనుపల్లవి॥**

**మధుర తిరుమలేంద్రుడు- మంచి బహుమాన మొసగి**
**ఎదుట గూర్చుండమని-ఎన్నిక ఇమ్మనెనే**
**ఇదిగో రెండువేల పదము-లిపుడెంచుకొమ్మనిన**
**చదురు మీదనే ఉన్న సామికి - సంతోష మింతింతగాదె ॥వేడుకతో॥**

**అలుకు దీరి తంజాపురి -నెలకొన్న విజయరాఘవుని**
**వెలయ మనుజుల వెంబడి-వేగమె పొడ గాంచి**
**చలువ చప్పరమున నుండగ - చక్కగ వేయి పదముల**
**పలుకరించుకోగానె-బహుమాన మిచ్చె నావేళ ॥వేడుకతో॥**

**బలవంతుడౌ గోలుకొండ-పాదుషా బహుమాన మిచ్చి**
**తులసిమూర్తితో వాదు- దలచె నావేళ**
**వెలయ మువ్వ గోపాలుడు - వెయ్యినేనూరు పదములు**
**నలుబది దినములోన - నన్ను గలసి వినుపించెనే. ॥వేడుకతో॥**

ఈ పదంలోని వివరాలను బట్టి మధుర తిరుమలేంద్రుని పై 2000 పదాలు, విజయ రాఘవుని పై 1000 పదాలు, గోలుకొండ పాదుషా దర్బారులో 1500 పదాలు-మొత్తము 4500 పదాలు క్షేత్రయ్య రచించినట్లు తెలుస్తుంది. వీరినేగాక క్షేత్రయ్య తుపాకుల వెంకటకృష్ణప్ప, రఘునాథనాయకులను గూడా ఆశ్రయించాడు. వెంకటకృష్ణప్పపై రచించిన పదాలు మూడు మాత్రమే లభించాయి. రఘునాథునిపై రచించిన పదములు బొత్తిగా దొరకలేదు. తిరుమల నాయకునిమీద, గోలుకొండ పాదుషా మీద రచించిన పదముల జాడే తెలియదు. విజయరాఘవనాయకునిపై చెప్పినవి పండ్రెండు మాత్రం దొరుకుతున్నాయి. ఇవిగాక మువ్వగోపాల ముద్రతో 347 పదాలు లభిస్తున్నాయి. క్షేత్రయ్య ఇన్నివేల పదాలు రచించినా ప్రస్తుతం మనకు దొరికేవి 372 మాత్రమే.



అనేక రాజులనే గాక క్షేత్రయ్య అనేక పుణ్యక్షేత్రాలను గూడా దర్శించాడు. పుణ్యక్షేత్రాల సందర్శనవల్ల వరదయ్యకు క్షేత్రయ్య అనే పేరు కలిగింది. క్షేత్రజ్ఞానం సంపాదించిన వాడు గావడం చేత క్షేత్రజ్ఞుడైనాడు. దక్షిణదేశంలో ఈ పేరుతోనే ఇతడు ప్రసిద్ధుడు. మధురభక్తి పరవశుడు క్షేత్రయ్య. తానే నాయికగా, మువ్వగోపాలుడే తన ప్రాణనాయకుడుగా భావించాడు. భగవంతుని యెడల భక్తునికిగల ఉత్తమమైన ప్రేమ భక్తి. ఈ భక్తిని శృంగారపరంగా వ్యాఖ్యానించి నపుడు మధురభక్తి అవుతుంది. గోపాలుడు విశ్వశృంగార నాయకుడు గావడం చేత క్షేత్రయ్యకు మువ్వగోపాలుడు శృంగారి గానే సాక్షాత్కరించాడు. అతని చిత్తవృత్తి తదనుగుణంగా మారి శృంగారంలో భక్తిని ఇమిడించుకొన్నది. క్షేత్రయ్య పదాలలో దివ్యశృంగారం వర్ణింపబడింది. క్షేత్రయ్య శృంగారంలో లౌకిక వ్యక్తులు కనిపించినా, వారు భక్తిపరవశులు. క్షేత్రయ్య మధురభక్త్యుపాసకుడుగా తరించి భక్తులకు తరుణోపాయం చూపించాడు. సంగీత సాహిత్యాభినయాలలో తరువాతి వారికి ఇతడు మార్గదర్శకుడైనాడు.

## సిద్ధేంద్రయోగి

క్షేత్రయ్య తరువాత పేర్కొనదగినవాడు సిద్ధేంద్రయోగి. కూచిపూడి నివాసియైన ఇతడు నారాయణతీర్థుల శిష్యుడని చెపుతారు. పారిజాతా పహరణము, గొల్లకలాపము సిద్ధేంద్రుని రచనలు. ఇతడు కూచిపూడి వారి సంప్రదాయాన్ని ప్రతిష్ఠించినవాడు. “16వ శతాబ్దం చివరి వరకు జక్కుల పురంధ్రుల ఏకపాత్రక ప్రదర్శనములు, కొరవంజులు వేటికవి వేరు వేరు గానే పామరజనానికి వినోదాన్ని కలిగిస్తూ ఉండేవి. దాదాపు ఆ ప్రాంతంలోనే ఈ ప్రదర్శనలకుగాని, ప్రదర్శకులకుగాని సామాజిక గౌరవస్థాయిగాని సాహిత్య నిబద్ధతగాని లేకపోవుట గమనించి, అఖిలశాస్త్ర పారంగదుడు, భరతోక్తనాట్య సంగీత లక్ష్యలక్షణ పరిజ్ఞాత అయిన నారాయణతీర్థులో, సిద్ధేంద్రయోగో చతుష్షష్టి కళలలో పాండిత్యం సంపాదించిన విద్వత్కుటుంబాలలోని పురుషులు నాట్యాభాసము, యక్షగాన ప్రదర్శనము కులవృత్తిగా అవలంభించవలెనని శాసించారు.”[1] ఇది కూచిపూడి నృత్యసంప్రదాయానికి తొలిమెట్టు. సంగీత

1. రజనీకాంతరావు, బాలాంత్రపు. ఆంధ్రవాగ్గేయకార చరిత్రము పుట. 196.

సాహిత్య నృత్యరీతులు యక్షగానంలో కలసిమెలసి ఉండినా వాటి మధ్య సయోధ్య కుదిర్చి ఒక విశిష్టతను చేకూర్చిన ఘనత కూచిపూడి సంప్రదాయానిది. భామాకలాపం సిద్ధేంద్రయోగి నూతనసృష్టి. భాగవతసంప్రదాయం అంటే భాగవతంలోని ప్రధాన ఘట్టాలను ప్రదర్శనయోగ్యాలుగా మార్చి, శృంగారం ప్రధానంగా భక్తి గౌణంగా మొత్తము మీద మధురభక్తియుతంగా ప్రజలముందు ప్రదర్శించడం ఈ కాలంలోనే స్థిరపడింది. సిద్ధేంద్రయోగి చేతులలో మెరుగులు దిద్దుకొన్న ఈ సంప్రదాయం ఒక కళగా అవతరించింది. దీనితోపాటు సంగీత నృత్యాలకు అనుగుణమైన పదాల రచన గూడా జరిగింది. సాహిత్య సంగీత నృత్యములకు సమప్రాధాన్యం క్షేత్రయ్య పదములలోనే కనిపిస్తుంది.

ఈ యుగపు పదసాహితీలాలిత్యాన్ని రాయలయుగపు ప్రబంధ కవితాహేలతో పోల్చవచ్చు. ప్రబంధాల ఒరవడి, ఉరవడి పదసాహిత్యంలో కనిపిస్తాయి. ప్రబంధకవిత్వం పోకడలను జీర్ణం చేసుకొన్న పదకవులు గూడా ఉన్నారు. ఊహలను పొదగడంలో, వైచిత్రిని ప్రదర్శించడంలో, ఆత్మీయతను ధ్వనింపజేయడంలో వారికీ వీరికీ సామ్యముంది. ప్రబంధాలు రాజులను, పండితులను, విలాసవంతులను సంతృప్తి పరిస్తే-పదకవితలు పండిత పామరులను సమంగా రంజింపజేశాయి. పదకవితకు, పదకవులకు గౌరవప్రదమైన కాలమిది. ఈ కాలంలో రాయలయుగపు ప్రబంధాలను గుర్తుకు తెచ్చే ప్రతి పద్య చమత్కృతి గల విజయవిలాసాది శ్లేషప్రబంధాలు రాజాదరణకు పాత్రమైనా, పదసాహితీ వైభవానికి ప్రతీకలైన యక్షగానాలు కూడా రాజుల హృదయాలను ఆకట్టుకున్నాయి.

అన్నమయ్యతో ప్రాచుర్యం పొందిన తెలుగు పదకవిత ఎందరో పదకవుల పదసాహితిని తనలో లీనం చేసుకుంటూ క్షేత్రయ్య నాటికి స్థిరత్వాన్ని, ప్రాభవాన్ని పొందింది. "తెలుగు పదకవితా కన్యకు పితామహుడు తాళ్ళపాకఅన్నమయ్య గారింటిని. కాని జనకుడే క్షేత్రయ్య. తాత మొదలుపెట్టిన పనిని తలపొలముదాక ఈడ్చిన తండ్రి యితడు."[1] అన్నరాళ్ళపల్లి వారి మాటలు ఈ సందర్భములో సార్థకమవుతాయి. క్షేత్రయ్యపదాల ప్రభావం తరువాతి పదకవులందరిపైనా ఉంది. క్షేత్రయ్యకు త్యాగయ్యకు నడుమ చాలామంది పదకవులు ఉన్నారు.

1. అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి, క్షేత్రయ్యపదములు(వ్యాసం) ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక 1942-43. పుట.12.



ఒకరకంగా వీరంతా రాజాస్థానాలలో పోషింపబడినవారే. కంఠీరవరాజు, సారంగపాణి, గోవిందసామయ్య, కూనసామయ్య, శాహభూపాలుడు, గిరిరాజకవి, మధుర శ్రీనివాసయ్య, ఘనం శీనయ్య, మార్గదర్శి శేషయ్య, మొదటి శరభోజి, తులజారి, ప్రతాప సింహుడు, కాశీనాథయ్య, మేరట్టూరు వీరభద్రయ్య, కంకంటి పాపరాజు, మునిపల్లె సుబ్రహ్మణ్యకవి మొదలైనవారంతా ఈ కాలంలో పదాలు రచించినవారే. మధురను పాలించిన విజయరంగ చొక్కనాథుని అమాత్యులలో ఒకడు ఘనంశీనయ్య. ఇతడు సంగీతసాహిత్యనిధి; వాగ్గేయకారుడు. శేషం వేంకటపతి కృతమైన శశాంకవిజయానికి ఇతడు కృతిభర్త. శశాంకవిజయం అవతారిక ఇతనిని గొప్ప సంగీతవిశారదుడుగా ప్రశంసించింది. ఇతడెన్నో పదాలు రచించాడు. 'శివదీక్షాపరురాలనురా' అన్నది ఇతని ప్రసిద్ధ పదం. ఇతని పదాలలోని భావాలు ఇతరుల పదములకు అనుకరణాలుగాక స్వతంత్ర మైనవిగా కనిపిస్తాయి. కంకంటిపాపరాజు ఉత్తరరామాయణ కర్తగా ప్రసిద్ధుడు. ఇతడు 'విష్ణుమాయావిలాసనాటకం' అనే యక్షగానం రచించాడు. ఇందులో రక రకముల పదాలు, దరువులు ఉన్నాయి. ఎందరు పదకర్తలుండినా ఈ యుగంలో చెప్పుకో దగినవారు సారంగపాణి, మునిపల్లె సుబ్రహ్మణ్యం. వీరిద్దరిలో ఎవరి ప్రత్యేకత వారిది. ఇరువురూ ఉత్తమ పదకర్తలే ...సారంగపాణి పదాల మాధుర్యాన్ని చవిచూడకముందే సుబ్రహ్మణ్యకవి ఆధ్యాత్మరామాయణ కీర్తనలను గురించి తెలుసుకోవలసి ఉంది.

## మునిపల్లెసుబ్రహ్మణ్య కవి (1730-1780)

రామదాసు కీర్తనల తరువాత ఆంధ్రదేశంలో ప్రచారం పొందిన జన రంజకమైన సంగీత సాహిత్యరచన కీర్తనలలో రచింపబడిన ఆధ్యాత్మరామాయణం. రామాయణ కథ నంతటినీ సుబ్రహ్మణ్యకవి ఆరు కాండాలలో 104 కీర్తనలలో నిక్షేపించాడు. ఇతనికి ముందు ముక్తకరూపంలో వెలువడిన గేయసాహిత్యం ఇతని చేతిలో కథనాత్మకం కావడం విశేషం. క్షరాక్షరరూపమైన దేహమునందు ఆధ్యాత్మము అక్షరమని, దేహము అధిభూతమని గీతలందూ ఉపనిషత్తులందూ వివరింపబడింది. దేహధారుల కందరికీ చైతన్యకారణమైన జీవాత్మ పరమాత్మకంటె అన్యము కాదనే అద్వైతతత్త్వమును బోధించు జ్ఞానము ఆధ్యాత్మజ్ఞానము. రాముడు అట్టి పరమాత్మ స్వరూపు డైనప్పటికీ దేహధారియై అవతరించి లోక వ్యవహారమనే

మాయలో చిక్కుకొని కూడా ఆత్మజ్ఞానము కలిగి,దుష్టసంహారము చేసినాడని నిరూపించినది ఆధ్యాత్మ రామాయణము."[1] బ్రహ్మాండ పురాణాంతర్గతమైన ఈ తత్త్వాన్ని శివుడు పార్వతికి బోధించాడు. సుబ్రహ్మణ్యకవి బాలకాండను 17 కీర్తనలలోను, అయోధ్యకాండను 9 కీర్తనలలోను, అరణ్యకాండను 11 కీర్తనలలోను, కిష్కింధకాండను 10 కీర్తనలలోను, సుందరకాండను 10 కీర్తనలలోను, యుద్ధకాండను 47 కీర్తనలలోను రచించాడు. కీర్తనలన్నీ అనుప్రాసలతో కూడి శృంగారరసాత్మకమైన విశేషణాలతో కూడిఉన్నాయి. వాల్మీకి రామాయణమంతా మానవోత్తముడైన రాముని చరిత్ర. ఆధ్యాత్మ రామాయణంలో రాముడు పరబ్రహ్మ స్వరూపుడు. సీత ఆదిమాయ లేక అవిద్య. ఇందలి రామచరిత్రమంతా లీలానటన. అద్వైత సిద్ధాంతమే పరతత్త్వమని, శ్రీరామునిపై గల భక్తియే భక్తి అని ఇందులో సిద్ధాంతీకరింపబడింది. ఈ కీర్తనల నిండా భక్తి పొంగి ప్రవహిస్తుంది. అయోధ్యకాండలో అహల్య రాముని స్తుతించిన సందర్భంలో

**"నీచరణ నీరజ పరాగమునను**
**దురితమెల్లను దొలగె నహహ**
**గరిమతోను కృతార్థనైతి**
**జగత్ప్రభో కమలావిభో"**
**"ఏ విభుపాదరాజీవ రేణువులచే**
**పావనమైనది భాగీరథి"**

ఇత్యాది చరణాలలో భక్తిరసం తొణికిసలాడుతుంది.

మునిపల్లెసుబ్రహ్మణ్య కవి శ్రీకాళహస్తి దామెర్లవారి సంస్థాన పోషితుడు. ఆ సంస్థానపు ప్రభువుల ప్రోత్సాహంపై ఇతడు కొన్ని పదాలు గూడా రచించాడు. కాళహస్తి జమీందారు లైన దామెర్లవారి సంస్థానంలో ఉండిన తాళపత్ర గ్రంథాలలో కొన్నిటిని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తిరుపతి ప్రాచ్యపరిశోధనాలయానికి తెచ్చారు. వాటిలో 'దామెరవారి పదాలు' అనే పేరుగలిగిన తాళపత్రంలో దామెర తిమ్మభూపాలుని కుమారుడైన కుమారవేంకటసార్వభౌముని మీద నాలుగు, దామెరవేంకటేంద్రుని కుమారుడైన కృష్ణభూపాలుని మీద రెండు పదాలు కనిస్తున్నాయి. ఇవే గాక కాళహస్తీశ్వరునికి అంకితమైన దొక పదము,

1.రజనీకాంతరావు, బాలాంత్రపు, ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము. పుట - 260.



అగస్త్యనాథునికి అంకితమైన దొక పదము కూడా ఈ తాళపత్రంలో ఉన్నాయి. దామెరవేంకటేంద్రుని చేత, అతని కుమారుడైన కృష్ణభూపాలునిచేత ఈ కవి పోషించబడినాడు. వేంకటేంద్రుడు 1780 లో తూర్పు ఇండియా వర్తక కంపెనీవారికి లొంగిపోయాడు. ఈ కారణాలవల్ల ఈ కవి 1780 ప్రాంతంలోనే వాగ్గేయకారుడై, పండితుడై సుమారు 1730 ప్రాంతంలో జన్మించి ఉండవచ్చునని రజనీకాంతరావు గారు నిర్ణయించారు.రాగాల విషయాని కొస్తే నూటనాలుగు కీర్తనలలో సుబ్రహ్మణ్యకవి 58 రాగాలు వాడాడు. లభించిన పదాలన్నిటిలో క్షేత్రయ్య 36 రాగాలనే వాడాడు. క్షేత్రయ్య పదాలలో వలె ఇతని కీర్తనలలో కూడా ధాతుమాతువులు సమప్రాధాన్యం కలిగి ఉన్నా వేదాంత భావాల భారంవల్ల కొన్ని కీర్తనలలో సంగీతం కంటె సాహిత్యం ప్రాధాన్యం పొంది కనిపిస్తుంది. "విద్వద్గాయకుల ఆదరం క్రమంగా తగ్గి కాబోలు ఈ నాడు ఆధ్యాత్మరామాయణ కీర్తనల గానపద్ధతి అప్రౌఢు లైనప్పటికీ, అభిమానంతో ఆదరించిన కొందరు వృద్ధ స్త్రీజనం నోళ్ళలోను, మారుమూల గ్రామాల సంకీర్తనపరుల గొంతులలోను మిగిలి, క్రమంగా హరించుకపోవడానికి సిద్ధంగా ఉన్నది."[1] ఆంధ్రదేశంలో తమ కీర్తనలలో ఆబాలగోపాలాన్ని అలరించిన ప్రసిద్ధ వాగ్గేయకారులలో సుబ్రహ్మణ్యకవి ఒక రకంగా చివరివాడు.

# సారంగపాణి

చిత్తూరుజిల్లాలోని కార్వేటినగరం ఒకప్పటి ప్రముఖ సంస్థానానికి కేంద్రం. కార్వేటినగర సంస్థాన పోషితుడు సారంగపాణి. ఈ సంస్థానంలో సారంగపాణి పండితుడుగాను, విద్యాధికారిగాను, వాగ్గేయకారుడుగాను ప్రసిద్ధికెక్కినాడు. వైణిక విద్వాంసుడుగా, అభినయాచార్యుడుగా ప్రఖ్యాతి గాంచినాడు. ఇతడు రచించిన పదాలు సుమారు 210 దాకా దొరుకుతున్నాయి. ఇవి శృంగార, దేశీయ, జాతీయ, కీర్తనపదాలుగా - నాలుగు భాగాలుగా ఉన్నాయి. వీటిలో శృంగార ప్రధానమైనవి, భక్తివైరాగ్యవాసనా విలసితములైనవి మాత్రమే కాక జానపదుల నిసర్గభావరమణీయములైన పదాలు కూడా ఉన్నాయి. సంగీత సాహిత్యాలలో నిండు పాండిత్యము కలిగి, అభినయపద్ధతి ఎరిగి పదాలు రచించినవారెందరో

1.రజనీకాంతరావు, బాలాంత్రపు, ఆంధ్రవాగ్గేయకార చరిత్రము, పుట.272-73.

ఉన్నారు. ఈ లక్షణాలతో పాటు సారంగపాణి వైణికుడు, విద్యాధికారి. ఇతని పదాలలో కనిపించే వైశిష్ట్యానికి ఇవి కూడా కారణాలే. పదకర్తగా సారంగపాణికి కొన్ని ప్రత్యేకతలున్నాయి.

1. సారంగపాణికి శిష్యవర్గం లేదు. అందువల్ల ఇతని పదాలకు ప్రచార ప్రాభావాలు తక్కువ. రచించిన కీర్తనలన్నీ కూడా దొరకడం లేదు.
2. ప్రాస్తావికంగా ఇతని కీర్తనలను విన్నవారు దేశంలో అక్కడక్కడా పాడి ప్రచార దోహదం చేశారే తప్ప, మరొక రకంగా ప్రచారంలోనికి రాలేదు.
3. శృంగార రసాత్మకములైన పదాలు రచించిన వారిలో తాళ్ళపాకవారు తప్ప ఇతని వలె ఇంత తీవ్రతతో, ఆత్మశుద్ధితో, భక్తి, నీతి వైరాగ్యాలను ప్రబోధించే పదాలు మరెవరూ వ్రాయలేదు.
4. మూడవదైన 'జాతీయపదాలు' అనే విభాగంలో గల పదాలలో వ్యావహారికభాష వాడబడింది. ఆనాటి వాడుకభాషలోని పదాల పొందిక ఈ భాగంలో కనిపిస్తుంది. తరువాత వచ్చిన వ్యావహారిక భాషా ఉద్యమానికి సారంగపాణి ఈ పదాలలో పునాది వేశాడేమో ననిపిస్తుంది. ఏ పదకర్తకూ అప్పటివరకు తోచని విషయమిది.
5. సారంగపాణి గతించిన ఏభై అరవై సంవత్సరాలకు అతని పదాలు కార్వేటినగరంలోనే భారతీ లీలాసదన ముద్రాక్షరశాలలో19 వ శతాబ్దం ఆరంభంలో ముద్రింపబడినాయి. ఈ ప్రతి అలభ్యం. ఈ ముద్రాక్షరశాల ఇప్పుడు లేదు. దాని స్థానం నేడు పంటపొలంగా మారిపోయింది. ఈ పదకర్త జీవించిన పట్టణంలోనే నాడు సారంగపాణి నివసించాడని చెప్పబడుతూ వున్న ఆవాసప్రాంతం బలసిన కంపచెట్లతో నిండి ఉంది.
6. 'పదాల పోహళింపు, భావాల గుభాళింపు' ఇతరుల పదాలలోవలె సారంగపాణి పదాలలో కూడా కనిపిస్తాయి. అయితే ఇతని పదాల ప్రత్యేకత సమకాలీన సాంఘికజీవితవిశేషాలను పదాలలో ప్రస్తరించడంలో కనిపిస్తుంది. సారంగపాణి కాలానికే ఒక రకమైన దొరల (ఆంగ్ల) సంస్కృతి దేశంలో వ్యాపించింది. పల్లెలు విడిచి ప్రజలు నాగరకతా వ్యామోహంతో పట్టణాలకు వలసవెళ్ళడం ప్రారంభమైంది. పరసంస్కృతీ ప్రభావం దేశీయుల మనస్సులను ఎలా ప్రభావితం చేసిందో సారంగపాణి గుర్తించాడు. తన పదాలలో అక్కడక్కడ పాశ్చాత్యసంస్కృతి దేశీయపద్ధతులను విచ్ఛిన్నం చేయడాన్ని ప్రస్తావికంగా ఖండించాడు.



## సారంగపాణి దేశం

ఇన్ని ప్రత్యేకతలు సంతరించుకున్న సారంగపాణి దేశకాలాదులను కచ్చితంగా తెలుసుకొనే ఆధారాలు అంతంత మాత్రమే. స్వవిషయాలు ఇతడు చెప్పుకోలేదు. దొరికిన పదాలలో ఎక్కడా ఇతని స్వవిషయ ప్రస్తావన కనిపించదు. సారంగపాణి "మదరాసుకు సమీపంలోని పొన్నేరి గ్రామంనుండి కార్వేటినగర సంస్థానానికి వచ్చినట్లు పెద్దలు చెప్పగా విన్నమాట."[1] అన్న కార్వేటినగర వాస్తవ్యులైన ఆచార్య పి.వి.అరుణాచలంగారి అభిప్రాయం విలువైంది. సారంగపాణి కాలం క్రీ.శ. 1680–1750 గా పండితులు నిర్ణయించారు. ఇదే నిజమైతే అరుణాచలంగారికి సుమారు రెండు వందల సంవత్సరాల ముందువాడవుతాడు సారంగపాణి. చారిత్రకంగా రెండు వందల సంవత్సరాల కాలం ఏమంత పెద్దదికాదు. రెండు వందల సంవత్సరాలలోపు మౌఖికంగా ప్రచారం పొందుతుండిన విషయాన్ని నమ్మవచ్చు. కార్వేటినగర పట్టణ పెద్దల ద్వారా ఒక తరం తరువాత మరొక తరంవారు వింటూ వుండిన సారంగపాణికి సంబంధించిన విషయాలనే తన తరంలో అరుణాచలంగారు విని ఉంటారు. సారంగపాణి పొన్నేరి ప్రాంతం వాడేనని నమ్మవచ్చు. ప్రథమంగా వాగ్గేయకార చరిత్ర రచించిన సుబ్బరామదీక్షితులు సారంగపాణిని గురించి "ఇతడు 200 సంవత్సరములకు లోబడు ఉత్తరదేశీయుడైన తెలుగు బ్రాహ్మణుడు."[2] అని పేర్కొన్నారు. దీవి నరసింహాచార్యులు "ఈ కవిది దివి తాలూకా ఘంటసాల కాపురము. వీరు కాణ్వశాఖ వైదికబ్రాహ్మణులు. ఋగ్వేదులు."[3] అని వివరించారు. ఈ

1.'అజ్ఞాత వాగ్గేయకారుడు – సారంగపాణి' (వ్యాసం) ఆంధ్ర పత్రిక. డిసెంబరు 5, 1976.
2.సంగీత సంప్రదాయప్రదర్శిని, ప్రథమసంపుటం, పు.34.
3.కృష్ణాస్రవంతి.పుట.119.

పండితులిరువురి అభిప్రాయాలను బట్టి సారంగపాణి కృష్ణా గుంటూరు మండలాల ప్రాంతంలో పుట్టి కార్వేటినగరానికి వలసవచ్చి ఉండవచ్చు ననిపిస్తుంది. అయితే సారంగపాణి ఆప్రాంతం వాడని చెప్పడానికి కావలసిన హేతువులను వీరు చూపలేదు. ఇతడు రచించిన పదాలలో పలు ప్రాంతాల పేర్లు కనిపిస్తున్నాయి. ఒకటి రెండుచోట్ల 'బందరు' కమ్మలు, 'బందరు' పావడలను పేర్కొనడంచేత ఇతనిని ఆ ప్రాంతం వాడుగా చెప్పడానికి వీలులేదు. ఒక కవి రచనలో అతని కాలం నాటికి ఏదో ఒక రకంగా ప్రసిద్ధికెక్కి వాడుకలో ఉండిన దేశాల పేర్లు ప్రాస్తావికంగా దొరలవచ్చు. అంతమాత్రంచేత ఆ కవిని ఆ దేశాలలో ఒక దేశానికి చెందినవాడుగా చెప్పడం పొసగదు. గుజరాతి ముత్యపుసరులను, నారాయణవనంచీరను, మునిమడుగురవికెలను కూడా సారంగపాణి పేర్కొన్నాడు. ఇవేవి ఆయన దేశాలు కావు. ప్రథమ భాగమైన శృంగార పదాలలో ఆరవ పదంగా 'ఊళ్ళపదము' ను రచించాడు సారంగపాణి.

**'కడపదాటి రానీయకే - అలవానిమాయ - గంటి వాకిలి దీయకే**
**పదతిరొాయిక్కేరి - పడుచుల జేరి నన్ను**
**విడనాడి పొమ్మనిన - వేణుగోపాలుని'**

ఈ పదంలో కనిపించే కడప, ఇక్కేరి, దరిశి, మదుర, నెళవాయ, తిరువీధి, పేరూరు, అయిరాల, వళికొండ, గోలకొండ, చిత్రకూటము, పెనుకొండ మొదలైనవన్నీ ఊళ్ళ పేర్లే. పదప్రయోగంలో సారంగపాణి సమర్థుడు. వేణుగోపాలుని దక్షిణనాయకత్వానికి భయపడిన నాయిక అతనిని 'కడపదాటి రానీయకుండా కట్టివేసుకునే' సందర్భంలోనిదైన ఈ పదంలో ఊళ్ళ పేర్లు సగము సగముగా విరిగి సారంగపాణి పదప్రయోగదక్షతను చాటుతున్నాయి. అందువల్ల ఈ పదం పదకర్త పాండిత్యానికి గీటురాయే కాని అతని స్వస్థలాన్ని తెలిపేది కాదు.

శహాజీ మహారాజు తంజావూరు నేలుతున్న కాలంలో చిత్తూరుజిల్లాలోని కార్వేటినగరంలో గోవిందసామయ్య, కూనసామయ్య అనే వాగ్గేయకారులు ఉండేవారు. వీరిద్దరు అన్నదమ్ములని, త్రైలింగ్య బ్రాహ్మణులని సుబ్బరామదీక్షితుల అభిప్రాయం. గోవిందసామి భరతశాస్త్రకోవిదుడైన నాట్యాచార్యుడు కూడా. ఇతని రచనలలో తాళపు పోకడలు, జాతుల మార్పుల ననుసరించి సాగిపోయే జతిస్వరరీతులు అద్భుతంగా ఉంటాయని వింజమూరి నరసింహాచార్యులు



ప్రస్తుతించారు.[1] ఈ ఇద్దరిలో గోవిందసామిని శహాజీకి సమకాలికుడై కార్వేటి నగరాన్ని పాలించిన మాకరాజు వేంకటపెరుమాళ్రాజు సత్కరించాడు. గోవిందసామి కేదారగౌళ, నవరోజు, ముఖారి రాగాలలో పదాలు రచించాడు. ఇతని తమ్ముడు కూనసామి కూడా ప్రసిద్ధిచెందిన పదకర్తే. ఈ అన్నదమ్ములిరువురు కార్వేటినగరసంస్థానంలో పండితులే. సారంగపాణి వీరికి సమకాలికుడు. వీరి కళ్ళముందే సారంగపాణి కార్వేటినగరసంస్థానంలో ప్రవేశించి పదకవిగా ప్రసిద్ధి చెందినాడు. "చెన్నపురికి దరిదాపుల్లోని పొన్నేరి ప్రాంతానికి చెందిన ఇతడు పిన్నప్రాయంలోనే కార్వేటినగరం చేరుకొని భక్తసంత్రాణశీలుడగు అచటి వేణుగోపాలునిపై పదాలల్లుతూ జీవయాత్ర సాగించాడు.[2] అనే అభిప్రాయం సమంజసంగానే ఉంది.

సారంగపాణి జన్మస్థానమేదైనా అతడు చిన్నతనంలోనే కార్వేటి నగరానికి వచ్చి స్థిరపడినట్లు తెలుస్తుంది. జన్మస్థలమేదైనా ఇతడు తెలుగువాడు. ఇతని పదాలలో తెలుగు నుడికారపు సొంపు-ముఖ్యంగా రాయలసీమ ప్రాంతపు తెలుగుతనం ఉట్టిపడుతుంది. ఆంధ్రదేశపు గ్రామీణ వాతావరణాన్ని, జానపదుల మనస్తత్వాన్ని ఇంత చక్కగా పదాలలో పొదుగుకున్న పదకవి మరొకడు కనిపించడు. అందువల్ల సారంగపాణి కార్వేటినగర వాస్తవ్యుడేనని చెప్పడంలో ఏ ఆటంకము ఉండనక్కరలేదు.

## సారంగపాణి కాలం

సారంగపాణి కాలనిర్ణయం చేయడానికి ప్రధానఆధారం అతనిని పోషించిన కార్వేటినగరసంస్థానపు రాజులు. సారంగపాణి పదాల ప్రథమ భాగంలో ఇతడు మాకరాజు కార్వేటిరాజేంద్రుని పేరుమీద రచించిన పదాలు మూడున్నాయి. (60,61,62 సంఖ్య గల పదాలు). ఈ విషయం ఆధారం చేసుకొని పండితులంతా ఇంచుమించు సమానంగానే ఇతని కాలాన్ని నిర్ణయించారు. నిడదవోలు వేంకటరావు సారంగపాణి క్రీ.శ. 1700 ప్రాంతం వాడని అభిప్రాయ పడినారు.[3] బాలాంత్రపురజనీకాంతరావు సారంగపాణి 1680-

1. రజనీకాంతరావు, బాలాంత్రపు, ఆంధ్రవాగ్గేయకార చరిత్రము, పుట. 316.
2. కృష్ణమూర్తి, కె.జె. సారంగపాణిపదాలు, స్రవంతి, డిసెంబరు, 1975.
3. తెలుగువిజ్ఞానసర్వస్వం, సంపుటం3, పుట -1173.

1710 సంవత్సరాల మధ్య జీవించినట్లు చెప్పారు.[1] సారంగపాణిని పోషించిన కార్వేటినగరరాజు శహాజీకి సమకాలికుడు. శహాజీ రాజ్యకాలం 1684–1712 కావడంవల్ల సారంగపాణి జననకాలం 1680 ప్రాంతంగా నిర్ణయించడం సరిగానే ఉంది. దీవి నరసింహాచార్యుల కింది మాటలను బట్టి సారంగపాణి 1710 తరువాత కూడా ఉండటానికి అవకాశముంది. "వీరు క్రీ.శ.1695 వ సంవత్సరమున జన్మించిరి....కార్వేటినగర ప్రభువులైన శ్రీమన్మహామండలేశ్వర సాళ్వరాజు వేంకట పెరుమాళ్రాజుగారి ఆస్థానమున వైణిక పండితులుగా ఉండిరి.....శక సంవత్సరములు 1731 వ సంవత్సరమునకు సరియైన శుక్ల సంవత్సరమున సంస్థానంలో 'దుర్గరాజపుర' మను శ్రోత్రియ గ్రామమును వీరికి దానమిచ్చిరి."[2] వేంకటపెరుమాళ్రాజు కాలం 1719–1732. అతని సోదర పుత్రుడైన కార్వేటిరాజు పాలన 1733 నుండి ఆరంభమవుతుంది. వీరి కాలాలను, పండితుల అభిప్రాయాలనుబట్టి సారంగపాణి 1731 లో సత్కరింపబడి తరువాత మాకరాజు కార్వేటిరాజు ఆస్థానంలో కూడా వర్ధిల్లి వుంటాడని అర్థమవుతుంది. ఈ పరిశీలనవల్ల సారంగపాణి కాలం 1680–1750 అని నిర్ణయించడం నిర్బాధకమని గంగప్పగారు అభిప్రాయపడినారు.[3]

సారంగపాణి వేణుగోపాలస్వామి భక్తుడు. ఇతని పదాలలో పదకొండు తప్ప మిగిలినవన్నీ వేణుగోపాలస్వామి నామాంకితాలే. ఇతడు కార్వేటినగరం చేరినప్పటికే అక్కడ వేణుగోపాలస్వామి ఆలయం నిర్మించబడి పూజాదికాలు నిర్వహింపబడుతూ ఉండి ఉండాలి. ఆలయం 1617 లో నిర్మింపబడినట్లు చెప్పబడుతూవుంది. అయితే అప్పటికి ఆలయం చాల చిన్నదిగా ఉండి ఉంటుంది. తరువాత ఆలయ వైశాల్యం పెరిగి గర్భగుడి చుట్టు మంటపాలు ఏర్పడి ఉంటాయి. ఇప్పుడున్న ప్రధాన గోపురం క్రీ.శ.1857 లో నిర్మించబడినట్లు గాలిగోపుర ప్రధాన ద్వారం కుడివైపు గోడమీదగల శాసనాన్నిబట్టి తెలుస్తుంది. ఆ శాసన మిది. "స్వస్తిశ్రీ శాలివాహన శతాబ్దములు 1779 అగు నేటి పింగళ సం॥ చైత్ర శుద్ధ 2 అశ్వనీ కర్కాటక లగ్నం- ఈ శుభదినమందు శ్రీమదిఖిలాండ కోటి

1. ఆంధ్రవాగ్గేయకార చరిత్ర పుట, 317.
2. కృష్ణా స్రవంతి. పుట.119.
3. సారంగపాణి పదసాహిత్యం. పుట8.



బ్రహ్మాండనాయకుడైన – శ్రీ వేణుగోపాలస్వామివారికి – అలమేలుమంగ తాయమ్మవారి పుత్రికయై శ్రీమన్మహామండలేశ్వరాది – బిరుదాంకిత మాకరాజు వేంకట పెరు–మాళ్రాజులుంగారి ధర్మపత్నియును – మహారాజ వేంకటాంబగారు ఆచంద్రార్కస్థాయిగా నూత్నముగ కట్టించిన – గోపురధర్మము."[1]

ఈ శాసనకాలం క్రీ.శ.1857 (శా.శ.1779+78). మాకరాజు వేంకట పెరుమాళ్రాజు కీర్తిశేషుడైన తరువాత అతని భార్య వేంకటాంబ వేయించినదీ శాసనం. ఈ శాసనాన్నిబట్టి సారంగపాణి కాలాన్ని లెక్కిస్తే ఇతని కాలం మరికొంత ముందుకొస్తుంది. మాకరాజు వేంకటపెరుమాళ్రాజు కాలంలోనే మాకరాజు కార్వేటిరాజు యువరాజుగా ఉండివుండవచ్చు. పెరుమాళ్రాజు ఆస్థానంలో ఉంటూ సారంగపాణి యువరాజైన కార్వేటిరాజు పేరుమీద మూడు శృంగారపదాలు చెప్పి ఉంటాడు. ఈ శాసనంలో ఇచ్చిన శకసంవత్సరం నిజమైనదైతే వేంకట పెరుమాళ్రాజు క్రీ.శ.1800 ప్రాంతం వాడవుతాడు. అతని ఆస్థానంలో ఉండిన సారంగపాణి కూడా ఈ కాలానికే చెందుతాడు. పెరుమాళ్రాజు కాలానికి లేబ్రాయపువాడై ఉండి కార్వేటిరాజు కాలానికి సారంగపాణి ప్రౌఢుడై ఉంటాడు. 1963 లో ప్రకటించిన సారంగపాణి పదాలకు సమీక్ష వ్రాసిన మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు సారంగపాణి కాలం క్రీ.శ.1830 ప్రాంతంగా నిర్ణయించడం ఈ అభిప్రాయాన్ని బలపరుస్తుంది. సారంగపాణి కాలం విషయంలో పండితుల అభిప్రాయాలను పరిశీలించి గంగప్పగారు నిర్ణయించిన కాలం 1680–1750. గంగప్పగారు ఈ కాలం శాలివాహన శకానికి చెందినదో, క్రీస్తుశకానికి చెందినదో స్పష్టం చేయలేదు. ఈ కాలం శాలివాహన శకానికి చెందినదైతే పై శాసనకాలం, పార్వతీశ్వరశాస్త్రిగారు ఊహించిన కాలం ఇంచుమించుగా సంవదిస్తాయి. ఇప్పటివరకు ఎవరూ ఈ శాసనకాలాన్ని గురించి ఆలోచించలేదు. ఈ దృష్టితో సారంగపాణి కాలాన్ని పునఃపరిశీలించవలసిన అవసరం ఏర్పడింది. ఇలా పరిశీలించినపుడు సారంగపాణి క్రీ.శ.19 వశతాబ్ది పూర్వార్ధంవాడని స్పష్టపడుతుంది.

1. రాజా బొప్పరాజు రామకృష్ణరాజులుంగారి సన్మానసభ (16–5–1965) సందర్భంగా ప్రచురించిన సంచికలో ప్రచురింపబడింది.

కార్వేటినగరంలో శ్రీవేణుగోపాలస్వామి ఆలయనిర్మాత వేంకట పెరుమాళ్రాజేనని పరంపరగా ఆ ప్రాంతంలో వినవస్తున్న అభిప్రాయం కూడా సారంగపాణి కాలానికి సంబంధించిన పై అభిప్రాయాన్ని బలపరుస్తుంది. పెరుమాళ్రాజు కాలం నుండి కార్వేటినగర సంస్థానంవారి చేత నిర్వహింపబడుతూ ఉండి, సంస్థానం పోయిన తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దేవాదాయశాఖవారిచే నిర్వహింపబడుతూ ఉండిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయాన్ని 10-4-1989 వ తేదీన తిరుమలతిరుపతిదేవస్థానం వారు స్వాధీనపరుచుకొని పూజాదికాలు నిర్వహిస్తున్నారు. వారు ఆనాడు వేయించిన శిలాఫలకం మీద వ్రాయించిన విశేషాలు కూడా ఈ సందర్భంలో గమనింపదగినవే. ఆ విషయాలివి.

"శ్రీవేంకటేశ్వరస్వామివారి ధర్మపత్ని పద్మావతీదేవి తండ్రి శ్రీ ఆకాశ మహారాజు వంశస్థుడైన కార్వేటినగర సంస్థానాధీశుడు శ్రీ వేంకటపెరుమాళ్రాజు తన ప్రభుత్వ కాలమందు కార్వేటినగరమును నిర్మించి సదరు నగరమందు ప్రాకార మంటప గోపురములచే కూడిన ఆలయమును మరియు పుష్కరిణి నిర్మించినాడు. నారాయణవనము నందు శ్రీవేంకటాచలపతితో కూడా పూజింపబడుచున్న శ్రీవేణుగోపాలస్వామిని తెప్పించి ప్రతిష్ఠించినాడు. వారి వంశస్థులైన సంస్థానాధీశులు ఈ ఆలయమును నిర్వహించుచుండిరి. తదుపరి తిరుత్తణి దేవస్థానం వారిచే నిర్వహింపబడి 1960 వ సంవత్సరమున తిరుత్తణి మద్రాసు రాష్ట్రమునకు చేరినందున ఆంధ్రప్రదేశ్ప్రభుత్వంవారు ధర్మకర్తల సంఘం ఏర్పరచి ఆలయనిర్వహణ దేవాదాయశాఖవారి ఆధ్వర్యములో జరుగుతూ వచ్చింది. ఆంధ్రప్రదేశ్ శాసనము 30/1987 ననుసరించి మరియు జి.ఓ./యం.ఎస్.నెం. 828 రెవెన్యూ ఎండోమెంట్ శాఖ తేది 8-12-1989 ప్రకారం పంగుని నెల సరియగు 10-4-1989 సోమవారం ఉదయం 9 గం॥ 30 ని॥లకు ఆంధ్రప్రదేశ్ ఎండోమెంట్స్ శాఖామాత్యులు శ్రీ కోళ్ళ అప్పలనాయుడు, జిల్లా పరిషత్ చేర్మెన్ శ్రీ జి.వి.శ్రీనాథరెడ్డి, వైద్యఆరోగ్యశాఖామాత్యులు డా॥పి.సుబ్బయ్య, మాజీ అమాత్యులు శ్రీ గాలిముద్దుకృష్ణమనాయుడు, శ్రీ ఆర్.చెంగారెడ్డి, ఎం.ఎల్.ఏ గార్ల సమక్షంలో తిరుమల తిరుపతి దేవస్థానంవారికి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం అప్పగించడమైనది." ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని పరిశీలిస్తే



సారంగపాణి కాలం పండితులు నిర్ధారించిన 1680-1750 కాలం కాదని, అతడు 19 వ శతాబ్ది పూర్వార్ధానికి చెందినవాడని అర్థమవుతోంది. ఈ కాలనిర్ణయానికి ఇంకా కొన్ని ఆధారాలు కావలసి ఉంది.

## వేణుగోపాల పదముద్ర

కార్వేటినగర సంస్థానాధీశులు వైష్ణవాన్ని ఆదరించారు. వీరి ఆస్థానాలలో వెలసిన కవులందరూ వైష్ణవమత ప్రతిపాదితములైన రచనలే చేశారు. మాకరాజు వేంకటపెరుమాళ్రాజు కాలంలో కార్వేటినగర సంస్థానమున అష్టదిగ్గజ కవులుండిరట. ఋగ్వేది వేంకటనారాయణ కవి, పోలిపెద్ది వేంకటరాయుడు, పాలమంగలం అప్పయ్యకవి, సారంగపాణి, శ్రీశైలకవి, ముడుంబ అప్పయాచార్యులు, రాయభట్టు వీరరాఘకవి, అనంతరాజు సుబ్బరాయకవి- అను ఎనుమండగురు ఆనాటి అష్టదిగ్గజకవులు,[1] ఈ కవులతో పెరుమాళ్రాజు ఆస్థానం సాహితీభోజుని ఆస్థానాన్ని తలపించి ఉండి వుంటుంది. ఈ కవులందరి రచనలు అలభ్యం. వీనిలో ఋగ్వేది వేంకటాచలకవి చంపూరామాయణం, ఋగ్వేది వేంకటనారాయణకవి అనువదించిన జయదేవకృత గీతగోవిందం, పోలిపెద్ది వేంకటరాయకవి వేణుగోపాలశతకం ముఖ్యమైనవి. కార్వేటినగర సంస్థానాధీశులు కవులను పోషించడమే గాక దేవాలయాలను కూడా నిర్మించారు. వేంకటపెరుమాళ్రాజు కాలంలో శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ నిర్మాణం జరిగింది. అంతకు ముందు కసవరాజు ప్రసన్నవేంకటేశ్వరాలయాన్ని నిర్మించినట్లు ఋగ్వేది వేంకటాచలకవి చంపూ రామాయణంలో గల-

**వేర్వేరన్ శివుడంచు విష్ణువనుచున్ వెల్లింటి కావేరిరా**
**జోర్వీనాథ కుమారుడౌ కసవరాజుత్సాహ వృత్తిన్ ధరా**
**గీర్వాణ ప్రకరంబు లెంచగను భక్తిన్ బ్రతిష్ఠించెగా**
**కార్వేటీశ ! ప్రసన్న వేంకటరమాకాంతా మనోవల్లభా!**

అనే పద్యాన్ని బట్టి తెలుస్తుంది. నగరానికి పశ్చిమవైపున గల ఈ దేవాలయం నేడు నామమాత్రావశిష్టంగా ఉన్నది.

1.దొణప్ప, తూమాటి. ఆంధ్ర సంస్థానములు-సాహిత్యపోషణము. పుట.86.

ఈ విధంగా వైష్ణవభక్తి సాగుతూ ఉండిన ఈ నగరంలో శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ నిర్మాణంతో వైష్ణవానికి గొప్ప ప్రాచుర్యం కలిగింది. సారంగపాణికి ఈ స్వామిమీద భక్తి కుదిరింది. వైష్ణవంలో వేణుగోపాలునికి ఒక ప్రత్యేకత ఉంది. ఆ దేవుని వేణురవంలో సమస్త ప్రకృతి తన్మయత్వం చెందుతుంది. గోవులు, గోపికలు, గోపాలురు అందులో తాదాత్మ్యం చెందుతారు. జగత్తును సమ్మోహనపరచే రవమది. అనాదిగా దివ్యప్రేరణ కోసం తపించే బద్ధ జీవులను చైతన్యపరవశులను చేసే మధురస్వరమది. జీవికి జీవితపరమార్థం తెలియ జెప్పిన ఈ మధురనిస్వనంలో బద్ధజీవులు ప్రాపంచిక వాసనలను తెంచుకొని ముక్తజీవులైనారు. భగవంతుని పిలుపుకు, ప్రేరణకు ప్రతీక మురళీరవం. ఆ రవం శ్రుతిగోచరమైతే జీవుల మానసాలు ఆనంద రసార్ణవా లవుతాయి. పురివిప్పిన మయూరాలవలె వారు నీలమేఘశ్యాముని సుందరత్వాన్ని భావించుకుంటారు. వేణులోలుని సౌందర్యం ప్రకృతి అంతటా నిండి ఉంది. అందుకే గోపికలకు ప్రతి చెట్టులోనూ, పుట్టలోనూ భువనసుందరుడు గోచరమవుతాడు. మురళీమనోహరుని సౌందర్య దర్శనానికి సహస్రాక్షులు చాలవనడానికి గుర్తుగా ఆయన శిరస్సు నలంకరించిన శిఖిపింఛాలలోని అక్షులే సాక్ష్యం. తన వేణుమాధుర్యంతో జీవుల సంచిత కర్మలను లయింపజేసి, వాటిని నిర్మూలించి వారికి జీవితగమ్యాలను నిర్దేశించడం వేణులోలుని తత్త్వం. ఈ అవగాహనతోనే సారంగపాణి శృంగార, భక్తి, వైరాగ్యాది భావాలను వేణుగోపాలునికి నివేదించుకొన్నాడు.

అనుపల్లవిలో ముద్రను వాడుకోవడం సాధారణం. కాని పదకర్తలు భావోద్వేగాన్ని బట్టి, వీలును బట్టి, కొన్నిట పల్లవిలోను, మరికొన్నిట అనుపల్లవి లోను వాడుకున్నారు. అన్నమయ్యసంకీర్తనలలో ముద్ర నియతంగా చివరి చరణంలో కనిపిస్తుంది. సారంగపాణి ముద్రను పల్లవిలోను, అనుపల్లవిలోను, చివరి చరణంలోను వాడుకోవాడమే కాకుండా కొన్ని పదాలలో (31,41,51 పదాలు) అనుపల్లవిని చివరి చరణాలలో కూడా వాడినాడు.

**తోడు తెచ్చేదనే వాని - అప్పుడే మెచ్చి తొడవు లిత్తువుగాని** //పల్లవి//
**వేడుక పరుడైన - వేణుగోపాలు దలచేడి**
**నగరినున్న - జాడ దెలిసి యాడకే**
**..... ..... ..... ......**

**చివరి చరణం : వీణెలు మీటుచును - ఒక్కరికొకరు**
**జాణతనము లాడుచును**
**మాణిక్యము వంటి - మగువ నిన్నేలిన**
**వేణుగోపాలుడా - వెలదిగూడిన గాని**

ఈ పదంలో అనుపల్లవిలోను, చివరిచరణంలోను వేణుగోపాలముద్ర కనిపిస్తుంది.

కార్వేటినగరనిలయుడైన వేణుగోపాలస్వామి పేర సంకీర్తనలు వ్రాసినవారు మరొకరున్నారు. కుమారవేంకటపెరుమాళ్రాజు (స్కంధ పుష్కరిణి, లక్ష్మీమహల్ నిర్మాణకర్త) కాలంలో మైనంపాటిరాఘవయ్య కార్వేటి వేణుగోపాలుని పై సంకీర్తనలు వ్రాసినట్లు ఆ వంశంవాడైన మైనంపాటి వేంకటసుబ్రహ్మణ్యం 'శ్రీ కృష్ణతాండవము- గోపికాలాస్యము' అనే గ్రంథంలో వ్రాశారు.[1]

కడపజిల్లాంతర్గత రైల్వేకోడూరు సమీపంలోని బుడుగుంటపల్లె నివాసియైన శ్రీ మైనంపాటి వేంకటసుబ్రహ్మణ్యం తెలుగుపండితుడుగా పనిచేసి, పదవీవిరమణ పొంది విశ్రాంతి తీసుకుంటూ ఇటీవల కాలం చేశారు. ఆయన మైనంపాటిరాఘవయ్యగారివిగా చూపిన కీర్తనలివి.

**కొలువుదీరెనే వేణుగోపాలుడు-** //పల్లవి//
**చెలువు మెరయ శృంగారపురుషుడు**
**శిరమున శిఖిపింఛము అల్లలాడగ-** //అనుపల్లవి//
**ఉరమున కౌస్తుభరత్నము కులుకగ**
**పరమేష్ఠి సురముని గణములు గొలువగ-**
**మురళి నూదుచు జగన్మోహనమున**
**పికగాన సమాన గోపిక గానములు వెలయ-**
**శుకవాణి సురరాణి సుదతులు నుతిసేయ** //కొలువు//

1.వివరములకు - ఆ గ్రంథ పీఠిక. పుటలు 41 - 42 (రైల్వే కోడూరు, 1975)

సురపొన్నతరుమూల వర(నవ)రత్న పీఠమున-
పరమాత్ముడై జగతి బాలింప నిలిచిన
ధర మైనముపాటి సుకవి రాఘవదాసు మెండు-
గారమున కీర్తింప కార్వేటిదేవుండు నిండు ॥కొలువు॥

* * *

జాలమేల బాలగోపాల - నాతో పంతమేలరా ॥పల్లవి॥
చాలురా విరాళి దూలి - చాల బాళి నొందినానురా
- - - -
రార! మైనముపాటి శ్రీరాఘవ కవివరుని బ్రోవరా
కారువీటి వరద ! రావదేర వేణుగోపాల ! బిరాన రార

## సారంగపాణిపదాల ప్రాచుర్యం

సారంగపాణికి శిష్యపరివారం లేదని ముందే చెప్పబడింది. ఆయన పదాలు వినిన సమకాలీన గాయకులు, పారమార్థిక గేయాలు పాడుకొనే వైష్ణవ సన్యాసులు ఇతర ప్రాంతాలలో పాడి ప్రచారం చేశారు. ఆంధ్రదేశంలోని వివిధ వేణుగోపాల స్వామి ఆలయాల్లో పారమార్థిక గేయ ఫణితిలో ఉండిన సారంగపాణి కీర్తనలు ప్రచారంలో ఉండేవి. వివిధ దేవాలయాలను దర్శించుకుంటూ ఉండిన సన్యాసులే ఈ కీర్తనల ప్రచారకులు.

**'ఎంత పేదవాడే వేణుగోపాలు డెంత పేదవాడే'(173)**
**'హరినామస్మరణ సేయకుంటే - అవతల గతి యేమి'(168)**

వంటి కీర్తనలు బొబ్బిలిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గాయకులు పాడేవారని మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు వ్రాశారు.[1]

**'అక్షయపాత్రకుపోతే - కదలని ఒక భిక్ష వేయరయా (194)**
**'కడుపా నీ వింత ఘనమైతివా' (192)**
**'భక్తిలేని వ్రతము లెన్ని జేసినా ఫలములేదు సుమీ' (184)**

అనే కీర్తనలను శాస్త్రిగారి ఊరి సాతాన్లు పాడేవారట.

1. సరస్వతిపవర్‌ప్రెస్, రాజమండ్రివారు 1963 లో ప్రచురించిన సారంగపాణి పదాలకు రాసిన పీఠికలో.



**'హరి నారాయణ గోవిందా యని - స్మరణ సేయవే ఓ మనసా' (175)**

అనే కీర్తనను రాయలసీమ పల్లెలలో ముసలమ్మలు పాడుతూ వుండటం నాకు లీలగా గుర్తుంది.

**'లాలనుచు వూచేరు - లలనలింపునను' (199)**
**'ఇందిరా రమణునకు - ఇభరాజ వరదునకు' (200)**

అనే కీర్తనలను ఆంధ్రదేశంలోని అనేక ప్రాంతాల్లో ఇంటింటా పాడగా వింటూ వుంటాం. ఈ పాటల ప్రచారమంతా పరంపరగా జరిగిందే. లోకుల రసనలు మీద నిలిచిపోయిన పాటలకు మరొక ప్రచారం అనవసరం. ఒకప్పుడు సారంగపాణిపదాలకు దేశంలో ఎనలేని ప్రచారం వుండినట్లు దీనిని బట్టి తెలుస్తుంది. కాని ప్రస్తుతం ఈ పాటల ఉనికి, ప్రభావం చాలమందికి తెలియని స్థితి ఏర్పడింది. సారంగపాణి పదాలు ఏడుసార్లు ముద్రింపబడినప్పటికీ దేశంలో రావలసినంత ప్రచారం రాలేదు. తెలుగుపదసాహిత్యాన్ని సుసంపన్నం చేసే రుచిగల ఈ పదాలను మరలా ప్రచురించవలసిన అవసరమున్నందున నాయీ ప్రయత్నం.

## సారంగపాణిపదాల స్వభావం

జీవితపరమార్థ సిద్ధికి ఆశాత్యాగం, వైరాగ్యానుభవ కర్మోన్మూలనం ముఖ్యమైన సాధనాలు. ఈ సుగుణాలు అలవడాలంటే ఆశ, వైరాగ్యం, కర్మ అనే మాటల తత్త్వం అర్థం కావాలి. ఇవి ఒకదానిపై మరొకటి ఆధారపడే తాత్త్విక విషయాలు. ఇవి అలపడిన జీవి దృష్టి ప్రకృతిమీద సమంగా ప్రసరిస్తుంది. అందుకే పాఠకులు వీటిని సులభంగా అర్థం చేసుకోవడానికి వీలుగా సాహిత్యకారులు వివిధ సాహిత్యవాహికలను ఎన్నుకున్నారు. సంస్కృతసాహిత్యంలో భర్తృహరి విరచిత 'సుభాషిత త్రిశతి'కి గొప్పస్థానముంది. నీతి శృంగార వైరాగ్య భావాలు మూడు శతకాలుగా ఇందులో కనిపిస్తాయి. ఇందులో కనిపించే మూడువందల శ్లోకాలు అనుభవజ్ఞానంతో చెప్పబడినవి. చురుక్కుమని హృదయంలో సూటిగా నాటదగినంత విషయ పౌష్కల్యం కలిగి, పాఠకుల చిత్తమును సంస్కరింపదగినవీ శ్లోకాలు. నీతిశతకం కామందకాది నీతి గ్రంథాల సారం. శృంగారశతకం అమరుకాది శృంగారగ్రంథాలకు తీసిపోనిది.

వైరాగ్య శతకం శాంతరసజ్వాలలను వెలార్చి సంసారాంధకారాన్ని పోగొట్టేది. ఈ పద్ధతి కవులందరిలో, సాహిత్యప్రక్రియలలో బాగా కనిపిస్తుంది. కావ్యకర్తలతో పోల్చి చూచినపుడు పదకర్తల మనఃప్రవృత్తి ప్రత్యేకంగా కనపడుతుంది. ప్రాపంచిక, పారమార్థికతత్త్వాలను మేళవించుకొన్న అనుభవ సారాన్ని పదకర్తలు పదాలలో నింపి మన కందించారు. సరిగ్గా సారంగపాణి కూడా ఇదే పని చేశాడు. రాజాస్థానాలలో ఉంటూ రాజుల మనస్తత్వాలను గ్రహించడమే కాక ఆనాటి రాచవ్యవస్థ చుట్టూ పడుగుపేక వలె అల్లుకుపోయిన సామాజిక శృంగారపు వింతపోకడలను గమనించినవాడు సారంగపాణి. రాజుల ప్రాపకం పొందినవారి డాబుసరితనాన్ని, సామాన్యుల అసహాయతను గుర్తించడమే కాక సారంగపాణి ఆనాటి కుంఫిణీ అధికారుల పాశ్చాత్యసంస్కృతి తన ప్రాంతాన్ని ఎలా ప్రభావితం చేసిందో కూడా చూశాడు. తన పదాలలో ఆనాటి సాంఘిక స్థితిని పొదిగి మన కండ్లముందు నిలిపినాడు. ఆయన రచించి పాడిన రెండువందల పై చిలుకు పదాలు శృంగార, దేశీయ, జాతీయపదాలని, కీర్తనలని నాలుగుభాగాలుగా విభజింపబడినాయి.

# 1. శృంగారపదాలు

ఈ విభాగంలో గల 75 పదాలలో మూడు పదాలు (60,61,62) మాకరాజు కార్వేటిరాజేంద్రునికి అంకితంగాను, మూడు పదాలు (68,69,70) పళ్ళిపట్టు వరదనారాయణునికి అంకితంగాను, మరి మూడు పదాలు (71,72,73) ప్రసన్నవేంకటశౌరికి అంకితంగాను, ఒక పదం (74) తిరుత్తణి చెంగల్వరాయనికి, మరొకటి (75) కల్యాణ వేంకటేశ్వరునికి అంకితంగాను రచింపబడినాయి. ఈ పదకొండు పదాలు కాక మిగిలినవన్నీ శ్రీవేణుగోపాలునికే అంకితం. శృంగార పదాలలో సారంగపాణి ప్రవహింపజేసిన శృంగారపువెల్లువ ఆలంకారిక లక్షణాలకు ఒదిగి, విచ్చలవిడిగా కాకుండా గంభీరంగా, సుకుమారంగా ప్రవహించి పఠితల హృదయాలలోని భావాన్ని ఉద్దీపింప జేస్తుంది. సారంగపాణి పదాలన్నీ ముక్తకాలు. ఏ పదానికి ఆ పదం స్వతంత్రంగా ఉంటుంది. ప్రతిపదంలోను రసపుష్టి కనిపిస్తుంది. ఈ పదాలన్నిటా దక్షిణనాయకుడైన వేణుగోపాలుడు నాయకుడు. పెక్కు నాయికల యందు సమాన ప్రీతిగలవాడు దక్షిణనాయకుడు. స్వీయ, పరకీయ, సామాన్య లక్షణాలతో ఒప్పిన నాయికలు చాలామంది కనిపిస్తారు. నాయకులలో దివ్యులు, అదివ్యులు, దివ్యాదివ్యులు



అని మూడు భేదాలున్నాయి. శంకరాదులు దివ్యులు. అర్జునాదులు అదివ్యులు. శ్రీకృష్ణాదులు దివ్యాదివ్యులు. ఈ పదాలలో వేణుగోపాలుడు అదివ్యనాయకుడుగా, శృంగారం కోసం వెంపర్లాడే సామాన్య నాయకుడుగా మనకు దర్శనమిస్తాడు.

**'ఏమిటికే నీ పే-రేమని యడిగితివి**
**కోమలి నను వేణు-గోపాలుడని దెలిసి**

**పడతీ నీ మోము ము-ద్దిడుకొన్నప్పటి నుంచి**
**పద్మాక్షుడని నను- బలుకుదురే**
**జడియక నీదు కీల్-జడ యల్లినదే మొదలు**
**తొడరి శేషశయను-డనుచు బిలుతురే'** (9వ పదం)

అనే పదంలో నాయిక వివిధ అవయవాల సాంగత్యంవల్ల తనకు మధుసూదనుడని, మందరధరుడని, మదనజనకుడని, పీతాంబరుడని పేర్లేర్పడినట్లు నాయకుడు స్పష్టం చేశాడు. ఈ పదంలో నాయకుడు నిజంగానే దివ్యుడే. ఈ దివ్యనాయకుని శృంగారవారధిలో తేల్చిన నాయిక కూడా దివ్యనాయికే అవుతుంది. వీరిరువురిది విశ్వమోహనశృంగారం. నాయిక మోము, కీల్జడ, మోవి, గుబ్బలు ఇందులో ప్రస్తావింపబడినాయి. వీటి సొగసు నాయకుడు పద్మాక్షుడు, శేషశయనుడు కావడంలో పర్యవసిస్తుంది. స్త్రీ ప్రకృతి స్వరూపిణి. స్త్రీ సౌందర్యాన్ని మించిన మరొక సౌందర్యం సృష్టిలో లేదు. శ్రీమన్నారాయణుని కృపను కరిగించి ప్రపన్నుల పై ప్రవహింపజేయడానికి జగన్మాత తన అపురూపసౌందర్యంతో ఆయనను ప్రసన్నుణ్ణి చేసుకొంటుంది. ఆయన భువనసుందరుడు. ఒకరి కొకరు ఆలంబనమైన వీరి సౌందర్యాలు ఏకమైనపుడు రసోదయ మవుతుంది.

కారణరహితంగా కార్యం జరగడం విభావనాలంకార లక్షణం. పడతి మోము ముద్దిడుకొనడానికి వేణుగోపాలుడు పద్మాక్షుడు కావడానికి సంబంధం లేదు. పడతి అవయవగుణాలు నాయకుడిలో పర్యవశించి అతనిని పద్మాక్షుని చేశాయి. ఈ పదంలో సారంగపాణి విభావనాలంకారాన్ని సాభిప్రాయంగా వాడి లోకోత్తరమైన అర్థచమత్కారం సాధించాడు. వేణుగోపాలుని మరెందరో వనితలు వలచారు. వారితో కూడ చుంబనాది అనుభవాలు ఆయనకున్నాయి. కాని ఆ చుంబనాదులు ఈ పదంలోని నాయిక చుంబనాదులంత దివ్యమైనవి కావు. అందుకే ఆ వనితల అవయవగుణతత్త్వం ఆయనలో స్థిరపడి దివ్యమైన

మార్పుకు కారణం కాలేకపోయింది. ఇది ఈ నాయిక ప్రత్యేకతను పట్టి చూపే గుణం. దీనికి కారణం వీరి పరస్పరానురూప్యం. ఈ అనురూప్యం జన్మ జన్మలది. ఆమె సిరి. ఆయన నారాయణుడు. లోకమే వారి కుటుంబం. నిత్య నూతనత్వం గలది వారి దాంపత్యం. సారంగపాణిపదాలలో ఆణిముత్య మనదగిన ఈ పదం అతని దివ్యానుభూతికి నిదర్శనం. ఈ ఒక్క పదంలో తప్ప మిగిలిన శృంగార పదాలన్నిటిలో వేణుగోపాలుడు సామాన్య నాయకుడే. నాయికలలో ముగ్ధలున్నారు, ప్రౌఢలున్నారు.

రసాత్మకమైన వాక్యం కావ్యమేనని ఆలంకారిక వచనం. ఈ దృష్టిలో ఈ విభాగంలోని పదాలన్నీ రసవంతాలే. నాయికానాయకుల మధ్య చెలికత్తె ప్రణయసందేశాలందించడం, నాయకుని నిర్దయను నాయిక చెలికత్తెతో చెప్పుకొని బాధపడడం. తనపై నెనరు చూపమని నాయకుడు నాయికను బ్రతిమాలు కోవడం మొదలైన విషయాలతో నిండిన ఈ పదాలు సంభాషణా రూపంలో ఉన్నాయి. 'మోవి గంటీలు చేయడం, పూవులు గూర్చడం, మచ్చు జల్లడం, మాటపట్లు చేసుకోవడం, లాలించి ఏలుకోవడం, మడుపు లందించుకోవడం, తమకంతో ఉస్సురనడం, చెలులకు లంచమివ్వడం, మొలకనవ్వులు కానుకివ్వడం, కన్నుసైగ చేయడం, పూచెండ్లు కానుకివ్వడం, పరిమళగంధం పూయడం, గ్రక్కున ఏలుకొమ్మని మొక్కడం, గుడి ముందర నమ్మిక లిచ్చుకోవడం, తేనెలూర మాట్లాడడం,సురపొన్నలపాన్పున పవ్వళించడం, తలిరాకు పాదము లొత్తడం' ఇత్యాది శృంగార రస సామగ్రి ఈ పదాలలో అధికంగా దొరుకుతుంది. నాయికా నాయకుల మధ్య విటీవిట సంబంధాన్ని చెప్పే పదాలు కూడా ఈ భాగంలో కొన్ని ఉన్నాయి. ఉదాహరణకు-

**'వేణుగోపాలుడీ వేళ వచ్చినాడు – వేమారు గొణుగకువే – వాడు**
**..... ..... ..... ......**
**ఏలనే కూతుర మూలల జుణిగేవు – నేలమీద బొటనవేలు రాయకే**
**పూలందుకొమ్మంటే – పుడకేల విరచేవు –**
**మేలువానిచేత – మెచ్చులందుదుగాని**
**చప్పుడుసేయక సాగిటు రావమ్మ–**
**ఇప్పుడేమె నీకు యేండ్లు లేవా**



**చెప్పినంతమాట చెల్లించే సామిని–**
**అప్పుడే రతివేళ తిప్పల బెడితివే.** ॥వేణు॥ (30)

అనే పదంలో తల్లి నాయికకు హితవు చెప్పడం కనిపిస్తుంది. ఇలాంటివి ఒకటి రెండు తప్పిస్తే ఈ విభాగంలోని పదాలన్నిటా స్వీయాశృంగారం ఎక్కువగాను పరకీయశృంగారం అంతకంటె తక్కువగాను వర్ణింపబడింది. భావాల కూర్పులో, రసనిర్వహణలో సారంగపాణి కృతకృత్యుడైనట్లు కనిపించినా కొన్ని పదాలలో రసనిష్పత్తికి కావలసిన సామగ్రి కొరత కనిపిస్తుంది. ఇటువంటి పదాలు ఇంకా దొరకవలసి ఉంది. ఒకవేళ దొరికితే వాటిలో రసనిష్పత్తికి వలసిన సామగ్రి పుష్కలంగా దొరుకుతుందేమో. ఏమైనా అలంకారశాస్త్రలక్షణాలకు అనుగుణమైన రచన ఇది. నాయిక స్వీయకానీ, పరకీయకానీ, లేదా సామాన్యకానీ, వీరి అంతరంగం శృంగారనిష్యంది కావడంచేత దానికి తగిన అనుభావాదులను కూర్చడంలో సారంగపాణి జాగ్రత్త పడినాడు. నిశితంగా పరిశీలిస్తే అష్టవిధ శృంగారనాయికల లక్షణాలకు ఈ పదాలలో లక్ష్యాలు దొరుకుతాయి.

**'మందు రాచినదేమో యిక నే–మందురా దానింట నీవు**
**విందు రాతిరి బోసేసితివట–విందురా చెలులు.'** **(13)**

అని నాయకుని నిగ్గదీయడంలో 'ఖండిత' నాయిక కనిపిస్తుంది.

**'అక్కరలేని కాపురమాయె–అతని మనసు వేరాయె**
**యెక్కడిదీ దాని పాలాయె–యెవరాడిన రోసము లేదాయె'(54)**

అని నాయిక బాధపడడంలో విరహోత్కంఠిత లక్షణముంది.

**'మేలు దలచక యీ వేళ పొమ్మంటే–**
**వాలుగంటి దైవము మెచ్చునా–**
**ఆలోచన లెందుకే–అతడు మనకు వేరా... ...'** **(59)**

అని నాయిక పశ్చాత్తాపపడడంలో కలహాంతరిత కనిపిస్తుంది.సారంగపాణి సంస్కృతాంధ్ర సాహిత్యాలలో గొప్ప పండితుడని, సంగీతాభినయాల్లో నిపుణుడని అతని పదాలను బట్టి తెలుస్తుంది. వీటికి తోడు అతనికి మెచ్చదగిన లోకజ్ఞత కూడా ఉంది. అందుకే అతనికి శృంగారరసనిర్వహణ సులభమైంది. శృంగారమంటే కచకుచాది వర్ణనకాదు; నాయికానాయకుల మానసాలు ఆనందోన్ముఖాలై అనంతానందంలో ఏకం కావడం. ఇదే బ్రహ్మానందం. ఇలాంటి రస పరిపక్వతను

సాధించాలంటే కవికి అలంకారశాస్త్ర పరిచయంతోపాటు తాత్త్విక అవగాహన అవసరం. పదకవులంతా శృంగారంలో తత్త్వాన్ని దర్శించిన వారే. తాము నాయికలుగా భగవంతుడు నాయకుడుగా భావించుకొని భగవస్సాన్నిధ్యం కోసం పాటుపడడం మామూలే. ఈ సందర్భంలో వారు శృంగార నాయికలై పోతారు. భక్తి శృంగారంలోను, శృంగారం భక్తిలోను మిళితమై పోతాయి. దీనినే పండితులు 'మధురభక్తి' గా పేర్కొంటారు. నాయికా నాయకుల ఐక్యత జీవేశ్వరుల ఐక్యతే. ఆత్మనివేదన శ్రీవైష్ణవంలోని ప్రపత్తి యోగానికి సంబంధించినది. పదకవులంతా ఆత్మనివేదన చేసుకొన్నవారే. శృంగార పదాల రచనలో సారంగపాణికి క్షేత్రయ్య మార్గదర్శిగా కనిపిస్తాడు. క్షేత్రయ్య పదాలు స్థూలదృష్టికి లౌకికశృంగార పూరితాలుగా కనిపించినా సూక్ష్మంగా పరిశీలించినపుడు భగవత్పరాలుగా, ఆత్మనివేదన సాధనాలుగా, మధురభక్తి వాహికలుగా దర్శనమిస్తాయి. సంభోగ శృంగారాన్ని వర్ణించినా, విప్రలంభ శృంగారాన్ని వర్ణించినా క్షేత్రయ్య పదాలలో తాత్త్వికత దాగివుంటుంది. జీవేశ్వరుల మధ్య ఆవరణలను తొలగించే ప్రయత్నం ఉంటుంది. ఉదాహరణకు క్రింది క్షేత్రయ్య పదాన్ని వివరిస్తే అర్థమవుతుంది.

**ఇద్దరి సందున పవ్వళించియున్న-ఇంతి పేరేమిరా ?**
**గద్దరి వగల మా మువ్వగోపాల-గాజుల చప్పుడు నేవింటి గదర ॥**

**అప్పటికప్పుడు నీదు కెమ్మోవి-యానిన యలవాటుచేత**
**కప్పుర గంధి మోవి నాపంట-కలయ నొక్కితిరా**
**అప్పళించి దాని మోవితేనె-యనుభవించితివేమొ**
**చప్పరించబోతే నమలిన చెరకు-పిప్పివలె చప్పనై యుండె గదర** //ఇద్దరి//

**కదిసి నీవంటి దాని మేను-గ్రక్కున కౌగిలి నదిమి పట్టిన**
**నుదుట గుబ్బలు నా గుబ్బల పై - నొరసి క్రిక్కిరిసితి**
**ఇది యేమో వింతయై యున్నదనుచు-నిందుకు నామది చోద్యమంది**
**పదిరితే నీ మనసు నొచ్చినని-ప్రాణేశ యావలి మోమైతి గదర** //ఇద్దరి//

**మునుపు నన్ను నీవనుభవించి యా-ముద్దుగుమ్మను గూడితివేమో**
**యనుదినము నీ రీతిగా-నది యీడకు వచ్చునా**
**మనసు పోహణ గంటి నేడు-మదన జనకుడైన సామి**
**నిను నమ్మరాదుర మువ్వగోపాల - నీ వగలెల్ల దెలిసె గదర** //ఇద్దరి//



ఈ పదంలో సంభోగశృంగారం లలితంగా వర్ణింపబడింది. ఇందులో నాయికానాయకుల మధ్య కనిపిస్తున్న మరొక ఇంతి వారి మధ్య కల్పింపబడిన ఆవరణ. ఈ యావరణ అజ్ఞానం కావచ్చు, మాయ కావచ్చు, మరొకటి కావచ్చు. దానిని నిర్మూలించుకో గలిగినపుడే నాయికానాయకుల ఐక్యత సాధ్యమవుతుంది. "ఈ పదంలో నాయకుడు పరమాత్మ స్థానీయుడు. నాయిక జీవాత్మ స్వరూపం. వారి నడుమనున్న వనిత మాయా స్వరూపిణి. అతడు పురుషుడు, ఆమె ప్రకృతి. పురుషుడు 'తాను' అయితే ప్రకృతి 'మేను' 'నేను' అనే భావనల మొత్తము. నామరూప రహితమైన 'తానే' వాటిని గ్రహించి 'నేను' 'మేను' లుగా నామరూపాలతో భావిస్తుంది. ఈ మూడింటి మొత్తమే బ్రహ్మస్వరూపం."[1]

సారంగపాణి శృంగారపదాలలో ఇంతటి నిగూఢ తాత్త్వికత కనబడదు కాని జీవేశ్వరుల ఐక్యతకు సంబంధించినవి, ఈశ్వరుని కోసం జీవి తాపత్రయ పడేవి చాల ఉన్నాయి.

**'వేరు సేతురా వేణుగోపాలా నను వేరుసేతురా**
**నీరాక కోరిన నన్ను నిరాకరించి పొమ్మని' (21)**
**'రమ్మనే సామిని రమ్మనే-కొమ్మ నీవే నామనవి గై**
**కొమ్మని వేణుగోపాలుని' (23)**
**'వచ్చునా మునుపటి నెనరుంచి - వట్టిభ్రమలు గాక**
**మచ్చుకంటి వేణుగోపాలుని - మనసు రానడిచే వారుండగ' (27)**

ఇత్యాది పదాలలో సారంగపాణే నాయికగా జగన్మోహనుడైన వేణుగోలుని సాహచర్యకోసం తపించడం కనిపిస్తుంది. క్షేత్రయ్య శృంగారాన్ని వేదాంతంలో ముంచిన శిల్పిగా కనిపిస్తే సారంగపాణి వేదాంతాన్ని శృంగార వీధుల వెంట తిప్పిన భావుకుడుగా కనిపిస్తాడు. సారంగపాణి పదాలలో మందారం మీద మంచుబిందువు ఎంత సహజంగా ఉంటుందో అంత సహజమైన భావుకత ఉంటుంది. పిల్లతెమ్మెర మన మేను సోకి గిలిగింతలు పెట్టినట్లు ఆయన భావాలు మనసును ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఆయన వాడిన పదాల మార్దవం, అవి మోసుకొని వచ్చే నిసర్గభావజాలం పఠిత మనసును మృదువుగా స్పృశిస్తాయి. అందుకే ఈ పదకర్త ఒక గొప్పకవిగా సౌందర్యోపాసకుడుగా ప్రతిపదంలోను కనిపిస్తాడు.

---

1. ఆనందమూర్తి, వేటూరి. క్షేత్రజ్ఞులు (పదసాహితి) హైదరాబాదు 1991,పుట 82.

## 2. దేశీయపదాలు

ఈ విభాగంలో 66 పదాలున్నాయి. ఇవి గూడా శృంగార పదాలవలె ఉంటాయి. అయితే ఈ పదాలలో కనిపించే నాయికానాయకులు పల్లీయ వాతావరణానికి చెందినవారుగా కనిపిస్తారు. ప్రేమకు గొప్ప మహత్తు ఉంది. ప్రేమించని, ప్రేమలో పడని లేదా ప్రేమస్పర్శలేని ప్రాణి సృష్టిలో ఉండదు. ఉత్తమసంస్కారం కలిగిన నాగరకులలో ఉన్నట్లే ప్రేమ పామరులలో కూడా ఉంటుంది. స్త్రీ స్వీయ పురుషుని; పురుషుడు స్వీయకాంతను ప్రేమించడం లోక సహజం. ఇది దాంపత్యప్రేమ. కోడెవయస్సులో వున్న స్త్రీ పురుషుల మధ్య మరొక రకమైన ప్రేమ ఉండవచ్చు. వారు ప్రేయసీ ప్రియులు కావచ్చు. కాని వారి ప్రేమను లోకం గుర్తించదు. వారు లోకాన్ని లెక్క చేయరు. ఇటువంటి ప్రేమను సాహిత్యలోకం గుర్తించదు. ఉపాధేయం కాక పోయినా ఈ ప్రేమ ఎప్పటి కప్పుడు తాజాగాను, మధురంగాను ఉంటుంది. ఇటువంటి ప్రేమ ఈ పదాలలో నిండి ఉంది. ఇది సామాన్యశృంగారం. ఈ పదాలలో నాయకుడు శ్రీవేణుగోపాలుడు. నాయిక సామాన్య. 'ధీరా కళా ప్రగల్భా వేశ్యా సామాన్య నాయికా' అని సాహిత్యదర్పణం సామాన్యనాయిక లక్షణం చెప్పింది. చతురురాలు, నృత్యగీతాదులు నేర్చినది సామాన్యనాయిక. వేశ్యలో ఈ లక్షణాలు ఉంటాయి. కాబట్టి సామాన్యనాయిక అంటే వేశ్యగా గుర్తించవచ్చు. ఈ విభాగంలోని పదాలలో వేశ్య శృంగారమే తలమునకలుగా కనిపిస్తుంది. వేశ్య వలపును ఆమె అడిగిన సరుకులిచ్చి కొనుక్కొనే విటరాయుడుగా, వేశ్యల ఇంటింటి చంద్రుడుగా వేణుగోపాలుడు దర్శన మిస్తాడు. మొదటి విభాగంలో మందరధరుడు, పీతాంబరుడు అయిన గోపాలుడు ఈ విభాగంలో 'వెన్నముచ్చిలి దిన్న వేణుగోపాలుడు'గా మారినాడు. ఆ మురళీలోలుని చోరత్వానికి జారత్వం కూడా జతచేశాడు సారంగపాణి.

వేశ్యల మోహంలో పడవద్దని, వారి ప్రేమ నేతిబీరకాయలో నెయ్యి వంటిదని, జారత్వానికి అలవాటుపడితే ఎంత సంపన్నుడైన విటుడైనా కాసుకు కొరగాకుండా పోతాడని తన సమకాలీనులను హెచ్చరించడానికే సారంగపాణి ఈ దేశీయపదాలు వ్రాసినాడనిపిస్తుంది. ప్రబంధసాహిత్యంలో వేశ్యల, వేశ్య మాతల వర్ణన లున్నాయి. సారంగపాణి వేశ్యల మనస్తత్వాన్ని అలవోకగా



వర్ణించినట్లు కనబడినా నిశితంగా పరిశీలిస్తే ప్రబంధ వర్ణనల ప్రభావం అతనిమీద కొంత కనిపిస్తుంది. **'రూక లడుగుచు ఁదుదిబచ్చునాకుకైన నొడబడు.'**

**'వెల చెలువల చిత్తవృత్తు లాజన్మ చం**
**చల తరంబు లంత తెలిసి తెలిసి**
**నేర్తు ధనములిత్తు నిలుపుదునని పారు**
**విటుడు శుద్ధమైన వెర్రిగాడె'**

అని సంకుసాల నరసింహకవి కవికర్ణరసాయనం (4-114) లో అభిప్రాయ పడినాడు.

**'కలిగిన కాసు గుంజుకోవే-కడమ జోలి నీ కెందుకే'**
**'ఇన్నాళ్ళు జరిపింది-యీ భోగానికేనా ఒక్క**
**చిన్నరూక దెచ్చి-చేతికిచ్చి అట్టె**
**కన్నుసైగజేసి-కదలమంటి వహహ.'** **(105)**
**'ఇన్నూరు వరహాలు తిన్నగ నాచుకుని**
**ఇక కదలమంటివిగా'** **(110)**

ఇత్యాది పదాల్లో వారస్త్రీల స్వభావాన్ని సారంగపాణి మన కనులముందు బెట్టినాడు. వేశ్య సహజంగా అందగత్తె అయినప్పటికి ఆమె అందం అందరికీ సొంతం గావడంచేత ఎక్కువ కాలం అందంగా కనిపించలేదు. ఆటవెలది రూపజీవని కాబట్టి అందంగా కనిపించే ప్రయత్నం చేస్తుంది. అయినా కొన్నాళ్ళ కామె అందం జుగుప్సావహంగా మారుతుంది.

**ఎక్కడ నుండి దాపురమాయెనె – ఇంత చక్కని అందగత్తె–లేని**
**వెక్కులు బుట్టించి వేణుగోపాలుని – దక్కించుకొని యెవరు**
**తన కెదురు లేదని** *॥ఎక్కడ॥*
**ఆట చదువు సున్న – పాట లంజమందు**
**బూటకముల కది – పుట్టినిల్లు**
**నీటు యింతనరాదు – నిలువెల్ల కపటము**
**గూటమువలె తిని – కూర్చుంటే కదలదు** *॥ఎక్కడ॥*

**లలన పల్వరుస గవ్వ-లతో వీయములందు**
**కలబంద వాసన-కలికిమేను**
**చిలుకరౌతు నగరు దలప-చీకటికోన**
**వలపు మందుల సంచి-వక నిమిష మేమరదు** ॥ఎక్కడ॥

**మొగచెంపలది కాన-మోమెల్ల మొటిమెలు**
**దిగబడ్డ చన్నులు-తెట్టెనోరు**
**వగలాడి వయసుయే-బదిమీద రెణ్ణెల్లు**
**యెగతాళి సేయక వా-డేలాగు గూడెనో** ॥ఎక్కడ॥

ఈ పదంలో సారంగపాణి వయసు మీరిన వేశ్య నైజాన్ని, రోత పుట్టించే ఆమె స్వరూపాన్ని హాస్యప్రాయంగా వర్ణించాడు.

శృంగారరస పరిపక్వతలో కవి నాయికానాయకులను విటీవిటులుగా మార్చి వర్ణించడం సబబే. అయితే సమకాలీన సమాజంలోని ఆశ్లీలశృంగారాన్ని పదాల కెక్కించడం పదకర్తగా సారంగపాణి పనికాదు. అయినా ఆయన ఎంతో నిశితంగా ఈ పదాలలో ఆనాటి సాంఘికస్థితిని ప్రతిబింబింప జేశాడు. కవికి సామాజికస్పృహ ఉంటుందని ఋజువు చేశాడు. కవిగా ఆయన సాధించిన ఘనవిజయమిది.

సారంగపాణి ఆనాటి సంఘంలోని అశ్లీల శృంగారాన్ని పదాల కెక్కించడానికి చారిత్రకమైన కారణాలున్నాయి. క్రీ.శ.1650 నాటికే దక్షిణ భారతదేశం మీద పాశ్చాత్యుల సంస్కృతీ ప్రభావం పడింది. అంతకుముందే సామ్రాజ్య దాహంతో ఇక్కడికి వ్యాపారార్థం వచ్చిన ఫ్రెంచి వారికి, ఆంగ్లేయులకు మధ్య ఘర్షణ మొదలైంది. రెండు పక్షాలవారు వారి మతబోధనలతో ప్రజలను ఆకట్టుకోవడం ప్రారంభించారు. తెల్లవారు తమ ఆధిపత్యం నిలుపుకొన్నారు. 'ఈస్టిండియాకంపెనీ' ఉద్యోగులు తమ అవసరాలన్నిటికీ ఇక్కడి ప్రజల పై ఆధారపడ్డారు. "The Company's servants were not at first expected to marry. They lived more or less like students in University hostels."[1]

1.Nilakanta Sastri, Srinivasachari, Advanced History of India 1982, page 645



వాళ్ళు కంపెనీఉద్యోగులుగా ఇంగ్లాండు నుండి వచ్చారు. వారి అవసరాలకు స్త్రీలు కావాలి. ఇక్కడ ఉద్యోగం ఎన్నాళ్ళు ఉంటుందో తెలియదు. అందువల్ల పెళ్ళిమాట ఆలోచించకుండా ఇక్కడి వేశ్యలతో గడపడం, వారికి కావలసినంత డబ్బివ్వడం అలవాటు చేసుకున్నారు. అంతకుముందే దేవదాసీ వ్యవస్థ పతనమైంది. దేవదాసీలు విలాసపురుషుల అవసరాలు తీర్చే వేశ్యలుగా మారారు. వేశ్యగా బ్రతకడం కొందరికి వృత్తిగా మారిపోయింది. తమ ప్రాంతాలలో విటులు ఇచ్చే ధనం కంటె కంపెనీ ఉద్యోగులు ఎక్కువగా ఇవ్వడంతో వేశ్యలు ఆంగ్లేయుల వశమైపోయారు. కంపెనీ ఉద్యోగులు బస్తీలలో ఉండడంవల్ల వేశ్యలు పల్లెలు వదలి బస్తీలకు వెళ్ళి స్థిరపడడం ప్రారంభమైంది. పరనాగరకతా వ్యామోహం ఈ వేశ్యావృత్తి ద్వారా పల్లెలకూ వ్యాపించి కుటుంబస్త్రీలను సైతం ప్రభావితం చేసింది. కొన్ని కుటుంబాలలో స్త్రీలు చాటుమాటుగా బస్తీలకు వెళ్ళి తమ అభిరుచుల కనుగుణంగా అవసరాలు తీర్చుకోవడం మొదలైంది. ఈ రకంగా సనాతన ఆచారవ్యవహారాలు మాసిపోవడం, కుటుంబవ్యవస్థ చిన్నాభిన్నం కావడం జరిగింది. తన కాలంనాటి సంఘంలో వచ్చిన మార్పు లన్నిటిని సారంగపాణి గమనించాడు. ఈ దురాచారాలను నిరసించాడు.

ప్రబంధసాహిత్యాన్ని పోషించిన రాజాస్థానాలు లేకున్నా చిన్న చిన్న సంస్థానాలు సాహిత్యాన్ని కొంతవరకు పోషించాయి. ఆనాటి చక్రవర్తుల రసిక జీవనం సంస్థానాధీశుల వారసత్వమైంది. రాచవ్యహారాలతో పాటు శృంగార రస వ్యవహారాలు కూడా వీరికి ముఖ్యమైనాయి. వేశ్యలను పోషించారు. వేశ్యలు పాలనా వ్యవహారాలలో జోక్యం చేసుకున్నారు. పాలానాయంత్రాంగంలో వేశ్యలకు గుర్తింపు లభించింది. సంస్థానాలలో పని కావలసినవారు వేశ్యల ద్వారా ప్రయత్నించడం మొదలైంది. వేశ్యలతమ్ముళ్ళు దొరలైనారు. వీరెన్ని ఆగడాలు చేసినా చెల్లుబాటయ్యేది. పుల్లగంజి తాగుతూ వుండిన వేశ్యలు సంస్థానాధీశుల ఆశ్రయం దొరకగానే రాణులుగా చెలామణి అయ్యారు. శృంగారానికి సంబంధించినంత వరకు ఇది ఆనాటి సంస్థానాలలో కనిపించే సాంఘికస్థితి. పర నాగరకతా వ్యామోహంలో, ధనార్జనా ధ్యేయంతో కొందరు స్త్రీలు పతనమైతే; సహజంగా తమకున్న రంకుతనంతో మరికొందరు స్త్రీలు చెడడం, ఇతరులను చెడగొట్టడం పరిపాటైపోయింది. చారిత్రకంగా సంఘంలో కలిగిన ఈ రెండు మార్పులు సంఘనడతను చెడగొట్టేవిగా భావించి సారంగపాణి దేశీయపదాలలో వాటి స్వరూపాన్ని బాగా వివరించాడు.

వేశ్యల మనస్తత్వాన్ని, విటుల స్వభావాన్ని సారంగపాణి కనులకు కట్టినట్లు వర్ణించాడు. ఒక విటుడు ఒక వేశ్య ఇంటికి వచ్చాడు. ఆమె రూకలు ఇస్తేనేగాని లోపలికి రానీయలేదు. వక్కాకు ఇస్తేనేగాని మంచమెక్కనీయలేదు. దీనితో ఆ రసికుడి మానసం నీరసమై పోయింది. (84 వ పదం) ఆ వేశ్యది కోమటి విశ్వాసమట (85 వ పదం), అంబలి తాగుతూ వుండిన వేశ్యకు సంబావడ్ల అన్నం రుచించలేదట (87 వ పదం), నిష్కర్షగా రాత్రి కొచ్చేవాడవైతే నిష్కాలుగొంచు' రమ్మని మొగమాటం లేకుండా చెప్పింది (88 వ పదం). ఒట్టి చేతులతో వచ్చినానని చులకనగా చూడవద్దు పట్టపేనుగును తెచ్చి నీ వాకిట కట్టివేస్తానంటాడు విటుడు. (89 వ పదం). 'వారస్త్రీ నీ ప్రక్కలోకి యూరకె వచ్చునా' అని ఆమె నిలదీస్తుంది. (92 వ పదం). 'నీవేనా శాస్త్రము నాచేత కాసుంటె నీయక్క యింకొకతె' అంటాడతడు. (102 వ పదం). 'ఇంతకంటె యింకా యెవడిచ్చునె యేమిటికే గొణిగేవు' అని ఆమెను బతిమాలుకుంటాడు. (104 వ పదం). 'ఇన్నాళ్ళు జరిపింది యీ భాగ్యానికేనా, వక్క చిన్నరూక దెచ్చి చేతికిచ్చి అట్టె కన్నుసైగ జేసితివి' అని ఆమె ఎత్తిపొడుస్తుంటే (105 వ పదం) పుట్టిన పుట్టుక వచ్చినరాకడ అట్టె తలచుకోవె, పట్టెదేసి సొమ్మేర్పడగానే మిట్టి పడకుమని అతడు పూర్వపుస్థితిని గుర్తు చేశాడు. (115 వ పదం). ఇలా సంభాషణా రూపంలో సాగుతాయి ఈ విభాగంలోని పదాలన్నీ.

పరనాగరకతా వ్యామోహంలోపడి స్త్రీలు తన పల్లెలను వదలి పోవడం, సంసార స్త్రీలు వేశ్యలుగామారి వెలయాండ్ల కడుపులు కొట్టడం.

**'అందరు నాయకురాండ్రైరి యిదేమి**
**యాశ్చర్యమే చెలియా నిన్న మన**
**ముందర దుత్తలెత్తుక అల్లాడిన లంజ**
**లందలా లెక్కిరి యౌరా కాలమహిమ'** **(118)**

**'కులకాంతలు విడిబడి నలుదిక్కుల**
**చెలరేగి రిదేటి పాపమో అయితె**
**వెలయాండ్లకు జీవన మేమిక శ్రీ**
**వేణుగోపాలా సంకరమై'** **(138)**

అనే పదాలలో సారంగపాణి చక్కగా వివరించాడు. ధనమిచ్చినా విటులకు వేశ్యల దగ్గర సరియైన గౌరవం లేకపోవడం, వారు కోరుకున్న సౌఖ్యం



లభించకపోవడం, విటులు వేశ్యమాతలతో చెప్పుకోవడం, వేశ్యల పొందు వద్దనుకోవడం, మొదలైన విషయాలు కూడా సారంగపాణి దృష్టినుండి తప్పించుకోలేదు.

**'నీకూతురి నడతలు నీకేసరి- లోకులెవరు మెచ్చరమ్మా**
**నేను గూడేది తనకు గూడదు-నెనరు గూర్చి నాతో పలుకాడదు' (77)**

అని ఒక విటుడు వేశ్యమాతకు మొరపెట్టుకుంటాడు. వేశ్యలతోను, వేశ్యమాతలతోను విసిగి వేసారిన మరొకడు.

**'నీ పాదాలకు దండం-నీ తల్లికొక సలాం-నీ యింటికిక రాంరాం'(86)**

అనుకుంటాడు. వెలయాలి దగ్గర సుఖం కొనుక్కొనేవారికి ఆమె తమ్ముడితో ఒక తంటా. ముందు అతణ్ణి ప్రసన్నం చేసుకోవాలి. ఈ బాధలు పడలేని మరొక విటుడు.

**'లంజవారి తమ్ములకే యిప్పుడు-రాజఠీవులన్ని యెందుకు**
**కంజభవునికీ వసుమతిలో గుడి-కరువైనది వేణుగోపాల' (117)**

అనుకొంటాడు. విటుల పాలిట శాపంగా 'లంజవారి తమ్ములను సృష్టించిన పాపానికి బ్రహ్మకు దేశంలో గుడిలేకుండా పోయిందని చెప్పడం ఒకచమత్కారం. వేశ్యలతోపాటు వావివరుసలు లేకుండా 'పోకిరి ముచ్చట్లా'డే కుల స్త్రీలను కూడా సారంగపాణి గర్హించాడు. 'బడవతనం'తో ఇలాంటి పనికిమాలిన తొత్తులు మగని కన్నుగప్పి అడ్డతిరుగుళ్ళు తిరిగి **'శగరోగము వొళ్ళున యిమిడించు'** కొన్నారట (130 వ పదం). శగరోగమనేది ఒక సుఖరోగం. ఇలాంటి రోగాలమారి బడవలతో సంఘమే రోగగ్రస్థమై పోయిన కాలమది.

ఇంతకుముందే చెప్పినట్లు సారంగపాణి దేశీయపదాలలో నాయికా నాయకులకు జానపదులమనస్తత్వాన్ని అంటగట్టి శృంగారాన్ని పారము ముట్టేటట్లు ఉరవడిగా ప్రవహింపజేశాడు. నాగరకులకు, జానపదులకు మాటలలో ఆలోచనలలో కొంత భేదముంటుంది. ఏదైనా ఒకటి కావాలను కున్నప్పుడు నాగరకులు సూటిగా కాకుండా సుతిమెత్తగా అడుగుతారు. ఈ విభాగంలోని విటీవిటుల సంభాషణలో ఈ భేదం కనిపిస్తుంది.

**'నీ పొందుసేయక విడచేనా వేరే-నెలత కొప్పున విరులు ముడిచేనా**
**బాపురే నే సేయు ప్రతిన చెల్లక పోతే-నాపేరు ఇక వేణుగోపాలు దనవలెనా'(153)**

అనే పదంలో ఒక జానపదనాయకుడు తాను కోరిన యువతి కోసం పట్టుదల పెంచుకోవడం కనిపిస్తుంది. మరొకడు-

**'ఒచ్చేవో రావో దెల్పవే రెంట్లో నొకమాట-వలదే యీనసనసలు' (208)**

అని కసురుకొంటాడు. పలుకులలో పారుష్యం గల ఈ విటనాయకుల మనస్సు చాల మృదువు. సొట్టబుగ్గలముఖం నిండా పసుపు పూసి

**'తేసు పండ్లతో సొమ్ముల జారవేసు'** కొని-
**'ఒకనితో సరసాలాడి-వేరొకని జూచి సైగజేసి**
**ఒకని ముద్దు బెట్టుకొని-ఒకరిని రమ్మన్న'**

సానిమీద కూడా వీళ్లు జాలి పడినారు.

వేశ్యావ్యవస్థ కుటుంబవ్యవస్థను చెడగొట్టిన రోజులవి. పరకీయ (వేశ్యా) శృంగారం రుచి చూచిన వానికి స్వీయ (స్వకళత్రం) శృంగారం మీద మోజు ఉండదు. భర్తలు వేశ్యలను మరిగి ఇండ్లు దోచి వారికి కానుకలు పెడుతుంటే కులస్త్రీలు పడిన బాధను సారంగపాణి అర్థం చేసుకొన్నాడు. కులస్త్రీలు **'మనసు నొచ్చుకొని అసురుసురంటె మంచిదేమే నీకు'** అని వారకాంతలను మందలించాడు. **'ఇంటి మగడు కుంటెనగాడైతే'** ఏమి చేయ గలమని కుల స్త్రీలు దిగులు పడినపుడు, **'ఈ కాపుర మెట్లా గుదిగూడునె యికమీదటనైనా'** అని తమ భర్తల పోకిరాట్లకు భార్యలు బలియైనపుడు సారంగపాణి ఆవేశంతో వేశ్యావృత్తిని నిరసించాడని చెప్పడానికి ఉదాహరణ లెన్నైనా ఉన్నాయి.

ఈ దేశీయపదాలలో సారంగపాణి గ్రహించిన మరొక ముఖ్య విషయం పరనాగరకత తన సీమలో ప్రచలితంగా వ్యాపించినపుడు ఇక్కడి ప్రజలలో కనిపించిన ఆ నాగరకత యెడల వ్యామోహం, అది సాంస్కృతికంగా కలిగించిన మార్పులు. సారంగపాణి స్వస్థానం మీద మమకారం కలవాడు. తమ ప్రాంత సంస్కృతి చిరకాలం కొనసాగాలని ఆకాంక్షించినవాడు. బస్తీలు బలవడం, పల్లె ప్రజలు బస్తీల కెగబడడం, ముఖ్యంగా స్త్రీలు షికార్లు తిరగడం, దైవభక్తి నశించడం



వంటి మార్పులన్నీ అతని కండ్ల ముందు జరిగినవే. అవాంఛనీయమైన ఈ మార్పుల నతడు నిరసించాడు. కింది పదంలో తన ఆవేదనను రూపు కట్టించాడు.

**'కులకాంతలు విడిబడి నలుదిక్కుల-చెలరేగి రిదేటి పాపమో అయితే**
**వెలయాండ్లకు జీవన మేమిక శ్రీ-వేణుగోపాలా సంకరమై** ॥కుల॥
**ఉగ దెలియని బిడ్డల నెడబాసి-వున్న మూల ముంత దాటవేసి**
**మగనిపేరు కారాదని రోసి-మన్నెకాపురము వ్యర్థముజేసి** ॥కుల॥
**అందెలు మెట్టెలు రవికెతొ జుట్టి-అత్తమామలకు దుద్దులుబెట్టి**
**బందరు పావడలో సద్దిగట్టి-పట్ణము జూతామని భ్రమ బుట్టి** ॥కుల॥
**..................................................**
**తలిదండ్రుల మది తల్లడబెట్టి-తమ జాతుల కపకీర్తి జుట్టి**
**తలపరాని నిందెల కొడిగట్టి-ధర్మశాస్త్రముల రోచిక బుట్టి** ॥కుల॥
**జారుపైటచెరుగు మెడకు జుట్టి-తేర లంజకాంద్ర చెట్టబట్టి**
**ఊరుదిక్కు రోతబుట్టి-ఉబ్బితబ్బిబ్బై తొడదట్టి** ॥కుల॥
**పగలురేయి జాగ్రత్తగా నడిచి-బాపనిండ్ల పూటకూళ్ళు గుడిచి**
**తెగువచేసి రాణాలు గడిచి-తగుదుమనుచు సిగ్గు శరము విడిచి** ॥కుల॥
**ఇంతదూర మెవరు వెతక రారని-యెవరువచ్చి వేలు వంచలేరని**
**అంతపనికి తేవణి చిత్తూరని-చింతలేదు హూణుల దరబారని** ॥కుల॥

*(138 వ పదం)*

పరనాగరకత స్త్రీలలో కలిగించిన అవాంఛనీయమార్పులకు ఈ పదం ఒక దర్పణం.

విషయవైవిధ్యం, మృదుమధుర భావాలు, భావాలకు తగిన నుడికారపు తెలుగుపదాలు కల దేశీయపదాలు సారంగపాణిని పదకర్తగా చిరంజీవిని చేస్తాయి. అతనిలోని కవి, విమర్శకుడు, సంస్కరణాభిలాషి ఒకరిని తోసుకుంటూ మరొకరు ఈ పదాలలో ప్రత్యక్షమౌతారు. శృంగారపదాలతో పోల్చి చూస్తే దేశీయపదాలలో సారంగపాణి కవిత చిక్కగా ప్రౌఢంగా కనిపిస్తుంది. మండపాక పార్వతీశ్వరశాస్త్రి దేశీయపదరచనను గురించి "భావాలు చాల స్వభావ సిద్ధములు. భాష పాత్రోచితమైన, శిష్టజన వ్యవహారసిద్ధమైన భాష. ఇలాంటి భాష చాల కాలం వరకు పాతబడిపోదు. స్వభావసిద్ధమైన భావానికి, మనోహరమైన భాషకు ఈ

ద్వితీయ భాగ రచనలో సారంగపాణిని చాల ప్రశంస చేయవలసి ఉన్నది."[1] అని అభిప్రాయపడడం సబబుగా ఉంది.

## 3.జాతీయపదాలు

తన జాతి ప్రజలు (తెలుగుప్రజలు) వాళ్ళకు సహజమైనభాషలో వ్యంగ్యోక్తులు, వక్రోక్తులు లేకుండా అతి సహజమైన రీతితో వ్యక్తపరచిన వారి కష్టనిష్ఠూరాలను, వారికి కలిగిన నిసర్గభావావేశాన్ని సారంగపాణి కొన్ని పదాలలో అతిరమణీయంగా వర్ణించి వాటిని జాతీయపదాలన్నాడు. జాతీయపదాలు 17 మాత్రమే లభించాయి. ఇవి సంఖ్యలో కొన్నే అయినా సారంగపాణి కీర్తిని అజరామరం చేస్తాయి. పదాలలో పామరుల భావాలను ఇంత అద్భుతంగా వర్ణించిన కవి 'నభూతోనభవిష్యతి'. పామరులు తమకు కలిగిన బాధను ఆనందాన్ని తాము రోజూ మాట్లాడుకొనే భాషలో వ్యక్తం చేస్తారు. సారంగపాణి తన ప్రాంతమైన కార్వేటినగర మండలంలో నివసించిన సమకాలీనులైన పామరుల (విద్యాగంధం లేనివారి) భాషనే తీసుకొని ఈ పదాలు రచించాడు. ఈ భాష రాయలసీమ భాష. ఈ పదాలలో ప్రయుక్తమైన భాషా ప్రయోగాలు పట్టణ సంస్కృతి వ్యాపించని రాయలసీమ ప్రాంతాలన్నిటా వినవస్తాయి. చిత్తూరు జిల్లాలో మరీ ఎక్కువగా వినవస్తాయి. ఈ విభాగంలోని పదాలలో వాడబడిన భాషను విశ్లేషించడానికి ముందు వస్తుపరంగా ఈ పదాల విలువను మదింపు వేయటం అవసరం.

సారంగపాణి రచించిన జాతీయపదాలలో ఆనాటి క్షామ పరిస్థితులలో ప్రజల ఇక్కట్లు, పామరప్రజలకు ఏకైక వినోదమైన తిరునాళ్ళు, తిండికి ముఖం వాసిన భిక్షగాళ్ళకు దానం చేయలేని పామర గృహస్థుల అసహాయత, జానపదాలలో అక్కడక్కడా కనిపించే పామరశృంగారం– పై జాతి పురుషులకు తక్కువజాతి స్త్రీలకు మధ్య ప్రవర్తిల్లిన శృంగారసంబంధం, పల్లెటూరిసంతలు ఇత్యాది విషయాలు ప్రస్తావించబడినాయి. ఈ సీమ ప్రజల మానసికవ్యవస్థకు అద్దం పట్టే అతి

1. రాజమండ్రి సరస్వతి పవర్‌ప్రెస్‌వారు 1963లో ప్రచురించిన సారంగపాణిపదాలకు వ్రాసిన పీఠికలో, పుట 20.



సున్నితమైన భావాలు అచ్చమైన నుడికారంతో మన హృదయాలను హత్తుకుంటాయి. ఈ ప్రాచీన జానపదభాషామాధుర్యం ఒకవైపు, అందులో పొదగబడిన అకృత్రిమపు ఆలోచనాలహరులు మరొకవైపు పఠితలకు తన్మయత్వం కలిగిస్తాయి.

### (అ)కరువురక్కసి

పదునెనిమిదవ శతాబ్దపు ఉత్తరార్థంలో రాయలసీమలో గొప్ప క్షామం సంభవించింది. కొన్ని సంవత్సరాలపాటు వర్షాభావం ఏర్పడింది. పంట పొలాలు బంజర్లుగా మారాయి. భయంకరపు ఆహారపుకొరత ఏర్పడింది. మనుషులు ఆకలితో అలమటించారు. పశువులు మేత లేక ఇతరప్రాంతాలకు కొన్ని, కబేళాలకు కొనిపోవలసిన పరిస్థితి ఏర్పడింది. పల్లెప్రాంతాలు అట్టుడికి పోయాయి. భూములుండి వ్యవసాయంపై ఆధారపడిన వాళ్ళకే ఇన్ని ఇబ్బందులైతే ఇక కూలినాలి చేసుకునే వాళ్ళ గతి, భిక్షగాండ్ల గతి చెప్పనవసరంలేదు. కరువు వేడిలో శలభాల్లాగా మాడిపోయారు.

ఇలాంటి క్షామపరిస్థితులలో అక్షయసంవత్సరం వచ్చింది. 'అచ్చయ బుట్టింది భూమికి బలుశబ్బర' అనే పదంలో సారంగపాణి కరువు తీవ్రతను వాస్తవికంగా వర్ణించాడు. ఈ అక్షయ 'బిరుదుబంట్లను భిక్షగాండ్ల' చేసిందట. 'పచ్చినూకలు నేల బడలే'దట. అంటే పైర్లు పండలేదని, రైతులు కూడా భిక్షగాండ్లైనారని అర్థం. పశువుల మందలు పడమటి సీమకు ఎగబడి పోయాయి. కార్వేటినగరమండలానికి పడమటిసీమ తమిళనాడు– కర్నాటక ప్రాంతం. వడ్లు, ఇతర ధాన్యాలు దొరకకపోవడంతో వర్తకులు రూకకు పడి చొప్పున కందులు అమ్మినారు. వర్షాభావపరిస్థితులను తట్టుకొనే మెట్టపంట కంది. రైతులు తమ దగ్గరున్న బంగారం అమ్ముకోవలసి వచ్చింది. వర్తకులు తక్కువ ధరకు బంగారం కొన్నారు. **'కుందనంబు పైడి కూటీక్నిల్లకెలబోయె'** ననడంలో అమ్మే వారి దైన్యం, కొనేవారి వంచన కనిపిస్తున్నాయి. కొందరు తమ బిడ్డలను పోషించుకోలేక భోగంవాళ్ళకు అమ్ముకున్నారు. మనుష్యులకు, జంతువులకే గాక పక్షులకు కూడా కరువు తీవ్రత తాకింది. చెట్లమీద పక్షులు తలలు వేలాడవేశాయి. దొంగతనాలు ఎక్కువైనాయి. అగ్నిప్రమాదాలు మామూలై పోయాయి. ఆహారంలేక,ఇండ్లు కాలిపోయి ఉండటానికి వసతి కూడాలేని బీదవాళ్ళు మంచి కలబందగుజ్జు తిని

కడుపు నింపుకున్నారు. ఆహారం లేక రక్తం క్షీణించి స్త్రీలకు ఋతుక్రమం ఆగిపోయింది. ఆలుమగల మధ్య శృంగారానికి తావు లేకుండా పోయింది. పొలంలో మడక కట్టి ఆరు సంవత్సరాలయిందట. పెద్ద రైతులంతా బయట ఘనంగా కనబడుతున్నారే గాని వాళ్ళ ఇండ్లలో పొయ్యిలో పిల్లి లేవలేదట. ఈ వర్ణన అక్షయకరువును మన కండ్లముందు పెడుతుంది. (142వ పదం).

## (ఆ) భిక్షగాండ్లు

రైతులే భిక్షగాండ్లై పోయారు. పౌరోహిత్యం చేసి, పంచాంగం చెప్పి, వీధిబడులు నడిపి బ్రతుకు వెళ్లదీసే బీదబ్రాహ్మణులు మరోమార్గం దొరక్క మధుకరానికి అలవాటుపడ్డారు. వీళ్ళ గతే ఇలా వుంటే ఇక మిగిలిన బడుగు కులాల వాళ్ళ గతి ఎలా ఉండేదో ఆలోచించు కోవలసిందే. ఒక బీద బ్రాహ్మణుడు మధుకరానికి వచ్చినపుడు బీదవాడైపోయిన ఒక గృహస్థుడు ఇలా అంటున్నాడు. "వర్షం పోయింది. పొలంలో వేసిన గింజలు మొలకెత్తడంలేదు. చెరువులు ఎండిపోయాయి. పూరి దొరకక గొర్రెలు వాపోతున్నాయి. నాడు కొర్రలు పెడితిని. ఇప్పుడు ఏమీలేదు. ఉండింది, పండింది అక్షయరాకతో ఊడ్చుకొని పోయింది. ఇంక నేనేమి ధర్మం చేసేది? పెందరాణ్నే అగ్రహారం చేరుకో, అక్కడందరూ బ్రాహ్మణులే, అగ్రహారపు ఎంగయ్యకు శోభనం జరుగుతుంది. ఊర్లో వున్న అయ్యవార్లకందరికీ విందు పెడతారంట" (143 వ పదం) ఇలా చెప్పినా ఆ యాచకుడు వెళ్ళక మొండిపడ్డాడు. గృహస్థునికి కొంచెం కోపం వచ్చింది. "యెగ్గంశైలోన వేలుబెట్టుకో, ఎందరికని చందా ఇవ్వగలను. చూడడానికి పెద్దమనిషివలె ఉన్నావు. చెప్పేది విని వెళ్ళు" అని కసురుకున్నాడు.

మరొక బీదబ్రాహ్మణయాచకుడు మరొకరి ఇంటికి మధుకరార్థం వచ్చాడు. గుమ్మం దగ్గర నిలబడి తన రాకను తెలుపుకున్నాడు. 'సంకనాకమను బీమేడుండాయి. బింగరమా ఈ బాపనోల్లకు' అనే మాటలు (148వ పదం) ఇంటి లోపల నుండి కటువుగా వినిపించాయి. 'వీళ్ళు మొండిపీనుగులు. ఎక్కడినుండి వచ్చారో గుమ్మం దగ్గర కూర్చుని లేచి పొమ్మంటే పోరు' అని గేస్థురాలు బయటకొచ్చి కేకలేసింది. ఆ యాచకుడు గోదావరి ప్రాంతం నుండి వచ్చానంటాడు. 'గోదారైతే గుడ్డెల్లిందేమీడ' అంటుందా ఇంటావిడ.



ఇంకొక బ్రాహ్మణయాచకుడు ఇంకొక ఇంటికి వెళ్ళాడు. ఆ ఇంటి యజమానిని ఆశీర్వదించి అక్షింతలు చల్లినాడు. ఈ ఇంటాయన కొంచెం బెడసరపు మనిషి. బాపడా డబ్బిలి పండినొద్ల నాడిప్పిస్తినె, మళ్ళీ వచ్చినావే. ఆశీర్వాదం బాగానేవుంది, సరిలే, అక్షింతలు కోళ్ళు ఏరక తిన్నాయి. కాశికిపొయ్యి వచ్చానంటున్నావు. అయితే ఏమి బొల్లి అవువా? ఇక్కడుండి కరవాడై ఎందుకు ఎండిపోతావు వెళ్ళు' అన్నాడు. కాని ఆ అయ్యవారు కదలలేదు. ఇతనికి కోపమొచ్చింది. 'అయిదుపోగుల జందెం వేసుకొని బూతంలాగా మొఖాన విభూతి రాసుకొని ఇక్కడే నిలబడ్డావు. నువ్వు చెంజిదుర్గం నుండి వస్తే నాకేమి? మనిషంటే చెప్పింది వినాలి. పంచాంగం విప్పొద్దు. పంగబగలదీస్తే నేలకు కరచుకుంటావు. వానలేక గింజలు పిరమైపోయాయి. దానధర్మం ఏం చేస్తాం. వేణుగోపాలస్వామి తిరునాళ్ళ దగ్గరికెళ్ళు. అక్కడ మస్తుగా కూడు పెడతారు' అని కసురుకున్నాడు. (149వ పదం).

వేరొక బ్రాహ్మణేతర భిక్షగాడు వేరొక ఇంటికెళ్ళి కిన్నెర వాయిస్తూ నిలబడ్డాడు. ఆ ఇంటి ఆవిడో లేక ఆయనో ఇలా అన్నారు. "ఇదేమి ఆగిత్యం తెల్లవారకతల్కే వచ్చావు. వర్షాలు లేవు. చెరువుల్లో చేపలన్నిటినీ సారేశారు. చేలల్లో కర్రలు బయటికి రావడంలేదు.కొలువుల కోసం పోతే ఫలితం కనపడడం లేదు. కొంపలిడిసి వెళ్ళలేకుండా ఉన్నాము. చలికి కప్పుకోవడానికి పాతగుడ్డలు కూడా లేవు. ఉపవాసముంటున్నా ఎవరూ పట్టించుకోరు. పిల్లకు సంగటేసి మూడునాళ్ళయింది. ముసల్ది లేవలేదు. చంటిది చంక దిగలేదు. గొడ్లకు ప్రాణం లేకుండా పోయింది. కోళ్ళు గింజలులేక అరుస్తున్నాయి. నా చేర నిండా ఆనాడు తైదలు యిస్తినిగా, మీకు యిసోసంలేదు. తెల్లవారితే బుట్టి సంకనేసుకొని మమ్మల్ని ఇట్టా ఉడకాడిస్తారు." (156 వ పదం). ఈ మాటలు విని ఆ భిక్షగాడికి తల తిరిగిపోయి ఉంటుంది కాని అతనికీ కడుపుమంట చల్లారాలి గదా!

సారంగపాణి తీసుకున్న సంఘటనల వివరణ ఇలా ఉంటుంది. కరువుకు భిక్షగాండ్లకు అవినాభావసంబంధముంది. క్షామ పరిస్థితులను ఎందరో వర్ణించి ఉంటారు. నిస్సహాయస్థితిలోని ప్రజల కడ గండ్లను ఇంత సహజంగా వర్ణించడం ఎవరికి సాధ్యమవుతుంది!

## (ఇ) తిరనాళ్లు

తమ ప్రాంతంలో జరుగుతూ ఉండిన తిరునాళ్ళను, ఆ సందర్భాలలో పల్లీయులు పొందే ఆనందాన్ని సారంగపాణి కండ్లకు కట్టినట్లు వర్ణించాడు. 'కొండ సుట్టోచ్చేరంటె' (144వ పదం) అనే పదంలో ఆనాడు కార్వేటినగరానికి సమీపంలో గల కొండ ప్రాంతంలో జరిగే ఉత్సవం వర్ణించబడింది. చుట్టుపక్కన గల గ్రామాల నుండి దేవతా విగ్రహాలను ఇక్కడికి తెచ్చి ఒక మంటపంలో గంట కొట్టి దించేవారు. నగరి వాళ్ళు (కార్వేటినగరసంస్థానం వాళ్ళు) నగారా శబ్దాలతో అక్కడికి వచ్చినపుడు ఆ ప్రాంతం కలియుగవైకుంఠ మయ్యేది. ప్రభువులు పూజించే విగ్రహాలను ఏనుగు అంబారి మీద తెచ్చేవారు. భోగం వాళ్ళు పాటలు పాడుతూ నాట్యం చేసేవారు. ఉత్సాహవంతులు రకరకాల వేషాలు వేసి ప్రజలను ఆనందపరచేవారు. ఉత్సవం చివర గుగ్గిళ్ళు ప్రసాదంగా పంచేవారు. ఆ కొండకు చుట్టూ పొలాల్లో దున్నుకుంటూ వుండే రైతులు మడక దున్నడం నిలిపేసి ఉత్సవం చూడడానికి వచ్చేవారు. ఇలా జరిగే ఈ కొండ జాతర 'దేవేంద్ర వైభవం' గా వుండేది.

కార్వేటినగరవీధులలో జరిగే మెరవణను సారంగపాణి (145 వ పదం) సహజంగా వర్ణించాడు. వృషభవాహనం మీద దేవుడు ఊరేగింపుగా సాగివస్తుంటే ఆ దేవుడు ఈశ్వరుడో, బ్రహ్మదేవుడో లేక విఘ్నేశ్వరుడో ప్రజలు పోల్చుకోలేక పోయారు. నొసట విభూది పెట్టుకొన్న పూజారి బండిలో గుండులాగా కూర్చుని ఉన్నాడు. ఏకులబుట్టలో ఉన్న రాగిపాత్రతో దగ్గర కొచ్చిన వాళ్ళ తలలు తాకించి తాంబూలం తీసుకొంటున్నాడు. తాళాలు వాగుతున్నాయి. మేళాలు మోగుతున్నాయి. భోగంవాళ్లు వీధి వెంట ఆడుతూ వస్తున్నారు. దివిటీలు వెలుగుతున్నాయి. వీధిలో అక్కడక్కడా తోరణాలు కట్టి ఉన్నాయి. ఉత్సాహవంతులు రకరకాల వేషాలతో తోరణాల కింద దూరుతూ ప్రజలను ఆనందపరుస్తున్నారు. పనులన్నీ మానేసి పురప్రజలంతా ఊరేగింపు చూడడానికి వచ్చారు.

నగరంలో జరిగే 'తెప్పతిరునాళ' వేడుక చూడవలసిందే. చెప్పడానికి మాటలు చాలవన్నట్లు వర్ణించాడు సారంగపాణి. నగరానికి అతి సమీపంలో ఒక పెద్ద పుష్కరిణి ఉంది. ఇప్పుడు దీనిని 'స్కంధపుష్కరిణి' అని పిలుస్తున్నారు.



నిండా నీటితో చూడడానికి చాల అందంగా ఉంటుంది. ఈ నీటిని ప్రస్తుతం పంచాయితీ వాళ్ళు నగరానికి సరఫరా చేస్తున్నారు. 'పదమ చరచు కాద – పందిల్లె బగినోదం' అని సారంగపాణి చెప్పడాన్ని బట్టి ఈ పుష్కరిణి సారంగపాణి నాటికి కొంచెం చిన్నదిగా ఉండేదేమో, దీనిని 'పద్మసరస్సు' అని పిలిచే వారేమోననిపిస్తుంది. ఈ సరస్సులో తెప్పోత్సవం జరిగేది. అక్కడ పెద్ద పందిళ్ళు వేసి 'యెదుట మలుగ కూడు ఇంటెలుపున వండి పోసేవారు. అక్కడే యజ్ఞం జరిగేది. ఊరి బ్రాహ్మణులంతా అక్కడికి వచ్చేవారు. సోమయాజులు యజ్ఞం నిర్వహించేవారు. ఆ ప్రాంతమంతా ప్రజలతో కిక్కిరిసి పోయేది. జంగం వాళ్ళు శంఖం ఊదేవాళ్ళు, మంగలి వాళ్ళు'మేళం' వాయించేవారు. పద్మసరస్సు చుట్టూ రకరకాల వస్తువులతో అంగళ్ళు వెలసేవి. వేషాలు వేసుకొని తిరిగేవాళ్ళ వేడుకే వేడుక. దేవతావిగ్రహాలను ప్రతిష్ఠించిన చోట భోగంవాళ్ళు ఆడేవారు. తెప్పోత్సవానికి సంస్థానం వారు తమ బలగంతో వచ్చేవారు.

'అగ్గితిరునాళ్ళు' కార్వేటినగర ప్రాంతంలో పెద్ద ఉత్సవాలు. 'ద్రౌపదమ్మ తిరునాళ్ళు' పేరుతో ఇప్పటికీ చిత్తూరుజిల్లాలో జరుపబడుతున్నాయి. నిప్పు తిరునాళ్ళనీ, ధర్మరాజుల తిరునాళ్లనీ, భారతాలనీ వీని కనేక పేర్లు. ఈ తిరునాళ్ళు పదునెనిమిది రోజులు జరుగుతాయి. ప్రతిరోజు ద్రౌపది, ధర్మరాజు, భీమార్జునాది విగ్రహాల ఊరేగింపు ఉంటుంది. ప్రతిరాత్రీ భారతకథ జానపదబాణీలో ప్రదర్శింపబడుతుంది. చివరి రోజు పెద్ద అగ్నిగుండం నిర్మించి కణకణమండే నిప్పులమీద ప్రజలంతా భక్త్యావేశాలతో నడుస్తారు. ఈ కారణం చేత ఈ ఉత్సవాలను 'అగ్గితిరునాళ్ళు' అని పిలుస్తారు. సారంగపాణి కాలం నాడు ఈ ఉత్సవం ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపబడినట్లు తెలుస్తుంది. ఇది జానపదుల పండుగ. పామర ప్రజలకు భారతకథలంటే వల్లమాలిన అభిమానం. అయితే విద్యాగంధం లేకపోవడం చేత భారతంలోని పాత్రల వావివరుసలు, పూర్వాపరాలు వీరికి సరిగా తెలియవు. ఈ ఉత్సవాల సందర్భంలో ధర్మరాజుల గుళ్ళో జరిగే భారతకథను వినివచ్చిన ఒక గ్రామీణుని పలుకులిలా ఉన్నాయి.

**అగ్గి తిరునాళ్ళంట – అజ్జునికతలంట –**
**ఔరా యెంతరుసోద్దమే** ॥పల్లవి॥

**సుగ్గీజయము దీని - సుట్టు బలాదూరు**
**అగ్గురోరపు అయ్యోర్నడిగె నీసాచ్చిగ** ॥అనుపల్లవి॥

**యిగనేసు పయినెక్కి - యీబీసనూడొచ్చి**
**బగు పెగ్గె లెన్నెన్నో - బలికి దుశ్శాసూని**
**మొగము సూడగానె - మొర్చనాయాలట్టే**
**గుగురు మిగురనకుండ - గుడ్లెల్ల గుక్కెనే** ॥అగ్గి॥

**అనుమంతెనకటోడు - అభిమన్నుడంటనే**
**సనియునోలెబట్ట - సాముశేయుచు అట్టె**
**యెనయ యీరబద్రు - డిసనకాయలుదొక్కి**
**కనురెప్పేశే తల్కి - కర్ణుని శించెనె** ॥అగ్గి॥

తెలిసీ తెలియని పురాణ కథాజ్ఞానంతో పామరులు పౌరాణిక కథలకూ పాత్రలకు విచిత్రంగా సమన్వయం కల్పించి వినోదించడం మనకిందులో కనిపిస్తుంది. ఈ 'తారుమారు' కథాంశాలు మనకు మృచ్ఛకటికంలో శకారుని మాటలను గుర్తుకు తెస్తాయి. **'నచ్చత్రం బొయ్యొత్తామె - చంద్రమాశి నచ్చత్రం సూశొత్తామె'** అనే పదంలో సారంగపాణి తిరుత్తణిలో జరిగే కృత్తికోత్సవాన్ని వర్ణించాడు. కార్వేటి నగరానికి తిరుత్తణి సమీపప్రాంతమే కాబట్టి నగరప్రజలు కృత్తికోత్స వానికి వెళ్ళేవారు. 'శిరతని' గుడిలో వాహనాల వేడుక, భోగంసానుల ఆటలు చూడడానికి జనం విపరీతంగా వచ్చేవారు. ఆనాటి తిరుత్తణి రథానికి అమర్చిన సింహాల బొమ్మలు చిత్తూరులో తయారు చేయించినారట. రథం చాల ఎత్తుగా ఉండేదని, దానిని చూడడానికి తల పైకెత్తినపుడు నెత్తిపాగ పడిపోయేదని సారంగపాణి వర్ణించాడు. ఉత్సవ సమయంలో సంత జరిగేది. ఈ సంతలో 'తొగరు శీల్లు' (ఎరుపు చీరలు) ఎక్కువగా అమ్మేవారు. గురుగులు, వరుగులు చౌకగా విక్రయించేవారు. ఒక దుగ్గానికి 'ఇంత' కుంకం దొరికేది. ఈతబెల్లంతో చేసిన 'నిప్పట్లు' కొనడానికి జనం ఎగబడేవారు.

## (ఈ) పల్లెటూరి సంతలు

గ్రామప్రాంతాలలో ప్రజలకు కావలసిన సరుకులను సరఫరా చేయడానికి రెండు మూడు గ్రామాలకు కలిపి ఒక్కొక్కచోట వారానికొకరోజు



ఏర్పాటు చేసే ఆంగళ్లే సంతలు. మొన్నమొన్నటివరకు పల్లెప్రాంతాల్లోన్ని ప్రజలు తమకు కావలసిన వస్తువులను తమకు దగ్గరలో ఏర్పాటైన సంతలలోనే కొనేవారు. ఇప్పుడిప్పుడు పల్లెలలో కూడా పట్టణవాతావరణం ఏర్పడుతూ వుండడంచేత సంతలు కనుమరుగవుతున్నాయి. అయినా ఇప్పటికీ మారుమూల గ్రామప్రాంతాలలో సంతలు జరుగుతున్నాయి. సారంగపాణి కాలంలో కార్వేటి నగరానికి చుట్టుప్రక్కల ఎన్నో సంతలు ఉండి ఉంటాయి. 154 వ పదంలో సారంగపాణి 'నాన్నారం చంత' (నారాయణవనం సంత)ను, సంతలో దొరికే వస్తువులను సహజంగా వర్ణించాడు. 'సంతలో అన్ని రకాల వస్తువులు నయముగా (చౌకగా) అమ్ముతారు. ఈసుళ్ళు (పల్లె ప్రజలు ఇష్టంగా తినే రెక్కల పురుగులు, ఇవి వర్షాకాలంలో పుట్టలలో దొరుకుతాయి. వీటి రెక్కలను తొలగించి వేయించుకొని తింటారు.), మలుగుచేపలు ఎక్కువగా దొరుకుతాయి. తలయెంటికె తాళ్ళు (ఆడవాళ్ళు అందంకోసం తమ వెంట్రుకలతో చేర్చి జడ అల్లుకొనే వెంద్రుకలతో చేసిన సవరాలు), ఇత్తడికమ్మలు, మెట్టెలు స్త్రీలకోసం అమ్ముతారు.' ఈ అమ్మకపువస్తువులతో పాటు సారంగపాణి సంత సందర్భాలలో అక్కడ జరిగే ఉత్సవాలు, వింతలు విశేషాలు కూడా వర్ణించాడు.

## (ఉ) పామరవేశ్యలు - విటులు

కులకాంతలలో కొందరి రంకుతనాన్ని నిరసిస్తూ-సారంగపాణి కులకాంతలు విచ్చలవిడిగా తిరుగుతున్నారని, వారివల్ల వెలయాండ్ల జీవనం కుంటుపడుతున్నదని 138 వ పదంలో అభిప్రాయపడినాడు. పలుకుబడి గలవారిని రప్పించుకుంటూ, వారి దగ్గర ఎక్కువగా గుంజుతూ పట్టణాలలో కాపురముండే వేశ్యలు కొందరైతే, పల్లెలలోనే ఉంటూ తక్కువ కానుకలైనా ఒప్పుకొని గుడి పూజార్లు మొదలుకొని వృత్తి పనివాండ్ల వరకు వివిధ వర్గాలలో గల కుంటెనగాండ్లతో తాత్కాలికసంబంధాలు పెట్టుకొనే వేశ్యలు కొందరు. ఈ రెండవరకం వారిని పామరవేశ్యలనవచ్చు. గుడి దగ్గర పెట్టే ప్రసాదాలకు, చేలలో కాసే కూరగాయలకు కూడా వీళ్లు ఆశపడతారు. విలువైన కానుకలు తెచ్చి ఇవ్వకున్నా చింతమానువద్ద చింతపండు, వంగతోటవద్ద వంకాయలు

ఇచ్చినా తృప్తిపడి శృంగారం అందిస్తారు వీళ్ళు. చాటుమాటుగా శృంగార సరదాలు తీర్చుకునే గుడి సాతాన్లు కొందరుంటారు. వీరికి పామర వేశ్యలతోగల సంబంధం, అది బయటికి పొక్కినపుడు అందరూ ఎగతాళిగా నవ్వుకోవడం పల్లెప్రాంతంలో సామాన్యం. ఇలాంటివి తెలిసినా ఎవరూ పెద్దగా పట్టించుకునేవారు కాదు. ఇలాంటి పామరవేశ్యల శృంగారాన్ని సారంగపాణి రెండు పదాలలో (151,152 పదాలు) అతి సహజంగా వర్ణించాడు. 'ఒక విటుడు తన వేశ్యను (ప్రియురాలిని) ద్వాదశినాడు దేవాలయానికి రమ్మన్నాడట. ఆమె వెళితే కొంతపాయిసం, వరికూడు, పానకం ఇచ్చి పాతిక రూకలవుతుందన్నాడట' మరొక విటుడు 'తనకు వచ్చిన నగరదక్షిణను కొత్తవేశ్య ప్రియురాలికిచ్చి అక్కడికి వచ్చిన తన పాత వేశ్యకు కనబడకుండా దాక్కున్నాడట' 'ఒక స్త్రీ పిల్లవాడిని తీసుకొని 'శిరతని నచ్చత్రం' పోవాలి, దుగ్గాండ్లీ మని చెయ్యి చాపి అడిగితే ఒక విటుడు లేదన్నాడట' ఈ సంఘటనలన్నీ ఆనాటి జనజీవనప్రవంతిలో భాగాలు. సారంగపాణి నిశిత పరిశీలనకు గోచరించిన సాంఘికసత్యాలు. సాంఘికనీతి మాట అటుంచితే ఇలాంటివి ఆనాటి జానపదజీవితాన్ని మధురతర మొనర్చిన రసగుళికలు.

# 4.కీర్తనలు

కీర్తన అనగానే పారమార్థికమైన, భగవద్భక్తి పరమైన పాటగానే అనిపిస్తుంది. కీర్తనకు పండితులు చెప్పే నిర్వచనమెలా ఉన్నా భక్తిపారవశ్యంతో భగవంతుని కల్యాణగుణాలను స్పృశిస్తూ తన నుద్ధరించమని మొర పెట్టుకొంటూ పాడే పాట అని చెపితే సరిపోతుంది. స్థూలంగా పదానికి కీర్తనకు మధ్య పెద్ద తేడాను పాటించనవసరం లేదు. అయినా ప్రాముఖ్యతను బట్టి శృంగారాత్మకములైనవి పదాలని, భక్త్యాత్మకములైనవి కీర్తనలని చెప్పడం సబబు. సారంగపాణి సంస్కృతంలో భర్తృహరివలె శృంగార వైరాగ్యబోధకాలైన పదాలు రచించాడని ముందే చెప్పబడింది. ఈ కీర్తనల విభాగంలోగల 44 పదాలలో పారమార్థికమైన, భక్తినిర్భరమైన, నీతిబోధకమైన విషయాలే కాకుండా అక్కడక్కడా సందర్భం చేసుకొని శృంగార సౌఖ్యం క్షణికమైనదని, భగవద్భక్తిలో రమించడం వల్ల శాశ్వత సౌఖ్యం కలుగుతుందని హితబోధ చేశాడు. కీర్తనలరచనలో సారంగపాణి మీద అంతకు ముందుండిన పదకర్తలలో రామదాసు ప్రభావం కంఠతఘ్నంగా కనిపిస్తుంది.



**'వేణుగోపాలుని విడువము-వేరేయొక్కరి పేరు నుడువము.'(158).**
**'హరి నారాయణ గోవిందాయని స్మరణసేయవే వోమనసా' (175).**
**'నిన్ను నే విడవాను-నీ పేరు మరువాను'** (179) ఇత్యాది కీర్తనలు

పాడగా విన్నపుడు భక్తరామదాసు మన మదిలో మెదలుతాడు.

సారంగపాణి వేణుగోపాలస్వామి భక్తుడు. కార్వేటినగరంలోని ఆ స్వామి గుడిలో ప్రతిరోజు ఆయన స్వామి సేవలో పాల్గొనేవాడేమో. గోపాలుని మీద భక్తి కుదిరింది. స్వామి ఊరేగింపు పట్టణవీధులలో తరచుగా జరుగుతూ వుండినట్లు క్రింది కీర్తనను బట్టి తెలుస్తుంది.

**'కదలి వచ్చెను జూడరే వేణు-గోపాలుడు కనుల పండుగగాను**
**పదిలుడై గరుడునిపై నెక్కి భక్తుల-ముదమంద జేయుచు ఇదిగో**
**రాజమార్గమున'** *(170)*

వేదపఠనంతో, సరసిజాక్షుల నాట్యములతో కొనసాగే ఈ ఊరేగింపులో భేరి దుందుభులు మ్రోగేవి. వందిమాగధులు హెచ్చరికె చేసేవారు. ఏనుగులు, గుఱ్ఱాలు వీధులలో స్వామి రథానికి ముందు కదిలేవి. దివిటీలు వెలగేవి. ఆలయసేవకులు ఛత్రచామరాలతో అనుసరించేవారు. భక్తులు పాటలు పాడుకొంటూ వచ్చేవారు. ఈ రకంగా సాగే ఊరేగింపు కనులపండువుగా ఉండేది.

దేహం అద్దెకొంప వంటిది. అనిత్యమైనది. ఇది తెలుసుకొని మానవుడు మసలుకోవాలి. మంచివాడనుపించుకోవాలి. భగవత్పాదపద్మముల మీద ప్రాపంచిక వాసనలో మునిగిన మనస్సు క్షణకాలం నిలవదు. మనస్సును గట్టిపరచుకొని పారమార్థికవిషయాల మీద దృష్టి నిలపాలంటే హరినామ స్మరణే గతి. వృద్ధాప్యంలో శరీరంలో బలం తగ్గకముందే, కర్రపట్టుకొని తిరగకముందే జీవిత పరమార్థసాధనకు పూనుకోవాలి. దీనికి సులభమార్గం భక్తి. భక్తిలేని జన్మ వ్యర్థం. భక్తితత్పరులైన హరిదాసులను ఏ పాపాలు అంటవు. పాపాత్ముల మనస్సు పారమార్థికాన్ని గురించి ఆలోచించదు. వాళ్ళు అందరూ చూడడం కోసం పూజలు చేస్తారు. భక్తిలేని పూజ వ్యర్థం. భక్తిలేని వ్రతాల వల్ల ఫలితముండదు. కీర్తనలలో సారంగపాణి వెలువరించిన అభిప్రాయాలివి.

శృంగారకీర్తనలను రసవంతముగా రచించి, తరువాత కీర్తనలలో పారమార్థికభావాలను ప్రచారం చేసిన సారంగపాణి చరమదశలో రాజాశ్రయం పోవడంతో పేదవాడై కవిసార్వభౌముడైన శ్రీనాథునివలె అష్టకష్టాలు అనుభవించాడని కొందరి అభిప్రాయం. "రాజాశ్రయం లేని రోజులలో ఇతడు అత్యంత దారిద్ర్యం అనుభవించి ఉంఛవృత్తిలో బియ్యమడుగుకొని జీవించినట్లు తెలియ చేసే పదాలు కొన్ని ఉన్నవి. శ్రీనాథుడు కూడా అటువంటి దారిద్ర్యం అనుభవించిన చరమదశలో పామరజనుల నడుమ గడిపి, వారి ఆనందానికి పల్నాటివీరచరిత్ర, కాటమరాజుకథ వంటి వీరపదాలను (బాలడ్సు) రచించినట్లే, సారంగపాణి తన చేత కాసులేని రోజుల్లో జానపదులతో కలిసి కాలక్షేపం చేస్తూ వారి ఆనందంకోసం **'అగ్గి తిరునాళ్ళంట', 'నాన్నారం సంతలోన'** వంటి పల్లెపదాలను కూడా రచించాడు."[1] అని రజనీకాంతరావు గారు ఊహించారు. ఈ ఊహ బాగున్నా అంత విశ్వసనీయంగా లేదు. కవి రచించిన ప్రతి కవితాఖండిక లోను అతని ఆత్మీయాంశ ఉండక పోవచ్చు. కవితలో అత డందించిన భావం అతని సమగ్రావగాహనకు, లోకజ్ఞతకు నిదర్శనం కావచ్చు. సాధారణంగా పదకర్త లందరిలో శృంగారాధ్యాత్మిక భావాలు ప్రముఖంగా ఉంటాయి. అందరిలాగే సారంగపాణిలో కూడా వయోధర్మాన్ననుసరించి ఆధ్యాత్మికచింతన, భక్తి నిర్భరమైన మనఃప్రవృత్తి ఏర్పడి ఉంటాయి, ఈ దశలో అతడు కీర్తనలు రచించి ఉంటాడు. "సారంగపాణి ఉత్తమభక్తుడుగా జీవితాన్ని గడిపినట్లు చతుర్థభాగంలోని కీర్తనలే నిదర్శనం. అతని భక్తితత్త్వానికి, వేదాంత వైరాగ్య నీతి ప్రబోధాత్మక దృష్టికి, ఆధ్యాత్మికచింతనకీ ఆ కీర్తనలు చక్కటి సాక్ష్యాలు. సారంగపాణి జీవితం పోతన జీవితంలాగా చివరిదశలో సాగిందని మనం విశ్వసించడమే సమంజసం".[2] అన్న గంగప్పగారి అభిప్రాయం ఈ సందర్భంలో సరిపోతుంది.

భక్తిభావాలతో పాటు సారంగపాణి మానవవర్తనలో సహజంగా వుండే బలహీనతలను, అవాంఛనీయమైన స్వభావాన్ని, అశక్త దుర్జనత్వాన్ని, అది కలిగించే హేయమైన జీవితాన్ని, సన్యాసులమని చెప్పుకొనే వారిలో ఉండే కామ క్రోధాది

1. ఆంధ్రవాగ్గేయకార చరిత్ర, పుట. 318
2. సారంగపాణి పదసాహిత్యం. పుట. 14.



భావాల్ని, మానవజన్మకు అవసరమైన నీతిసూత్రాల్ని ఈ కీర్తనలలో సహజ ధోరణిలో వివరించాడు. 'కోటివిద్యలు కూటికొరకే' నన్నట్లు

**'పాతకాలు జేసేది – ప్రజలను బాధించేది**
**నీతి యేట కలిపేది – నిష్ట మానేది**
**.... ..... ..... ..... .... ......**
**మూటలు మోసేది – ప్రుచ్చులించేది**
**ఎలికి బొక్కలు ద్రవ్వి – యెన్ను వెళ్ళదీసేది' (192)**

కడుపుకోసమేనని, సంపాదన ధర్మబద్ధమై ఉండాలని సారంగపాణి బోధించాడు. కులాచారం పాటిస్తూ, తల్లిదండ్రులను భక్తితో సేవిస్తూ, ధర్మ కార్యాలకు విఘ్నం చేయకుండా మంచివాడని పేరు తెచ్చుకునే మానవుడే ఘనుడని సారంగపాణి అభిప్రాయం. **'పాపాత్ముని ధర్మాధికారిగా బంపేదొక రోత – సతతము కోపము జేసే నరనాథు కొలువు గొలిచేదొక రోత' (174) 'దాతను వాదులు జెరిపే దబ్బిలి తలమీదనె సొద్దు – చెయ్యి ధాతువు దెలియని వైద్యము జేసే ధగిడీకొక సొద్దు' (167)** అనే పదాలలో సారంగపాణి స్త్రీ పురుషుల నడతను చక్కదిద్దే ప్రయత్నం జేశాడు.

మానవస్వభావంలోని లోపాలను ఎత్తి చూపి వాటిని సంస్కరిస్తూ, జీవితంలో ఆచరించవలసిన నీతులను మెత్తగా బోధించేవి నీతిశతకాలు. నీతి శతకాలలో సుమతిశతకం, వేమనశతకాలకు విశేషమైన ఆదరణ, ప్రచారం ఉన్నాయి. ఈ శతకాలలోని ఒకటి రెండు పద్యాలైనా రానివా రుండరేమో. పామరులకు కూడా ఈ శతకాలు పరిచయమే. ఈ శతకాల ప్రభావం సారంగపాణి కీర్తనలలో బాగా కనిపిస్తుంది.

**'భక్తిలేని పూజ లేమిటికి – పత్రి దొరకగానే**
**జీతము ముట్టని కొలువేమిటికి – చిలుకలేని పంజర మేమిటికి'** (కీ. 180)

అనే కీర్తన.

**'అడిగిన జీతం బివ్వని – మిడిమేలపు కొలువు గొలిచి మిడుగుట కంటెన్**
**వడిగల రెండెద్దుల బట్టుక – మడి దున్నుక బ్రతుకవచ్చు మహిలో సుమతీ'**

అన్న సుమతీశతకం లోని పద్యాన్ని తలపిస్తుంది.

**మేనినిండ భస్మమలదిన నేమి - మెడల రుద్రాక్షలు పూనిన నేమి**
**నానా భూములు తిరిగిన నేమి - నదులు నిధులు గనుగొంటే నేమి'**
అనే కీర్తన (184).

**'ఆత్మశుద్ధి లేని యాచార మదియేల - భాండశుద్ధి లేని పాకమేల?**
**చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా - విశ్వదాభిరామ వినురవేమ'!**

అనే వేమన పద్యానికి వ్యాఖ్యానప్రాయంగా ఉంది. ఇలా పరిశీలిస్తూ పోతే శ్రీనాథాది ప్రసిద్ధకవుల ప్రభావం కూడా ఇతని పదాల మీద ఉన్నట్లు స్పష్టమవుతుంది. శతకకవులలో ఎందరి ప్రభావమో సారంగపాణి మీద ఉంది.

**'పగవానింట కుడవరాదు- బలవంతుల కెదమియ్యరాదు**
**మగువల యాలోచనలు వినరాదు - మానఘనుల పోనాడగరాదు**
**అప్పులు మెండుగ సేయరాదు - ఆవల పండ్లిగిలించరాదు**
**మెప్పులు వకరికి దోపరాదు - మెచ్చని నడతలు నడువరాదు**
**చేతగాని పని పట్టరాదు - చేసిన మేలు చెప్పరాదు**
**ఘాతకాని కొడిగట్టరాదు - కాయము సతమని నమ్మరాదు**
**కలిమి గలిగెనని త్రుళ్ళరాదు - గాసి వచ్చెనని వగవరాదు'**

181వ కీర్తనలో గల ఈ వాక్యాలలోని సార్వకాలిక, సార్వజనీన సత్యాలు 'సత్యంవద - ధర్మంచర' అనే ప్రాచీనోక్తులను జ్ఞప్తికి తెస్తాయి. ముందు చెప్పినట్లు సారంగపాణిపదాలు తత్త్వాలు పాడుకొంటూ ప్రాంతాలన్నీ తిరిగే సన్యాసుల ద్వారా ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి. ఒకప్పుడు రాయలసీమ జిల్లా లన్నిటా ఈ పదాలకు ప్రచార ముండేది. గ్రామాలలోని రామాలయాలలో రామదాసుకీర్తనలను భజనపాటలుగా పాడేపద్ధతి చాల కాలంగా ఉంది. రాయలసీమ గ్రామాల వీధులలో నృత్యపద్ధతిలో అడుగులు వేస్తూ భజనపాటలు పాడే పండరి భజన మొన్న మొన్నటి వరకూ ఉండి ఆధునిక నాగరకత చాటుకు వెళ్ళిపోతూ వుంది. దేవాలయాలలోను, వీధులలోను పాడే భజనపాటలలో సారంగపాణి కీర్తనలు గూడా పాడబడుతూ వుండేవని నా నమ్మకం. మా గ్రామంలో (మైసూరివారి పల్లె, రైల్వే కోడూరు మండలం కడప జిల్లా). 'రాముల మెరవణ' సందర్భంలో జరిగే బృందభజనలో



**'ఏమి చేయుదు దైవమా-నా కెటుల తోచగదాయెను',**
**'నా మనోహర రామచంద్ర-నాదు కోర్కెలు తీర్చుమా'**
అనే పాటలు (భైరవి-ఝంపె) వినపడేవి. వీటితోపాటు-

**'శ్రీ రమా రమణీ మనోహర-చిరకృపాన్వయ భూషణా**
**నారదాది మునీంద్ర వందిత-నవ్యమణి గణ భూషణా**
**శారదాభ్రశరీర దానవ-జన మదాంబుధి శోషణా**
**భారతాన్వయపాల వేణు-గోపాల దీనజనావనా** ॥శ్రీరమా॥

**కాంత నిన్నెడబాసి దినమొక-కల్పముగ భావించురా**
**చింతచే పవళించురా చై-చెక్కిటను గీలించురా**
**కంతుబారి చెలించురా నిను-కౌగిలించగ నెంచురా**
**పంతమేలర రార వేణుగో-పాల దీనజనావనా'** (196) ॥శ్రీరమా॥

అనే సారంగపాణి కీర్తన కూడ వినబడేది. 'మెరవణ' గ్రామ వీధులన్నీ తిరిగి మళ్ళీ దేవాలం వద్దకు వచ్చినపుడు భక్తులందరూ మంగళకీర్తన పాడి ఉత్సవవిగ్రహాలను గాని, పటాలను గాని లోపల ఉంచడం ఆనవాయితీ.

**'జయమంగళం-నిత్య శుభమంగళం**
**ఇందిరా రమణునకు-ఇభరాజ వరదునకు**
**మందరోద్ధారునకు-మాధవునకూ**
**నందనందనుడైన-నవనీతచోరునకు**
**కందర్ప శతకోటి-సుందరునకూ'** ॥జయ॥

అనే సారంగపాణి కీర్తన (200) ఈ సందర్భంలో విన్నట్లు నాకింకా జ్ఞాపకం ఉంది. **'లాలెనుచు వూచేరు-లలన లింపునను-శ్రీల చెన్నలరు నుయ్యాల పాన్పునను'** అనే లాలిపాట (199) కూడా ఎప్పుడో విన్నట్లు లీలగా గుర్తు. వీటినిబట్టి చూస్తే ఒకప్పుడు సారంగపాణిపదాలకు బహుళప్రచారం ఉండేదని అర్థమవుతుంది. నేడు భజనకూటాలు కరువై పోయాయి. తత్త్వజిజ్ఞాసతో కీర్తనలు పాడే తాత్త్వికులు తగ్గిపోయారు. అందువల్ల సారంగపాణి కీర్తనలు మరుగున బడడంలో విచిత్రం లేదు.

# సారంగపాణి భాష

సాధారణంగా పదకర్తలందరూ వ్యవహారభాషనే తమ పదాలలో వాడుకొన్నారు. పదకవితాశాఖ దేశి సంప్రదాయానికి చెందినది కావడంచేత, భావాలు సహజ సుందరాలు కావడంచేత పదకవులకు అప్రయత్నంగా వాడుకపదాలు స్ఫురిస్తాయి. భాషనువాడుకోవడం, భావాలనుపొదగడం ఆయా కవుల మనస్తత్వం మీద ఆధారపడిన విషయం. పదకవి మనస్సు అతి సున్నితం. అందువల్ల అతడు చెప్పదలచిన విషయాలు తన కాలంనాటి వాడుక భాషలోనే వ్యక్తం చేస్తాడు. పదకవులు పాండిత్యప్రకర్షకోసం రచన చేయడం అరుదు. కాబట్టి పదకవుల భాష ఆయా కాలాల వ్యవహార భాషే అయి ఉంటుంది. సారంగపాణి వాడిన భాష అతని కాలపు జన వ్యవహారం లోనిది. అతని పదాలు నాలుగు భాగాలుగా ఉన్నాయి. ఒకటి ,రెండు,నాలుగు భాగాల రచనలో భాష ఒక రకంగా ఉంది. మూడవ భాగంలో గల రచనలో మరొక రకమైన భాష వాడబడింది.

సారంగపాణి కాలం నాటికి కావ్యభాష, కావ్యేతరభాష స్థిరపడి ఉన్నాయి. పద్యకావ్యాలలో కనిపించేది కావ్యభాష. వచనగ్రంథాలలో కనిపించేది కావ్యేతర భాష. కావ్యభాషలో వాడుకపదాలు అతి తక్కువగాను, కావ్యేతరభాషలో కొంచెం ఎక్కువగాను కనిపిస్తాయి. స్థూలంగా చెప్పాలంటే కావ్యభాష బిగువుగాను, కావ్యేతర భాష కొంచం సడలింపుగాను ఉంటుంది. ఈ రెండు లక్షణాలకు భిన్నమైన నడిమిరకం భాష మరొకటుంది. ఈ భాష శతకాల, కావ్యాల భాష కంటే భిన్నంగా ఉండి ఎక్కువ వాడుక మాటలను కలిగి ఉంటుంది. పాటలు, మామూలు వచనాలభాష కంటె కొంచెం బిగువుగా ఉండి ప్రాచీన గ్రంథాలలోని మాటలను కూడా కలిగి ఉంటుంది. పదసాహిత్యంలో కనిపించే భాషను ఈ నడిమి రకానికి చెందినదిగా గుర్తించవచ్చు. ఆ కాలంలో చదువుకున్న వాళ్ళు తక్కువ. కవులు వ్రాసినది చదివి అర్థం చేసుకొనే వారి సంఖ్య మరీ తక్కువ. పదసాహిత్యం ప్రచారం మూలంగానే వ్యాప్తిలో ఉండేది. నిరక్షరాస్యులకు కూడా పదవాఙ్మయం కంఠస్థ మయ్యేది. భిక్షగాండ్లు, బైరాగులు వేరు వేరు ప్రాంతాలలో ఈ పాటలు పాడేవారు. ఆ రకంగా ఇవి అందరికీ తెలిసేవి. విన్న వెంటనే అర్థం గావాలంటే ప్రజలకు అలవాటైన మాటలే పదాలలో వాడబడి ఉండాలి. పరుషాక్షరాలు , సంయుక్తాక్షరాలు గల దీర్ఘసమాసాలు లేకుండా తమకు పరిచయమైన చిన్న



చిన్న మాటలతో ఉంటేనే పదాలు కంఠస్థం కావడం సులభం. పదకవిత లక్షణానుసారంగా వ్రాయబడి నప్పటికీ పదకవులకు పండిత పాఠకులు అంత ప్రమాణం కాదు. భక్తిభావం కలిగి, కల్మషరహితమైన మనస్సుగల పామర ప్రజలే వీరికి ప్రమాణం. అంతమాత్రం చేత పదకవితలో పెద్ద పెద్ద పదాలు, పాండిత్య ప్రకర్ష కోసం వాడిన సంస్కృతసమాసాలు ఉండవని కాదు. సమకాలపు కవుల ఈసడింపులకు లోను కాకుండా పదకవులు కావ్యభాషాపదాలను, సంస్కృత పదాలను కూడా వాడతారు. ఇలా పరిశీలించినపుడు పదకవుల భాష ఆయాకాలంనాటి వ్యవహారభాషకు చాల దగ్గరగా ఉండిన వాడుకభాషగా కనిపిస్తుంది. ప్రాచీనకాలం నుండి కావ్యభాష వేరుగా, ప్రజలు మాట్లాడే భాష వేరుగా కనిపిస్తాయి. వాడుకభాషను కావ్యాలలో వాడిన కవులు కూడా ఉన్నారు. శ్రీనాథమహాకవి భాషను పరిశీలిస్తే నైషధాదికావ్యాల భాష ఒకరకంగా, పల్నాటివీర చరిత్ర భాష మరొక రకంగా ఉంటాయి. పల్నాటివీరచరిత్రలో శ్రీనాథుడు తన కాలం నాటి వాడుక పదాలను ఎక్కువగా వాడినాడు. కావ్యభాషగా స్థిరపడిన ఒక రకం భాషను పండితులంతా ఆదరిస్తున్న రోజులలో శ్రీనాథుడు పల్నాటి వీరచరిత్రలో కావ్యేతరభాష వాడడం గొప్ప సాహసంతో కూడిన పని. ఈ కవి కాలానికి కొంచెం ముందే సింహగిరి నరహరివచనాలు కూడా ఎక్కువ వాడుక పదాలతో రచింపబడినాయి. ఒకవైపు పండితులు ఆదరించే కావ్యభాషలో కావ్యాలు పుంఖానుపుంఖాలుగా వెలువడుతుంటే మరొకవైపు కొద్దిగానైనా వాడుక భాషా పదాలుపయోగించి రచనలు చేసేవారు కూడా కనిపిస్తారు. అయితే వీళ్ళ సంఖ్య చాల తక్కువ. ఆదరణ లేకపోయినప్పటికి ఈ పద్ధతి బలహీనంగానైనా కొనసాగింది. కథలు, వ్యాఖ్యానాలు, శాస్త్రాలు,చరిత్రలు మొదలైనవన్నీ స్వచ్ఛమైన వ్యవహారభాషలో పుడుతూ ఉండేవి. పండితులు కూడా వీటిని ఇలాగే రాసుకొని చదువుతూ ఉండేవారు.

ఏకామ్రనాథుని 'ప్రతాపచరిత్ర', విశ్వనాథనాయనివారి స్థానాపతి రచించిన 'రాయవాచకం' రెండూ క్రీ.శ.16వ శతాబ్దంలో వచ్చిన చారిత్రక వచన రచనలు. ఇవి వాడుకభాషలో రచింపబడినాయి. "ఈ చారిత్రక వచన రచనలకు నాడు జనులలో బాగా ప్రచారం ఉండి ఉండాలి. ఎందువల్ల ననగా ఏకామ్రనాథుడి 'ప్రతాపచరిత్ర'ను అతని కంటే అర్వాచీనుడైన కాసె సర్వప్ప ద్విపదకావ్యంగా మలిచాడు. అంతేగాదు, అటు తరువాత కూచిమంచి జగ్గ కవి

18వ శతాబ్దపు పూర్వార్థంలో దీనిని 'సోమదేవరాజీయ'మనే పేరుతో పద్యకావ్యంగా రూపొందించాడు. ఇదే విధంగా రాయవాచకాన్ననుసరించి 17వ శతాబ్దపు చివరి పాదంలో కుమారధూర్జటి 'కృష్ణరాయవిజయ'మనే పేరుతో దానిని పద్యకావ్యంగా మలిచాడు.[1]

వ్యాఖ్యానాల రచనలలో వాడుక భాషను వాడేవారని చూపడానికి తాళ్ళపాక పెద తిరుమలాచార్యులు 'భగవద్గీత'కు వ్రాసిన తొలి తెలుగు వచన భావానువాదాన్ని పేర్కొనవచ్చు. ఈ గ్రంథంలో పెదతిరుమలాచార్యులు గీత లోని ప్రతి శ్లోకాన్ని వ్యావహారికభాషలో అనువాదం చేశాడు.[2] 'బృహజ్జాతటీక' తొలి తెలుగు వచన గ్రంథమని, అదే తొలి తెలుగు వ్యాఖ్యానగ్రంథమని నిడదవోలు వేంకటరావు చెప్పారు.[3] ఇది 13 వ శతాబ్దికి సంబంధించిన ఒక జ్యోతిష గ్రంథానికి వ్రాయబడిన తెలుగు టీక. వీటన్నిటిని బట్టి వ్యావహారికభాషలో రచనలు జరిగేవని, అదొక పద్ధతిగా స్థిరపడిందని అర్థమవుతుంది.

ఈ రకంగా స్థిరపడిన వ్యావహారికభాషాపద్ధతిని దేశీయులెవరూ సరిగా గుర్తించలేదు. తెలుగుభాషా సాహిత్యాలమీద మక్కువ గలిగిన శ్వేత జాతీయులు దీనిని గుర్తించారు. వాఙ్మయోద్ధారకుడైన సి.పి. బ్రౌన్ మహాశయుడు అనేక తెలుగు పద్యగ్రంథాలకు వ్యావహారికభాషలో వ్యాఖ్యానాలు వ్రాయించాడు. రావిపాటి గురుమూర్తి, జూలూరి అప్పయ్య మొదలైన దేశీయపండితులు బ్రౌన్ పండితుని ప్రోత్సాహంతో ఎన్నో గ్రంథాలకు వ్యాఖ్యానకర్త లైనారు. కొన్ని కావ్యాల వ్యాఖ్యాన వ్రాతప్రతులు ఇప్పటికీ మద్రాసు 'ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీ'లో ఉన్నాయి. చిన్నయసూరిలాంటి పండితులు ఈ వ్యావహారికభాషాపద్ధతిని విస్మరించారు. చిన్నయసూరి ప్రాచీనకావ్యాలలోని గద్యాలనే వచనాలుగా భావించి సామాన్య పాఠకుడికి అర్థంకాని వచనపద్ధతిని తయారుచేసి, దానిని స్థిరపరచడానికి నీతిచంద్రికను గద్యకావ్యంగా అనువదించాడు. దీనితో అందరికీ అందుబాటులో ఉంటున్న వ్యావహారికవచనరచనా విధానం తాత్కాలికంగా ఆగిపోయింది. గిడుగు రామమూర్తి పంతులుగారు చారిత్రకంగా భాషాపద్ధతులను గుర్తించి వ్యావహారిక భాషోద్యమాన్ని చేపట్టవలసి వచ్చింది.

1. రామచంద్రరావు, సి.వి.(సం) ప్రతాపచరిత్ర, హైదరాబాదు 1984 పీఠిక పుట.18.
2. ఈ గ్రంథాన్ని శ్రీ వేంకటేశ్వరవిశ్వవిద్యాలయ ప్రాచ్యపరిశోధనాలయం ఆచార్య జి.ఎన్.రెడ్డిగారి పరిష్కరణతో 1978 లో ప్రకటించింది.
3. A Descriptive catalogue of the Telugu Manuscripts in the Saraswathi Mahal Library, Tanjore. Vol.II-1959.



సారంగపాణి కాలంనాటికి ఇంగ్లీషు పాఠశాలలు రావడం, భాషా పద్ధతులు మారడం జరిగింది. సారంగపాణి భాషా మర్మం తెలిసినవాడు. ప్రజలు మాట్లాడే భాషలోని తియ్యందనాలు రుచి చూచినవాడు. ప్రజలభాషకే పట్టం కట్టాలనుకున్నాడు. వాడుకభాషలోని మాటలను పదాల కెక్కించాడు. భాషకు తగిన భావం, భావానికి తగిన భాష ఇతని పదాలన్నిటా ప్రత్యక్షం. 'పాయము, సొంప్రాణి, చలము, సుద్ధి, తాళజాలకపోవు, చక్కట్లు, మారాముళ్ళు, మచ్చు, చీటి, ఐదువరాలు, కంచం, తెగువ, దేవర, లంజరికం, బూటకం, సందేల, మిద్దియిల్లు, సొమ్ములు, వడ్డి, పొంగలి, విటుకులాడి, వేటగొట్టు, బుద్ధిమాట, రూక, రాకడి, దుడ్డు, కజ్జాయం, ఉప్పుచట్టి, దండం (నమస్కారం), అంబలి, అతుకులగుడ్డ, దండిగ, తిరిపం, పొవ్వాకు, కాసు, దోసకారి, పంచాంగం, రవిక, కంబడి, సున్నపాకు, గుడిశ, దిండు, వేకటి, ఏబ్రాసి, పిడచ (అన్నం), ఎంగ్రకాయ ఇత్యాది పదాలన్నీ ప్రజల వ్యవహారంలో నిత్యమూ వినిపించేవే.

భాషా విషయంలో సారంగపాణిని ఉన్నతశిఖరంపై నిలిపినది జాతీయ పదాలలో అతడు వాడిన పామరభాష. గ్రామాలలో తిరనాళ్ళు జరుపుకోవడం సంతల కెళ్ళడం పామరులకు రుచించినట్లు పండితులకు రుచించదు. పామరులు వారి కలవాటైన భాషలోనే మాట్లాడుకుంటారు. పండితులు రచనకు కావ్యభాషను, వ్యవహారానికి వ్యావహారికభాషను వాడుకుంటారు. పామరులభాష మీద మరొక భాషాపద్ధతికి చెందిన ప్రభావం కనిపించదు. పామరులతో కలిసి మెలిసి ఉంటున్నప్పటికీ పండితులు పామరభాషాపదాలను తమ రచనలో వాడుకోవడం అరుదు. సారంగపాణి దీనికి అపవాదం. జాతీయపదాలుగా సారంగపాణి పేర్కొన్న 17 పదాలలో ఆనాటి పల్లె ప్రజలు మాట్లాడే భాష యథాతథంగా వాడబడింది.

పామరప్రజల భాషను ప్రత్యేకంగా గ్రంథస్థం చేసినవారు సారంగపాణి కంటె ముందు ఎవరూ కనిపించరు. ఈ 17 పదాలు చదివినపుడు మనకు వెంటనే అర్థంకావు. పామరభాషలో సహజంగా దొరిలే పదాలు, పదబంధాలు

ఈ నాటి వ్యావహారిక భాషలో కనిపించవు. పదాలచరిత్రను, ప్రజల సాంస్కృతిక జీవితాన్ని అర్థం చేసుకుంటే తప్ప సారంగపాణి వాడిన భాష అర్థం కాదు. తాను సంస్థానాలలో ఉండి కూడా ప్రజల మధ్య బతుకుతూ, వారిలో కనిపించే మార్పులన్నిటికి స్పందిస్తూ, వారి కష్ట సుఖాలలో పాలుపంచుకుంటూ వారిలో ఒకడై మెలిగి ఉంటేనే సారంగపాణికి పామరప్రజల భాషామర్మం తెలిసి ఉంటుంది. ఇలా మెలగడంవల్లనే వారి భాషలోని తీయదనం తెలిసి వారి భావాలను వారి భాషలోనే వ్యక్తం చేయాలన్న తలంపు సారంగపాణికి కలిగింది. ఈ పదకర్త ప్రయత్న ఫలితంగా వీధిభాషకు వేదిక లభించింది. ఆనాటి ప్రజల భాషాస్వరూపాన్ని దర్శించాలంటే సారంగపాణిపదాలలో కొన్నిటినైనా ఉదహరించవలసి ఉంటుంది.

**'ఇసబోనమ్మీన – యీదెంబడెల్లొచ్చె – యిస్తిగ్నమో యీస్పృడో**
**బెమ్మో లేక యిగనేసుడో సిముడో'** (145) ఈ పదంలో సారంగపాణి అనుభవంలో జరుగుతూ వుండిన ఒక ఉత్సవం వర్ణింపబడింది. 'ఇసబోనమ్మీన' అంటే వృషభవాహనం మీద అని అర్థం. 'బెమ్మో' అనే మాటకు బ్రహ్మ అని 'యిగనేసుడో' అనే మాటకు విఘ్నేశ్వరుడని అర్థం చేసుకోవాలి.

**"దీపాల్‌రెయి నా పక్కిలె మునుకొని – కాపెంగిటి దేయిరింట్లోసాస్మీన"**
అన్నదానికి 'దీపావళి రాత్రి కాపు వేంకటదేవర ఇంట్లో చాపమీద నా పక్కలో పడుకొని' అని తాత్పర్యం చెప్పుకోవాలి.

**ఊరూరు యిగిణీల్ను – వూపుతా వాస్తా చన్నా**
**గారనూరే  మండపాన – గంటవాపి దింపగానే**
**తేరుమూకే పరచైన – దేవేంద్ర యిబమాలె**
**గారడాలంటుండావొ – కళిగ్ణె వైకుంటమేనె' (144)**

(సన్నాయి వాయిస్తుండగా ఊరూరి విగ్రహాలను ఊపుకుంటూ గారనోరి మండపం దగ్గరికి వచ్చారు. అక్కడ గంట కొట్టగానే విగ్రహాలను దించారు. ఆ జనమంతా తేరు లాగడానికి వచ్చారేమో చూడడానికి దేవేంద్ర వైభవంగా ఉంది. నమ్మితావో లేదో గాని ఇది కలియుగ వైకుంఠమే) 'గారనూరే మండపం'అంటే గచ్చు (గార) చేసిన మండపమేమో. ధ్వనులలో మహా ప్రాణాలు, అక్షరాలలో సంయుక్తాలు



ఈ భాషలో అతి తక్కువగా ఉంటాయి. కొన్ని పదాలలో క్రావడి ఉండవలసిన చోట వారి ఉచ్చారణ కనుకూలంగా తొలగించి పలుకుతారు. ఈ ప్రజలు విద్యాగంధం లేనివారు కాబట్టి పదాలను వారి నోటి ఉచ్చారణకు అనుకూలంగా మార్చుకొని ఉచ్చరిస్తారు. మీద–మీనగాను, విగ్రహాలు – యిగిణీలు గాను, బ్రహ్మ– బెమ్మగాను, వాయిస్తూ – వాస్తాగాను వీరి ఉచ్ఛారణలో మారి పోయాయి.

సారంగపాణికాలం నాటికి ఈ ప్రజలభాష వ్యావహారికభాషగా ప్రచారంలో ఉండి ఉంటుంది. ఇప్పుడు మనకది సరిగా అర్థం కాదు. ఎందుకంటే మనం మాట్లాడే వ్యావహారికభాషకు దీనికి చాల తేడా ఉంది. సారంగపాణి వాడిన భాషను మనం వ్యావహారికభాష అనుకున్నా నిజానికి అతడు గ్రంథస్థం చేసిన భాష గ్రామ్యభాష. భాషా విధానం ఒకొకజాతికి ఒకొకరకంగా ఉంటుంది. గ్రామంలో వృత్తులవాళ్ళు మాట్లాడే భాషకు ఉన్నతతరగతికి చెందిన వాళ్లు మాట్లాడే భాషకు ఎంతో తేడా ఉంటుంది. విద్యాగంధంలేని వడ్రంగి గాని, కంసాలి గాని పండితుడు మాట్లాడినట్లు మాట్లాడితే ఔచిత్యవంతంగా ఉండదు. వాళ్ళకు సహజమైన రీతిలో వాళ్ళకు తెలిసిన పదాల నుపయోగించి మాట్లాడితే ముచ్చటగా ఉంటుంది. దీనిని అందరూ ఒప్పుకోవాలి. అందువల్లనే 'గ్రామ్యంబు తత్తజాతి వర్ణంబునం బ్రయోగార్హంబగు' నని సిద్ధాంతం చేయబడింది. ప్రజలభాషకు భవిష్యత్తులో మహర్దశ కలుగుతుందని సారంగపాణి ఆనాడే ఊహించాడు. అందుకే ఆ భాషకు పట్టాభిషేకం చేశాడు. ఈ 17 పదాలలో కనిపించే వ్యక్తులంతా నిరక్షరాస్యులైన గ్రామీణులు. వారి భావాలెంత మధురంగా ఉంటాయో వారి భాష కూడా అంత మధురంగా ఉంటుంది. సారంగపాణి పాత్రకు తగినభాషను వాడడాని కిదే కారణం.

పాత్రోచిత భాష సారంగపాణితోనే మొదలైనదని చెప్పలేము. దీనికొక చరిత్ర ఉంది. ప్రాచీనకాలం నుండి భారతదేశంలో ప్రచారంలో ఉండిన భాషా పద్ధతులను పరిశీలిస్తే ఆసక్తికరమైన విషయాలు తెలుస్తాయి. దేశంలో ప్రాంతీయ భాషలు ఏర్పడడానికి ముందు ప్రాకృతం ప్రజలభాషగాను, సంస్కృతం పండితుల భాషగాను ఉండేవి. ఒక రకంగా ప్రాకృతం పామరులభాష గాను, సంస్కృతం పండితులభాషగాను చెలామణి అయినట్లు చెప్పవచ్చు. సంస్కృతనాటకాలలో ఏ పాత్రకు సహజమైనభాషను ఆ పాత్రచేత పలికించడం కనిపిస్తుంది. నాటకాలలో

ఉత్తమపాత్రలకు సంస్కృతం, నీచపాత్రలకు ప్రాకృతం వాడబడినాయి. ఈ పాత్రోచితభాష లక్షణగ్రంథాలలో కూడా ప్రస్తావించబడింది. ఉత్తమపాత్రలకు సలక్షణమైన సంస్కృతభాష, మధ్యమపాత్రలకు యథోచితమైన లాక్షణిక భాష, నీచపాత్రలకు లాక్షణికము గాని భాష వాడవలెననే నియమం లక్షణ గ్రంథాలలో ఉంది.

దేశభాష లేర్పడి ఆ భాషలకు సాహిత్యస్థితి సిద్ధించిన తరువాత కవులు పాత్రోచిత భాషాసిద్ధాంతాన్ని దృష్టిలో పెట్టుకొని కొంత వరకైనా పాత్రల మధ్య భాషాభేధం చూపుతూ వచ్చారు. తెలుగులో ఈ పద్ధతి కొంతవరకు కొనసాగి అవసాన స్థితికి వచ్చిన సమయంలో సారంగపాణి పట్టుబట్టి ఈ పామరభాషకు పెద్దపీట వేశాడు. ఆంధ్రదేశంలో తరువాత జరిగిన భాషాపరిణామాన్ని బట్టి వ్యావహారిక భాషాఉద్యమానికి సారంగపాణే ఆద్యుడని చెప్పవలసి ఉంది. ఈ ఉద్యమం ఇలాగే కొనసాగి కొక్కండవారిలో మొలకెత్తి , వీరేశలింగం గారిలో కొంత తలయెత్తి, వేంకటరాయశాస్త్రిలో అటూ ఇటూ ఊగులాడి, అప్పారావు గారిలో వేళ్ళుదన్ని రామమూర్తి పంతులుగారిలో పల్లవించి పుష్పించి ఫలించింది.

## ప్రతులు - పరిష్కరణ

సారంగపాణిపదాలు ఇప్పటికి ఏడుసార్లు ప్రకటింపబడినట్టు కొందరి వ్రాతలవలన తెలుస్తున్నది.

1. మొదటిసారిగా కార్వేటినగరం భారతీలీలాసదన ముద్రాక్షర శాలలో19 వ శ. పూర్వార్ధంలో ముద్రింపబడింది. సారంగపాణి 19వ శతాబ్దానికి చెందినవాడైతే ఈ ప్రతి ఇతడు బ్రతికి ఉండగానే వచ్చినట్లు చెప్పవచ్చు. ఇది ఎంతో విలువైన ప్రతి. శృంగారపదాలు, దేశీయపదాలు, జాతీయపదాలు, కీర్తనలు అనే విభాగం ఈ ప్రతిలోనే ఉండి ఉంటుంది. ఈ విభాగాన్నే తరువాతి ప్రచురణకర్తలు గ్రహించారు. ఈ ప్రతి ఇప్పుడు దొరకదు. భారతీలీలాసదన ముద్రాక్షరశాల కార్వేటినగరసంస్థానాధీశులు స్థాపించినదే. ఈ ముద్రాక్షర శాల ఉండినదని చెప్పబడుతూ వున్న స్థలం ఇప్పుడు పంటపొలంగా మారిపోయింది.

2.పందొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్ధంలో రెండవమారు ప్రకటింపబడింది. 'శ్రీకార్వేటినగరపురవరాధిష్ఠిత శ్రీ మద్వేణుగోపాల నామాంకితముగా సంగీత సాహిత్య దేశీయ జాతీయ కవిత్వ రచనా చమత్కారులగు సారంగపాణి యను



కవివర్యునిచే రచింపబడిన సారంగపాణి పదములు' అని ఈ ప్రతి లోపలి పుటలో ఉంది. దీని ముద్రణ సంవత్సరం 1867. ఇదే పుటలో 'ఇది శ్రీమన్మహామండలేశ్వర కఠారీ సాళ్వ మాకరాజ హుండే రాజకుమార వేంకట పెరుమాళ్ళరాజు బహదర్ దేవమహారాజులుంగారియాజ్ఞ ప్రకారం నీ కృతికర్తకు దౌహిత్రులగు గరిమెళ్ళ వేంకటసుబ్బయ్యగారిచే చెన్నపురి నేలటూరి సుబ్రహ్మణ్యంగారి విద్యావిలాస ముద్రాక్షరశాల యందు ముద్రింపబడియె' అని కూడా ఉంది. శిథిలం కావడానికి సిద్ధంగా ఉన్న ఈ ప్రతిలో 201 పదాలున్నాయి. అకారాది క్రమంలో పదాల పట్టిక, కీర్తన సంఖ్య, పుట సంఖ్యలతో ఇవ్వబడింది. అక్కడక్కడా అచ్చుతప్పులున్నాయి.

3.1880 లో ప్రకటింపబడిన ఈ ప్రతిలో కేవలం 111 పదాలే ఉన్నాయి. 'ఇవి మహారాజరాజశ్రీ కొల్లా - వేంకటకన్నయ్యసెట్టిగారి అనుమతిచే పోకల రామానుజులునాయుడు వలన పండితపరిష్కృతము గావింపబడి పిడుగు సుబ్బరామయ్యగారిచే స్వకీయ శారదా నిలయ ముద్రాక్షరశాలయందు ముద్రింపబడి ప్రచురింపబడియె' అని లోపలి పుటలో ఉంది. ఈ ప్రతి మద్రాసులో 1880 డిసెంబరు నెలలో ప్రకటింపబడింది. ఈ ప్రతిలో సారంగపాణి పదాలే గాక సెట్టివణ్యము శ్రీనివాసయ్యంగారివి 27 పదాలు, అయ్యపట్టణం సీనయ్యగారివి 20 పదాలు కూడా ఉన్నాయి. అందుకే ఈ ప్రతికి 'పదరత్నాకరము - మొదటి భాగము' అని పేరుంచబడింది. పరిష్కరించిన రామానుజులు నాయుడు గ్రంథం మొదట రెండు పుటలలో ఒక ప్రకటన చేశాడు. ఆ ప్రకటనలోని ముఖ్యభాగమిది.

"ఈ కృతు లనభిజ్ఞ జనముఖంబులంబడి వర్ణపదచ్యుతివ్యత్యయాది బహువికారంబులం బొంది యర్థావబోధప్రదంబులుగాక రసావబోధకంబులు గాక యున్నయవి. కాబట్టి యీ కృతుల దిద్ది అచ్చువేయించుట మహోపకారముగ నుండునని చిరకాలముగ నే సమార్జించిన క్షేత్రియుడు, తాళ్ళపాకము చిన్నయ్య వారు, బుక్కపట్టణమువారు, అయ్యపట్టణము సీనయ్య గారు, సెట్టివణ్యము శ్రీనివాసయ్యంగారు. సారంగపాణి, పరిమళరంగడు, వీరభద్రయ్య, శివరామాపురమువారు, వేణంగివారు, గట్టి మొదలారి కూతురు, వృద్ధ కాశివారు, శోభనాద్రివారు, బొవాల్ల వరమురు, తిరుమల పురివారు, పల్లి కొండవారు,

మురారివారు, కచ్చియు వరంగ తుళజ మహారాజ నామాంకిత ప్రణీతులు మొదలగు నూరుగురు మహాకవికృతిజాలంబును పండితపరిష్కృతంబు గావించి, కొంత కొంతగా ముద్రింప సమకట్టి, తొలుత సారంగపాణి పదములు 111 అచ్చు వేయించి, మరి కొందరు కవుల కృతులను జేర్పనెంచి యుంటిని. ఉపపత్తి లేమింజేసి నా పూనిక యొనగూరక యింతకాలంబు విరమించుటయ్యెను.... ప్రకృతమున ....వేంకట కన్నయ్య శ్రేష్ఠిగారభిమానించి వీనినన్నిటిని ముద్రింప సెలవిచ్చుటంజేసి, జీర్ణించియుండు గ్రంథమునకు వృద్ధిదశ కలిగెనను కుతూహలముచే ముద్రింప నుత్సహించి వీనిం బరిశీలించి, గ్రంథమునకు పదరత్నాకరంబను పేరిడి, అందు మొదటి భాగమగు నీ పుస్తకముతోడ సెట్టివణ్యము శ్రీనివాసయ్యంగారు అయ్యపట్టణము శీనయ్యవారి పదములను జేర్చి ప్రచురించినాడను. వెంబడిగా శీఘ్రకాలముననే పై జెప్పిన కవులచే రచియింపబడిన కృతిజాలంబు ముద్రింపబడును.” తరువాత కాలంలో పదరత్నాకరం రెండు మూడు భాగాలు ప్రచురించబడినాయేమో తెలియదు. అవి నేడు ఎక్కడా కనబడవు.

ఈ ప్రకటన ప్రకారం అంతకుముందే ప్రకటింపబడిన సారంగపాణి పదాలను ఇతడుచూచి అందలి ముఖ్యమైన 111 పదాలను ఎంపిక చేసుకొని, శ్రీనివాసయ్య, శీనయ్యల పదాలు కొన్ని చేర్చి, వాటిని పరిష్కరించి ఒక గ్రంథంగా ముద్రించినట్లు తెలుస్తుంది. అయితే 1867 నాటి సారంగపాణిపదాలప్రతిలో లేని తొమ్మిది పదాలు దీనిలో ఎక్కువగా ఉన్నాయి. రెండు ప్రతులలోను ఉన్న పదాలను తులనాత్మకంగా పరిశీలిస్తే అర్థబోధను స్పష్టం చేసే మంచి పాఠాలు ఇందులో దొరుకుతాయి. పామరభాషలో ఉన్న జాతీయపదాలను ఈ ప్రతిలోని పదాలసహాయంతోనే నేను అర్థం చేసుకోగలిగాను. దీనినిబట్టి ఈ 111 పదాలు కొత్తగా సేకరించినవేమో ననిపిస్తుంది. ఇదే నిజమైతే రామానుజులు నాయుడు 1867 నాటి ప్రతిని చూడలేదేమో ననుకోవలసి వస్తుంది.

4. ఉప్పలరామానుజాచార్యులవారిచే పరిష్కరింపబడి యద్దనపూడి సంజీవయ్యగారిచే పమ్మి త్యాగరాయశెట్టిగారి (మద్రాసు) రాజరాజేశ్వరీనికేతన ముద్రాక్షరశాల యందు 1899 లో ముద్రింపబడింది. ఈ ప్రతి లభ్యం.



5. ఈ 1899 నాటి ప్రతినే 1956లో ‘వెస్టువార్డుకంపెనీ’ మద్రాసు వారు ప్రచురించినట్లు బాలాంత్రపు రజనీకాంతరావు రాశారు. ఇది అలభ్యం.

6. ప్రాచీనగ్రంథావళి సీరిస్‌లో 10వ గ్రంథంగా సరస్వతీపవర్‌ప్రెస్ రాజమహేంద్రరం వారు 1963లో 35 పుటల పీఠికతో ప్రచురించారు. దీని సంపాదకుడు పురిపండాఅప్పలస్వామి. పీఠిక వ్రాసినవారు మండపాక పారతీశ్వర శాస్త్రి. ఈ ప్రతి 1867 నాటి ప్రతి ననుసరించి తయారుచేయబడింది అచ్చుతప్పు లధికంగా ఉన్నాయి. కార్వేటినగరంలో మొదటిసారిగా ముద్రింపబడిన ప్రతిని గాని, 1880 నాటి ప్రతిని గాని, మరే ఇతర ప్రతిని గాని ఈ సంపాదకుడు చూచినట్లు లేదు. అందువల్ల తులనాత్మకంగా పరిశీలించి పాఠనిర్ణయం చేసే అవకాశం కలుగలేదు.

7. సరస్వతి నృసింహాచార్యులచే పరిష్కరింపబడి భువనగిరి రంగయ్యశెట్టి గారి జ్ఞానసూర్యోదయ ముద్రాక్షరశాల యందు (మద్రాసు)1878 లో ముద్రింపబడినట్లు రాళ్లపల్లిఅనంతకృష్ణశర్మగారు చెప్పారు. ఈ ప్రతిని వారెక్కడ చూశారో తెలియదు. ఇప్పుడిది అలభ్యం.

ఈ ప్రతులలో నాకు 1867 నాటిది, 1880 నాటిది, 1963 నాటిది దొరికాయి. ఈ మూడు ప్రతులలో 1963 నాటి ప్రతిలో మాత్రం కవికి, కవితకు సంబంధించిన 35 పుటల పీఠిక ఉంది. ఈ మూడు ప్రతులను ఆధారంగా పెట్టుకొని నేను ఈ ప్రతి తయారు చేశాను. వీటిలో 1867 నాటి, 1963 నాటి ప్రతులు కొద్ది తేడాలతో ఒకే రకంగా ఉన్నాయి. 1880 నాటి ప్రతిలో ఈరెండు ప్రతులలో లేని మంచి పాఠాలు ఉన్నాయి. అందువల్ల నేను 1963 నాటి ప్రతిని మూలప్రతిగా గ్రహించి మిగిలిన రెండు ప్రతులను దీనితో పోల్చి పాఠ నిర్ణయం చేసే ప్రయత్నం చేశాను. 1867 నాటి ప్రతికి A అని, 1880 నాటి ప్రతికి B అని సంకేతాలు పెట్టుకొన్నాను. పాఠాంతరాలు గుర్తించేటప్పుడు 1867 ప్రతి నుండి పాఠాంతరం తీసుకొని పదం కింద గుర్తిస్తే దాని ఎదురుగా కుండలీకరణంలో A ని, అలాగే 1880 ప్రతినుండి పాఠాంతరం తీసుకొని గుర్తిస్తే దాని ఎదురుగా B ని చూపించాను. రెండు ప్రతులలోను సమానంగా ఉన్న పాఠాంతరం దొరికినపుడు AB ని చూపించాను.

సారంగపాణిపదాలలో జానపదభావాల పాలు ఎక్కువ. ఒక పదం తీసుకొని పరిశీలించినపుడు ఒకే సందర్భంలో మూడు ప్రతుల్లోను మూడు రకాల పాఠాలు ఉంటాయి. వీటిలో కవిహృదయానికి దగ్గరగా ఉన్న పాఠాన్ని నిర్ణయించవచ్చు. అయితే ఇందులో ఒక సమస్య ఉంది. మూడు పాఠాలు మూడు వేర్వేరు అర్థాలనిస్తాయి. అపార్థాల నివ్వవు. ఈ మూడర్థాలు కూడా ఆ సందర్భానికి బాగా అతుకుతాయి. పైగా జానపదులభావాలకు వ్యతిరిక్తంగా ఉండవు. పద్య కావ్యాలలో వలె పాఠాంతరాలు అపార్థాన్ని కలిగించే అవకాశం ఇక్కడ లేదు. అందువల్ల ఏ పాఠం గ్రహించినా సరిపోతుందనిపిస్తుంది. ఒక ఉదాహరణంతో ఈ విషయం బాగా అర్థమవుతుంది.

**'ఇల్లలికితే పండుగాయెనా నీ - విపుడే గెలిచినట్లాయెనా**
**తెల్లవారితే గాని చెల్లదు పొమ్మని - మల్లాడే కొద్దిటుల బెల్లిమాటలాడి'**

*(125)*

విటరాయుడైన వేణుగోపాలుడు విటియైన ఆయన ప్రియురాలితో పలికిన 'పంతపు' మాటలివి. ఆమె బిగుసుకొని కూర్చుంటే ఆయన తెల్లవారిన దాకా పోనని మొండిపట్టు పట్టడం ఈ చరణంలో కనిపిస్తుంది. 'తెల్లవారితే' అనే దానికి 'తెల్లవారికేగాని' అనే పాఠాంతరం ఉంది. ఆ కాలపు వేశ్యలు అప్పటికే ఈ ప్రాంతంలో స్థిరపడిన తెల్లదొరలతో సంబంధం పెట్టుకొని ఉండి ఉంటారు. ఇతర విటులు వచ్చినపుడు 'మీతో నాకు పొత్తు కుదరదు, తెల్లవారితోనే (ఆంగ్లేయులతోనే) నాకు సంబంధం' అని ఆ విటుకులాడి విటులను బెదరించి తరిమి ఉంటుంది. సాంఘికంగా ఆనాటి మార్పును తెలియజేసే విషయమిది. అందువల్ల 'తెల్లవారికే గాని' అనే పాఠం కూడా ఇక్కడ సరిపోతుంది. ఇలాంటి పాఠాంతరాలు చాలా ఉన్నాయి. ఇటువంటి పాఠాంతరాలన్నిటిని పదాల కింద చూపడం జరిగింది. సాధ్యమైనంతవరకు కవిహృదయం ప్రతిబింబించే పాఠాంతరాలతో ఈ ప్రతి సిద్ధం చేయబడింది.

* * *

# సారంగపాణిపదములు

## ప్రథమభాగం - శృంగారం

### 1. కళ్యాణి - ఆది

#### రాగమాలిక పదం

ఈ సీమల హరిణాక్షుల వలె గా - దీ మోహనాంగి ॥పల్లవి॥
కాశీపురి నుండి వచ్చిన దీ - కల్యాణి వేణుగోపాల ॥అనుపల్లవి॥

కన్నడ సేయక నీదరబారు - గాచియున్నది నాట నుంచి
అన్నెమెరుగ[1] నని యా[2] - హరిపాదము లాన బెట్టెరా
వన్నెలాడి బహుశా నాతో దన - వద్ద కీ క్షణమె తోటి తెమ్మనె
నెన్న నొకరి తరము గాదు సామజ - యాన రీవి గుజ్జరి పదుచనదగు
॥ఈసీమ॥

పంచమ శ్రుతిని తంబుర మీటి - సంచుగా బాడి సారంగ
పంచి పెట్టినటుల వినికి చేసే - ప్రౌఢ నాయకిరా
వంచన యింత లేకను పలుమారు - వనిత గౌరీ పూజ[3] సేయుచున్నది
పంచసాయకుని సేనల రాకకు- భయము జెంద నదెవచ్చె వరాళి ॥ఈసీమ॥

శ్రీమీర చెలువొందుచున్నది - రామామణి రంగుమీర
కామించి వచ్చె ననుచు నీ విం-కా బిరుదులీరా
ఆ మానిని కెంతో నీపై- ఆ [4]సావేరే పని తోచదు
నా మాట విని యేలుకోర అభి-నయము నాట్య మతివ సేత లలితము
॥ఈసీమ॥

---

1. దని (A) 2. హరిసాక్షిగా (B) 3. సేయువేళ (B)
4. ఆస వేరే భ్రమ దోచదురా (B).

# 2. కళ్యాణి - ఆది

## స్వర స్థాన పదం

దాని పాయము పదారేండ్లునీ – [1]దాని నేలుకోరా ॥పల్లవి॥
సానిదాపనికి [2]హొంతకారి – సామి వేణుగోపాల రాయ ॥అనుపల్లవి॥

సారి రాగా మాపటివేళ – దారిని గాంచి
నీ రూప మనిశము మది దలచుచు – నిదుర గానదురా
నీ రాకే కోరి సన్నిధి – నీరీతిగాను గాంచినదిరా
దారిగా మాటాడవు నీ దయ – దాని యేచుట నీతిగాదు అల ॥దాని॥

మగధ పాంచాల దేశముల గల – మగువలైన మా గరితెకు సరిగారు
మగని పేరడుగ మాధవుండును – మదిరాక్షులతోను
మగరాల పతకము పదివేలది – మచ్చకంటి గురుతిచ్చెనుకోరా
సగము రేయిదాకా పదము బాడి– సారె మెప్పించు నిలువరమ్ముగ ॥దాని॥

మాటి మాటికి సరిగా మారుడు – మర్మముల గాంచి సాయికమ్ముల
సూటి దప్పక నిర్దయమతిని – ధాటినేయగాను
పాటలాధరి సగమాయ గద – పాదములకు దండము బెట్టెరా
సాటిలేని సమరతుల గూడరా – సామి వేణుగోపాలరాయ ॥దాని॥

1. నీ దానిగా నేలుకోరా (A) 2. హొంతకారి రాజ (B)



# 3. సావేరి - చాపు

## కొమ్మల పదం

తరుణి కేమని దారబోసి వచ్చెనె మద – దంతికొమ్మా – ఎంతో
మురిపెము లేకనే యిచ్చున మరువంపు – మొలక కొమ్మా

భామ కిమ్మని పంపె భ్రమరముచే పూల – బంతికొమ్మా – అల్ల
సామజయానకు సరిలేదన్నది వక్క – సారే కొమ్మా

కోమలాంగికి [1] చూడ విడిచె పెట్టెలు పగల – గొట్టి కొమ్మా – నేనా
వామాక్షివలె [2]నేర్పరిన విభుని గెలు – వంగ కొమ్మా

కనులజూచే నంటె దాటిరాడె దాని – కడప కొమ్మా – ఆ
కనకాంగి జూచి నేర్చుకొన్నాడింత – కలివి కొమ్మా

నూతనముగ వచ్చిన యింతివలె కా – నుగ కొమ్మా – పరమ
ఘాతకులైతె ఏలాగున [3]చిత్తము – గరుగుకొమ్మా

రమణి యుండెడి యూరు దూరములే మగ–రాల కొమ్మా–నాపై
మమత మరచి యందే యున్నాడు గదవె నీ – మంగ కొమ్మా

ఎనసి వేణుగోపాలుని కిది మరి – యాద కొమ్మా – సుంత
కనికరమని లేదె వేదనచే మేను – కందికొమ్మా

1. చూర విడిచె (A). 2. నేర్పరినిగా (B). 3. విత్తము (C).

# 4. సావేరి - త్రిపుట

## మందుల పదం[1]

ఆ[2]వాలుగంటి మాట - లతని కతి మధురమాయె
నన్నింత మోడి సేతురా ॥పల్లవి॥

రావే యూరక పాద - రసమువలె తిరిగేవు
భావము దెలిసి యి - ప్పటి కోర్చుటే బాగు ॥అనుపల్లవి॥

బాలరో పతి మనసు - పాషాణమని దెలిసి[3]
ఏల కులుకులాడీని - ఎంత లేదంటివి
చాలునే శుద్ధమడ్డి - సాంబ్రాణివే నీవు
ఆ లోలాక్షి నెదిరించి - అతివా సాధింతువా ॥ఆవాలు॥

అక్కరకా రమామణిని - అనుసరించితో బిరుదు
తక్కువా యూరకే - చక్కట్లభినయించేవు
కక్కసమైతే యొక్కరి క - క్కరకంటు గారాదే
ఇక్కు వెరుగనంటే నగరా - ఇందు పూబోణులు ॥ఆవాలు॥

ఎలనాగ కేసరా[4] - లిచ్చితే నీకేమి
చలపట్టి యిపుడు ర - చ్చలకా కాచుకున్నావు
పలుమారు వేణుగో - పాలా వేరు సేయక
కలిసియుందా మనుచు - బిలువవే రుజువుగా ॥ఆవాలు॥

1. ఫల సరుకుల పదము (B).
2. ఆవాలు గంటి మాటలు తనకు నతి మధురమయితేనె మోడి సేతురా (B).
3. దూరి (B).
4. కేసర - మిచ్చితే (B).



# 5. పంతువరాళి - ఝంపె

## మానుల పదం

పడతి నేస్తము వేణుగో - పాల మాను ॥పల్లవి॥

తడబడక నీ వికను - దాని చింత మాను ॥అనుపల్లవి॥

పంతమున అటుదిక్కు - పదినాళ్ళు పోక మాను
యింతి కిచ్చేవు[1] సుమీ - ఈతమాను
సుంత మనసు గట్టిచేసి - సుదతి కెమ్మోవి మాను
చెంతదీయ కది మహా - జగడగొండి మాను ॥పడతి॥

సతతము దీనితో నీకు - చాలాయ వేగిమాను
మతి యింత లేదు శుద్ధ - మడ్డిమాను
[2]హితవుగా నా వద్ది - కీ సుద్ది తేకుమాను
తతిగా దిపుడు నీవా - సతిని బిల్వమాను ॥పడతి॥

చెలిని గూడినది మొదలు - చేతికాసు వొడిశ మాను
అలివేణి నిన్ను[3] నేను - లడగు మాను
నలితిండి బెడితివా - నాకు సింగి రేగు మాను
పొలతి కొసగకు చేతి - పూలగుత్తి మాను ॥పడతి॥

1. ఇంతి కిచ్చెదవు (B).
2. ఇతవు (హితవు) (B).
3. నెమ లడుగుమాను (A).

# 6. పంతువరాళి - ఆది

## ఊళ్ళ పదం

కడప దాటి రానీయకే – అలవాని మాయ –
గంటి వాకిలి దీయకే ॥పల్లవి॥

పడతిరో ఇక్కేరి – పడుచుల జేరి నన్ను
విడనాడి పొమ్మనిన – వేణుగోపాలుని ॥అనుపల్లవి॥

మగువరో పుణ్యానికే – [1]మనుచు దరిశించెనే
మగరాల కమ్మలా – మదిరాక్షికీ
వగకాని కెట్లా మధుర – వాణి నెళవాయ మునుపె
అగడై తిరువీధిలో అతని పేరూరడిగేవు ॥కడప॥

ఇంతగ నారుదూరై – ఏమి యొడిగట్టుకొంటి
అంతరంగ మిద్దరికి – అయి రాలేదే
పంతగించి నా పై లేని – పళికొండగ గావించి
రంతులు జేసి యుసు – రనిపించిం దెరుగవేమె ॥కడప॥

కోరియుంటినే గోల – కొండగ యెంతో నమ్మి
ఈరేడు జగము లెరుగ – నిదివరకు
కూరిమితో నన్ను చిత్ర – కూటమున కూడిపాడి
పేరుజెప్పి నా ముందర ఆ – పెనుకొండను (గ)భూషించెను ॥కడప॥

1. మనసు



# 7. గౌళి పంతు - జంపె

## ఔషధముల పదం

వరకన్యా తిలక మీ – వనిత పేరు దీని ॥పల్లవి॥

పరికించ వేణుగో– పాల నాసామి ॥అనుపల్లవి॥

పొలతి నెమ్మోము సం – పూర్ణ చంద్రోదయము
అలకాళి రుచి వినో – దాంజనంబు ॥వరకన్యా॥

దాని మృదు మధురోక్తి – ద్రాక్షాది రస మెంచ
మానవతి చూపు మ – న్మథబాణసమము ॥వరకన్యా॥

చెలిమి దాని(న) గుణంబు – చింతామణి స్ఫూర్తి
అలరించు పాట శ్రుతి – కానంద రసము ॥వరకన్యా॥

సరసాంగి పొక్కిలి వ – సంత కుసుమాకరము
అరయగా చనులు బి – ల్వాది నిరసించు ॥వరకన్యా॥

తరుణి సర్వాంగ సుం – దర రసము రతినేలు
కరుణరాజ మృగాంక – కలయు మిక రతిని ॥వరకన్యా॥

## 8. గౌళిపంతు- ఆది

### ఆభరణముల పదం

కంకణము గట్టినాదు - గదవే నామీద - సుంత ॥పల్లవి॥

కొంకు కొసరు లేక వేణు - గోపాలు డీవేళ నాపై ॥అనుపల్లవి॥

కమ్మలు దానికి వ్రాయ - కారణమే మన్నందుకు
సమ్మతి గాకుంటె పోనీ - పొమ్మనె నిరాకరించి ॥కంకణము॥

[1]పట్టెదా వక్కనాటికి - పచ్చిపసు పాబోటికంటె
గట్టిగా మెడబట్టి వాకిట - గంటీలు వెళ్ళిపొమ్మని ॥కంకణము॥

కుంటెనలు నడిచేవారు రా - కూడదన్నందుకే నాపై
కంటి సరివారిలో నన్ను - కానిది కాదనిపించి ॥కంకణము॥

[2]ముక్కారాటం పందేది ఆ - ముదితకు నెలవైన వూరు
పక్కాపడెదు[3] కనదీచేను - పల్లేరు పూలంటిననిి ॥కంకణము॥

సూర్యచంద్రులు మెచ్చగ - సురత కేళి గూడి నన్ను
కార్యకత్తె యనుచు దాని - కట్లా దండాలు బెట్టుచు ॥కంకణము॥

1. పట్టెడా (A). 2. ముక్కారాట (A). 3. కనదీచేను (A).



## 9. గౌళి పంతు - ఆది

ఏమిటికే నీపే - రేమని యడిగితివి ॥పల్లవి॥

కోమలి నను వేణు - గోపాలుడని దెలిసి ॥అనుపల్లవి॥

పదతీ నీ మోము ము - ద్దిడుకొన్నప్పటి నుంచి
పద్మాక్షుడని నను - బలుకుదురే
జడియక నీదు కీల్ - జడ యల్లినదే మొదలు
తొడరి శేషశయ - నుడనుచు బిలుతురే ॥ఏమిటికే॥

అలివేణి నీ మోవి - యానిన నెపమున
తలకొని మధుసూ - దను దందురె
బలిమి నీ గుబ్బలు - బట్టి జూచుటజేసి
తలిరుబోణి మందర - ధరుడని తలతురే ॥ఏమిటికే॥

మరుకేళి నినుగూడి - మరిగినదే గురిజేసి
మదన జనకుడని ప్రే - మను గొలుతురే
పరిమళవతి నీమై - పసుపు దుప్పటైనది
అరసి పీతాంబరధరు - దను కొందురే ॥ఏమిటికే॥

## 10. భైరవి - ఆది

కందువ లెంచి ఈడకురా - [1]కుంద వున్నాడే - ఒ ॥పల్లవి॥

క్కందుకని [2]వగతునా - యిక గందువు లేవే ॥అనుపల్లవి॥

మందయాన నా పేరంటే - మందాయెన తనకు - సం
మంద మేమన్నాడట - మంథరధరుడు ॥కందువ॥

ఆనాతి నెడబాయ నని - యాసబెట్టిన సుద్ది
ఆనతీయ లేదా మనతో - నానాడా మగువ ॥కందువ॥

మానినీ వాడు నా సొ - మ్మని యుంటినే కనికర
మూని లేదా కనకాంగే సత - మని యున్నాడే ॥కందువ॥

పాలు మాలిన వేణుగో - పాలుడు నను గూడితేనె
పాలు బెట్టి అదియేమో కో - పాలు చేసినె ॥కందువ॥

1. కందు పున్నాడే (A). 2. వగచు (B).



## 11. భైరవి - ఆది

రారా కొట్లాడితేనే - రారా ఔలేరా ॥పల్లవి॥

వేరా మీ యాపె కివుడు న - వ్వేరా వేణుగోపాల ॥అనుపల్లవి॥

కద్దా ఇట్లాదాయము - కద్దాయిక మోములు చూడ
వద్దా రావణమాయలు నీ వద్దా
దుద్దు బెట్టి వచ్చేనని కమ్మ - దుద్దు వ్రాసి దానికి బంపిన నుడి
ప్రొద్దున విని సంతోషమాయె సరి - ప్రొద్దుకాడ నెనరైన వినేరు ॥రారా॥

రాదా దయ నాపేరే కా - రాదా కనరెందుకురా - నా
మీదా యీ సొగసెవ్వరి కికమీదా
రాదుగా నెనరు యే మాటను కో - రాదు (గా) యింత నిరసించుట మంచిది
కాదు వారు వీరనుకొన్న దిచట - గాదు నేడు [1]మంచిది నడు బిరాన ॥రారా॥

ఈడా మనసురాదె నీకది -ఈడా పిలువనంపె నదిగో
జోడా ముందరగా కమ్మలజోడా
కూడరాదో మీ రిద్దరు వెన్నెల - [2]కూడనిచ్చి యొకరి నొకరు మెచ్చుచు
దాడిపదము సంచున బాడుచు ము - ద్దాడి నాటి వలె నన్నేలుదు విటు ॥రారా॥

1. మంచి దినము బిరాన (A). 2. కూడనిల్చి (A).

## 12. శ్రీ - త్రిపుట

పిలుచుక రావమ్మ - సామి నీ వేళ //పల్లవి//

నెలతా ఈ పందు వె -న్నెల తాళజాల నిక //అనుపల్లవి//

మానవతి [1] చెలులగా నీకు స - మానమెవ్వరు వట్టి యీ అను
మాన మెందుకు చిన్న నాటభి - మాన మిపుడైన మదినెంచి //పిలుచుక//

పాలుమాలుచు కమ్మవిల్తుని - పాలు సేయక మేని సొమ్మొక
పాలు [2]నీ కిచ్చేను గూట దీ - పాలు బెట్టే వేళకైన //పిలుచుక//

మారు మాటాడ వలదని ము-మ్మారు మ్రొక్కితి రతుల నన్ను - సు
మారుగా పెనగిన మహా సుకు - మారుండౌ వేణుగోపాలుని //పిలుచుక//

1. చెలులలో (A). 2. నీకిచ్చెదను (B).



## 13. మధ్యమావతి - ఆది

ఏ రమామణి బోధ వింటివి - యేర మాటాడవు నాతో [1]వక //పల్లవి//

బీరమా మరి మరి వేడితె గం - భీరమా వేణుగోపాల //అనుపల్లవి//

మందు రాచినదేమో యిక నే - మందురా దానింట నీవు
విందు రాతిరి బోసేసితివట - విందురా చెలులు
సందురా నవ్వేవారికి మన - [2] సందురా నీకు యేలా
గుందురా నినుజూడక [3] నామది - గుందురా సుందరాకార //ఏ రమా//

మెత్తురా నా పేరంటె శివ - మెత్తురా చెలికి - ఇటు చను
విత్తురా కాపురాల వేరు - విత్తురా సామీ
ఇత్తురా ఒకనాటికి మొలతా - యిత్తు [4] రాచ్చలకే మరి యెడ
మిత్తురా మునుపటి దయరానే - మిత్తురా వృత్త రవ్వలేల //ఏ రమా//

ఏలరా దాని గూడి [5] నటు వలె - ఏలరా నన్ను - నే గుణ
శీలరా నీవా చెలికెంత వ- శీలరా చలము
చాలురా వెలదికి రేపేనా - చాలురా అది జెప్పిన మాట నె
పాలురా కలిగినదంటే కో - పాలురా నీకు //ఏ రమా//

1. సామి (B). 2. సందురా నిను జూడక నామది (B).
3. నిను బాసి యేలా - గుందురా సుందరాకార (B).
4. యిత్తురా చాగల మరి నెడ (B). 5. నేలినటువలె (B).

# 14. పున్నాగ వరాళి - ఆది

ఎంత దుడుకు జేసెనే ఓ భామా న - న్నెంత దుడుకు జేసెనే ॥పల్లవి॥

ఎంత దుడుకుజేసె - నెవరితో దెలుపుదు యీ
వింత కార్వేటి నగర - వేణుగోపాల రాయుడు ॥అనుపల్లవి॥

గంటీలు బెట్టి వాలు - గంటీ నామోవి పలు
గంటీలు జేసిన త్రాణ - గంటివేమే
యొంటి పాటున యిటు - వంటి పనులయితే ర
వ్వంటికమ్మ చెల్ల నా - వంటిదానిని రాతిరి ॥ఎంత॥

అక్క వినవే వాని - అక్కర బంగారాయ
అక్కరలేదు పొమ్మంటే - అక్కసుతో
చక్కా పొయ్యేవా యని - చక్కని నా గుబ్బలు
చక్కగా బిగబట్టి - చక్కట్లెన్నో జెప్పుచు ॥ఎంత॥

పట్టుచీరకు పల్లి - పట్టు వరహా లయిదు
పట్టుమనుచు నాచై - పట్టుకొని
కట్టుకొంగున మూట - గట్టుకోవే యని యి
క్కట్టు గూడి రా - కట్టు వుంగర మిచ్చి ॥ఎంత॥



# 15. పున్నాగవరాళి - ఆది

మట్లవారి సీమ చీర నిను పది - మాట్లడిగిన లేదంటివి - బంగరు ॥పల్లవి॥

గెట్లు దానికిచ్చితి విక నీసి -గ్గెట్లు దక్కు వేణుగోపాల ॥అనుపల్లవి॥

కట్ల సంచి పొరలో దాచిన - కట్లదండ కూడా - పణతిచే(చా)
కట్ల కిచ్చినది నే తెల్లవార - కట్ల వింటి జాడా - యీ
పట్లదే యోగశాలిరా వినే - పట్ల యెంచి చూడా - మేల్
కట్లయిండ్లు విడిది [1] జేసితివా - కట్లమారి గుడికాడా ॥మట్లవారి॥

రాళ్ళమర్చిన పతకము పావు - రాళ్ళ పలుకుకేనా - వే
మాళ్ళపచ్చ దారబోసినది పెరు - మాళ్ళ ప్రీతిగానా - చె
క్కిళ్ళ సొరు మెచ్చి యిచ్చినది యొక - కీళ్ళ మంచమేనా - నీ
వేళ్ళ వుంగరాలేని (వి) రా వట్టి - వేళ్ళ చప్పరము లోనా ॥మట్లవారి॥

కేళికాడితేనే చెలితో రతి - కేళి సల్పనగునా వింత
యాళి మొగము వీణె రాతి - గయ్యాళి కియ్య దగునా
తాళిమితో ననుగూడి యింత యెగ - తాళి సేయనగునా - అ
చ్చాళిగా సుదతి చేతనే పద - చాళి చిత్తగించితి వీవగనా ॥మట్లవారి॥

1. జేసితివి తాకట్లమారి గుడికాద (A).

## 16. పంతువరాళి - ఆది

రావద్దు పొమ్మననా మా యింటి దోవ - రావద్దు పొమ్మననా ॥పల్లవి॥

పోవే మాటలమారి - ప్రొద్దు పోదేమె నీకు
యీ వేణుగోపాలు - డిట్లా జేసినందుకు॥ ॥అనుపల్లవి॥

మళ్ళ చీరడిగితే - మళ్ళా వచ్చెదనని
మళ్లా దోవ పోయి మారా - మళ్ల బెట్టి నందుకు ॥ ॥రావద్దు॥

కొదవేమున్న దనుచు - కుదువబెట్టి నా తీగె
కొదవ పరచి నా మనసు - కొదవ సొమ్మడిగితే॥ ॥రావద్దు॥

అక్కరకయ్యే నని - అక్కరో ననుకూడి
అక్కడ ఆడుకుంటె - అక్కర లేదిక॥ ॥రావద్దు॥



## 17. సౌరాష్ట్ర - ఆది

మందగమన చెలుల - మందగ గూర్చేవు - మంచిది కానీ లేవే ॥పల్లవి॥

అందరన్నట్లు నన్నారడి చేసేవు - అందరాని పండ్ల కాసించి నట్లాయె॥
॥అనుపల్లవి॥

కనకాంగి మరచేవు - కనకాని వన్నది
[1]వెనక లేలంటే ఆ - వెనక దెలిసీని
వినక నామాట న - వ్విన కారణము దెలిసే
దనక పోనీను సా - దనకత్తె వైనావు ॥మంద॥

నేరమా వలచితే - నేరమా నీ వలె
మారామళ్లేమె రా - మారామ యిపుడు
దూరమ నీ మనసు - దూరమై నందుకు నే
దూరమా నీ యింటికి - దూరమని బొంకుచు ॥మంద॥

వాలాయమిదె ర - వ్వాలాయె నీకు కో
పాలాయె యిది ప్రస్తా - పాలాయె కొసరి
చాలాయె నినుగూడిర [2]- చ్చాలాయె వేణుగో
పాలా యనక నా - పాలాయె మఱి మఱి ॥మంద॥

1. వెనక లేదంటే (A). 2. రచ్చాలాయె (B).

# 18. బేగడ - ఆది

ఎందుకో రాక అలగినది నా -
యందు కోపమేమి దెలుపవే - అది ॥పల్లవి॥

[1]సందుకొనను వేణుగోపాలుడీ -
సందు కొనకు వచ్చి మళ్లినాడట ॥అనుపల్లవి॥

వచ్చునా నీ కీ గుణ మేమన - వచ్చు నా నెనరు దోచి దరిశన
మిచ్చునా దయవుంటే చెలికస - మిచ్చునా న్యాయము
మెచ్చునా యింకా నాపై చల - మెచ్చునా బోటి కడప దాట
నిచ్చునా వకరి మాట సాగ - నిచ్చునా దైవమింత దెచ్చునా ॥ఎందుకో॥

[2]తిరుగా నిలచి వార్తలాడ - తీరెనా లోనిగుట్టు జెప్పి
తీరు నాటించి నటుల యున్నది - తీరునా యిట్లా
మీరు నాడన్నది నిజమాయె - మీరునా యింత వెరపు లేక
దూరునా మీదబెట్టి దానిలు - దూరునా కోర్కె లీడేరునా ॥ఎందుకో॥

ఏల నాపేరు వాసి తిరుగా - యేలనా కాని నేనంత
చాలనా తనకంటికి సమ్మతి - చాల నాట నుంచి
యేల నాతోజెప్పని మర్మ - మేల నా సరివారిలోనే
బేలనా యడిగిరావె తబ్బి - బ్బేలనా మది సహింపజాలనా ॥ఎందుకో॥

1. సందుకొనెను (A). 2. తీరునా (A).



# 19. హుసేని - ఆది

చక్కని సామిగ నాతో - చక్కగ నుత్తర మీక ॥పల్లవి॥

చక్క దానింటికి పోదురా - నీ పరువున కిది -
చక్కని[1] నడితి కాదుర ॥అనుపల్లవి॥

తీరని మోహమున వలచి - తీరా వచ్చేనని ఆన
తీర నీకు మేలుదానరా పనియున్నదిరా - తీరదనే సుద్ది మానరా ॥చక్కని॥

మానవతి మెచ్చి నీ స- మాన మెవ్వరని బహు
మానము జేసినది వింటిరా - రాగా రాగా నీ - మానసము దెలుసుకొంటిరా ॥చక్కని॥

[2]నాటి నమ్మికెలు మది - నాటి యుండవా నన్ను యే
నాటికీ యడబాయ నంటివి - ఆపె యెదుట ని - న్నాటి కెంతో కసరు కొంటిరా ॥చక్కని॥

నగరా చెలులు శ్రీ కార్వేటి - నగరా వేణుగోపాల తి
న్నగ రాదీసి యేలుకొంటివీ - వాదాడితే యీ - నగరాబుట్టి నీ మాటంటివి ॥చక్కని॥

1. నడత (B). 2. నాటి నమ్మికలు (B).

## 20. అసావేరి - ఆది

ఏరా యేరామా బోధించ - రారా రారాపు సేయ - వ
దూరా దూరాన నిలుచుందురా - నీ మదిరా నడి
చేరా చేరా రావేమందురా ॥ఏరా॥

నిన్నా నిన్నాడుకొన్నది - విన్నా విన్నాణగత్తెను
కొన్న కొన్న పతకమిత్తురా - నే వాని కంటే
చిన్న చిన్న పనులు మెత్తురా ॥ఏరా॥

వద్దా వద్దా రావు యొక్క - పొద్దా పొద్దాయనే యిట్లా
కద్దా కద్దా చెలితో ఆటలు - యే వేళ యిదే
రద్దా రద్దాయ నీ మాటలు ॥ఏరా॥

కానీ కానీ బోటి సత - మానీ మానితివి దయ
రానీ రానీదు మాయింటికి - అది జెప్పీనట్లు
పోనీ పోనీదు పొరుగింటికి ॥ఏరా॥

ఇందు యిందుముఖులు మెచ్చ - ముందు ముందుగా గూడినా
యందు యెందుకింత కోపమూ - వేణుగోపాల
సందు సందుల ప్రస్తాపమా ॥ఏరా॥



## 21. ఆహిరి - చాపు

వేరుసేతురా - వేణుగోపాలా నను - వేరుసేతురా ॥పల్లవి॥

నీరాక కోరిన నన్ను - నిరాకరించి పొమ్మని ॥అనుపల్లవి॥

ఇందుకా నీవని నమ్మినది - యిందుకా నీ వనితల లోన ॥వేరు॥

అంతటీదాని రసికత - యింతటిదని దెలియకా ॥వేరు॥

పూలు గూర్చిన వగజూచి గుం-పూలు గూర్చిన వగలాడి వద్ద ॥వేరు॥

మరుని భయాన తారినందుకు వే - మరుని భయానలు నవ్వగా ॥వేరు॥

[1] నిలుపరా నీ మోహమాయ - నిలుపురా నీ మోడీ యికను ॥వేరు॥

నిన్ననే మీ యోచన వింటి - నిన్నన నేమీ ఫలమింక ॥వేరు॥

పాయమున నేమేమొ వు - పాయముననే నన్నుగూడి ॥వేరు॥

1. నిలుపరాని మోహమాయ (A).

## 22.కన్నడ - ఆది

తిరుగా యే చెలిని పొమ్మందునె –
వేణుగోపాలునే – తీరుగా పిలచి రమ్మందునే ॥పల్లవి॥

తిరుగా వల దన్నందుకే వక –
తీరుగా బోయె వాని మనసు ॥అనుపల్లవి॥

మందార వనములో నేడు – మందరధరుని వద్ద
మందర జేరినదట మే – మంద రాడకు పోతగదు ॥తిరుగా॥

వద్ద నేమారని విభుని – వద్దనేల పో పొమ్మంటి
వద్దా నేర్పు చేరదీయ – వద్ద నేరీ మగువలెల్ల ॥తిరుగా॥

వచ్చునా తానై నను కలయ – వచ్చునా ఆడికెలు తెలియ
వచ్చునా అతనీమది గురుతీ – వచ్చునా శుభరేఖ వ్రాసి ॥తిరుగా॥



## 23. ఫరజు - చాపు

రమ్మనే సామిని రమ్మనే ॥పల్లవి॥

కొమ్మ నీవే నామనవి గై –
కొమ్మని వేణుగోపాలుని ॥అనుపల్లవి॥

మచ్చుమీద నేనుండగ – మచ్చు మీద జల్లిన వాని ॥రమ్మనే॥

ఇందుకాక కోర్వదంటె – యిందుకా కసరిందీ వేళ ॥రమ్మనే॥

అల సీమాటితో రేయెల్ల – అలసి మాటాడకున్నాడు ॥రమ్మనే॥

కూడిన సామిని నీతో – కూడిన నాపై దయ యుంచి ॥రమ్మనే॥

## 24. కాపి - చాపు

తడవాయె పోయిరా - యీతడవా - యేమే ॥పల్లవి॥

పడతిరో వేణుగో - పాలు దచ్చటజేరి తడవాయె ॥అనుపల్లవి॥

మనవి దెలిపి రారమ్మనవే కూడ -
దన వొచ్చే బుద్ధి గాదనవే - నాపై
కనరు దోచుటకేమో కనవే - వో -
వనజాక్షి గట్టిగ - వకటి నీ వనవే ॥తడవాయె॥

[1]వలచిందే తప్పు నావలనా - అ -
గ్గలమైన మరులోర్వ గలనా - ఆపె
వలె నున్నానటె నే కావలెనా - క
ల్లలకు లోనౌన - చల్లనివాడె[2] లలనా ॥తడవాయె॥

సతి యిల్లాతనికి వసతిగా - మాన
వతి చాల ననుకూలవతిగా - అది
మతి గలదైతే సమ్మతిగా - యెంతో-
మితిలేని ప్రేమ సామికి మేనమ్మితిగా ॥తడవాయె॥

కలదా రానిచ్చేది గలదా - మా -
పలదాని [3]పడక లోపలదా - యీ
వల రాను సెలవు కావలదా - తే-
గల ధైర్యము నీకు గట్టిగ గలదా ॥తడవాయె॥

మరుకేళి గూడినది మరుగా - నీ -
వరుగ చెలులు నవ్వరుగా - యొ
క్కరు మనకై పలుకరుగా - యెం-
దరుగవలెనే సుందరి నేడిందరుగా ॥తడవాయె॥

1. వలచినది తప్పు (B). 2. చల్లనివాడయిన (B). 3. సెలవుగావలదా (B).



## 25. ఘరజు - ఆది

ఆడకే పోరా - యెదు - రాడక పోరా ॥పల్లవి॥

వేడుక లీడు జెల్లవు - వేణు గోపాల నాసామి ॥అనుపల్లవి॥

వాతెర విందు సేయ నె - వ్వాతె రావించే నన్నదో ॥ఆడకే॥

[1]చీటీ బంపిందే బందరు - చీటి బంపిందే మగువకో ॥ఆడకే॥

పూలు గూర్చిన వగలు జూచి గుం-పూలు గూర్చిన వగలా దెవతో ॥ఆడకే॥

ఐదు వరాలిప్పించు కొన్న [2]ఐదువరాలి యిల్లేదనో ॥ఆడకే॥

కూడిన నాటనుండి చే - కూడిన నా పై దయయుంచి ॥ఆడకే॥

ఏకాంతలతో నే ప్రొద్దు - నే కాంతలతో గూడేవో ॥ఆడకే॥

పదములు బాడించి దేని - పదములు బట్టుకొంటివో ॥ఆడకే॥

వాలుగంటిచేత యాన - వాలు గట్టి యంపిన దెవతో ॥ఆడకే॥

1. చీటి బంపిన దానికి బందరు (B). 2. ఐదువరాలిల్లీడగాదు (B).

## 26. భైరవి - ఆది

సరసాలు సేయవద్దిక – చాలు పోపోరా ॥పల్లవి॥

వెరతురా నీ పేరంటె – వేణుగోపాల నా సామి ॥అనుపల్లవి॥

పచ్చని కమ్ముల చీర– పండుగ నాడైన యెరుగ–
వెచ్చానికేమి లేదంటె – వెలవెల బోయి నాతో ॥సరసాలు॥

మంచము మీది పాదాలు – [1] దించనీకు పదిరూకల
కంచము దీసీయమంటే – కండ్లెఱ్ఱ జేసు కొనేవు ॥సరసాలు॥

ముత్యాల కుళ్లాయి మాకు– ముందర బెట్టేది శానా
యిత్యాహాభట్ల నా మేలు – యిక నిన్ను గూడేది సున్న ॥సరసాలు॥

1. దించనీవు (A).



## 27.భైరవి - ఆది

వచ్చునా మునపటి [1] నెనరుంచి – వట్టి భ్రమలు గాక ॥పల్లవి॥

మచ్చుకంటి వేణుగోపాలుని – మనసు రానడిచే వారుండగ ॥అనుపల్లవి॥

పిలువ వచ్చేనని యంతో మురి – పెముల పొయ్యేవు – వాని
తలపు వేరైన జాడ కాసం – తైన తెలియ లేవు
వెలదిరో యతని జిత్తుల నీ – వేమి గన్నావు – ఓ
నళిననేత్రి విభుని కేవహించుక – నన్ను కాదనేవు మంచిదానవు ॥వచ్చునా॥

మాటపట్టు చేసుకొన్నారట – మగువ తాను మొన్న నన్ను
నోటిలో నాడుకొన్నారట – కోటివేలు నిన్నా
బోటి యీ సుద్దులన్ని జెప్పగ – ప్రొద్దుననే నిన్నా – యీ మొగ
మాటమే దూరమాయె చెలువుని – మర్మమెల్లగన్న వేడుకొన్న ॥వచ్చునా॥

నన్ను లాలించి యేలుకొన్నది – నవ్వుల కెడమాయె – ఆ
వన్నెకాడు నా యిల్లు విడిచినదె – కన్నెల పరమాయ
సన్నుతాంగి పొందే నాసామికి – సంతోషమాయ – యిక
నెన్ని దలచుకొందునమ్మ నా మది –
కేమి తోచదాయె నన్నుడాయ ॥వచ్చునా॥

1. నెనరించి (A).

## 28. భైరవి - ఝంపె

ఇంత సేసిన యింతి యిగనెంత సేయదే -
యెంత సాహస మందునే ॥పల్లవి॥

వింతలేమనవచ్చు - వేణుగోపాలునికి
సొంతకత్తియ కదవే సకియ ॥అనుపల్లవి॥

సుదతిరో నను విభుడు [1]చూడబొయ్యా ననుచు - సురటీలు బట్టించెనే - వాని
కెదురుగా నొకవేళ - నేవత్తునని దలచి - యేమొ జాబందిచ్చెనె -
పదము నేబాడితే - [2]సదయునికి వినకుండ - భటులచే బొగిడించెనే - యెవరు
నదరు లేదికమీద - నావేలు వంచరని - మదిలోన గర్వించెనే - సకియ ॥ఇంత॥

అతివరో నామాట - లాలకించీ ననుచు -
నపుడె చిలుకను బెంచెనే - నన్ను మదిలోన దలచునని -
ప్రతిమ నొక్కటి చిత్ర - పటములో వ్రాయించెనే
వ్రతమనుచు వగకాని - వద్దికే చెలుల రా -
వద్దనుచు చాటించెనే - సకియ మితిమీఱి యిద్దఱికి -
మిత్రభేదము జేసి - మేలు మెచ్చులు గాంచెనే - సకియ ॥ఇంత॥

సామి ననుగూడినది - యేమగువ దెలిపెనో -
యా మొదలు చలపెట్టెనే - అంగ
నామణి యది నంగ - నాచివలె నుండి య - న్యాయాని కొడిగట్టెనే
రామరో యతడు తన - రతి సాధనకు మెచ్చి-
రాణి వాసము బెట్టెనే - వినవే
వామనేత్రి విభుని - వల వేసుకొంటినని -
వగలాడి తొడ దట్టెనే - సకియ ॥ఇంత॥

1. చూడబొయ్యా ననుచు (A). 2. సదయునికి (A).



## 29.భైరవి - ఆది

నా పేరంటె నీకు దొరకదు - నంగి మాటలాడకు లేరా ॥పల్లవి॥

దోపనే సరి యేదొక్కటి ఆ - దొరసానికి వేణుగోపాల ॥అనుపల్లవి॥

తలుపుచాటున చిలుకల తాళి - దానికియ్యలేదా - పూసల
కొలుకి[1] వేయుమన్నందుకె నాపై - కోపగించలేదా
పులి జున్ను పుట్టతేనె మొదలుగ - చెలికి నడపలేదా - నీకు
వలసియున్న పనులైతే మదిలో - తలచినపుడె కాద అందు మీద॥ ॥నా పేరంట॥

వారవప్పళి చీరదెచ్చే - వాడవు నీవు - నేటి
కారు దినములాయె తొంగి చూడక - నందే యున్నావు
తేరతేరగా జూచి యెందుకు - [2]మేరదప్పేవు - అంత
భారమై తోచితే నిక నా - పద్దు జూచెదవు మాయకాడవు॥ ॥నా పేరంట॥

వగలమారి నన్నంటకు మంటే - వద్ద చేరావు - ఆ
మగువ నిన్నేలుకొన్న చిన్నెలు - మరుగు జేసేవు
సొగసు జేసుక నను తమిరేచి - సొంపున గూడేవు - నీ
తెగువ దేవేంద్ర పదవైనది - తెలియ జేసేవు - మంచివాడవు ॥నా పేరంట॥

1.కొలికి (A). 2.మేర చెప్పెదవు (B).

# 30. నవరోజు - త్రిపుట

వేణుగోపాలు డీవేళ వచ్చినాడు –
వేమారు గొణుగకువే – వాడు ॥పల్లవి॥

మాణిక్యపుతునకే – ప్రాణమె నీమీద
యేణాక్షి వినవే – నేడెంతో హౌసుమీర ॥అనుపల్లవి॥

దగ్గరికటు జేరి దండము బెట్టవే –
సిగ్గేటికే యింక చిన్నదానవా
యెగ్గుగా దోచి నీవిటు తలవంచేవు –
దిగ్గున మొగమున తెలివి దెచ్చుకొవే ॥వేణు॥

ఏలనే కూతుర మూలల జుణిగేవు –
నేలమీద బొటన వేలు రాయకే
పూలందుకొమ్మంటే పుడకేల విరచేవు –
మేలు వానిచేత మెచ్చులందుదుగాని ॥వేణు॥

చప్పుడు సేయక సాగిటు రావమ్మ –
యిప్పుడేమె నీకు యేండ్లు లేవా
చెప్పినంత మాట చెల్లించే సామిని –
అప్పుడే రతివేళ తిప్పల బెడితివే ॥వేణు॥



# 31.తోడి - త్రిపుట

తోడి తెచ్చెదనేవాని – అప్పుడే మెచ్చి –
తొడవు లిత్తువుగాని ॥పల్లవి॥

వేడుక పరుడైన వేణుగోపాలు డల
చేడె నగిరినున్న – జాడ దెలిసి యీడకే ।అనుపల్లవి॥

అద్దము జూచుచును – ఒక్కరి కొకరు
ముద్దులు బెట్టుచును
గద్దరితమున కౌగలింపుచు నీపై
పద్దున దానికి –బాసలిచ్చిన గాని ॥తోడి॥

మడుపు లందిచ్చుచును – ఒక్కొక్కరి కొకరు
తొడరి మోవి నొక్కుచును
కడలేని మోహమున– గంధమలదుచు నాపై
పడకింటి యిష్టాలా – పముల నుండిన గాని ॥తోడి॥

వీణెలు మీటుచును – ఒక్కరి కొకరు
జాణతనము లాడుచును
మాణిక్యమువంటి – మగువ నిన్నేలిన
వేణుగోపాలుడా – వెలది గూడిన గాని। ॥తోడి॥

## 32. నీలాంబరి - ఆది

రారాసామి నీకు మ్రొ - క్కేరా పిలచిన పలక
వేరా నిలచి వొక మాటాడర - నిన్నెడబాయ జా
లరా చలమేల యింటికి రారా ॥రారా॥

రాదా కనికరమింతైన - లేదా యీ మేను నీదే
కాదా నా కోరిక దీర్చ - రాదా తమి నిల్పలే నిక
మీదా తడవేల సరసకు రారా ॥రారా॥

వేరుసేయకుర కాద - [1]నేరు తోడి చెలులు - న
వ్వేరు యెవరైన యెటు నమ్మేరు - యెంతని వేడుదు పలు
మారు నన్నాదు కొందువు రారా ॥రారా॥

ఓరీ యెంతో నెమ్మది నిను - కోరీ వలచినందుకు - వక
సారీ రావైతివిగా యీ - దారీ ఫలమేమిక నిన్ను
దూరీ [2]యిదిమంచి సమయము రారా ॥రారా॥

కాయజుడెంతో పగవా - డాయ నీ మనసు కరగ
దాయ నిందుననే సరిప్రా - ద్దాయ వేణుగోపాల
రాయా నన్నేలు కొందువు రారా ॥రారా॥

1. నేరు నా తోడి చెలులు (A). 2. కోపమేల యింటికి రారా (A).



## 33. శంకరాభరణం - త్రిపుట

ఇంత మోహ మేమిరా - యిందరికన్న - [1]నింత చక్కని దేమిర ॥పల్లవి॥

సుంత సేపు దాని - జూడకుండ లేవు
అంతరంగము దెలుప వదియేల - వేణుగోపాల ॥అనుపల్లవి॥

నీకెదురుగా వచ్చునా - నెనరూరగ - నిండు కౌగిట గ్రుచ్చునా
ఆకుమడుపు లందిచ్చునా - తన చెలిమికి -
నైనవాడని మెచ్చునా - తమి హెచ్చునా-
యేకచిత్తమున మీరిద్దరు - యింపు సొంపులనున్న ముచ్చట
నాకు వినవిన వేడుకయ్యేరా - యిపు డానతీరా ॥ఇంత॥

మోని పానకమిచ్చునా కొసరి కొసరి - ముద్దులాడ నిచ్చునా
తావిపువ్వులు దెచ్చువా - నీ సొగసుకు
తగియున్నదని యిచ్చునా - చను విచ్చునా
దేవరే మగడు గావలెనని - భావజుని పూజ లొనరించిన
ఆ వనిత పేరేమి సెలవీరా - సిగ్గేలలేరా ॥ఇంత॥

సంతోషముగ వాడు నా - తంబుర మీటి - సంచుపాట బాడునా
వింత రతుల గూడునా - ఆ సమయాన
విడువకుమని వేడునా - కొనియాడునా
సంతతము నన్నేలుకొని యా - కాంతపై వలచినపుడే యిక
కొంత వున్నదే వేణుగోపాల - [2] గారణము లేల ॥ఇంత॥

1. నింతి (A). 2. గారడములేల (A).

## 34. పున్నాగ వరాళి - చాపు

సామి యీ కోపమేల - దాని జేరకు మంటే రోసాలా ॥పల్లవి॥

కామినీజనపాంచాల - కార్వేటి నగర వేణుగోపాలా నా ॥అనుపల్లవి॥

నెనరుగూర్చి యేమైన - నే నొకటనరాదా - ఆది
కనరుగా దోచేది యా కన - కాంగి మహిమ గాదా
చనవరి నీకదైనప్పుడే - చాలదా యికమీదా
మనసు రాక మెలగే విది - మంచి మరియాదా నా ॥సామి॥

అమ్మచెల్ల నీ నడతలు - ఆనాడే గంటి - ఆ
కొమ్మకు వెలలేని రవల - సొమ్ముమీయ వింటి
దిమ్మరివలె యిల్లిల్లు - దిరుగ వద్దంటి
యెమ్మెకాడ మంచివాని - కీ గుణమేమంటి నా ॥సామి॥

చెలియ పొందు సేయలేదని - చై వేసేపు - రుజువులుగా
కలదనిపించితె - ఉపముగా తొలగేవు
తలిరుబోణిరో యీ తప్పు-దయ సేయు మనేవు
అలగియున్నగాని గూడి - అపుడే నవ్వించేవు నా ॥సామి॥



## 35.శహాన - త్రిపుట

నేరుతునని మాటలాడరాకు మునుపే - నిన్ను నేనెరుగనా ॥పల్లవి॥

పోరా పోనీ కేడ - ప్రొద్దు పోక తిరిగేవు
వూరులేనివారిని - పేర బిలుచుకుంట ॥అనుపల్లవి॥

మూసిన ముత్యమువలె నున్న యాచెలిని -
ముంగిళ్ల బెట్టితివి - ఎంతో
వాసివాడని చాల వలచియున్న నాతో - వాదుల కొడిగట్టితివి
భాసురాంగి నిన్న పడకకు రానంటె - పదివేలు తిట్టితివి - అగడు
జేసెదనని పూని చేడె లందరు జూడ-
చెలియిల్లు మెట్టితివి - చేబట్టితివి ॥నేరుతు॥

అడుగు లోనే యరవై - యారు గుణములైతే -
అతివలు మనసిత్తురా - ఆకు
మడుపులోనే వలపు - మందుంచి మాపొరుగు- మానినీమణి కిత్తురా
దుడుకులు సేయ నీ - దొడ్డతనమేమో -
దొరవైతేనే మెత్తురా - యింత
గడిదీరి తిరిగితే - కన్నెలు వాకిటి -
కైన జేరనిత్తురా - మొగమిత్తురా ॥నేరుతు॥

వేడుక లొదవు కార్వేటినగరమేలు - వేణుగోపాలుడవు - చిన్న
యీడున ననుగూడి యీదోవ రావైతి - వింటింటి చెంద్రుడవు
ఆడకాడకు నీ జాడలు బయలాయె - ఐనా మాయకాడవు - యిట్లా
కోడిగములు జేసి - కొమ్మల బెదిరించి -
కొంటెతనము వీడవు - మాయకాడవు ॥నేరుతు॥

## 36. పంతువరాళి - చాపు

వలచియుండితే నీవు– వలచేది ఘనమా ॥పల్లవి॥

వెలది కార్వేటి నగర – వేణుగోపాలుడు ॥అనుపల్లవి॥

అండ జేరి వేడేది – అతని ముద్దిమ్మనేది
వుండివుండి తమకమున – వుస్సురనేది
యెండమావుల సామ్య – మేమనుకో రాదికను
కొండకేగే వాని మొలను – కొడవలి చెక్కినట్లాయె ॥వలచి॥

కడుప్రేమ బుట్టించేది – కదిసి కౌగిలించేది
తొడరి మోవి నొక్కేది – దొరవనేది
మడుపు లందిచ్చేది – మనసు రాదనేది
పడతి పులగము మీది – వప్పుసామితె ఆయె ॥పల్లవి॥

మేలు మరువ ననేది – వేళ మంచి దనేది
పాలుమాలక విటుని – పైకొనేది
రాలుగాయనగ వుప – రతుల తనియించేది
ఆలి మీద లంజరిక – మనుమాట నిజమాయ ॥వలచి॥



## 37.పంతువరాళి - ఆది

దోసకారి పోవే యతడీ – త్రోవదొక్కునా – వూరకె ॥పల్లవి॥

ఆసుబోసిన కోవివలెనే ఆడకు యీడకు తిరిగేవు మాత్రమే ॥అనుపల్లవి॥

అందమైన వెండిమట్టెలు – సందెకాడ బంపించితె
కందు గలసిందని యెగిరి – చిందులు ద్రొక్కుచు చిదియగొట్టిన ॥దోసకారి॥

కరకు వరహాలారుబెట్టి – కరకంచు చీర[1] దీసిస్తె
[2] చెరగు బాగాలేదని మెటికలు – [3]విరచి నుచ్చుపాతలు జేసిన ॥దోసకారి॥

సన్నబియ్యము లేనివాసి – [4] సంబావ్వడ్ల గోనె లంపితె
కన్నులెఱ్ఱజేసి గింజ – లన్ని కుంపట్ల కెత్తించిన ॥దోసకారి॥

[5]కలువ పూలు లేనివాసి – కస్తూరి పట్టెలంపించితె
తిలకించి కోపముచేత – నలిచి పందిటిమీద జల్లిన ॥దోసకారి॥

వేణుగోపాలుని గూడి – వేలాంత్రాలు సంపాదించి
యేణాక్షులతో నొక కాసైన – యెరుగననుచు నాడుకొన్న ॥దోసకారి॥

---

1. దెచ్చియిస్తే (B).
2. చెరుగు (B).
3. విరుడుచు పేలికలు చేసిన (B).
4. సంబావడ్లు పంపించితే (B).
5. కలువపూవు లేడ జిక్కక (B).

# 38. గౌళిపంతు - చాపు

చండితనము జేసే - సరసిజాక్షితో యిట్లా
సరసాలు సేయకురా - అయినా ॥పల్లవి॥

కొండ్రదొవ్వెలుకను బట్టుదురా వేణు
గోపాల నే నంటే - కోపాలా యేవేళ ॥అనుపల్లవి॥

ఎక్కడలేని మోహాముతో దాని -పక్కజేరి పాదము లంటితే
గ్రక్కునలేచి చిడిముడిపాటున -గద్దించి పలికేనుగా
మక్కువతోనాకు మడుపు లీయబోతె
నక్కరలేదని యావలి మోమాయె
జక్కుల సంతోస మనుమాట నిజమాయె
చక్కలిగింతలు చత్రాతికి గలవా ॥చండి॥

[1]రాతిరీవు గుజ - రాతి ముత్యపుసరులు
చేతికిత్తామని - ప్రీతితో బిలిచితె
ఘాతకురాలు గొణుగుచు నీ మీద - కండ్లెఱ్ఱ జేసేనుగా
పాతకురాలు నీ వంపిన పైడి - పట్టె దేలేదని యానలిడుకొనె
చూతామనుచు సన్న వేతామా యంటివి -
యీతాకు రాలున యేయాకు రాలిన ॥చండి॥

ఉయ్యాలమంచముపై నిన్నటిరేయి -
పయ్యద తొలగించి పణతి నిద్రించగా
చయ్యన నీవాసమయాన బలిమిని - సమరతి గూడగనూ
అయ్యెడ తెలివొంది అధిక కోపమున -
గయ్యాళి తన వామకరమున నెట్టించె
నెయ్యము సేతుర - నెనరులేని చోట

1. రాతిరినీవు (A). 2. వేద (A).



# 39.సురట - త్రిపుట

ఇంటికి రానిచ్చేనా - యీ మేనితో -
యింతి వాని [1]దలచేనా ॥పల్లవి॥

[2]గొంటుకాయై వేణు - గోపాలుడు నాపై
తంటలు జేసితె - దండించక విడచేనా
॥అనుపల్లవి॥

యితనికి వెరచి నే - నిక లంచమిచ్చేనా
యిన్నాళ్లవలె ననుసరించేనా
బతిమాలి నే రాయ - బార మంపించేనా
పతియని మునుపటి - భక్తి దయలుంచేనా ॥ఇంటికి॥

ప్రేమదలచి తన - మోమైన జూచేనా
యేమి జెప్పిన నిజ - మెంచేనా
రామా అయినది కాని - రచ్చకు వెరచేనా
ఆ మాట సభలోనే - ననక సహించేనా ॥ఇంటికి॥

ఎనసిన మొగమాట - మింతైన జూచేనా
యెంత వేడిన మన - సిచ్చేనా
వనిత పట్టిన [3]పద్దు - వట్టిదనిపించేనా
పనిబూని వేణు - గోపాలా యని పిలచేనా ॥ఇంటికి॥

1. వలచేనా (B). 2. గొంటుకాడై (B). 3. పట్టు (B).

## 40. ధ్వజావంతి - త్రిపుట

నెరనమ్మితిగదె – నీ మాట సతమని –
నెనరు దాన వనుచు ॥పల్లవి॥

మరులు బుట్టించి యే – మరి యూరకున్నావు
గురిజేయకే నన్ను – మరుబారి కిప్పుడు ॥అనుపల్లవి॥

మాటల పందిలి బెట్టకే నీ పయిని – నాటియున్నదే మనసు
బూటకములు జేసి – ప్రొద్దులు బుచ్చకే
తేటకెమ్మో వీవె – తేనెలానగ నీవె ॥నెరన॥

అరచేత వైకుంఠ – మదిగో యందురా – సామ్యమంతయు నిజమాయెనె
మరిమరి చనువిచ్చి – మనసీక జుణిగేపు
సరస జేరగ రావె – చనులు బట్టనీవే ॥నెరన॥

నమ్మి నానబోసి – నటులాయగదె యల్ల – నాటి సంకేతములు
కొమ్మరో ననువేణు – గోపాల రమ్మని
కమ్మవిల్తుని కేళి – గలయవేమె బాళి ॥నెరన॥



## 41. శుద్ధసావేరి - త్రిపుట

త్రాణదానవె వాడిం – తగా బతిమాలితే
తలయెత్తి చూడరాదా – నీపై ॥పల్లవి॥

వేణుగోపాలునికి – వెగటు దోచితే రేపు
వేకటేలాగౌదువే – యో చెలియరో ॥అనుపల్లవి॥

ఇందుకేనటే బంగా – రందలమ్ములో బెట్టి
సందేల దొర [1] నిన్ను నజరు బంపినది
అందకాడు గుబ్బ – లంట వచ్చిన వేళ
చిందు ద్రొక్కుచు – చెయి బట్టుకోవలెనా ॥త్రాణ॥

మిద్దెయిల్లు గట్టి – మేలు మెచ్చుగ జూచి
హద్దుగా వుంచినది – అందుకే నటలే
వద్దికి తావిచ్చి – వలపు రేచేవేళ
ముద్దు బెట్టుకోనీక – ముణుచుకొని వంగుదురా ॥త్రాణ॥

పడతిరో వేణుగో – పాలు దద్దమరేయి
విడిదికి వేంచేసి – వేడుకలరగాను
తడయక నిను రతుల – తమిని గూడేవేళ
బెడసరమటే రెండు –తొడ లదుముకోవలెనా ॥త్రాణ॥

1. నీకు

# 42. కేదారగౌళ - ఆది

నేడు [1]నీ విన్నవించినందుకు – నెనరు బుట్టరాదా – యెంత ॥పల్లవి॥

వేడుకై [2]తోచెనా నా వునికి – వెలది వేణుగోపాలదేవునికి ॥అనుపల్లవి॥

నిన్నుబాసి నిముస మోర్వదంటివి – నీ సొమ్మంటివి
కన్నీరున పైట దడిసెనంటివి – కారాదంటివి
వున్నతావున నుండదంటివి – పులికీనంటివి
చిన్నబుచ్చితే దోసమంటివి – చిత్తానికి సరిపోయినదంటివి ॥నేడు॥

చిలుకచాయ తొంగి చూడదంటివి – చెప్పదంటివి
చెలుల దగ్గర జేర్చదంటివి – తలచునంటివి
వెలవెల బోవుచున్నదంటివి – వెరచునంటివి
పిలిచి రమ్మని రారా యంటివి – నెలత నీకెదురు జూచునంటివి ॥నేడు॥

కూడి వీడ తగవు గాదంటివి – వేడుకొంటివి
మోడిసేయ మర్యాదా యంటివి – మ్రొక్కితినంటివి
చాడిసుద్దులు వినవద్దంటివి – సరసుడనంటివి
ఆడికలకు [3]యడమా వలదంటివి – అలుక దీరి యింటికి రమ్మంటివి ॥నేడు॥

---

1. నీవు విన్నవించినందుకు (B). 2. తోచెనో (A). 3. యడమీయ (A).



# 43. హుసేని - ఆది

తెలిసె నీ నెనరులేని జాడలు – తేటతెల్లముగను ॥పల్లవి॥

వలదు నిలుపు యీ మాటలకేమి –
వచ్చె వేణుగోపాల నాసామి ॥అనుపల్లవి॥

మనసు గలిగితె దినమొక సారి – మా యింటికి రావా – యెంతో
చనువుమీర కౌగలించి ముద్దిడి – సరస నుంచుకోవా
తనివిదీర లాలించి[1] కర్పూర – తావి మడుపు లీవా యీ
తనువు నీదని జేసిన నమ్మిక – తప్పునలే కావా – కొంచెగాడవా ॥తెలిసె॥

[2]ఊరిదాకా పోయివచ్చేనని – వూరకె అనలేదా – అయి
దారు దినము లిందుండే మోమొక – సారి జూపరాదా
వారిజాక్షి హితవైతేనే నా – పేరు దలచనీదా – క
న్నీరు నించి దయ మరువకు మన్నది – నీతోనే గాదా – మర్యాద ॥తెలిసె॥

కూడియుండలేదా నను మెచ్చి – కూరిమితో నీవు – యిపు
డాడ కాడ కేమేమో దలచుక – అంతరంగ మీవు
జోడుబాయ లేనని బతిమాలితె – వేడవలదనేవు – నా
ఈడువార లెకసక్కెములాడుట – కింత జేసినావు – మంచివాడవు ॥తెలిసె॥

---

1. కపురపు (B). 2. ఊరుదాకబోయి వచ్చెద నన్నది – ఊరకయినగాదా (B).

## 44. ఫరజు - చాపు

ఎంత వేడుకొన్న పలుక - డేమి సేతుకొమ్మా
ఇంత రాతిమనసు వాని - నెందుగాననమ్మా ॥ఎంత॥

చిటుకు మంటె కోపమైతే - యెటుల సైతునమ్మా
కటకటా దైవమెంత - కరుణ దప్పెనమ్మా
మాయదారి వగల కెంతో - మరులైతినె కొమ్మా
బాయననుచు చిన్ననాడె - బాసలిచ్చెనమ్మా ॥ఎంత॥

గచ్చులాడి నాపై వళి[1] - గల్పించె గదమ్మా
మచ్చుజల్లి నాదు విభుని - మనసు విరచెనమ్మా
వేణుగోపాలుని కిది - వేడుకాయెనమ్మా
జాణననుచు గూడి నన్ను - జాలిబెట్టెనమ్మా ॥ఎంత॥

1. పళి



## 45.ఆనందభైరవి - చాపు

ఏమి సేతు విరహవేదన - ఎంతని తాళుకొందునమ్మా ॥పల్లవి॥

సామి నాపై ప్రేమ మరచె - నామది కెంతో దిగులు దోచె ॥అనుపల్లవి॥

కోరిన కోరికె కొదవలాయె - కూరిమెల్ల వెగటాయె
వారచూపులే జూడడ మాయె - వంచన దైవము పగదాయె ॥ఏమి॥

తలచి తలచి వగచుటాయె - నిలచిన చోట నిలువ దాయె
చెలియరో యన్నము సైచదాయ - చిత్తము వాని విడువదాయె ॥ఏమి॥

మనసురాని మాటలాయె - వినయ మెన్నడో విడిచిపోయె
యెనసి లేదని ఏర్పాటు సేయ యెం - చిన వేణుగోపాలునిమాయ ॥ఏమి॥

# 46. సావేరి - త్రిపుట

[1]చిన్నదాననే - చెనకే విందరిలో నీ - సిగ్గేల బయలయ్యీరా ॥పల్లవి॥

కన్నుసైగజేసి గారడము లాడేవు -
వెన్న ముచ్చిలి దిన్న వేణుగోపాల నే ॥అనుపల్లవి॥

బొమ్మల పెండ్లికి - కొమ్మలు వేగమే -
రమ్మన నేసంతోసమ్మున బోవగ
సొమ్ములివిగో గై - కొమ్మని చెంతకు -
రమ్మని సుంత - ముద్దిమ్మని కొసరేవు ॥చిన్న॥

పున్నమనుచు సన్న - వెన్నెవలువ [2]జుట్టి
కన్నెలతో నిసుక - దిన్నెల చెన్నైన[3]
గున్నపొన్నల [4]చాయ - గన్నేరులు గోయు
చున్న తిన్నగ పొంచి - చన్నులు పట్టేవు ॥చిన్న॥

పండ్లు గావలె చె - ల్లెండ్ల కనుచు గొల్ల
యిండ్లిండ్లు తిరిగి పూ - చెండ్లు కొమ్మని మగ
వాండ్లు నవ్వగా పన్నెం - దేండ్లదానవు నిన్నె
పెండ్లాడేనని గూడ - నిండ్లకు బలిచేవు ॥చిన్న॥

1. చిన్నదాననన్నేల - చెనకే విందరి లోన - సిగ్గెల్ల బయలాయెరా (B).
2. గట్టి (A).
3. దిన్నెల చెంతనే (B).
4. కాయ (B).



# 47. కర్నాట - సారంగ - త్రిపుట

చెప్పినంతమాట చెల్లించుకొన్నాడు - చెల్లునా నీ వలుగను ॥పల్లవి॥

విప్ప పనేమిక - వేణుగోపాలుడు
అప్పుడే యనలేద - యతివా నీముందర ॥అనుపల్లవి॥

మనసువచ్చిన చెలుల - మా యింటికి రప్పించి
మచ్చికసేతు ననలేదా - యెంతో (చెప్పి)
చనువిచ్చి నీకంటె - చాలాగ మన్నించి -
[1]సరసాలాడుదు ననలేదా - యింతా
కని విని సుంతైన - కసటు దోచక యుంటె -
కలికి రమ్మనలేదా ప్రొద్దు పోదా ॥చెప్పినంత॥

అరుదైన సొమ్ములు - అలదాని మెడ నుంచి -
అందము జూతు ననలేదా దివ్య
పరిమళ గంధము - పాలిండ్లపై నలది -
బాగాలిత్తు ననలేదా - మదిని
అరమరలేక నే - నల్లిబిల్లిగా నుంటె -
అలివేణి రమ్మనలేదా యిదే వాదా ॥చెప్పినంత॥

నిన్నుగూడిన యట్ల - నీవు [2]నిలుచుండగ
కన్నెనేలుదు ననలేదా - యిక
కొన్నాళ్ళ కీ[3]సుద్ది - కొమ్మ మరచే వాని -
కొంగుముడి వేయలేదా - యిది
అన్ని సమ్మతించి - అనుకూలమై యుంటె -
అబ్జాక్షి రమ్మనలేదా - తెలుసుకోరాదా ॥చెప్పినంత॥

1. సరసాలాడుచు (A). 2. వినుచుండగ (A). 3. మద్ది (B).

# 48. యదుకుల కాంభోజి - త్రిపుట

ఇంత నిర్దయుడవట - ఇది నానోము ఫలము -
ఇంతి నిన్నన నేలే //పల్లవి//

చింతింప పనిలేదు - చెలియ వేణుగోపాలు
డంతరంగము దెలిసి మనవి ని - రంతరము దెలుపు నాపై //అనుపల్లవి//

చెవి నిల్లు గట్టుక చెప్పిన మాటలు - చిత్తమని వినలేదో
విద్యలకు మెచ్చిన దొర తాగాదో - హృదయమున లేదో
యువిద నన్నలయించ - యుక్తమై తోచితే
యెవరి నొచ్చు కొందు - యెటుల తాళు కొందు //ఇంత//

నమ్మియున్నదెల్ల - నలుగురి ముందర - నగుబాటు కెడమాయెగా
సరివారికి మన్ననలు మిక్కిలి సేయగా - చులకన తనమేగా
యెమ్మెకాని కాబోటి - హితవౌటే పదివేలు
కొమ్మ నేటికి దెలసె - నమ్మ వాని నిజాలు //ఇంత//

మనసిచ్చి కూడిన - మంచితనమెల్ల -
మరపు వచ్చెనేమొగా - దానివలెనే
మదిరా నడువనేమొగా - బాగాయెగా
ననబోణి కార్వేటి - నగర వాసుడైన
ఘనుడౌ వేణుగోపాలుడు - గాంభీర్యపరుడైనే //ఇంత//



# 49. ఆనందభైరవి - చాపు

వలచితినే నీపై ముద్దుబాలా - తలచితే నామది //పల్లవి//

తాళదు విరహ మగ్గల మాయె //అనుపల్లవి//

వంచన మానవే - మంచిమాటాడవే
సంచున బాడవే - పంచశరుని చిలుకా
యించుబోణుల మేటి - వంచు సభాస్థలి విని నే //వలచి//

నమ్మినవాడనే - కొమ్మల వేడనే
తెమ్మెర డాయెనే - నెమ్మది నోర్వ గలనా
సమ్మతి చిగురాకు - కెమ్మోవి తేనె లానగ నే //వలచి//

దక్కితి వలలో - చిక్కితినే గోలా
మ్రొక్కెద యీ వేళ - గ్రక్కున నేలుకోవే
చక్కెర బొమ్మరో - నిక్కము వేణుగోపాలుడ నే //వలచి//

# 50.ఆనందభైరవి - త్రిపుట

కుందరదన నాపై - కూరిమి మరచితో
కొసరి వేడిన పలుకవేమె - ఆ ఔనే ॥పల్లవి॥

సుందరీమణి వడి - సుళ్ళుబెట్టుచు యిట్లా
యెందుకు యేచేవు - యికనైన దయజూడవె ॥అనుపల్లవి॥

కలనైనా మరువ జాలనే నిన్ను - గడియ జూడకున్న జాలేనే - యిట్లా
అలయించిన నాదాయ మెంతౌనే -
వలచి వేలు నాకి - వ్రతము జెరుచుకొంటినే ॥కుంద॥

అడుగులకు మడుగులొత్తేనే కెమ్మో - వాన నీయవె జుంటితేనె
పడుచు తనమా బుద్ధి - బంగారాయనే
తొడరి దైవానికే - ద్రోహము జేసితినె ॥కుంద॥

వేణుగోపాలుడ గానా నన్నీ - వేళ రతుల సుఖానా - కీర
వాణి ప్రేమదాచితే- వడ్డికి మారున
జాణవైనావే నీ సరి యవరే చెలులలోన ॥కుంద॥



# 51. ఆనందభైరవి - రూపకం

ఒట్టు బెట్టుదు సుమ్మీ - వలదు యీ సరసాలు ॥పల్లవి॥

పట్టకురా నా కొంగు - గట్టిగ వేణుగోపాల ॥అనుపల్లవి॥

ఇందుంటే వకమాట - యిలు వెడలితే వకమాట
[1] దందనకాడా రా నీ - దయలెల్ల దెలిసె
యెందుకు వేడుకొనేవు - యెవ్వరు నేర్పిరీ చిన్నెలు
సుందరివలె నీకైన - అందకత్తెను గాను ॥ఒట్టు॥

ఎక్కడ నీమది కితవో - యెవతెకు నీపై నెనరో
అక్కడికే పోవలె గా - కిక్కడ పనియేమీ
కక్కసమున వకటంటె - కానిది యనిపించుట కా
చక్కగ నీ వెందైనా - చల్లగ యుండుటె చాలు[2] ॥ఒట్టు॥

[3]తగవా శ్రీ కార్వేటి - నగర వేణుగోపాల
ఆగడైతి నినుగూడి - నందున సుఖమేమి
మొగమాటము జూడ నీ - వగలెల్ల నావద్దనా[4]
సగమాయెను ప్రొద్దైతె - తగ దిందుండను నీకు ॥ఒట్టు॥

1. దండనకాడవులేర (B).
2. పక్కకు నను బిలిచేవు - పయికొనుమని కొసరేవు
చక్కని వాడవు లేర - సారస్యమ నేగంటిని (B).
3. నగరా.
4. మొగమాటమి జూడనిక - మోసము లెల్లను దెలిసెను (B).

## 52.ముఖారి - త్రిపుట

పయ్యెద తొలగించినదె నేరముజేసి –
 పలుకకుందురటవే ॥పల్లవి॥

 వెయ్యి విధమ్ముల వేణుగోపాలుడు –
 నెయ్యము జేసిన నెవరైన దలచక ॥అనుపల్లవి॥

కలనైన పరసతుల – కన్నుల జూడని
 చెలువుడె నీపాద – సేవ జేసేనంటే
 వలదు పొమ్మనుచు ఆ – వలి మోమైతివి
 చెలియరో నీకింత – చెల్లుబడి యేమే ॥పయ్యెద॥

తియ్యనీ కెమ్మోవి – తేనె లీయవే యని
 చెయ్యెత్తి మ్రొక్కిన – చేర దీయవైతివి
 అయ్యయ్యో సుంత వా – దసురుసురనుకొంటె
 తొయ్యలి నీకిది – దోసము కాదటే ॥పయ్యెద॥

ననబోణి నిను చిన్న – నాడే జెలిమి[1]జేసి
 యెనసినాడని మది – నెందుకే పదరేవు
 అనుకో పనేమిక – నతివరో యూరకే
 వెనక చింతించేది – వెఱ్ఱితనము కాదా ॥పయ్యెద॥

1. జులిమి (A).



## 53.ముఖారి - చాపు

ఎందుకు బొంకేవు రాలేదని నాతో –

 యెమ్మెలు సేయకురా ॥పల్లవి॥

 [1]ముందరివాడవ వేణుగోపాల నీ –
 ముచ్చువగలు మానరా నాసామి ॥అనుపల్లవి॥

నిన్న దానింటికి పోలేదో – నీవది నన్నాడు కోలేదో
 అన్ని యిపుడే తార్కాణగాదా – యౌర యిట్లైతే కోపమురాదో ॥ఎందుకు॥

 సరసాలాడుకోలేదో – సన్నజాజులు జడ నుంచలేదో
 [2]పరిమళ మలదలేదో – భామచే వీడె మందుకో లేదో ॥ఎందుకు॥

చెలిని కౌగలించలేదో –చేరి[3]మోవిని ముద్దిడలేదో
 కిలకిల నవ్వుకోలేదో – కీరవాణిని మెచ్చుకోలేదో ॥ఎందుకు॥

దయ మరున వద్దనలేదో – దక్కితినని వేడుకోలేదో
 నయముగా పదము వినలేదో – నాతి నిను బా[4] యలేదనలేదో ॥ఎందుకు॥

నన్ను గూడిన వాడవు గాదో – నాతో నీ సుద్ది దెలుపనీదో
 చిన్నబుచ్చితే దోసము లేదో[5] – కన్నె నేలితినని పలుకరాదో ॥ఎందుకు॥

1. ముందటి (B). 2. పరిమళగంధ మలదుకోలేదో (B).
3. మోవాని (B). 4. బాయలే ననలేదో (B). 5. గాదో (B).

## 54. ముఖారి - ఆది

అక్కరలేని కాపురమాయె – అతనిమనసు వేరాయె ॥పల్లవి॥

యెక్కడిదీ దానిపాలాయె – యెవరాడిన రోసము లేదాయె ॥అనుపల్లవి॥

మగువ నా పేరు దలచడాయె – మమతలు మరుపాయె
పగలు రేయి అందె వునికాయె – పాళి యెక్కు వాయె
సొగసు లీవెనుక మెండాయె – వగలు సేయనాయె
యిగురు బోణికిది నవ్వులాయె – యేమమ్మా వలపుమందు మాయ ॥అక్కర॥

ఇంటి దోవ తొంగి చూడడాయె – సొంట్లు వెదకుటాయె
వొంటిగా చెప్పి చాలాయె – యోర్పు లేదాయె
తుంట పడుచు సాహసమాయె – మంటిముక్కాయె
అంటి ననుచు యీసు నిండాయె – ఔర ఆరపరాని ముత్యమాయె ॥అక్కర॥

దానిపొందు సంతోసమాయె – దైవము తోడాయె
చానరో నాపొందు కల్లలాయె – సద్ద లేదాయె
తాను వేణుగోపాలుడాయె – దయలు దూరమాయె
కానివారి కిది వేడుకలాయె – గయ్యాళే వానికి సతమాయె ॥అక్కర॥



## 55. ముఖారి - ఆది

తన చిత్తము వచ్చి[1] నట్లా –దయసేయ మనవే యేమే ॥పల్లవి॥

వినవే శ్రీ కార్వేటినగర – వేణుగోపాలదేవునితో ॥అనుపల్లవి॥

చెలిని వేడుకొన్నాడట – చెయ్యెత్తి మ్రొక్కినాడట
అలివేణితో నన్నేమేమో – అనుకున్నాడట
నళినాక్షికి గుడిముందర – నమ్మిక లిచ్చినాడట
జలజగంధి విభు డెందైన – చల్లనై యుండుటే చాలు ॥తన॥

తొడరి యీ దిక్కు జూచితె – దోసము వచ్చు ననెనట
పడతి వద్ద మీసము[2] దిద్ది – [3]పదురుకొనెనట
తడయక నా పేరు [4]దలచి – పుడక ద్రుంచివేసెనట
అడుగులో వేయి గుణములైతే – అతని దిద్ద నెవరి వశమె ॥తన॥

మోహనాంగుడు నను తొలుత – మోసపోయి గూడెనట
ఆ హరి సాక్షిగ యిక – నన్నంటు కోడట
సాహసురాలని నిందు – సభలో [5]వాకొన్నాడట
స్నేహము నాటియుండితె – చెలువునికే దయవచ్చీని ॥తన॥

---

1. నటుల. 2. దువ్వి (B). 3. పదరు (A).
4. జెప్పి (B). 5. వాదుకొన్నాడట (A).

## 56. అసావేరి - ఆది

వంచనలకు గురుపీఠమురా యీ –
చంచలాక్షి యనగా – అంత ॥పల్లవి॥

మంచిది కదా యంటివి యిక పలు
మాటలేల వేణుగోపాల ॥అనుపల్లవి॥

కండ్లు తేలించి కులికి నవ్విన – కౌగిలించినా – పువ్వుల
చెండ్లు దెప్పించి శిఖను జుట్టిన– చెక్కిలి నొక్కినా
గుండ్ల పేరు నీకు కానుకిచ్చిన – గుస గుస లాడినా
ముండ్ల మీది వలువ సామ్యమేగా – ముదిత వలపు తిన్నగ దెలిసీని ॥వంచన॥

అడుగులకును మడుగులు తా పరచిన – హారతులిచ్చినా – కర్పూర
విడెము సేయమని లాలన జేసినా – వీణె మీటినా
గడియ కొక్క వింత సొగసు జేసిన – గంధము బూసినా
వుడుము కలుగులోని చెయ్యి సామితె – యువిద నెనరు తిన్నగ దెలిసీని ॥వంచన॥

మూతి సాచి ముద్దిమ్మని కొసరిన – ముచ్చట జెప్పినా – తన
చేత విరుల సురటి బూని విసరిన – చేలాగిచ్చినా
రాతిరి నీ మనసు రంజిలగ – రతుల గూడినా –
కోతిచేతి మాణిక్యము సామితె – కొమ్మ మనసు తిన్నగ దెలిసీని ॥వంచన॥



## 57. సావేరి - ఆది

పూసలోని దారము వలె యెంత జేసెనే
నమ్మినందుకు అయినా బల్ ॥పల్లవి॥

[1]మోసమే అడిగితే తగని – రోసమే వేణుగోపాలుడు ॥అనుపల్లవి॥

[2]ఎవతె యింటికిని పోసనె నాతో – యెందరిండ్లు తిరిగి వచ్చె గడియలో
శివశివా అతని మోము జూచితే –సేతుయాత్ర పోయి వచ్చిన తీరదు ॥పూస॥

అటక మీద [3] చలువచీర సైగగ – ఆపెకిచ్చి సేవించు కొనెనట
కటకటా వీనిపేరు దలచితే – కాశియాత్ర పోయి వచ్చిన తీరదు ॥పూస॥

నాయకసానులసంగతి నిమిషము – బాయలేదు నన్ను వలచి యొల్లక
మాయ చేసి గూడి నందు కిక చాం– ద్రాయణము చెరియించిన దీరదు॥పూస॥

1. మోసమే యడిగితేను యెంతో (B).
2. ఎవతె యింటికి బోనని బొంకి – యెందరిండ్లు దూరి వచ్చె గడియలో (B).
3. సరిగ (B).

## 58. కాపి - ఆది

వక్కకైన నాస లేదు గదవే - వానిచెలిమి కొక దండమే - మంచి ॥పల్లవి॥

చక్కని వాడైతే నిందునటే - సఖియ వేణుగోపాలుని చేతి ॥అనుపల్లవి॥

చెడ్డచేని కింటివద్ల పొంగలి - జేసినట్లు యెదురుసు[1]దరిశించితె
దొడ్డ రసికుడనుచు పేరుమాత్రమె - గుడ్డిగవ్వ జూచితె నీ యాన ॥వక్క॥

ఉడుము బోతె[2]పోయినది చై మాత్రము - విడిచితే చాలు ననేకతగా
పడతి తాను కుదువబెట్టిన సొమ్ములు - పైకమిచ్చి విడిపించిన చాలదా ॥వక్క॥

[3]మొగమాటమున మాట తోయజాలక - మునుపు యెవతో కడుపాయె నందురు
[4]వగయింత లేక వాని గూడితి - వుసురుంటే ఉప్పమ్ముకోగల ॥వక్క॥

1. యెదరుప దర్శించితి (B). 2. బోనీ చెయి మాత్రమె (B).
3. మొగమాటమి (B). 4. ఉగ (B).



## 59. ధన్యాసి - చాపు

ఇచ్చినా మంచిదె ఇవకున్నా మంచిదె -
ఇంటికి రమ్మనవే ॥పల్లవి॥

[1]వచ్చితే యేమన వలదే మెచ్చుకొనీని
మెచ్చరాని చుట్టమే వేణుగోపాలుడు ॥అనుపల్లవి॥

కలనాడు వకగవ్వ - గా సెలవుసేయడా -
తలచిన వస్తువు - దయ సేయడా
కలిమిలేము లనగ - కావటి కుండలు
[2]కలకాలమొక రీతి - గావచ్చునా వుండి ॥ఇచ్చినా॥

మేలు దలచక యీ - వేళ పొమ్మంటే
వాలుగంటి దై - వము మెచ్చునా
ఆలోచ నెందుకే - అతడు మనకు వేరా
కాలము బోవును - కడను మాటనిలుచు ॥ఇచ్చినా॥

నేడువచ్చిన నెనర - నెలత నన్ను రతుల
గూడిన ముచ్చట - గురు[3]తెరుగగా
[4]ఆడికులకు లో - నౌదున బాగాయ
వాడల బండ్లొచ్చు - బండ్లువాడల బోవు ॥ఇచ్చినా॥

1. వచ్చితే నేమన - వలదు నొచ్చుకోవలె (B).
2. కలకాల మొకరీతి - గావచ్చునటలే (B).
3. తేరుగడా (B). 4. ఆడికెలుకులో (A).

## 60. శంకరాభరణం - ఆది

తేనెలూర మాటలాడ రాకు తెలిసె నీనెనరు ॥పల్లవి॥

మానినీమనోహర శ్రీ సాళువ మాకరాజ కార్వేటి రాజేంద్రా ॥అనుపల్లవి॥

పండుగనుచు వెచ్చాని కడిగితే - పళ్ళిపట్లు రెండా - నాపై
కొండెకారి మెడకు మంచి బంగరు - గొప్పగుండ్ల దండా
నిండుకొలువులో విరులుంచితివా - నెలత కొప్పునిండా - యిక
వుండ వలద ఇటువంటి నేస్తము - యువిదె నెనయుచుండ - వదలకుండ ॥ఇచ్చినా॥

ఎక్కువైన ముత్యాల పాపట - ఇంతి కీయలేదా - యెన్నో
లెక్కలాడి నా చేతికిచ్చినది - యొక్క చీరగాదా
నక్కవినయములు జేసే వారికి - చక్కని మరియాదా - నే
నిక్కమే మంచి నోము నోచితె - నీకే దయరాదా - యికమీద ॥ఇచ్చినా॥

మరునికేళి మెప్పించినందుకు - మగువ కింత ధనమా - నా
సరస జేరి యేలుకొమ్మంటే - సామీ దంధనమా
అరుదు జేసి యా చెలినే పొగడే - వౌరా నెరతనమా - తన
పెరటిచెట్టు మందుకు గైకోరని - పెద్దలనగ వినమా ఇది ఘనమా ॥ఇచ్చినా॥



## 61. ఆనందభైరవి - ఆది

దానికెవ్వరు సాటి ఆవెలది నీకే - తగురా రాజకిరీటీ ॥పల్లవి॥

మానితవరగుణపేటీ - నీ పై - మరలు కొన్నదిరా మాబోటి యిక నిను
మానదురా భానుసమతేజా - మాకరాట్కార్వేటి రాజా ॥అనుపల్లవి॥

మగువను సభల నెన్నుదురు - చంద - మామ నదలించు నెన్నుదురు - ఆ
వగలాడి పల్వరుస కుదురు - మేటి- వజ్రమణులనుచు పల్కుదురు - ఈ
జగతి దాని కెవ్వరు నదురు - విరి - జాజులంపె నీకు నదురు - మంచి
నిగనిగలు గల మొగడు తమ్ముల - దెగడు చనుగవ - బొగడ తగునిక ॥దానికె॥

వనజగంధి కనుల దీరు - చూడ- వలరాజు చేతికిలితీరు[1] - ఆ
ఘనవేణి మెరుగు నూగూరు సౌరు - గణుతింప ఫణిలీడుగారు
నిను రమ్మనె పలుమారు - తూపు - మొనల కోర్వరు పలుమారు - అను -
దినమునను చెలిమనము నను పెన - గొనినతమి యింతనగ వశమా ॥దానికె॥

సుదతి నెన్నగ శ్రీలమిన్నా - దాని - శ్రుతుల వైఖరి శ్రీలమిన్నా - ఆ
మదవతి [2]కే గౌనుసున్నా - నాదు - మనవి వినవా మనసున్నా
బెదరించు కురులళుల కన్నా - గొప్ప - పిరుదులు చక్రములకన్నా - సామి
అదనిదని మరుకదనమున సతి - నెదను తమి - వదలకను గదియర ॥దానికె॥

1.చే చికిలితీరు (A). 2. లేగౌను (A).

# 62. శంకరాభరణం - త్రిపుట

వలదు యీ మాట లేలరా - మది హితవైన - వనిత యిల్లిది గాదురా ॥పల్లవి॥

వెలయ శ్రీ మాకరాజ - వీర కార్వేట్రాజేంద్ర
చెలులు దెలుపగ దెలిసె నీవగలు - చాలు పదివేలు ॥అనుపల్లవి॥

కరుణ చేతను కోరి మోహించియా -
కనకాంగి నినుజేరి - మరి మరి తమిమీరి
విరహ భరముచే - తరము గాక తారీ - మరులూరీ
తరుణి గురుకుచగిరుల నురమున -
నొరసి మురిసిన - సరస మెల్లను
మరచి వత్తుర యేర యీదారి - ఓరోరి ॥వలదు॥

సగము రేవేళాయరా - నీరాకకై - సఖియ యెదురే జూచురా
తగని ముచ్చట లేలరా నేనొకటంటే -
వెగటు దోచదటరా - బాగేనటరా
మగువ లెల్లను - నగగ నీవిటు - అగడు సేయగ నగున జిగిబిగి
సొగసు మిగులగ - పెనగ గలనటరా - నన్నంటకురా ॥వలదు॥

సతతము నను చాల - మెచ్చియుండిన - జాణతనము లేల
బతిమాలు కొనేదేలా వినయములకు నే -
నతి బేలనా యిట్లేల - చతురోక్తులేల
తతిని దెలుసుక - అతివవలె బహు -
గతుల నిన్నుపరతుల నెనయుచు
సతులు మేలన ఘనుడనే - జాల నీ రవ్వలేల ॥వలదు॥

వనజాక్షీ బోటులెవరైనా - యిచ్చట యున్నా
వని దాని సముఖానా - మనవి జేసిరైన -
నెరనమ్మిన చనవరి సుంతైనా - కొనియాడునా
అనువుగను నను - దినము యాజ -
వ్వనిని గలసిన పనులు హొయలుగ
తనిసియున్నది నీకు మనమునా మరులూనా ॥వలదు॥

పలుమారు ఎంత కొసరిన మునుపటి వలెనే -
బాళితో మనసిచ్చేనా - చెలువుడనుచు జూచేనా -
ఇకమీదనా - యిలుజేర రానిచ్చేనా - చనువిచ్చేనా
తొలుత చెలిమిని - కళలు గులుకగ -
కలసి మెలసిన - సొలపు దలతున
తలపు తెలియని - వలపు తగవేనా - యేమైనా ॥వలదు॥



# 63. బిలహరి - త్రిపుట

ఏలనే యీచల మేలనే పలుమారు -
మేలు దాన ననవే - వినవే ॥పల్లవి॥

బాలరో వేణుగోపాలుడు నన్నింత -
జాలి జెందించి యాలోలాక్షి యిలుజేరె ॥అనుపల్లవి॥

కుటిల కుంతలి విను ని - న్నటిరేయి విరితోటా
కటుల రమ్మనె నట - విటరాయడిటుల - ఆ
విటుకులాడిని బిగికౌ - గిట జేర్చి మేటౌ చా
కటు లిచ్చినాడట - యెటుల సైతు నే నిచటా ॥ఏలనే॥

కొమ్మ రమ్మని నిన్నే - నమ్మినానని విభుడా
యెమ్మెలాడి జడను - కమ్మని మరవంపు
రెమ్మలు సవరించి - సొమ్ములు ధరియించి
నెమ్మది గూడినా - దమ్మ మనమ్మున ॥ఏలనే॥

ఎంత సంతోసముగా - కాంతలలో మేటైనా
హొంతకారివే యని శ్రీ - కాంతుడు ననుగూడి
నంతలో దాని యే - కాంతము మది దలచి
పంతగించి నటుల - చెంతకు రాడాయె ॥ఏలనే॥

# 64. పంతువరాళి - త్రిపుట

వట్టి చూపులతోనే - వలపు బుట్టించ నీ -
వలె నెవరీ జగతీ లేరే - ఇది నీ - ॥పల్లవి॥

పుట్టుక దినుసేమొ - పొలతి కలయ చై చై
తట్టి నగువగానె - తనువు ఝల్లుమనగ ॥అనుపల్లవి॥

సందెవేళ నీవు మా - సందు వీధిన వెడలి
కుందరదనలతో - గుసగుసలా
ముందు వచ్చుచు లేని - ముచ్చువగల [1] తొలవై
మందిలో గ్రక్కున - మాటిమాటికి తిరిగి ॥వట్టి॥

నిన్న జగన్మోహి - ని వలె తళుకుగ
అన్ని సొగసుల నీ - వందముగ
తిన్నగ తిలకము - దిద్ది యద్ద మెదుట
వన్నెలాడిరో తలుపు - వారజేసుక తొంగి ॥వట్టి॥

పల్లవాధరి నన్ను గో - పాల రమ్మని బిలచి
అల్లిబిల్లిగా నుండి - యాదరించి
కల్లలాడిరొ మరుని - కార్పణ్యములు బాయ
కొల్లగ రతినేలి - కోరిక దీర్చక ॥వట్టి॥

1. తొవై (A).



# 65. పంతువరాళి - ఆట

వింటిరేమే చెలులారా - వాని చెరియలు - గంటిరేమే సఖులారా ॥పల్లవి॥

గొంటుకాయై[1]తిరిగే వేణుగో - పాలు దలివేణి కూతురి
గంటీలు దొంగిలిచి చిత్ర - గంటి [2]చేను చేరెనట ॥అనుపల్లవి॥

[3]ఇందుబోణింట్లో ఉయ్యాల - మంచము మీద గూర్చుండి
పంచదార నెయ్యి పాలార - గించి [4]మందపయి కర
కంచుచీర చంకలో ఇరి- కించుకొని గడియదీసి
కంచి కావల తెల్లవార - కదిలెనట కాలికొద్ది ॥వింటి॥

సరసుడ నీ వద్దజేరి - మురియుచు బాగాలందిచ్చి
పరిమెళగంధి పక్కలో - పవ్వళించి తా
సరిప్రొద్దున లేచి దాని - సరిపెణ కత్రించుకొనీ
తిరవళ్లూరు దాటిపోయి - తిరిగి చూచి నవ్వెనట ॥వింటి॥

ఈవికానివలెనె చెలిని - హితవుగా దగ్గర దీసి
తావు తావులంటి రతుల - తనియించే వేళ కత్తెర
బావిలి విడుచుకొని సరిగ - పయిట కొంగున తేలు గట్టి
భావించినపుడె సవుదూరు - బంకాపురము కదిలెనట ॥వింటి॥

1.కాద్దై (B). 2. సీమ (A). 3. ఇంచుబోణి (A). 4. మంచపయి కర (A).

## 66. శంకరాభరణము - ఆది

అలుక జేసి పలుకదేమొ యాచెలి – వలపుమందు బలిమో //పల్లవి//

వెలది వినవె శ్రీ కార్వేటినగర – నిలయుడైన వేణుగోపాలుడు //అనుపల్లవి//

కలికి చిలుక పలుకులకును సొలయుచు – చెలిని గోరినాడే – నను
బలిమి జేసి వలచియున్న బాలిని – కలసి యెంచినాడే
తలిరు బోణులలో – బలు విధముల నిటు – చులక జేసినాడే – యిక
చెలిమి దలచి కలసి మెలసి అలయక –
వలపు నిలుపగలన లలన[1]చెలుడు //అలుక//

తెగువ తోడ నా మగువకు వెలగల – నగలు యిచ్చినాడే – నే
సగము రేయివేళ నగరు బంపితె – అగడు జేసినాడే
వగలు జూడ నే సొగసుగ బిలిచితె – నగవు లాడినాడే – యీ
పగలు వలదు – సుగుణముగల నగధరు
దగిలి పొగడి – తగదను బహు ఘనముగ //అలుక//

సరసముగను యా సరసిజముఖిపై – మరులు జెందినాడే – నే
సరస జేరి కరుణ జూడమని నను – విరస మాడినాడే
తరుణి వినవె మును సురతము నేలిన – సరణి మరచినాడే – యీ
మరుడు శరము – చురచురమని గురుతుగ –
నురము నొరయు – బరపె తరమ మరిమరి //అలుక//

1. చెలువుడు (A).



## 67. ఆరభి - ఆది

నేను నీవు కనుగొన్నవేళేమొ –
నేస్తము బాయదుగా
మరీ మరీ – నెమ్మది గలిగెనుగా //పల్లవి//

మేను నీ సొమ్మని యానలిడుకొని –
మెచ్చితి యీడని వేణుగోపాలుడని //అనుపల్లవి//

చిన్ననాడు పండు వె – న్నెలలో యిసుక
దిన్నెలపై సుర – పొన్నల పాన్పున
పన్నీరు జల్లుక – పవళించె లాహిరై
యెన్నెన్నో విధముల – యెదనెద నదుముక //నేను//

ఊరినుంచి కలలో – వొచ్చి పైకొన్నట్లు
వులికి దిగ్గున లేచి – నే నెదిరించి నట్లు
తీరుగాదని డింకి – తిరిగి సొలసి నట్లు
చేరి లెమ్మన్నట్లు – చై చై పట్టినట్లు //నేను//

మగడు వినిన చుట్ట – ము లెడబాసిన
తగదని భూపతి – దండన జేసిన
అగడైనా యెంతపాపము వచ్చిన –
జిగిబిగి సొగసుగ – వగలుగ పెనగొన //నేను//

## 68. ముఖారి - ఆది

చాలు చాలు వాని నేస్తము యిక - నేలనే [1]మనకాడ ॥పల్లవి॥

బాలరో వరద నారాయణు - డా లతాంగి గూడి
మెలగి యుండుటె చాలు ॥అనుపల్లవి॥

ఆస జెప్పి గుడి ముందర యిచ్చిన - బాస మరచె కొమ్మా - యీ
దోసకారి యెందరినో యీవగ - మోసబుచ్చెనమ్మా
నా సరైన చెలులు విన్న వికవిక - నవ్వరేమమ్మా - విన
దోసమో కలిగిన మాటంటె - రోస మెందుకమ్మ పోవమ్మా ॥చాలు॥

తనువు తనది జేసియున్న నా వం - తైన దలచడమ్మా - యేదొక
మనవి దాని కెరిగింపక వినడట - మంచి పనేనమ్మా
నెనరు వాని జాడ లాడకాడకు - నేడు గంటికొమ్మా - అతి
వినయమెల్ల ధూర్త లక్షణమనే - విధమాయె గదమ్మా లేవమ్మా ॥చాలు॥

వరద నారాయణ సామెంత - వంచన వాడమ్మా - నా
సరస జేరి నను గూడి లేదనుచు - సాధించె గదమ్మ
యిరవు పల్లిపట్టితేనే తన - యెక్కు వెవరికమ్మా - యే
మెరుగనట్టి వానివలెనె వుండి - యెంత జేసెనమ్మా వలదమ్మా ॥నేను॥

1.మనకూ ఓ (A).



## 69. ఆనందభైరవి - ఆది

రమ్మనే యీమేను వాని - సొమ్మనే
కౌగిట జేర్చు కొమ్మనే మోవితేనె - లిమ్మనే ॥పల్లవి॥

బాలనే తమక మణప - జాలనే పతి జూడని సొగ
సేలనే యీ జవ్వన - మేలనే ॥అనుపల్లవి॥

మించెనే మరుడు నన్నెది - రించెనే శుక శారకెలు రవ
ళించెనే నెలరాజు గ - ర్వించెనే ॥రమ్మనే॥

వాదటే యీ మేను నీదే - గాదటే వాని నందు తే
రాదటే నెనరింతైన - లేదటే ॥రమ్మనే॥

మెచ్చెనే దాని నడిమీకి - దెచ్చెనే మేలైన బిరుదు
లిచ్చేనే యెంతపని - వచ్చెనే ॥రమ్మనే॥

నాయమా వెతలు బెట్టుటా - దాయమా వొంటిగా నుండే
పాయమా - నా చెలిమింత హేయమా ॥రమ్మనే॥

చూచునా తొలుతటి ప్రేమ దా - చునా మనసున దయ
తోచునా నేరములన్ని - కాచునా ॥రమ్మనే॥

ఒట్టు బెట్టి నన్నేలీనా - వరదనారాయణుడా పల్లి
పట్టునా తిరుగా చెట్ట - బట్టునా ॥రమ్మనే॥

## 70. ఫరజు - ఆది

రాజీవాక్షిరో సామిని - రాజిగ రమ్మనవే ॥పల్లవి॥

రాజసమున మాయింటికి - రాచెల్లదు కనవే ॥అనుపల్లవి॥

చెలులేమే మెగబోసిరా - చెలువునితో నేడు
పలుమరు యెంతో వేడిన - పలుకక యున్నాడు ॥పల్లవి॥

తాయిచ్చిన నమ్మిక లం - తా యిపుడేమాయ
హా యేమని దెలుపుదునె - హాయే లేదాయ ॥పల్లవి॥

వూరకె మది నొప్పించితె - వూరట యేమమ్మా
వేరుగ నను జూచితె న - వ్వేరు గదే కొమ్మా ॥పల్లవి॥

వరదా నారాయణు డీ - వరదాక నన్నేలి
సరిదానికి యసమిచ్చి కొ- సరి తా బతిమాలీ



## 71. ముఖారి- త్రిపుట

అరుదు గాదట వేమె - యమ్మనే జెల్ల నే -
దతడిందు వచ్చినది ॥పల్లవి॥

సరసిజముఖి అన్నృణ - సరసీతటి నెలకొన్న
పరమాత్ముడైనట్టి - ప్రసన్న వేంకటశౌరి ॥అనుపల్లవి॥

దక్కితినని చెలులెం - దరో చుట్టు తిరుగగ
వక్కతేప కడపైన - తొక్కినాడటే యింక
యెక్కడి మోహమే - యెపుడు నిన్నెరుగడు
చుక్కవంటి ముత్యపు - ముక్కర తీసుకొని ॥అరుదు॥

నిగ్గులెంతసేపే - నిలువుటద్దము మానీ
సిగ్గు పడక పోవె - దగ్గరికి పిలచీనీ
యెగ్గు బెట్టేవు సుమీ - యే పని జెప్పిన
మొగ్గలపనిచీర - మొన్ననే తీసుకొని ॥అరుదు॥

ప్రేమమీర నిన్ను - పెనగి కూడేవేళ
రామామణిరొ యుప - రతి గానీ ముందర
సామిగాదా యని వం - చాడించ బొయ్యేవు
నేమము రేపైనీ - నేవళము దీసుకొని ॥అరుదు॥

## 72. కాపి - చాపు

నను గురుతు దెలియ నిచ్చున ఈ భాగ్యము మీద
నాతివల్ల నేరమా యేమె ॥పల్లవి॥

అన్నృణ సరోవర - మనుకోగా వినలేదా
ఘనవేణి ప్రసన్న వెం- కటశౌరి నే గాదా ॥అనుపల్లవి॥

సగము రేయి దాక - సంధానా లంపించి
వగలాడి నీవు నా - వద్దకి రాలేదో
ఇగురుబోణిరో యీసు - ద్దెరుగకుండ నాడీ
మగరాల కమ్మలే - మగడిచ్చెనే నీకు ॥నను॥

తలిరాకువంటి పా - దము లొత్తుచుండగ
అలసితివని నీతో - అన్నదైన కద్దా
తలపురాదుగ యిసుమం - తైన నీ మదికి యీ
గిలకలమంచ మే - చెలువు డిచ్చెనే నీకు ॥నను॥

త్రాణ దానవె తల - దడివి బాస జేసిన
యేణాక్షి నమ్ముదురు[1]- యెంతటి పనికైనా
మాణిక్యములు చింది - మాటలాడితే నీ కీ
వీణ దీసిచ్చిన - విటకాని పేరేమె ॥నను॥

మరుపు వచ్చుటకు - మహవింత గావలెనా
సిరులు మించిన వార - స్త్రీల ధర్మమెగాదా
పరిమెళవతి యీ వు - ప్పరిగె గట్టించిన
దొర యెవరో దెలుపవే - దోసకారి సుంత ॥నను॥

వింత ఇది యేమైన - విరిబోణి నిను బాసి
అంత నిన్నటికి పద - హారేండ్లు మట్టుగ
కంతుకేళి నన్ను - గలసి నందుకే సాక్షి
ఇంతి తొలుచూలు కొడు- కెవరి పోలికె అయినా ॥నను॥

1.నమ్ముదుర (A).



## 73. ఘంటారాగము - ఆది

తటుకు తటుకు మని యదరీనె గుండె -
దిటువు లేదె నీ సాక్షిగా ॥పల్లవి॥

కుటిలకుంతలి యన్నృణ సరోవర -
మట ప్రసన్న వేంకటశౌరి మొన్న
చిటికిలో వలపించి పోయె నే[1] -
నెటుల సైతు దెలుపవె నా రొమ్మున ॥అనుపల్లవి॥

నిలువ నీయదు నిలిచిన చోట - నిమిషమొక్క యుగమాయెనే
పలుకనీదు ప్రాణసఖుల మీది - బాళియెపుడు మరుపాయెనే
తలచి తలచి వేదనచే గుందితి - తలవాకిట నిలచి యెదురు చూచితి
లలన యీతనిపై రోసితి - చెలువరాయని బాసిన మొదలుగ ॥తటుకు॥

అన్నమేమో నా జిహ్వాకు సుంత - హాయనేది లేదాయెనే
కన్నెరొ విరహాగ్ని చేత - కరిగి మేను సగమాయెనే
అన్ని దైవముల వేడుకొంటి - అతనికైన వారిని శరణంటి
యెన్ని శకునములో జూడమంటి - యెమ్మెకాడిటకు రానందుకు ॥తటుకు॥

రతులు దేలించిన నాసామి - రాక సమయమిటు జేసెనే
అతివరొ సరివారు నవ్వగ - అగడు నాతల వ్రాసెనె
పతిని విడచి నేనేవగ సైతు - పణతి యీ తొడవు లెచట వైతు
మితము మించె చిలుకతేజి రౌతు - మేలువాడు వెంచేసేటంతలో ॥తటుకు॥

1. పాయనే (A).

## 74. ఆనందభైరవి - ఆది

నీ యింటికి నీవు వచ్చేటందుకు –
నెలత నంపవలెనా ॥పల్లవి॥

రాయబారమా చిరుతని చెంగల్వ
రాయా యిదీ మా బాగాయ ॥అనుపల్లవి॥

ఎపుడు వత్తునని యెదురే జూచుచు –
యెవరు వచ్చినా శకునము లడుగుచు
కపట దైవాల కెల్ల మ్రొక్కుచు –
కరగు[1]చున్న నను చే బిలచుచు ॥నీ యింటి॥

ఒకటి రెండనుచు దినములు యెంచి –
వద్ద దిరుగు చిలుకల నదలించి
సుకము లేక పైపై తమి మించి –
పొలయుచున్న నన్ను పొంద దలంచి ॥నీ యింటి॥

చెలుల కందరికి లంచముగట్టి –
శయ్య మీద చెక్కిట చెయి బెట్టి
వలరాయని రోయ బాయదిట్టి–
వగచుచున్న నాపై దయబుట్టి ॥నీ యింటి॥

1. కరుగుచున్నను చేరబిలచుచు (A).



## 75. ఆనందభైరవి - త్రిపుట

వలచి వచ్చిన దానరా – మది తమిదీర –
మెలగి కౌగిలీరా ॥పల్లవి॥

చెలులు నవ్వేరుగా చెంత జేర్చుకోరా –
లలితుడవౌ శ్రీ కళ్యాణవేంకటేశ్వరా ॥అనుపల్లవి॥

అలగి యుండుట ఏలరా – నేరమేమిరా –
పలుకరించ రాదా – ఔరా
చలము సేయకురా – సామి నీకు మ్రొక్కేరా
నిలచి మాటాడర – నీ కెదురే జూచితిరా ॥వలచి॥

మరుడు నన్నెదిరించెరా – యేమి తోచదురా
విరహ మగ్గల మాయెరా
నెరనమ్మి నానురా – నేటి నేస్తమటరా
తరి దెలిసీ యేచకురా – తనువు నీ సొమ్మేరా ॥వలచి॥

ఎంతని వేడు కొందురా – మోహనాకార –
యెన్నాళ్ళనుసరింతురా
అంతరంగ మీవేరా – ఆదుకొందువు రారా
కంతుకేళి గూడరా – కళలు చెలంగెనురా ॥వలచి॥

# ద్వితీయభాగం - దేశీయం

## 76. బేగడ - ఆట

నీ పొందు సేయక విడచేనా వేరే -
నెలత కొప్పున విరులు ముడిచేనా - అరే ॥పల్లవి॥

బాపురే నే సేయు - ప్రతిన[1] చెల్లక పోతే
నాపేరు ఇక [2]వేణు - గోపాలు డనవలెనా ॥అనుపల్లవి॥

మరుని గూర్చి తపము సేయనా యీడా - మనసు లేదంటేనే ఆయెనా
మరులు నిలుపలేక - మరి మరి వేడితే
కరుణమాలి యట్టె కండ్లెర్ర సేయగా ॥నీ పొందు॥

పాటబాడి మెప్పించనా నీపై - పదము జెప్పి వలపించనా
బూటకాలమారి నీ - పుణ్య మనే కొద్ది -
మోటుబారుకొని - మొగము చిట్లించగా ॥నీ పొందు॥

కూనలమ్మకు వేట గొట్టనా నిన్ను - గూడితే పొంగళ్ళు బెట్టనా
చానరో బతిమాలి - సరసకు రమ్మంటె
కాని లేలెమ్మని - కసరి పొమ్మనగా ॥నీ పొదు॥

1. ప్రశ్న (B). 2. శ్రీ వేణుగోపాలుడనవలెనా (B).

# 77. భైరవి - ఆది

నీ కూతురి నడతలు నీకే సరి –
లోకులెవరు మెచ్చరమ్మా ॥పల్లవి॥

ఈ కాడికి తెల్లవారెగద న –
న్నికను వేణుగోపాలు డనదట ॥అనుపల్లవి॥

నిదురబోతే లేవ మనసు బుట్టదు –
నుదుట యేనాడు బొట్టు బెట్టదు
ఇదియు గాక తమలపాకు [1] ముట్టదు –
ఏడాదికీ కొప్పు విడిచి కట్టదు ॥నీ కూతురి॥

వీణె చేత వకనాడు ముట్టదు –
ఎంత జూచినా నవ్వు బుట్టదు
రాణివాసమట అడుగటు బెట్టదు –
రామ రామ సొగసనేది గిట్టదు ॥నీ కూతురి॥

నేను గూడేది తనకు గూడదు –
నెనరు [2]గూర్చి నాతో పలుకాడదు
పూనినట్టి మంకుగుణము వీడదు –
బుద్ధిమాట జెప్పేరని చూడదు ॥నీ కూతురి॥

1. బట్టదు (B). 2. గలిగి (B).



# 78. భైరవి - ఆది

బిఱ్ఱు బిగుసుకొని పిలిచెతె రావు –
భీష్మీకరించుకొని ॥పల్లవి॥

వెఱ్ఱి వెఱ్ఱి పోకలీడ సాగవు –
వేణుగోపాలుడు నా పేరు ॥అనుపల్లవి॥

గొప్ప ముత్యములు దెచ్చిన జాడ – కోమలాంగి విన్నవించగానె
కొప్పువీడ జారుపయిట తొలగగ – రెప్పపాట్లో రాలేదటె యిప్పుడు ॥బిఱ్ఱు॥

పెద్ద రాకడి దెచ్చిన సుద్ది – ముద్దుగుమ్మ మందలించగానే
అద్ద మచట పారగుక్కి బిర బిర – మిద్దె పయికి రాలేదటె యిప్పుడు ॥బిఱ్ఱు॥

పతక మొకటి నా దగ్గర జూచి – భామామణి సైగ సేయగానె
అతివ అన్ని పనులు మాని నన్నుప – రతుల నేలు కొంటివి గదె యిప్పుడు
॥బిఱ్ఱు॥

# 79. తోడి - ఆది

చేతి సొమ్మెవరయిన యిత్తురా
కూతురా యిట్లు సేతురా - యేమె ॥పల్లవి॥

పాతకురాలా నీకు వేణుగో-
పాలుడెక్కడ దాపురమాయె ॥అనుపల్లవి॥

ఎంత మంచి తీరైనదే ముసి - లవ్వ తాళిబొట్లు - యేమో
వింతగా పచ్చల మొలనూలు - వేలి వెండిచుట్లు
అంతకన్న చూడ చూడ ముచ్చట -
అక్క[1]చేకట్లు - అయినా
యింత పెద్ద వేళుపేనా పతకము -
యీనగాచి నక్క కిచ్చినట్లు ॥చేతి॥

అల్లుడా నా పాలికి వాడొక - అప్పుల [2]కావమ్మ - భువిలో
నల్లవారి నమ్మరాదనే నుడి - కల్ల గాదమ్మా
యిల్లు జేరి లోతుపాతు గని వీ - డెంత జేసె నమ్మా - యిక
పిల్లిదిన్న కోడిని రా రమ్మని -
పిలిచితే [3]పలుకునే నమ్మమ్మ ॥చేతి॥

వడ్డి కాశించి మొదలు పోయిన - వార్త నిక్కమని దెలసెను - సుంత
సడ్డలేదు గదవే చదవు బెట్టిన - సామితై ధర వెలసెను
[4]దుడ్డు సెలవు సేయలేక జుణుగుచు -
తొడరి నిన్నే యెనసెను - యిది
అడ్డెడు బియ్యము దెచ్చియిచ్చి మా -
యమ్మ నీ ప్రసాద మనవలసెను ॥చేతి॥

1. చాకట్లు (A). 2. కాపమ్మ (A). 3. పలుకు నటవెకొమ్మ (A).
4. దుడ్డుసెలవుసేయనేరక నిను - దుడుకుచు రతిని నెనసెను (B).



# 80. తోడి - చాపు

తల్లి చెప్పిన బుద్ధి దలచితే నా గుండె -
[1]ఝల్లు ఝల్లునునులే ॥పల్లవి॥

అల్లుని కోరికె లాపెకే సమ్మతి -
పల్లవాధరి నూరు పల్లిపట్ల కాశించి ॥అనుపల్లవి॥

[2]మగనాలనుచు సోకరాదట పెద్ద -
మహలు మీద[3]ఉంచేదట - యీ
సొగసు [4]దక్కొరు చూడరాదట రే -
పగలు నన్ను పక్క బాయనీయడట ॥తల్లి॥

ఇంటికెవ్వరు రారాదట పొరు -
గింటికైన పోనీడట - వెను
[5]వెంట కావలి దిరిగేదట నా -
వంటి బిడ్డను వాని వశము జేసినట ॥తల్లి॥

పందెము లాడుచు గూడేదట వచ్చి -
పదము బాడి నవ్వించేదట - యిటా
కొందరు సమ్మతైనారట వేణు -
గోపాల రా రమ్మని బిలచేదట ॥తల్లి॥

1. జల్లు జల్లు మనెనే (A). 2. మగ గాలి యని (B).
3. నుండేదట (B). 4. ఒక్కరు (A).
5. వెంటనే వెలిదిరిగేదట (B).

## 81. సారంగ - త్రిపుట

నిన్ను యేమనెనే వో కన్నెరో మగని
కన్నుల జూడక యున్నావు ఇపుడు ॥పల్లవి॥

పన్నగశయనుడా గోపాలుని గూడి నీ -
వెన్ని పనులు జేసిన అన్నిదెలసి యుండి ॥అనుపల్లవి॥

చుట్టు కొల్లారిండ్లు గట్టుక యెపుడు -
పుట్టినింట నుండి రట్టుగా
పెట్టెల కొలది మేల్ - పట్టుచీరలు జేర్చి
గొట్టుబడితివే మెడను - బొట్టుగట్టిన విభుడు ॥నిన్ను॥

ఖజ్జాయములను దెప్పించుక నీవు -
బొజ్జనిండ భుజియించుక
గజ్జెలందెల రవళి - ఘల్లు ఘల్లని మ్రోయ
లజ్జమాని పతిని - ఖొజ్జవలెనే జూచిన ॥నిన్ను॥

చెలియ నీ వయసిట్ల చెల్లెనా వాని -
కలయరాదని నీకీ కనరేమే
నెలత నీ సోదరి - నీ కన్న మేలేనె
యిలను మీ నడతలు - కులమువారు విన్న ॥నిన్ను॥



## 82. సావేరి - చాపు

మోసము పోవద్దురా వేశ్య -
మోహము వట్టిది లేరా - చేతి ॥పల్లవి॥

కాసుకు మూల మిదేరా చెలి -
కాడ యింతటనైన [1]మేలుకోరా ॥అనుపల్లవి॥

దాని తల్లి చెడ్డలొత్తు - అన్న -
దమ్ముడైతే యింద్రజిత్తు - ఆ
చాన సోదరి పలువిత్తు [2]వక్క -
సారె తీసెగ హంసలపని నత్తు ॥మోసము॥

ఉప్పుచట్టి అమ్మించు చెవుల -
వుండేది కుదువ బెట్టించు - రేపే
అప్పుల పాలు సేయించు [3]సెలవు
కైపాయతే తెమ్మని కోపగించు ॥మోసము॥

ఇంటి పనంతా సేయించు నో -
రెత్త వద్దని వాయించు - బలు
[4]గొంటెకాయై చెరియించు - వేణు -
[5]గోపాల నిను రతి గూడి వాదించు ॥మోసము॥

1. తెలుసుకోవేరా (B). 2. యొక - సారి దీసినది హం - సల పని నత్తు (B).
3. సెల - వయిపోతె దెమ్మని కోపగించు (B). 4. గొంటుకాయై (A).
5. గోపాలుని రతి గూడి - మెప్పించు (B).

## 83. మధ్యమావతి - చాపు

ఇప్పుడు గాక యింకెప్పుడు బెదరించే -
  వింతి నిన్నన దోసమా ॥పల్లవి॥

  చప్పుడు సేయక వేణుగోపాలుడు -
  చంకబెట్టుకొన్న [1]సవిగాదట వేమే ॥అనుపల్లవి॥

చుట్టు కొల్లారిండ్లు - సుంతలో విడిదాయె -
  పట్టె మంచము దూది - పరుపులాయె
  పెట్టెల కొద్ది కట్టువర్గములాయె - పెరిమెల దనమాయె -
  కట్ట విడువ చేత - కాసు వీసమాయె
  వుట్టి మీద నేతి - వుగ్గాలాయె -
  పట్టిన పనులెల్ల - బంగారు[2] చెరువాయె
  వట్టాకు వుడికించే - చట్టి దూరమాయె ॥ఇప్పుడు॥

పడతిరో వూరూర - పైరు పచ్చలాయె
  కడలేని ధాన్యాల - కణజలాయె
  మెడ దిప్ప రాకుండ - మినుకు సొమ్ములాయె -
  మెరుగు టద్దము లాయె
  నడితీలో యిప్పుడు - నాగరీకమాయె
  నానాటికి పని - నాణ్యమాయె
  వడినిండా తరగని - వక్కలాకులాయె
  ముడికే చాలని గుడ్డ - ముచ్చట మరుపాయె ॥ఇప్పుడు॥

ముప్పూట భోజనమ్మే - మంచి వొప్పాయె
  కొప్పులోకి పూల- గుత్తులాయె
  అప్పుడు నీసొగ సతనికి మెప్పాయె -
  హాయిగ కలయ నాయె
  చెప్పిన మనవులు - తప్పక వినుటాయె
  గొప్పవారు నిన్ను - గొలుచుటాయె
  దెప్పవటే వకరు - ద్రిష్టిలో లేదాయె
  చిప్ప కొలత గంజి - యెప్పుడో వెగటాయె ॥ఇప్పుడు॥

1.సలిగ గాదటవేమె (A). 2. చెరుగాయ (A).



## 84. మధ్యమావతి - ఆది

ఎవడైన వచ్చునటే పోపో - యిక నీ యింటికి ॥పల్లవి॥

  హరహర నీకు చిత్తజు - భవన మింత వెళుపైతేనే ॥అనుపల్లవి॥

గడిసేపు బిలచిన - గడియ దీయవు - రూకలు
  విడిచి చేతులో బెడితేగాని - అడుగిడు నీవు - సరిసరి ॥ఎవడైన॥

వక్కాకు లేకుంటే - మంచ మెక్కనీయవు - వకటి
  తక్కువైనా తిరిగి కడప - తొక్కనీయవు - సరిసరి ॥ఎవడైన॥

గట్టిగ పాలిండ్లు బిగ - బట్ట నీయవు - మొలను
  కట్టిన నీవిబంధము - ముట్టనీయవు - సరిసరి ॥ఎవడైన॥

కుసుమాయుధుని నైన కాళ్లు - బిసుకు మనేవు - మంచి
  రసికుల మానసము నీ - రసము జేసేవు - సరిసరి ॥ఎవడైన॥

వేణుగోపాలుని గూడి - విడనాడేవు - పంచ
  ప్రాణముగ వున్న సామితో - పంతములాడేవు - సరిసరి ॥ఎవడైన॥

## 85. పున్నాగవరాళి - చాపు

ఏమిసేతు మోసమాయెగా – ఆ – యెమ్మెలాడికి సందాయోగా – ఇది ॥పల్లవి॥

కోమటి విశ్వాసమాయగా వేణు – గోపాలుడు రాడాయగా – యిక ॥అనుపల్లవి॥

వలచిన దెక్కువాయెగా బల– వంత – మాఘస్నాన మాయెగా
బలిమి జేసిన వట్టిదాయెగా ద – బ్బరకాని విందాయెగా – యిక ॥ఏమి॥

పిలువబోతె అలుకాయెగా నా – పేరువాసి యిట్లాయెగా
పలుకే బంగారమాయెగా తిర – పతి చుట్టరికమాయెగా ॥ఏమి॥

రచ్చబెట్టి గూడుటాయెగా అంద – రాని పండాయెగా
ముచ్చటే మరుపాయెగా వే – ముల తీయదనమాయెగా ॥ఏమి॥



## 86. నాటకురంజి - త్రిపుట

నీ పాదాలకు దండం నీ తల్లికొక సలాం
నీ యింటికిక రాం రాం – అయినా ॥పల్లవి॥

ఈ పాపము కద్దా – యిట్లైతే కాపురము
[1]కోపే సమ్మతైనట్లు – దోప నాతరమటే ॥అనుపల్లవి॥

పల్లవాధరి నెలకు – [2]పల్లిపట్లు నూరు –
చిల్లర సామాన్లు – చెల్లించి యుండగ
అల్లరి జేసేవు – అది యిది లేదని
ఇల్లు జేరక మునుపే – యెలికె [3]రావడన్నట్లు ॥నీ పాదా॥

మొన్న పూరకే నాపై – మోడి జేసి నందుకు–
మున్నూరు వరహాల – [4]ముల్లెయ యెనమిస్తి
నిన్ననే దెలిసె [5]ఏ – నిగె దాహమే నీది –
తిన్నతిన్నగ నయ్యు – దివాలెత్తే పనివచ్చె ॥నీ పాదా॥

కొంచగత్తెవా వేణు – గోపాల రమ్మని –
పంచబాణుని కేళి – ప్రౌఢిమి ననుగూడి
సంచితమంతయు – సంగ్రహించుకొని –
మంచిమాటల గుడిసె – వంచేదానవే నీవు ॥నీ పాదా॥

1. కాపె సమ్మతైనట్లు (B).
2. పల్లి పట్లు వరాలు (B).
3. రావిడన్నట్లు (A).
4. ముల్లె యప్పనమిస్తే (AB).
5. ఏనుగు (AB).

## 87. పంతువరాళి - చాపు

అంబలి దాగేవు నెత్తి వ్రాతనీకు – అన్నము సైచదటే – పాత ॥పల్లవి॥

సంబావడ్లు దంచి – సత్రాలు బెట్టేవో
యెంబరుమానారంటె – యెగతాళనుకొంటివి ॥అనుపల్లవి॥

తల్లిపేరు జెప్పి – పుల్లని కూట్నీళ్ళ –
కిల్లిల్లు దిరిగేవు – యిది ఘనమా
నల్లనావుల పాలు – కొల్లె మీ మందలో –
చెల్లబో చలివేళ – చై వెంట జారగ ॥అంబలి॥

ఆకు చేతబట్టి – హౌసుగా నిలుచుండి –
పోకబద్దకు దోవ పొంచేవేమే
కోకస్తనీ వక్క – గోనె కెన్నడె ఖర్చు
రాకేందుముఖి ముక్క – రాగుల విసరుకొని ॥అంబలి॥

పతియైన వేణుగో – పాలుడు నినుగూడ
సతకల బడ యిచ్చె – సర్వస్వమూ
అతుకుల గుడ్డలే – గతి నీ పుట్టుక యేమో
మెతుకు కలికానికి – మెదలదెన్నడు గొడ్డు ॥అంబలి॥



## 88. పంతువరాళి - చాపు

నిష్కర్షగా [1]రాత్రి కొచ్చేవాడ వైతే
[2]నిష్కాలు గొంచు రారా నేనా ॥పల్లవి॥

ముష్కరి వినను యీ – శుష్క ప్రియాలు తు
రుష్కులు దిగివుండే – లష్కరులో నుంచి ॥అనుపల్లవి॥

దండిగ పొవ్వాకు – రెండు వీశల వక్క
పండు టాకుల ముడియ – పాల కావిళ్ళు
కండ శర్కర దుత్త – కౌజుల బుట్టలు నీ
రెండ జారగనే – యెత్తించుకొని నీవు ॥నిష్కర్షగా॥

పూలు గంధము బుక్క – పునుగు లవంగాలు
యేలక్కాయలు తుల – మెత్తు జాపత్రి
పాలుమాలేవు దీ – పాని కద్దెడు నూనె
యీలో బంపించి నీ – వింట్లోనే భోంచేసి ॥నిష్కర్షగా॥

మునిమడుగు రవికెలు – [3]మూడుకొంగుల చీర
దినుసువారి పప్పు – తేటద్దమూ
పనిబూని వేణుగో – పాల సాగించుక
నను రతిగూడి యా – నంద మొందుటకు ॥నిష్కర్షగా॥

1. రాత్రివొచ్చే వాడవయితే (AB). 2. నిష్కములు (B) . 3. ముందుకొంగులు

## 89. పంతువరాళి - చాపు

ఒట్టి చేతుల నేడు [1]వచ్చినని న -
నొ్నక లాగున జూడకే రేపే ॥పల్లవి॥

పట్టపేనుగ దెచ్చి పణతి నీవాకిట -
[2]కట్టి వేయకుంటె - కాని ఇది మీసమా ॥అనుపల్లవి॥

కంచి మాణికె దాని కడగొట్టు పిల్లను -
కన్నెరికె [3]ముంచలేదా - రాము
నుంచుకోక మునుపే - వుదయాద్రి మంగకు -
వుంగర మంపలేదా
మంచము [4]శ్రీరంగి మనమరా లడిగితే -
మాపే సాగించలేదా - నిన్న
[5]యెంచకిచ్చింది మీ - యెదురింటి వాణికి -
వంచిన తలయెత్తి యించుక పలుకవు ॥ఒట్టి॥

ఆరణి [6]నాంచారి మేనకోడలి సమర్త
[7]కరవై దరిశించలేదా - పుణ్య
పేరంటానికి తంజా - వూరి శేషికి గుండ్ల -
పేరు దారబోయలేదా
పేరూరి గంగకు సూరి మొక్కుకుంటె -
తేరు నడిపించలేదా - నిన్న
నారగంటి మద్దెల - [8]నరశికి దోపిందొా -
తేరజేసి తలుపు - వారకు వొదిగేవు ॥ఒట్టి॥

నాణ్యమౌ కార్వేటి - నగరాన వుండే ది -
న్నాళ్ళుగ యెరుకలేదా - నన్ను
వేణుగోపాల రమ్మని రతిగూడి యా -
వెనుక కాదన రాదా ॥ఒట్టి॥

యేణాక్షి యేడాది మనసు బట్టితి వైనా -
యిల్లు బంగారు గాదా - యెంత
త్రాణ దానవే నేనింతగ బతిమాలితే
కాణాచివలె - లోని కడప వెళ్ళిరావు ॥ఒట్టి॥

---

1. వచ్చినానని
2. కట్టివేయకున్న - గాని యిది మీసమా
3. బెట్టలేద
4. సీరంగి
5. ఎంచక యిచ్చిన - దెదిరింటివానికి
6. నాంచారు
7. కరువై దర్శించలేద
8. నారికి దోపినదో



## 90. పంతువరాళి - ఆది

నాయకసానైనందుకు పాట - నయముగ పాడవలె[1] -అందున ॥పల్లవి॥

గాయక మెరిగి వినుపించేందులో - ఘనము గూడవలే - ప్రౌఢ ॥అనుపల్లవి॥

కాసుకైన వక్కలాకులు - తీసుకోను చేతులాడక
తేసు పండ్లతో సొమ్ములు జార - వేసుక కులికినట్లే గాదు ॥నాయక॥

సొట్ట బుగ్గలతోను వెండి - మెట్టలు వేళ్ళ రొాదలు సేయ
పట్టుచీర చుంగులు జార - గట్టుక కులికి నట్టేగాదు ॥నాయక॥

బడిబడి కటికాలు బిలువ - అడుగు మీద [2]అడుగు విడుదు
ఆడనే తెలియక చదురు మీద - ఆడేనని మురిసితే కాదు ॥నాయక॥

కోటేరు బెట్టినట్టు ముక్కున - వాటమైన నత్తు బెట్టి
మాటా పలుకు నేరక పసుపు - మరి యింత బూసితే గాదు॥నాయక॥

పొట్టి వాకున శాలువ ముసుకు - బెట్టుకొని పిళ్ళారయవలె
పొట్టాడించు కొంటూ మంత్రుల - చుట్టు తిరిగినట్టే గాదు ॥నాయక॥

ఒకనితో సరసాలాడి వే - రొకని జూచి సైగచేసి
ఒకని ముద్దుబెట్టుకొని - ఒకని రమ్మన్నట్టే గాదు ॥నాయక॥

వేణుగోపాలుని గూడి - [3]వేలాంత్రాలు సంపాదించి
రాణివాసమనుచు గోడలు - [4]రాతిరి దాటినట్టేగాదు ॥నాయక॥

---

1. శాబాసని నలుగురు మెచ్చవలె (B).
2. ఆడుగులిడుచు (AB).
3. వేలాంతరములు (A)
4. రాత్రుల (B).

## 91. పంతువరాళి - ఆది

ఇంచుబోణి నను నవ్వేరట తమ -
దింత గంపెడు దాచుకొని - ఇది ॥పల్లవి॥

ఎంచబోతె మంచమెల్ల కంతలు -
ఎవతె సుద్దమో యివతల రమ్మను
పంచసాయకుని గన్న వేణుగో -
పాలసామి తడవని యిల్లాండ్లుగ ॥అనుపల్లవి॥

దక్కితిమని చెలులు భంగపడి సం-
ధానాలు నడిపించిం దెరుగవొ
యెక్కువైన రవల సొమ్ములివి మీ -
కెక్కడవని మందలించ రాదటే ॥ఇంచుబోణి॥

చేదెరో బొడ్డు గోసిన కొడవలి -
యీడ నా చేత నున్న దిదిగో
మేడ లెవరు కట్టించి నారని[1] -
జాడగా కదిలించ రాదటే ॥ఇంచుబోణి॥

అడ్డమాజ్ఞ లేదు వారి[2] నోటికి -
అతనికేమి భయమా ననుగూడితె
దొడ్డవింత తమ కడుపున బుట్టిన -
బిడ్డలెవరి పోలికైనది [3]తెలియక ॥ఇంచుబోణి॥

1. చూడగాను గదిలించ లేనటే (B). 2. పాడు (B). 3. ఎరుగక (B).



## 92. పంతువరాళి - ఆది

వారస్త్రీ నీ ప్రక్కలోకి - యూరకె వచ్చునా ॥పల్లవి॥

తేరకు దొబ్బేనని జాచేవో - పోపోరా వేణుగోపాల ॥అనుపల్లవి॥

పందిళ్ళు తా నొకడే వేసి - బావిలో నీళ్ళన్ని మోసి
సందు గోడలు మదురు బోసిన - బొందిలి వానికె సున్నజుట్టిన ॥వారస్త్రీ॥

పాలు దినము దెచ్చి యిచ్చి - బట్ట శింబోతును బట్టిచ్చి
చేలో మందల దోలిన గొల్ల - చెంగడికే నామము బెట్టిన ॥వారస్త్రీ॥

నమ్మించి సన్యాసి శారీ - నయము జేసి గుంజుకొని
అమ్మజెల్ల వుడకాడించి - అల్లాపనికి దుద్దు బెట్టిన ॥వారస్త్రీ॥

నరహరిభట్ల వేలి ఉంగరాలు - యెరువు దీసికొని
తిరుగు అడుగబోతే నెత్తిన - తిరుమల కొప్పు బెట్టించిన ॥వారస్త్రీ॥
వేణుగోపాలా నీవు వొక - విడెమైన తనచేతి కీయక
వీణుగా మును గూడినందున - వీధెక్కి రచ్చలు బెట్టించిన ॥వారస్త్రీ॥

## 93. గౌళిపంతు - ఆది

నీ పప్పేమే చిమిడిందిపుడు – కోపగించేవు – ఓసి ॥పల్లవి॥

పాపాత్మురాలా వేణు – గోపాలుడు నమ్మించినందుకు ॥అనుపల్లవి॥

కోళ్ళగుడిశంతా పోయి చుట్టు – కొల్లారిండ్లాయ – నులక
తాళ్ళ నల్లుల కుక్కి వదలి – (బంగరు) – కీళ్ళమంచ మాయె॥నీ పప్పే॥

తుండుగుడ్డ కట్టే మొద్దుకు – (సరిగె) కండెచీరాయ – పురిట
[1]కుండలు తిరిపెమెత్తే తొత్తుకు – (చొక్కపు) వెండి పాత్రలాయె ॥నీ పప్పే॥

పచ్చపూసలు గట్టిన మెడకు – భన్నసరమాయ – [2]వూళ్ళో
తెచ్చే కవళము మరచిన వెనక –తెల్లని మెతుకాయ ॥నీ పప్పే॥

తొడిమెలు యేరుక నమిలే పంజకు – (ఆడాడ) మడుపు దిట్టమాయ – వీధిలో
పడుతూ లేస్తూ తిరిగే బసివికి – [3]పల్లకి యొకటాయ ॥నీ పప్పే॥

[4]చన్నే లేదన్నందుకు రొమ్ము – గిన్నెలంతాయ – మెచ్చి
వెన్నుడు నిన్నేలిన పిమ్మట – విరివి యెక్కువాయ ॥నీ పప్పే॥

---

1. కుండ లెత్తుకొని తిరిగే తొత్తుకు (B).
2. ఊళ్ళో తెచ్చిన కబళము మరిగినదానికి (B).
3. పచ్చల పాలకి యొకటాయె (B).
4. చన్నులు లేనందుకు రొమ్ములు – (బంగరు) గిన్నెలంతలాయె (B).



## 94. గౌళిపంతు - ఆది

అంత మాత్రము నేనీయనటె – అజ్ఞానురాలా – నే ॥పల్లవి॥

నెంత బిలచిన ససేమిరా యని [1]గంతె వైచుచు పరుగెత్తేవు ॥అనుపల్లవి॥

సేవాకాలము రాతిరి గుళ్ళో – ఆవేళదాకా నిలుచుంటె
తేవాకులయ్యావా రొక దోశ – నీ వొళ్ళో దోపె [2]మూసుకొమ్మని ॥అంత॥

గద్దగూడువలె తలబెట్టుకొని – సుద్దులాడ వచ్చితె సాతాని
పెద్ద వెలగచిప్ప దెచ్చుకొమ్మని – శిద్దెలోని చమురు వంచియిచ్చెను ॥అంత॥

రొయ్య దిన్న నోటికి పొవ్వాకిం – తియ్యమనుచు యెడమ చెయ్యి సాచితే
అయ్యతోడే లేదని తన చారదు – బియ్యమిచ్చె వుగ్రాణపు దాసరి ॥అంత॥

పాతగుడ్డ పైట కందలేదని – భంగపడితే నాంచారు కప్పుడు
[3]సాతియున్న చీర గుంజి వేగమె – చేతి కిచ్చె పరిచారక వైష్ణవుడు॥అంత॥

వేణుగోపాల రా రమ్మని – వింతగా నను గూడితి వైనా
వీణుగా నిను పొమ్మందునటే – వెర్రిదాన తెలుసుకో వైతివి ॥అంత॥

---

1. గంతులు వైచుచు (AB).
2. ముడుచుకొమ్మనె (B).
3. చాతి (AB).

## 95. గౌళిపంతు - ఆది

పదిమంది కొడుకుల[1]గన్నదానీ చేతికి –
పైకమిచ్చి వత్తురా యింత ॥పల్లవి॥

పదటమ వేణుగోపాలా నీకు రూక –
లదనమై యుంటేనే అరువు తెరువు[2]మాలి ॥అనుపల్లవి॥

ఒకడు బిడ్డల తండ్రి – వొంటిమిట్టలో ఠాణ
యొకడు కొత్వాల్‌గిరి – వోరుగంటి కాడ
ఒకడు పై సీమ కీ – డకు దూది బేరము
యొకని వంచించి వే – రొకనికి మనసిచ్చి ॥పది॥

ఒకడు నీ పొదుగై నా – టకశాల నట్టువు
ఒకడు బంగాళా బా – రుకు సుబేదారుడు
ఒకడు శృంగార తో – టకు ఖుల్‌దారోగా
యొకటి యెరుగవు దిన – మొకరిని తల దడవి ॥పది॥

ఒకనికి మీసక – ట్టిక మొనజూపలే
దొకని పళ్ళికూటా – నకు బంపే పాయము
ఒకడు చౌలబిడ్డ – తకతికలాడీనే
[3]యిక మాననంటే యే – లుకో చెలులు నవ్వగా ॥పది॥

1. దానికి చేతిపయిక మిచ్చి వత్తురా (AB).
2. లేక (B).
3. యిక మానేనంటే (B).



## 96. సురటి - చాపు

ఎక్కడినుండి దాపురబాయెనె –
ఇంత చక్కని అందగత్తె – లేని ॥పల్లవి॥

వెక్కులు బుట్టించి – వేణుగోపాలుని
దక్కించుకొని యెవరు – తనకెదురు లేదని ॥అనుపల్లవి॥

ఆట చదువు సున్న – [1]పాట లంజమందు –
బూటకముల కది – పుట్టినిల్లు
నీటు యింతన రాదు – నిలువెల్ల కపటము
గూటమువలె తిని – కూర్చుంటే కదలదు ॥ఎక్కడి॥

లలన పల్వరుస గ – వ్వలతో వీయములందు
కలబంద వాసన – కలికి మేను
చిలుక రౌతు నగరు దలప – చీకటి కోన
వలపు మందుల సంచి – వకనిమిష మేమరదు ॥ఎక్కడి॥

మొగచెంపలది గాక – మో మెల్ల మొటిమలు
దిగబడ్డ చన్నులు – తెత్తినోరు
వగలాడి వయసు యే – బదిమీద రెణ్ణెల్లు
యెగతాళి సేయక వా – డేలాగు గూడెనో ॥ఎక్కడి॥

1. పాటలందు (B).

## 97. సురటి - చాపు

మద్ది స్వరూపమా ఇట్లాడ తగునటే -
మర్యాద తెలియకనూ ॥పల్లవి॥

తెడ్డుబాయె నీవు రాకుంటె కొదవౌనా
[1]దేవదేవుడౌ వేణుగోపాలునితో॥ ॥అనుపల్లవి॥

అమ్మచెల్ల చెలువు - డావేళ ప్రొద్దున
యెమ్మెలు జేసుక - యింటికి వేంచేసి
కొమ్మరో మదిలోని - కోర్కె నీ కెరిగింప
సమ్మతి గాకుంటె - సరిపడ దనరాదా॥ ॥మద్ది॥

అతివ నీదు గొడ్డు - [2]మతమే అయినా గాని
క్షితిలో బోటులకంటె - అతిశయమా
మితిలేని మోహమున - బతిమాలుకొనే వేళ
హితవు గానట్టైతె - యీడుపడ దనరాదా॥ ॥మద్ది॥

విరిశయ్య మీద రా - తిరి నీవు వొంటిగ
మరుమందిరము పార - తెరుచుక నిద్రింప
దొరికించుకొని [3]నిను స - మరతి గూడే వేళ
సరసము గాకుంటె - చాలించ మనరాదా॥ ॥మద్ది॥

1. దేవుడైన వేణుగోపాల రాయనితో (B).
2. మదమె (B).
3. నిన్నుపరతి (AB).



## 98. సౌరాష్ట్ర - ఆది

కలిగిన కాసు గుంజుకోవె -
కడమ జోలి నీ కెందుకే ॥పల్లవి॥

ఉలవకట్టు సామెతగా నున్నది -
యువిద వేణుగోపాలుని చేత॥ ॥అనుపల్లవి॥

ఎవతె యింటికిని పోతే నేమి - యెంత ప్రొద్దు బోయి వచ్చితేనేమి
అవును కాదనుచు దినము లెంచుచు - ఆ యింత నెల వెళ్ళ గానే ॥కలిగిన॥

అప్పుల పాలైతే నీకేమి - ఆదాయము గలిగితె నీకేమి
గుప్పుచప్పుమనక నేరుపరివై - గోడమీది పిల్లివలెనె పొంచి ॥కలిగిన॥

దాని గూడి నిన్నేలితే నేమి - దీని కింత రోస పడేదేమి
చాన నీకు వయసు [1]మించె యిక నీ - సాగుబడి చెల్లదుపో ముదిమిని
॥కలిగిన॥

1. చెల్లె (B).

## 99. సౌరాష్ట్ర - ఆది

సీసపు రూకలు కొంగున గట్టితె -
దోసకారి చూడరాదటే - యెంతో ॥పల్లవి॥

ఆసజెప్పి తెల్లవారేదాక బలు -
గాసిబెట్టి వేణుగోపాలుడు - వట్టి ॥అనుపల్లవి॥

మంచి వానివలె జాబులు వ్రాసి - మాయదారి యేమో నీకెగబోసి
సంచిలో వక్క లాకులు జాడజేసి - చాన తలమీద సొడ్డొకటి వేసి ॥సీసపు॥

జంట బాయక బిగికౌగిట డాసి - పంట నొక్కి మోవి గంటుజేసి
అంటనీయని తావులంటి సిగ్గుదీసి - వెంటికె దెంచి నీ యింటి మీదవేసి ॥సీసపు॥

మదనుకేళి గూడి మది తమిరేపి - వదలిన కుచ్చెళ్ళు కుదురుగ దోపి
నిదురబొయ్యే దాని నిను తట్టి లేపి - ముదిత వాడు తన ముందరిది జూపి ॥సీసపు॥



## 100. హుసేని- ఆది

సత్యమింతైన లేదాయెగా చెలికాడా యీ -
సతి నుంచి నాసిగ్గే పోయెగా - ఆణి ॥పల్లవి॥

ముత్యమైన పగలగొట్టి - నిత్యబత్యాలు గొలిచితె
ప్రత్యేకముగా సంధానాలు - పనికత్తెను బంపించెనట ॥అనుపల్లవి॥

వారస్త్రీల నమ్మరాదుగా యెంత దోపిన - వారిమది సంతుష్టి లేదుగా - నిన్న
జారుకొప్పు బెట్టుకొని మై - జారు చీర గట్టుకొని
బేరి గుర్నాధుని చావిడికి - పెరుమాళ్ళను రప్పించెనట ॥సత్య॥

ఇల్లు మల్లు కడిగి బెట్టితి చై విడువ - నని యీ చంబాటి శివుని ముట్టితి - కంచి
నల్లేరయ్యంగారి వెంట - నాగపూడి తిరునాళ్ళకు
తెల్లవారే పైనమట - మళ్లి రా నెల బట్టునట ॥సత్య॥

తోట దొరువు వొప్పగించితీ యీసీమ యేలే -
దొరచేత బహుమతి చేయించితీ - మొన్న
నాటేరిచెన్ రాజేమో పడ - వేటి జాతరకు పోతే
మూటా మనిషి కంటే తాను - ముందుగ బోయి నిలిచేనట ॥సత్య॥

అప్ప చెల్లెలు సమర్తాడితె పని నిగ్గించితె న -
న్నాడనే నిష్టూరాలాడితే - గాజుల
తిప్పిశెట్టి పిలువగానే - ముప్పావు కంబళి కాశించి
చప్పుడు సేయక చిరుతని - తెప్పలకు బోయినాదట ॥సత్య॥

కోమలి పొందిక చాలుగా - అది నన్ను వేణు -
గోపాలుడనకుంటే మేలుగా - మొన్న
సోమేశ్వరుని కొండమీద -
రామాయణము వినబోయి రాత్రి
గ్రామలెక్క వ్రాశే పిళ్ళకు - గర్భము ధరించెనట ॥సత్య॥

## 101. మోహన- చాపు

ఇందుకా నీకు పంచాంగము జెప్పింది -
ఇన్నాళ్ళ ననుసరించి - యిట్లా ॥పల్లవి॥

కందువ [1]లెంచేది దెలసితె యిదివరకే
కాశికి పోయివత్తు - గదవే నిర్దయురాలా ॥అనుపల్లవి॥

ఎద్దు పోకట బెట్టి - మిద్దె యింటికి నిలువు
టద్దము [2]దీసింది - పెద్దల ఋణ మటె
[3]కద్ద నీ మోమేమి - కంచి గరుడసేవో
ముద్దు బెట్టమంటే - [4]మూతి ముడుచుకొనేవు ॥ఇందుకా॥

వరలక్ష్మీ వ్రతమంటే - వొక యిల్లు తెగనమ్మి
యిరు చెవ్వేరుగనీక - యిస్తే కులుక లేదో
గురుకుచముల మీద - గోరు లుంచేనంటే
వురిమిచూచి చెయ్యి - మరుగు బెట్టుకొనేవు ॥ఇందుకా॥

కొత్తచీర వేణు - గోపాల తెమ్మంటే
కత్తి తాకట బెట్టి - యెత్తి చేతి కీలేదో
చిత్తజుకేళికా- యత్తమై గూడితే
మత్తురాల యేమే - యొత్తికల పొరిలేవు ॥ఇందుకా॥

1. లాడేది (B). 2. దెచ్చినది (B). 3. కద్దటె నీమోము (B).
4. మోమటు దిప్పేవు (B).



## 102. మోహన- చాపు

నీవేనా శాస్త్రము నా చేత కాసుంటె -
నీయక్క యింకొక్కతె ॥పల్లవి॥

అది గాకుంటె - దానక్క మరి యొక్క తె
పోపో యెవతైన - పుణ్యానికి రాదు
దేవ రంభయైన - తే తెమ్మనక పోదు ॥అనుపల్లవి॥

అతిమోహమున వచ్చి - యదుగులపై వ్రాలి
బతిమాలి నప్పు డీ - బాళి యెక్కడ బోయె
పతక మిచ్చితె గాని - పలుక నంటివో లేదో
మెతుకులు జల్లితే - క్షితిలో కాకులు బాతె ॥నీవేనా॥

ఆనాడు నగిరిది - ఆరవై రూపాయల
తాను పెట్టెలో వుంచి నేనట్టె రాననె - ఆ
తాను పావడ గూర్చి - ధరియించుకోవటే
వానలు గురిసితే - వాతలు మానున ॥నీవేనా॥

పాతర లాడుచు - రాతిరి వేణుగో
పాలా యనుచు నన్ను - పరతి గూడినదెల్ల
ఈతగింజకథ - తాతై యున్నది గదె
యేతము వంగేది - లోతు నీళ్ళకె గాద ॥నీవేనా॥

# 103. మోహన- ఆది

నీవు రాకుంటేనే నిన్ను మించిన దొకతె –
యీ యూర దొరకదేమే యిపుడు ॥పల్లవి॥

కావలెనని సుంత కనుసైగ జేసితే –
రావద్ద నా వెంట రంభ చెల్లెలైన ॥అనుపల్లవి॥

పిలిచే కొద్దికి మరి – బింకాల బొయ్యేవు
కలగిం దిచ్చేనంటే – తల ఎత్తి చూడవు
బలిమి జేతామంటే – చెలుల నేమారవు
యెలనాగ యోడెరా – యల కూతురువ నీవు ॥నీవు॥

లెక్క సేయవు వస్తె – లేచి నిలుచుండవు
మక్కువతో మంచి – మాటాడవు
దక్కితిననేకొద్ది – దండము బెట్టవు
రక్కసివలె గుడ్లు – బిక్కరించుకొనేవు ॥నీవు॥

నిదురబోవగ జూచి – [1]నిను గూడిం దెరుగవు
చెదరిన లోకొంగు – చేతంటవు
మదనమందిర మింత – మృదు వేమి యనుకోవు
కొదవలేదిక వేణు – గోపాలుడని దెలిసి ॥నీవు॥

1.నినుగూడుటెరుగవు (B).



# 104. మోహన- ఆది

ఇంతకంటె యింకా యెవడిచ్చునె – యేమిటికే గొణిగేవు ॥పల్లవి॥

పంత మేలనె నీకు వేణుగో – పాలసామి జేసిన కొదవేమి ॥అనుపల్లవి॥

కుంటెన కత్తెకు శేరుంబావుది – గుండ్లపేరాయె
[1]ఇంటికి వాడు రాగా దాని – కింత సొమ్మాయె
వెంట వెంట పండుగ చీరలకె – వేయి వరాలాయె – సుంత
చంటి మీద చై వెయ్య నియ్యవట నీ – శారస్యము [2]బాగాయె॥ఇంత॥

కావిలిగాచే వాకిటి వానికి – (మైసూరి) – కంబళి వకటాయె
కోవెల నంబికి శోభనమంటే – గోనెడు వడ్లాయె
పోవె పోవె నట్టువునికి వేసిన – (పచ్చల) – పోగు లేమాయె – సుంత
మోవి పంట నొక్కనీయవట నీ – మొరప [3]గుణము పోదాయె ॥ఇంత॥

పదమటి సీమ గురువుల వారికి – (పచ్చల) – పల్లకి యొకటాయె
కడప వైద్యునికి నీ చై మీదుగ – కావలసినదాయె
తడుకు సర్వదు[4]ంబాలగ నాడే – ధారబోశాయె – కూడితె
తొడ రవంత ఎడము సేయవట నీ – తో [5]మంచి సుఖమాయె ॥ఇంత॥

1. ఇంటికి వాడు రాగాగద నీ – కింత సొమ్మాయె (B).
2. స్వారస్యము (A). సారస్యము (B).
3. మురుసు గుణము (B).
4. దుంబాలు గానే (B).
5. సుకము బాగాయె (B).

## 105. మోహన- చాపు

[1]ఇన్నాళ్ళు జరిపింది యీ భాగ్యానికేనా- వక్క ॥పల్లవి॥

చిన్నరూక దెచ్చి – చేతికిచ్చి అట్టె
కన్ను సైగజేసి – కదలమంటి వహహ ॥అనుపల్లవి॥

నేనెంచినది యేమి – నీవు జేసినదేమి
నానా సవతులు వూళ్లో – నవ్వుకోవడమేమి
మానము గలమేటి– [2] మగవాని కిదే నడితి
యేనుగు సామిత – ఇదుగో తార్కాణాయె ॥ఇన్నాళ్ళు॥

నీ వొద్దు పొదుగేమి – నీ రాజరీవేమి
ఆ వేళ గుడివద్ద – అన్న మాట లేమి
[3]యేవి యొక్కటి గాన – మింతటి ఘనుడవా
యీవికానివలెనే – యిదిగోరే పనియిట ॥ఇన్నాళ్ళు॥

బాళితో వేణుగో – పాలా రమ్మన వేమి
లాలించి గూడి యీ – లాగు బొంకడ మేమి
నాలుగేండ్ల నుంచి – నన్నుద్ధరించింది
చాలు చాలు సం – సారితనము దెలిసె ॥ఇన్నాళ్ళు॥

1. ఇన్నాళ్ళు జరిపిన – దీ భాగ్యానికేనా (B).
2. మగవానికిదా నడత (B).
3. ఏవి యొకటి గాన – నింతటి ఘనుడవా (B).



## 106. మోహన- చాపు

వస్తే యెంతలోది రాకపోతే యెంత –
వనిత నీ పుణ్యమేమే – విడిచి ॥పల్లవి॥

[1]వస్తేగా యెవతైనా – యిట్లా రమ్మనేది
ప్రస్తుతి సేయుటకు – పాచ్చా బిడ్డవ నీవు ॥అనుపల్లవి॥

పయ్యెద తొలిగించి – పాలిండ్లమీదికి
చెయ్యిచాచగానె – శింగిలీకమువలె
గయ్యాళి మొగమంత – కండ్లు జేసుకొనేవు
అయ్యయ్యొ ఇపుడు చ – ల్లారి పోయిందేమే ॥వస్తే॥

మదిరాక్షి నీ వింత – మహాత్మురాలవని
యిదివరకు నేనెరుగ – నీశ్వరుసాక్షిగ
పెదవి నొక్కబోతె – పెంకె మాటంటివి
[2]గదశే కాళ్ళమీద – గంజి వొలికితె చూతాం ॥వస్తే॥

వెలది నా పేరేమి – వేణుగోపాలుడు
కలగన్నదే మొదలు – గా ఇన్నాళ్ళకు నిన్న
బలిమి గూడి నే నే – భాగ్యం వారుకొంటి
లలన కొండ త్రవ్వి – యెలుక బట్టినట్లాయె ॥వస్తే॥

1. ఇస్తేగా (A). 2. గదవే (A).

# 107. కేదారగౌళ- ఆది

ఇంకా వాని చెలిమి సేతురా –
[1]యేటి మాటలాడేవు – నేడు ॥పల్లవి॥
వంకాయకు వచ్చిన చాలేగద –
[2]టెంకాయకు వచ్చేది ముందర ॥అనుపల్లవి॥

చిటిపాటి సొమ్ములు కరిగించి –
బేసరాలకని బంగారిచ్చితె
వాటిలోనె మైలాపురిమంగకు–
వజ్రమణుల కమ్మలు సేయించితె ॥ఇంకా॥

పట్టు తాను మూడేండ్లుగ దాచి –
పావడకని బుద్ధినేర కిచ్చితె
అట్టె సగము రవికెలు గూర్పించి[3] –
ఆరికాటిరామికి దరిశించితె ॥ఇంకా॥

వేణుగోపాలుడు ననుగూడి –
వేలి వుంగరా లిట్లా తెమ్మని
బాణవరముురంగి మనమరాలికి –
వీణుగాను ధారబోసి వచ్చితె ॥ఇంకా॥

1. యేటిమాట లాడేవే (B).
2. టెంకాయకు రాబోయేది ముంగల (B). 3. గుట్టించి (B).



# 108. కేదారగౌళ- ఆది

ముసలి బడుగుమీద యెంత మోహమే –
ముదితరో నీకు – మదిలో ॥పల్లవి॥

[1]అసమశరు డనుచు వుప్పొంగితివో –
అన్నిటికీ కాసుగదా దొడ్డది ॥అనుపల్లవి॥

తల మొలకడ వెల్ల నరసిపోయె –
దగ్గి దగ్గి హీనస్వరమాయె
పిలిచినాను చెవి వినరాదాయె–
బలము వుడిగి తప్పటడుగులాయె– ॥ముసలి॥

రాత్రిరైతే రేచీకటి గదలడు –
[2] రమణీని బిగి కౌగిలి వదలడు
మూతిమీద బట్ట యేమారడు–
[3] ముష్టి వకరికైన వేయ నీయడు ॥ముసలి॥

అధరపాన మేలాగున జేసెనొ –
అతనుకేళి నన్నెటు మెప్పించెనొ
విధికి యెన్నాళ్ళు చలము వుండెనో –
వేణుగోపాలు డెటుల గూర్చెనో ॥ముసలి॥

1.అసమ శరుడనుచు నుప్పొంగేవు – అన్నిటికిని కాసుగదా ముఖ్యము (B).
2.రమణి నిన్ను బిగి కౌగిలి వదలడు (B).
3.ముష్టి యయితే నౌకరి కేయనీయడు (B).

## 109. అసావేరి - త్రిపుట

ముసలి వాడైతేనే - కసరేదా గొణుగుచు
పసితనమటే నీకు వాడు ॥పల్లవి॥

రసిక శిఖామణి - రాజ్యాలలో పేరు
తుసకారమటే తెచ్చి - దోపితే కులికేవు ॥అనుపల్లవి॥

భామ నీకు నూట - పదహారు లిప్పించె-
స్వాములిచ్చిన భారీ - శాలువ దరిశించె
రామ నీ నగలకు - రత్నాలు చెక్కించె -
గ్రామాలు రెండు నీ - కరుచూ కేర్పరిచె ॥ముసలి॥

సంబళాలు నిలిపి - శాస్త్రాలు జెప్పించె-
తంబురంత జీవ - దంతాన జేయించె
కంబడి మైసూరి - కాణ్ణుండి తెప్పించె -
నంబిగుండానె తి - న్నగ రక్ష గట్టించె ॥ముసలి॥

కలసిమెలసే వేళ - తలయేల వంచేవు -
నలినాక్షి మొగమున - నవ్వు దెచ్చుకోవు
వెలది యెందుకె యిట్లు - విధిని నిందించేవు -
పలుమారు వేణుగో - పాలుని దలచేవు ॥ముసలి॥



## 110. ముఖారి - త్రిపుట

ఇన్నూరు వరహాలు - తిన్నగ నాచుకుని -
ఇక కదల మంటివిగా వాడు ॥పల్లవి॥

సున్నపాకు కండ్ల - జూపని నెరదాత
వన్నెలాడిరొ వార - వని తంటే సై నీవె ॥అనుపల్లవి॥

ఎద్దు బాడిగె జేసీ - యెక్కించుకొని నీకు -
సద్ది గట్టుకొని - సంబ్రాలు పడుకొంట
కద్ద లేదా కంచి - గరుడసేవకు పోయి -
మిద్దెలో దించిన - మేలైన దలచక ॥ఇన్నూరు॥

చీరెలు రవికెలు - చీటి తానులు గొప్ప -
జారిచెంబు పెద్ద - జముఖానా తలగడ
సేరు పట్నూలు నీ - పేరిటి సరములు
యీ రీతి గొని యిచ్చిం - దెపుడో తుంగలొ ద్రొక్కి ॥ఇన్నూరు॥

సీమాటి నీ వెంత - చిత్రాంగివే ఐనా -
కామించి నిను నోర - గండ్ల జూచుచుంటె
ప్రేమలేక యిన్నా - ళ్లే మని కూడితివె -
భామరో వేణుగో - పాలుని తలదడవి ॥ఇన్నూరు॥

## 111. శంకరాభరణం - త్రిపుట

పొదుగున గూర్చున్నానని మిట్టిపడి వెర్రి
పోకలేల పొయ్యేవు నీవు ॥పల్లవి॥

గుడిసె వాటైనది - నడతలో నిజమాయె
ఝుడుపు లేక సుకవి - జనుల నావల గదిమి ॥అనుపల్లవి॥

అందగత్తెవో లేక - హాయిగ పాడేవో
సుందరి అభినయ - [1]సురతవో - నీ
[2]యందేల రవళే వ - క్కందుకు కొరగావు
పందెంత బలసిన - నందితో సరి ఔనా ॥పొదుగు॥

బెట్టుగా ఒక జతికి - పేరిణి దొక్కేవొ
గట్టిగా చదరం - గము జూచేవో
[3]బట్ట డబ్బె లోని - పసయాడ వట్టిదే
పట్టుగూర్చితేనె- పైజారు మడికౌనా ॥పొదుగు॥

కోడిగాల వేణుగో- పాలు గూడేవో
పోడిమైన కథల - ప్రొద్దు బుచ్చేవో
నేడు క్రొత్తటే చిన్న - నాడే నిన్నెరుగనా
కూడు గలిగితేనే - [4]కుక్క గోపిదేవౌనా ॥పొదుగు॥

1. సురతానివో (B). 2. యందల రవళి (A). 3. బట్ట డబ్బే గాని (B).
4. కుక్క గంగిగోవౌనా (B).



## 112. మధ్యమావతి - ఆది

గట్టివాడవు సైరాసై నిను -
గన్నదే తల్లీ - నే (నీ) ॥పల్లవి॥

వెట్టి కాని బుద్ధులు - విన్నది -
వేణుగోపాలా శాబాసు ॥అనుపల్లవి॥

చీరలు రవికెలు నాణ్యము జూస్తివి -
శీనా అద్దము బేరము జేస్తివి
ఆరణి దీపస్తంబము దీస్తివి -
అడిగి నందుకా చెంపల వేస్తివి ॥గట్టి॥

ఎమ్మెలుగా తిరుగులాడ మంటివి -
యేదడిగిన దయ జేసేనంటివి
సొమ్మునాకు లక్ష్యము లేదంటివి -
సొద్దు వేసి మెడది నాచుకొంటివి ॥గట్టి॥

వ్రతము జెరచి నను వేకటి జేస్తివి -
వాలాయము తల వాకిలి గాస్తివి
హితవుగా వుండి యింత జేస్తివి -
యెప్పుడో లేచి కంబి దీస్తివి ॥గట్టి॥

## 113. గౌళిపంతు - ఆది

ఏమి జూచిన బోర్లపాటే – యిట్లా కులికేవు – ఓ ॥పల్లవి॥

భామ వేణుగోపాలుని వాకిట –
పదివేలకు నీ వంటి బానిసెలు ॥అనుపల్లవి॥

నాళ్ళ నడుమ జేరి యారు – పాళ్ళ యిల్లు గట్టి వాకిట
గోళ్లు మీటుచు నిలువక కానీ – వేళ్ళ [1]ఉంగరా లెరుగరటే ॥ఏమి॥

పయ్యెద [2]తొలగింది చూడక – వెయ్యిమంది నవ్వుకోగా
చెయ్యి విసురుచు [3]తిరుగక కానీ – చేతి చేకట్లెవ రెరుగురటే ॥ఏమి॥

ఈసుతో జూచేవు [4]తిరుగా – రోసమా తిరునాళ్ళ ప్రజను
తోసుకొని పోకుంటే యత్తరు – పూసుకొన్న దెవరెరుగరటే ॥ఏమి॥

జ్ఞాపక మెక్కడనే [5]మొన్న – [6]మాపు నే నిను బిలువగ రాగా
దీపమేల దెమ్మంటివి నీ – పాపట బొట్టెవ రెరుగరటే ॥ఏమి॥

సమ్మతిగ వేణుగోపాల – సామి నిన్నేలిన సుద్ది
కొమ్మలడిగితె తల యూచితివట – కమ్మలుండే దెవరెరుగరటే॥ఏమి॥

1. వేళ్లయుంగరా లెవరెరుగరటే (B). 2. తొలగిన దెరుగక (B).
3. నడువకగాని (B). 4. మర్ల (B). 5. నిన్న (B). 6. మాపు నేను బిలువరాగ (B).



## 114. గౌళిపంతు - ఆది

బొట్టువేలు సున్నమైతే అంతలో – బోర్లపడేవేమే – తాను ॥పల్లవి॥

పట్నానికి బోయి నచ్చిన బడాయి –
పల్లకి ముందర విచ్చుకత్తులట ॥అనుపల్లవి॥

దిండు కానుకొని కూర్చుండేదట
దండము బెట్టేది దొరలకేనట
పండితులకు మరియాద సేయదట–
కుండలు గోకింది తలచుకోదట ॥బొట్టు॥

చల్లని అన్నము నోటికి పోదట –
సరిగె బుటేదారి చీర ముదుగట
మొల్లవిరుల పాన్పు జీరుకొనునట –
పుల్లగంజి నాడే మరిచిందట ॥బొట్టు॥

వేణుగోపాలసామి గుత్తట –
వేకటై మొగ పిల్లను గనెనట
యేణాక్షుల నలుపు లెంచితివట –
యెత్తుక తిన్నది మదిలో లేదట ॥బొట్టు॥

## 115. గౌళిపంతు - ఆది

పుట్టిన పుట్టుక వచ్చిన రాకడ –
అట్టె తలుచుకోవె – ముందర ॥పల్లవి॥

పట్టెదేసి [1]సొమ్మేర్పడగానే –
మిట్టిపడక వయసు రెండు దినములు ॥అనుపల్లవి॥

కీలుగంటు వెనక జారగానే [2] –
గీరు నామము దిద్దగానే
పూలగుడ్డ మొలక జుట్టగానే –
పొగరు నీ వొళ్ళు నీ వెరుగవు ॥పుట్టిన॥

మూడు మాట్లు పిడచ దొరకగానే –
ముక్కు చెవులు కుట్టించగానే
వాడుతమలపాకు దొరకగానే –
యొయ్యారము దోవ జూచి నడువవు ॥పుట్టిన॥

వేణుగోపాలు డెనయగానే –
విత్తళి కమ్మలు బెట్టగానే
కాణాచికి నిన్ను బిలువగానే
గర్వమటే లేచి తలుపు దీయవు ॥పుట్టిన॥

1. రొమ్మేర్పడగానే (A).
2. కదలగానే (B).



## 116. కన్నడ - ఆది

ఒక ధూపము లేదే నీ సాక్షిగ –
ఒట్టి పై బూటక మేనే – యేమో ॥పల్లవి॥

ఇక ముందర ముత్యాల కుళ్లాయి –
యెన్నడో బెట్టినట యిప్పుడు ॥అనుపల్లవి॥

కానని నా సవతులు[1] యీ వూళ్లో –
కల్పించేందుకు దొడ్డాశ్చర్యము
శానా వున్నది రామాయణ మిది –
లోని గుట్టు పెరుమాళ్ళకు తెలివిడి ॥ఒక॥

గుడుగుడు ఆలోచనలే కాని –
కోమలి నేనొక పోణిమి యెరుగను
అడిగి తెలుసుకొని పిమ్మట కాదను –
తడుకు దాసరి ప్రతిష్ఠ వంటిది ॥ఒక॥

ఏణాక్షిరొ యీ సాంబ్రాజ్యానికి –
ఏమిటికే గాంధారితనాలు
వేణుగోపాలుడు ననుగూడి –
వేళ్ళ వుంగరా లిచ్చే ననేరు ॥ఒక॥

1. కాని నా సవతులు (B).

## 117. పంతువరాళి - ఆది

లంజవారి తమ్ములకే యిప్పుడు[1] –
రాజఠీవులన్నీ – యెందుకు ॥పల్లవి॥

కంజభవుని కీ వసుమతిలో గుడి –
కరువైనది వేణుగోపాల ॥అనుపల్లవి॥

ఖాసాబంతి భోజనమాయె –
[2] వీసె తమలపాకుల విడెమాయె
వాసన గంధము బూయడమాయె –
మీసాలకు అత్తరు మెరుగాయె ॥లంజ॥

నానాటికి పాగ పెద్దదాయె–
నయము శాలువలు గప్పడమాయె
చీనా అద్దము జూడదమాయె–
చిమటాపని దినము దప్పదాయె ॥లంజ॥

కాళ్ళకు వంకర పైజారాయె –
కాపులు లంచము దోపడమాయె
వేళ్లనిండ ఉంగరాలాయె –
వీధి వీధి గుర్రపు [3]స్వారాయె ॥లంజ॥

చేతిరుమాల విసరడమాయె –
చెవుల పోగు లాడించడ మాయె
రాతిరి సంగీతము మెండాయె స్వ –
జాతి ధర్మమంతయు మరుపాయె ॥లంజ॥

జాబులు జత్రలు [4] వ్రాయడ మాయె –
స్వాలు జవాబులు చెప్పడమాయె
జేబులోనె పెట్టె బీగెమాయె –
జెట్లు వచ్చి నడుము బట్టుటాయె ॥లంజ॥

---

1. లంజవారి తమ్ములకే గద – యీ రాజఠీవులన్ని (B).
2. వేసు తమలపాకుల (B). వీసు తమలపాకుల (A).
3. సవార్లాయె (B). 4. రావడమాయె (B).



## 118. పంతువరాళి - చాపు

[1]అందరు నాయకురాండ్లైరి యిదేమి –
యాశ్చర్యమె చెలియా నిన్న మన ॥పల్లవి॥

ముందర దుత్త లెత్తుక అల్లాడిన లంజ –
లందలా లెక్కిరి యౌరా కాలమహిమ ॥అనుపల్లవి॥

వేళ వేళకు సొగసు – వింత వింత చీరలు
తాళీలు రవల బం – దరు కమ్మలు
మేలుకట్ల యిండ్లు – చాలినంత ధనము
[2] మూళి ముందర కొచ్చె – మురిపాల ధనమాయె ॥అందరు॥

ఓర్వ జాలరు సుంత – వొకరు పచ్చగ వుంటె
గర్వింతురటె పదవి – గలిగితేనే
నిర్వహించే దెట్ల – నే పేదసాదలు
పూర్వీకుల పని – బుట్టిలోకి వచ్చే ॥అందరు॥

ఏమి పుణ్యము జేసి – యీ భూమి మెట్టిరో
తాము వున్న వూరు – తలచరమ్మా
నేమనిష్ఠలు ఆడ – నే వుట్టిపడిం దిపుడు
భామరో వేణుగో – పాలు దేలిన వెనుక ॥అందరు॥

---

1. అందరు నాయక సాను లయిరి యేమి – ఆశ్చర్యమె చెలియ (B).
2. మూలి ముండకు వచ్చె (B), మూలి ముందరికొచ్చె (A).

## 119. పంతువరాళి - ఆది

ఎంత యే(బ్రాశైతేనేమి – హితవేగద నీకు – యీ ॥పల్లవి॥

వింత జూచి నవ్వని వారెవ్వరు –
[1]వేణుగోపాలరాయ మొన్నటి ॥అనుపల్లవి॥

[2]పడకటిల్లు వకనాడును నూద్వదు –
పట్టెమంచ మెన్నడు కదలించదు
పడిగె మెపుడు బైటబెట్టి కడగదు–
పరుపు దుప్పటైనా విదలించదు ॥ఎంతయే॥

[3]ఏడ జూచినా తల వెంట్రుకలు –
ఎదురుగానె యెంగలి పొగచుట్టలు
గోడమీద విపరీతపు నల్లులు –
కొమ్మ పెదవిపై సున్నపు గురుతులు ॥ఎంతయే॥

పల్లు కుత్తుకుని వేసిన [4]పుడకలు –
పైటకొంగు కడవెళ్ళా మరకలు
తెల్లవార్లు వింటివిగా గురకలు –
చెల్లగడితివి యాభై కరుకులు ॥ఎంతయే॥

కానుగ నూనె బోసిన దీపము –
గాదె మూల కుంపటి పొగ ధూపము
నాన బియ్యమంటే నిక్షేపము –
నాతి కెపుడు ముక్కు మీద కోపము ॥ఎంతయే॥

వారానికి పందుల సాకింది –
వల్లమాల్నె కోళ్ళను బెంచింది
నీ రాకకు దోవలు గాచింది –
నిన్ను గూడి గర్వము మించింది ॥ఎంతయే॥

1. వేణుగోపాలసామి సాక్షిగ (B).
2. పడక టిల్లొ కనాడయిన నూద్చదు (B).
3. ఏడ జూచిన వెంట్రుక చుట్టలు (B).
4. పొరకలు (B).



## 120. పంతువరాళి - ఆది

రావద్దటే నీవు జేసిన మేలుకు – రమణిరో యిపుడూ ॥పల్లవి॥

భావజు తూపుల [1]కోర్వలేనని నే –
బతిమాలితే మూతి వోరగ బెడితివి ॥అనుపల్లవి॥

నూరు పనులు నుగ్గబెట్టి యెంతో –
మేరువగా యెంచి వచ్చినందుకు
తేరు లేనిదైన సాకు బెట్టుక –
తిరువళ్ళూరి కిదిగొ పైన మంటివి ॥రావద్దటే॥

మల్లెపూలు పండ్లు వక్కలాకులు –
మంచిదనుచు గుంజి లోన వేసుక
తెల్లవార్లు తలుపు దట్టి పిలిచితె –
పిల్లి దిన్న కోడివలెనె యుంటివి ॥రావద్దటే॥

ఒక్కపూట పిడచ వేసి యెన్నో –
లెక్కలాడితిరి యింటిలుపాది
యెక్కడి దబ్బిలి సాంప్రదాయకమె –
నిక్కమె వెలయాలని భ్రమసితి ॥రావద్దటే॥

మంచి గుండె ధైర్యము గాకుంటె –
పంచ తిన్నెపైనే పవళించితె
కంచి పరుష మీద బెట్టి రాతిరి –
వంచనజేసి పొగ తస్కరింతువ ॥రావద్దటే॥

వెలది వేణుగోపాలుడైన నిను –
గలసినదే నా బుద్ధికి మోసము
పిలువబోకు సాలు బొల్లి మాటలు –
చెలియ మీ వీధికి యొక దండము ॥రావద్దటే॥

1.కోర్వలేక నిను (A).

## 121. మధ్యమావతి - చాపు

బారు బూరుమని పరుగులెత్తితే నిచట -
పాట బాడ వద్దటే నగిరి ॥పల్లవి॥

నారాయణవనము చీర గట్టుకొని -
[1]నగిరి వద్దకి ఘననాయకురాలివలె ॥అనుపల్లవి॥

తుమ్మికూర చేలో - తుంచుకొచ్చే నని
దిమ్మరి యేడేడ - దిరిగితివే
కమ్మ కస్తూరి బొట్టు - నెమ్మోమున [2] దీర్చి
సొమ్ములు తగిలించి - యెమ్మెకాండ్లు జూడ ॥బారు॥

ఉసిరికాయలు నమిలి - వూట నీళ్ళు దాగి
కసువు [3] మోపెడు గోసి - అసురుసురై
[4]పసపు నిగ్గు మెరయ - పై తళుకులు జేసి
విసవిస నొకచేత - విడెము బట్టుకొని ॥బారు॥

ఏ మళ్ళలో జిక్కె - ఇన్నెంద్రకాయలు
భూమి నక్కల [5] కిక - బుగ్గి వున్నదే
కోమలి అడిగితే - కోప మెందుకె యిట్లా
భామరొ వేణుగో - పాల రాయని గూడి ॥బారు॥

1. నగరి వారిలో ఘన - నాయకి వలెనే (B). 2. దిద్ది (B).
3. గంపెడు (B). 4. పసుపు నిగ్గుగ బూసి (B). 5. కింత (B).



## 122. ముఖారి - త్రిపుట

నమ్ముదురటే తెలిసి తెలిసి యుండి తిరుగా -
నన్ననేవా నీవూ ॥పల్లవి॥

కొమ్మరో వేణుగోపాలరాయడు దేశ -
దిమ్మరై యిల్లిల్లు దేవరింపుచుంటె ॥అనుపల్లవి॥

నత్తు జూతామని - నను మోసబుచ్చి - చి
ల్లత్తూరిలో తన - లంజ ముక్కున బెట్టి
యుత్తర మియ్యక - నుంటే నేనడిగితే
ధుత్తెరియని పట్టా - కత్తి దూసిన వాని ॥నమ్ము॥

ఏమమ్మా మరచితివో - యిదె గవ్వాక్షి గుండ
నామంపు పెట్టెలో - నరసి రేకడిబిళ్ళ
రామంజేరి విజయ - రాగి బొడ్లో దోపి
నీ ముందరనె సత్యా - నికి బిలచే సామిని ॥నమ్ము॥

సుమశరకేళిని - సొలసి నిద్దుర బోవ
సమయము జూచి మం - చము కింది జలపాత్ర
అమరికెగా బట్టి - అరుణోదయానికెల్ల
తిమిరి కోటదాటి - తిరిగి జూచిన వాని ॥నమ్ము॥

## 123. ధన్యాసి - ఆది

మనసు నొచ్చుకొని అసురుసురంటె -
మంచిదేమె నీకూ - యెందుకె ॥పల్లవి॥

నను మాతులు బొడిచేవు కార్వేటి -
నగర వేణుగోపాలుడు వూరకె ॥అనుపల్లవి॥

ఎన్నాళ్ళో నీ యింటికి దిరిగెను -
యేమేమో ప్రియములన్ని బలికెను
అన్నియు బాణములై విన సైచక -
చిన్నాట్లకు రాక తర్లమంటివి ॥మనసు॥

నీపాదములకు సాగి మ్రొక్కెను -
కోపము సేయకుమని బతిమాలెను
పాపపు దైవము నీ మనసింత -
పాషాణము జేసినందు కనవలె ॥మనసు॥

దినము లెంచి చెక్కిట చై బెట్టెను -
ననవిల్తుని కేమో మీదుగట్టెను
ఘననాయకురాండ్లు లేరో అయినా -
గాని యింత నిర్మోహితన మటే ॥మనసు॥

పదము బాడి చిరునవ్వు నవ్వెను -
పాలిండ్లను జూచి సొక్కిసోలెను
పదరి పైట చెరగు బట్టినాడని -
భాషించక మోడి చేసుకొంటివి ॥మనసు॥

ముద్దుబెట్టమని మోమటు వంచెను -
మునుపు నిన్ను గూడినదే దలచెను
పద్దుబట్టి మీవారిముందర
బైసి దీసుకొంటి వనుచు చిన్నబోయి ॥మనసు॥



## 124. ధన్యాసి - ఆది

ఇంటి మగడు కుంటెనగాడైతే -
యెటులసేయ వశమే - సంగతి ॥పల్లవి॥

వింటివటే వేణుగోపాలుడు -
విడిచి రాక లెగజల్లేవాడని ॥అనుపల్లవి॥

మిద్దె విడిది సేయమన్నాడట -
మిణుకు రవల సొమ్ము చూడమనెనట
యెద్దుబరువు పాత్రలు బడియుండెనట -
యే వస్తువుకైన చింతలేదట ॥ఇంటి॥

ఇకను తిరిగి తెచ్చిపెట్టలేడట -
యీ కాడికి చాలు చాలైందట
ఒక బిడ్డకు యే పోణిమి లేదట -
వొప్పనంటె సన్యసించీనట ॥ఇంటి॥

దారిద్ర్యము వెళ్ళబోయలేడట
తన యాజ్ఞయితే పాపము లేదట
వీరపతివ్రత అని పిలచీనట -
వెలవాణిగ వుంటె చూడవలెనట ॥ఇంటి॥

పతిమాటకు మారు బలుకరాదట -
ఇతిహాసము లిందుకు వేయిగలవట
అతివరో అరవైయేండ్లు జెల్లితే -
అర్లుమర్లు గాదటవే ముదిమిని ॥ఇంటి॥

వేణుగోపాలుని గూడేదట -
వేశ్యవలెను సొగసు సేయవలెనట
ప్రాణ మెక్కువటె మానము కన్నను -
పణతి రేపు తనకే దెలిసేని ॥ఇంటి॥

## 125. సారంగ - త్రిపుట

తప్పించుకొంటేనే విడుతునా ఇక నీ -
తల్లికేమైన నే ఝుడుతునా ॥పల్లవి॥

యిప్పుడేమే నీ ప - ప్పెల్ల చిమిడింది
చెప్పినంత మాట - చెల్లియుండగ ॥అనుపల్లవి॥

[1]అర్జి వ్రాసి నగర బెట్టనా యిట్లా - గైతే కాలికి బొమ్మ గట్టనా
దరువులు [2]వేసుకొంట - వరహా లెంచుకోలేదో
సరసకు రమ్మంటె - హరివాసర మనుచు ॥తప్పించు॥

పంచాయితులను గూర్చనా నిన్ను -
పదిమందిలో [3]బైశార్చనా
అంచుకోక దెస్తె - అలాగేనని
మంచ మెక్కమంటె - మహాశివరాత్రనుచు ॥తప్పించు॥

ఇల్లలికితే పండుగాయెనా నీ - విపుడే గెలిచి నట్లాయెనా
[4]తెల్లవారితే గాని - చెల్లదు పొమ్మని
మల్లాడే కొద్దిటుల - బెల్లి మాటలాడి ॥తప్పించు॥

కూళ్ళమారి యికనే తిట్టనా నీ - కూడుగుడ్డ పాతల గట్టనా
వేళ్ళవుంగరాలిస్తే - వెనక చూతామని
కాళ్ళకు మ్రొక్కితె - కడకుబోయినా ననుచు ॥తప్పించు॥

వేణుగోపాలుడ గానటే నిన్నీ - వేళ రతుల గూడలేనటే
ఆణిముత్యము దెస్తె - ఆడ్డి సేయనని
వీణె విందామంటె - వెలిగోరు జూపించి ॥తప్పించు॥

1. అరిజి వ్రాసి నజరుపెట్టనా యిట్లా (B). 2. వేసుక (B).
3. బగిసీ యార్చనా (A). 4. తెల్లవారికేగాని చెల్లదు పొమ్మంటే (AB).



## 126. కళ్యాణి - ఆది

చిటికె వేసితె నీ వంటి - చెలులు లక్ష పదివేలే ॥పల్లవి॥

విటుకులాడి యెవడనుకొన్నావో - వేణుగోపాలుడు నా పేరు ॥అనుపల్లవి॥

అందగత్తె వనుచు వలచి నందుకె - అలమి కౌగిట జేర్చేవా
గందమలది విరులు సిగను జుట్టి - కప్పుర బాగా లిచ్చేవా
బందరు కమ్మలు గదలగ రాగము - పాడి వీణ వాయించేవా
మందెమేళమున యేమాటాడక - దందనతో ప్రొద్దులు బుచ్చేవా ॥చిటికె॥

సరిగె పయిట దిగ్గున తొలగించి - చనులు అంటనిచ్చేవా
అరమర సేయక చక్కెర కెమ్మో - వాన నిచ్చి లాలించేవా
మరుని భయము నీ కెందుకు వలదని - మనసు దెలిసి నడిపించేవా
తరి యిది గాదు యింటికి రమ్మని - తలుపు మూసి గడి వేయించేవా॥చిటికె॥

చెలువరాయ నా సామిగ రమ్మని - చెక్కులు నొక్కి ముద్దిచ్చేవా
మొలకనవ్వు లొలుక సారె సారెకు - మోము మోమునను జేర్చేవా
కలను కలసినది నిజమౌటకు నను - గడియ రతుల తనియించేనా
కలదు లేదనుచు నిజముగ నాతో - పలికి యిపుడె సెలవిప్పించేవా ॥చిటికె॥

# 127. ఆనందభైరవి - ఆది

ఈ కాపురమెట్లా [1]కృతి గూడునె - యిక మీదటికైనా తెల్పవె //పల్లవి//

గోకుల వంశోద్భవుడైన వేణు- గోపాలస్వామి [2]పోకిరాట్లకు //అనుపల్లవి//

ఇంటిజోలి అక్కర లేదాయె - హితవు మాట [3]లెంతో కనరాయె
వంట తనకు ప్రత్యేకమాయె - కొంటెలతో నాలోచనలాయె //ఈ కాపుర//

[4]రాతిరి గుడిసెలలో పడకాయె - చేతికాసు లంజల పాలాయె
భూతికి అప్పులు గోకడమాయె - నేతి మెరుగు కల గన్నట్లాయె //ఈకాపుర//

[5]తందన పదాలు బహు మెండాయె - తగినట్టే కిన్నెర వకటాయె
పందానికి కోడిపుంజులాయె - బైసాట్లకు కిరుకిరు మెట్లాయె //ఈ కాపుర//

చూరుకు మొలకు వొక కొంగాయె - మారు రవికె పేరెత్తక పోయె

[6]పూరపసవు అది బంగారాయె - వుత్త చెవులతో నుండడమాయె //ఈకాపుర//

దినదినము పొంచులు వినుటాయె - తిట్టినాను రోసము లేదాయె
నను రతిగూడి యేడేండ్లాయె - నా యీడుది బిడ్డల తల్లాయె //ఈ కాపుర//

1. గుదిగూడు (B).
2. పోకిరాట్ల కిపుడు (B).
3. పనికి రాకపోయె (B).
4. రాతిరి పొరుగింఢ్లను పడకాయె (B).
5. తందన పదములు బాడడమాయె (B).
6. కూరపసపు యది బంగారాయె - ఓరి చెవులతో నుండడమాయె (B).



# 128. బిలహరి - త్రిపుట

పిలచిన నాడెల్ల బింకాల పోయి నేడు -
యిలుచుట్టు తిరిగేవేమే యిపుడు //పల్లవి//

వలపు బుట్టెనే మొగ -వయసు మించిన వెనక
కులుకరాకు వేణు - గోపాల రాయుడు //అనుపల్లవి//

ముదిమి గాదటవే నీ - మొగము మునుపటి కిపుడు
పెదవులు తెలుపెక్కె - వదిలిందే పలువరస
చెదరినే మై చాయ - చెవులు మందగించె
సదయుడు బతిమాలి - సాష్టాంగపడి మ్రొక్కి //పల్లవి//

నేడు జూచితే తల - నెరిసిందే సగబాలు
[1]ఆరూపే గాన - మది గాక చత్వారి
పాడజాలవు గుక్క - బట్టి మునుపటి కిపుడు
మోడి సేయవద్దని - మోహనాంగుడు నిన్ను //పల్లవి//

మకరధ్వజుని నగరు - చికిలి వింతగ చేసి
యొకతే వత్తురే యిట్లా - వొంటిదోవ నీ రాత్రి
ప్రకటించి వేణుగో - పాలుని దయ వచ్చి
యిక నిన్ను గూడితే - యెవరైన నవ్వరా //పల్లవి//

1.ఆడరూపే గాన (A).

## 129. బిలహరి - త్రిపుట

తొలుతటి బ్రతుకెల్ల దోచదో యిప్పుడు –
దొరలు చేరదీయగానే మును మీ //పల్లవి//

తలిదండ్రి తాతలు – తమ్ములు నలుగురు నీవు
చలివేంద్ర బోసినది – సకల జను లెరుగరా //అనుపల్లవి//

తలకు తైలము బోయ – దరువు లిద్దరు వేయ
నలుగు నలుగురు బూయ – నలుపు వదల దాయె
[1]కడకండ కడవలాయె – కాయము బరువాయె
బలుసాకు విసమాయె – కలిచారు వెగటాయె //తొలుత//

పరగడుపుతో పాచి – పండ్లు తోమడ మాయె
సరివారివలె దినము – సంధ్య వార్చడమాయె
పరిపరి రుచులుగా – బ్రాహ్మణార్థము లాయె
యిరికిపండ్లు జూచి – యీసడించడమాయె //తొలుత//

గోపాలకుని దయ – గొప్ప జెందుటలాయె
యే ప్రొద్దు పండితుల – యెంత లేదనుటాయె
దీప శెమ్మెలాయె – దివ్వె బెట్టడమాయె
మోపు కట్టెలు తలను – మోసినది మరుపాయె //తొలుత//

1. కలకండ (A).



## 130. నాదనామక్రియ - ఆది

బడవాతనాల కేర్పటినావటె – బవిసిమాల్నె తొత్తా యికనాళ్ళ //పల్లవి//

నడుమ [1]వుండతగదు కార్వేటి – నగర వేణుగోపాలుని దగ్గెర //అనుపల్లవి//

పెరటి దోవనే అది వచ్చేదట – పొరుగుననే యా ఘనునకు విడిదట
సరసాలకు మీ చింపిరి గుడిసట – సభలో నిను మెచ్చుకొన్నారట //బడవాత//

అక్కడి కిక్కడికీ సారథివట – ఆలోచన కర్తవు నీవేనట
యెక్క డెక్కడనో ప్రస్తాపాలట – యే మొగవారికి యిదే చదువట //బడవాత//

వింత వింతగా జడలల్లుదువట – వేకటి గమ్మని దీవింతువట
యింతలోనె ఆయన వచ్చేదట – యిద్దరి కొంగులు ముళ్లు వేతువట //బడవాత//

మగడంటే దానికి తలనొప్పట – శగరోగము వొళ్లున యిమిడిందట
సొగసులు జేసుక మిఠారించునట – వగలాడికి ప్రాణపదము నీవట //బడవాత//

గొప్పవారి కడుపున బుట్టిందట – గోడలు బట్టుక నిక్కిజూచునట
ఎప్పటికీ పుట్టింటినె వునికట – యింతికి వుపదేశ గురువు నీవట //బడవాత//

ఏ వస్తువు నీకే దోపేదట – యేవేళా పోకిరి ముచ్చట్లట
వావివరస అక్కర పనిలేదట – వనితను కాపురము సేయనీవట //బడవాత//

చెరగుమాసెనని యది బొంకేదట – మరునాడే నీవు కడకు బోదువట
యిరువర్లకు వక తావున నునికట – యేమి జెప్పవలె సరిపోయినదట//బడవాత//

తుంటరి చేష్టలిక పోనీరాదటె – తంటలు తారాముళ్ళు ప్రతిష్ఠటె
వంటవార్పు నేర్చితె కారాదటె – కుంటెనగత్తని పేరుబెట్టదటె //బడవాత//

ఎట్లా యీపని ఘటన చేస్తివో– ఎన్ని కొంప లీలాగు జెరిస్తివో
ఇట్లా ఆర్జన లెక్కడ చేస్తివొ – యే మిండడి కిచ్చి దారబోస్తివో //బడవాత//

వారి కోర్కెలన్నియు పండిందట – వలరాయని మ్రొక్కులు చెల్లిందట
చీర కొనిస్తే కుశిపించితివట – చేతులో పైకము వేసికొంటివట //బడవాత//

1.వుంచ తగదు (A).

# 131. గౌరి - ఆది

ఈ భాగ్యానికి రాణివాస మెందుకే నీకు ॥పల్లవి॥

ఓ భామ వేణుగోపాలు - డొకరి గాలి కారాదంటె ॥అనుపల్లవి॥

తెల్లవారక మునుపే లేచి - కళ్లాపు చల్లుకొని అమడ
పిల్లలకు వుగ్గుబెట్టి - పిడకలు తట్టుకొనేదాన ॥ఈ భాగ్యా॥

వాడుకునే వొక బోకి సత్ర - వాడకు చేయించ బంచి
మూడు నెలలాయె గదే కుమ్మ ర - వాడీ వూళ్ళో బంగారాయె ॥ఈభాగ్యా॥

నల్లపూసలోకి వక్క - తెల్లపూస లేదిప్పటికి
ఇల్లు వురుపన్నందుకేగా - గిల్లింది లోతొడలో బట్టి ॥ఈ భాగ్యా॥

తల్లి నీకక్కర లేకుండా - తాటాకు వ్రాసీయమని
తెల్లవార్లు కొట్లాట వీ - ధెల్ల శివరాత్రిగ నుండె ॥ఈ భాగ్యా॥

గోడ నిక్కి చూచినావని - యేడనో పొంచుండి చాం
త్రాడుతొ నిను మొన్న యనం - త వ్రతము గావించెనట ॥ఈ భాగ్యా॥

యీడు జోడు చెలుల కెల్ల - మేడ వుప్పరిగెలాయె
నాడే వద్దని మొరబెట్టితె - నను గురకాయించితివో లేదో ॥ఈ భాగ్యా॥

ఈతచాప మీద చింపి - గోతము బరచుకొని వాడు
రాతిరి నిను గూడితె - యే తీరున సయిచు కొంటివో ॥ఈ భాగ్యా॥



# 132. శంకరాభరణం - చాపు

బారలు సాచుక జగడానికి రాకే -
బయిశారి పో - బొయ్యేవు - మొలను ॥పల్లవి॥

చీర గట్టుకొనేది - సిగ్గుక యెందుకే
నోరు మూయవె మగ - ధీరునివలె లేచి ॥అనుపల్లవి॥

బసివి యింట బుట్టి - బందివద్ద[1] బెరిగి
పసితనాన కన్న - పాట్లబడి
దెసజెడి వచ్చింది - తెలయదా యెవరికి
[2]అసలు బోగందాన - వైతె వీధెక్కుదువా ॥బారలు॥

బ్రతికితే వచ్చెనా - పంది వుండలేదా
వ్రతమా నోముల పూజ - వొక్కప్రొద్దా
గతుకు దొరకగానె- కండకావరమటే
అతివ గుంటకాసు - లాడించె వేమొగా ॥బారలు॥

మూల నీవు నడిచేది - మునుపు నే నెరుగనా
యేల [3]కారాదని - యెంచితి గానీ
బాళితో నిన్ను చెయి - బట్టి దగ్గర దీసి
యేలిన వేణుగోపాలు ననవలె గాక ॥బారలు॥

1. జేరి (B). 2. అసలు బోగం దానవయితే నిదే కొదువా (B). 3. పోనిమ్మని (B).

## 133.ఆఠాణా - త్రిపుట

సరిగచీర గట్టి కులికినట్టే గాదు –
సభలో నిలవవద్దటే – యింకా ॥పల్లవి॥

మతి రత్నాల సొమ్ము – లిరికించు కుంటె నే
మహరాజు మెచ్చ యే – మని వినిపించేవే ॥అనుపల్లవి॥

పాటకుండేమొ సం– బళ మడిగినాడని
చాట దెమ్మన్న నీ – మాటిగాదా
పేట నట్టుడు నీ – కాట చెప్పుచు తాళం
గూటాన తగిలిస్తే – గుగ్గిళ్ళదానికమ్మి ॥సరిగ॥

చదువులయ్యవారు – నిదుర బోవగ జూచి
పదరకుండ నెత్తి – పాగ మీటవా
అది మాత్రమటె శాస్త్రు – లభినయము జెప్పుచు
మదనమందిర మంటె – బదులు కన్నదె వింత ॥సరిగ॥

మద్దెల గవిసెన – మబ్బులో కత్రించి
పెద్ద దిండు గూర్చి – పెట్టు కోలేదా
కొద్దిదానవ వేణు – గోపాలుని గూడి
మిద్దె జేరుకొని యీ – మేరకు పైఠాణి ॥సరిగ॥



## 134.కాపి - చాపు

ఒచ్చేవా రావో దెల్పవే రెంట్లో నొక మాట –
వలదే యీ నసనసలు నేనా ॥పల్లవి॥

విచ్చలవిడి దిరిగే – వేణుగోపాలుడ
యిచ్చే కాసిచ్చీ తిరుగలజడి యెందుకే ॥అనుపల్లవి॥

మెల్ల మెల్లనె వచ్చి – అల్లిబిల్లి జేసి
మల్లెమొగ్గల చీర – శల్లా అంటుకొని
మల్లి వచ్చేనని – మాయలెన్నో బన్ని
యిల్లు జేరకుంటె – యిక నిన్ను విడచేనా ॥ఒచ్చేవా॥

మదిరాకోట బెదరి – పెదవులు దడుపుచు
ఒదిగిందెవ్వరే యింత – ఒళ్ళెరుగని శివమా
గదిమి పొమ్మని చెయ్యి – మరుగు బెట్టుకోగానె
పదిమంది ముందర – బైశార్చక మునుపే ॥ఒచ్చేవా॥

గూడకంబడి నిండ – వాడ బియ్యము కరుకు
మాదరూకలు సంత – నాడంపిం దెరుగవో
కోడిగాల వేణు – గోపాల రమ్మని
కూడి యుందాము వా – దాడక గట్టిగ ॥ఒచ్చేవా॥

## 135. కాపి - చాపు

తిన్న యింటికి రెండు దలచే
ద్రోహి లంజపై తిరుగా ఆస పడుదురా నీవు ॥పల్లవి॥

వెన్నదీసి విసరి – వేసినందుకు రాత –
వేయనెంచి రాలేదా – వేణుగోపాలా ॥అనుపల్లవి॥

రోగాలు గుణపరచి – రాగాలు పాడించి
తేగ మిచ్చుట బూడి – దె లోని హోమమాయ
యీగర్వి తొత్తుల – కే గతో ముందఱ
కాగల పనులకు – గంధర్వులున్నారు ॥తిన్న॥

చీలిక గుడ్డలు – చీరపోతులు వదలి
నాలుగేండ్లకె ఘన– నాయకుసానైరి
వేలు వంచలేరని – వెక్కిరించిన లేదా
కాలికి గాని చెప్పె – క్కడ దొర్లితే నేమి ॥తిన్న॥

కలినీళ్ళు రాగి సం – కటి చేలో గురుగాకు
నిలిచె శృంగారించి – నీవు గూడిన నాడే
తులువల కూడి బు – ద్ధుల జెడితె బలాదూరు
తలకు బాసిన కురులు – తాక యోగ్యమె పోపో ॥తిన్న॥



## 136.పంతువరాళి - చాపు

గొడ్డుబోతు వొకతె బిడ్డలకై నిన్ను –
కోరియున్నదిరా – గురుతు ॥పల్లవి॥

నడ్డిముక్కు మేను – నలుపు మాటలు నత్తి
మడ్డి శరీరము – మగువ బుగ్గలు సొట్ట ॥అనుపల్లవి॥

వక్కలాకులు వద్దు – వరహాలంటదు సొమ్ము
లెక్కసేయదు చీర – లక్కరలే
కక్కసగాండ్లెల్ల –గాదని తొలగిరి
దక్కితివని యడుగు – దండాలు బెట్టుచు ॥గొడ్డు॥

గంధమేల పూలు – గలవు అక్కడ శానా
మందయానకు నేడు – మారు నీళ్ళు
సుందరముగ చాదు – చుక్క దిద్దినది
అందకత్తె విడిది – అదిగో తేరకాడ ॥గొడ్డు॥

రాణివాసము లేదు – రావచ్చు దొరవలె
ప్రాణము నీ మీద – భామామణికీ
యేణాక్షిని రతి నేలుకో – యీ రాత్రి
వేణుగోపాల నీకు – వేకటైయ్యానని ॥గొడ్డు॥

## 137. ఆరభి - చాపు

సంకటి యిది తిరువీ – సముగాదు మ్రింగను –
చవిజూడ వలదు సుమీ ॥పల్లవి॥

పంకజ భవనుత శ్రీ వేణుగోపాల
ఇంక నన్నమీ కండ్ల – యెపుడు జూతుమో రాగి ॥అనుపల్లవి॥

సారెసారెకు ముద్ద – సాధింప నోపక
బీరముడిగి యూళ్ళ – బిచ్చ మెత్తుచు విసికి(గి)
శ్రీరామ మంత్రము – చిత్తమునందుంచి
ఆరగించడా శివుడు – హాలాహలము వట్టి ॥సంకటి॥

నలుపు వర్ణము జూచి – నమస్కారా లొనరించి
పలుదెరంగుల బయలు – బ్రాకి దిక్కులు చెదరి
కలగి యంతట గుములై – కాసార నివాసులై
కలహంసములు తమ్మి – కాడలు నమలవ ॥సంకటి॥

ఇది సంభావితమాయ – నేమి సేయుదునని
మదిలో మాటికి చింత – మగ్నుడై ధృతి దూలి
అది కారణము జేసి – ఆదిశేషు డీభువిని
పదపడి యనిలము – భక్షణ సేయడ ॥సంకటి॥



## 138.మోహన - ఆది

కులకాంతలు విడిబడి నలుదిక్కుల చెలరేగి –
రిదేటి [1]పాపమో – అయితే ॥పల్లవి॥

వెలయాండ్లకు జీవనమేమిక శ్రీ – వేణుగోపాలా సంకరమై ॥అనుపల్లవి॥

ఉగదెలియని బిడ్డల నెడబాసి – వున్న మూల ముంత దాటవేసి
[2]మగని పేరు కారాదని రోసి – మన్నెకాపురము వ్యర్థము జేసి ॥కుల॥

అందెలు మెట్టెలు రవికెతో జుట్టి – అత్తమామల(కు) దుద్దులు బెట్టి
బందరు పావడలో సద్దిగట్టి – పట్నము జూతామని భ్రమ బుట్టి ॥కుల॥

పిల్లెడుగుల చీర యెత్తి కట్టి – చల్లవుగ్గ మొక చేతబట్టి
ఒల్లెయాడ్చి నడుముకు బిగజుట్టి – నల్లశాజిన్ నిండు ముసుగుబెట్టి ॥కుల॥

తలిదండ్రుల మది తల్లడ బెట్టి – తమ జాతుల కపకీర్తి జుట్టి
తలపరాని నిందెల కొడిగట్టి – [3]ధర్మశాస్త్రముల రోచిక బుట్టి ॥కుల॥

జారుపైట చెరగు మెడకు జుట్టి – తేర లంజకాండ్ర చెట్టబట్టి
ఊరు [4]దిక్కు రోత బుట్టి – ఉబ్బి తబ్బిబ్బై తొడదట్టి ॥కుల॥

పగలు రేయి జాగ్రత్తగా నడిచి – బాపనిండ్ల పూటకూళ్ళు గుడిచి
[5]తెగువ చేసి ఠాణాలు గడచి – తగుదుమనుచు సిగ్గు శరము విడిచి॥కుల॥

ఇంత దూర మెవరు వెతక రారని – [6]యెవరు వచ్చి వేలు వంచలేరని
అంత పనికి రేవిణి చిత్తూరని – చింతలేదు హూణుల దరబారని ॥కుల॥

1. చోద్యమె (B).
2. మగని పొరుగు (B).
3. ధర్మమందు నరోచకము బుట్టి (B).
4. ఊరి దిక్కు (A).
5. తెగువతో చవుకీలు గడచి (B).
6. యికను వచ్చి యేమిచేయ (B).

## 139. ధన్యాసి - ఆది

వారివలె చక్కని వాడైతే - చేరనిత్తువు నిజమే ॥పల్లవి॥

సారెకు నోరగండ్ల జూచుచు - కూరిమితో నిన్ననుభవించే ॥అనుపల్లవి॥

మీసాలెరుపా చేతులు తెలుపా - మీనాక్షయ్యవలె రొమ్మున
నీ సాక్షిగ వీపున గూనా - వ్యాసాచార్లవలె నేమైనా ॥వారి॥

పండ్లు పొడుగా మెడలో కణితా - పాపాపిళ్ళవలే అవటి
కండ్లా పాపపు చెవుడా బోయ - కదిరీగానివలె నేమైన ॥వారి॥

దూడా కడుపా తిరువళ్ళూరి - ఆడిగానివలె నున్నగ
పేడూ మూతా తిరపే గూడా - పెరియాళ్వారివలె నేమైన ॥వారి॥

నత్తా యిప్పుడు వచ్చిన సారాయి - గుత్తన నరసువలె మూగటే
కొత్తచీర రాతిరి తెచ్చిన - కోమటి బోడివలె నేమైన ॥వారి॥

దొడ్డికాళ్ళా తొఱ్ఱి పెదివా - బుద్దయవారివలె ముక్కు
నడ్డా తల వణుకా మరగుజ్జా - నర్రపరెడ్డివలె నేమైన ॥వారి॥

తడయక నినుగూడి గదా యెగ - తాళి సేయవలె యింతకు
పడతిరో వేణుగోపాలుని - పద్దు చెల్లవలె యేమైన ॥వారి॥



## 140. అపురూప - చాపు

అట్లాగే కావలె దానికి - అయి శాబాసు నాడు - ॥పల్లవి॥

కొట్లాడిం దెరుగవటే వేణు - గోపాలుని పిలువ వద్దంటే ॥అనుపల్లవి॥

వడ్డీకి వేయమని రూకలు - గుద్దతో గట్టియ్యగానే
సొద్దు నెత్తిన వేసి యురికె - [1]జిద్దు మొన్నటితోనె విడిచె ॥అట్లాగే॥

కల భూషణములన్నీ ముడిచి - తలమాటున వుంచుకుంటె
[2]మెళకువగా అంటుకొనీ జరిగె - చిలుము నిన్నటితోనె వదలె ॥అట్లాగే॥

[3]పందుకునే యుండి పక్కలో - పయి పనులన్ని చక్కబెట్టి
కుండలు చట్లన్ని జక్కగడిగి - వుండింది పండింది వూడ్చుకపోయ ॥అట్లాగే॥

1. జడ్డు (B).
2. మెలుకవతో నటించుక జరిగే (B).
3. పందుకోని పక్కలో నుండి (B).

## 141. ముఖారి - చాపు

ఇంచుబోణిరో వినుమీ – యింతి నడతలు చూడ
యెంత చోద్యమయ్యానే – యిపుడు ॥పల్లవి॥

పంచబాణుని నగరు – బలు వింతగా జేసి
ముంచినట్టి గృహము – లెంచ నా తరమటే ॥అనుపల్లవి॥

వెలయాలనుచు ఘనుడు – వెయ్యారు లిచ్చెతె
అలమేలు నీ తల్లి – యల్పబుద్ధిచే మరచి
కులహీనునితో రతుల – గూడి పెనగగానే
తెలియనాయె నీ సౌరు – తేటతెల్లమిగాను ॥ఇంచు॥

వారస్త్రీ లైతేనె – వావి వర్తన లేదా
శ్రీరామని పిన్ని – శింగిరేగి యొక్క
తేరుగా నిల్లిల్లు – దేబెరించినదని
యీ రేయి మీ యెదురింటి – యెంబెరుమానా రనెనే ॥ఇంచు॥

పటికెవర్ని మటేమి – పడచు రూపదియేమె
యెటుల జూడలేదె – యీ యెట్టి వెంద్రుక లేమే
అటు నిదానించితే – నాడ రూపేలేదే
విటుల మది కిష్టముగా – వేరే మార్గ మటనే ॥ఇంచు॥

చవుశీతి యుపములు – సకియ పైకొని చాల
అవిధిపడి నేర్పితే – [1]నది సిగ్గుబడి లేచి
యువిద నన్నిటుసేయ – యుక్త మౌనా యంటే
ప్రౌఢనాయకివై యే – పనులని దెలిపేవు ॥ఇంచు॥

వేణుగోపాలునైన – వేమారు గలసీనా
వీణేనని దెలిసితి – వేకటౌదువా నీవు
రాణివాస మనుచు – రాత్రిళ్ళు దిరిగేవు
[2]కాణాచివలె పగలు – గడప దాటిరావు ॥ఇంచు॥

1.నది సిగ్గుబడి పొరలె (B). 2. మాణిక దారికి మరియాద లెటు గల్గు (B).

# తృతీయ భాగం - జాతీయం

## 142. కళ్యాణి - చాపు

అచ్చియ బుట్టింది బూమికి బలుశబ్బ –
[1]రైణా దానెమ్మ సోణిది– [2]సూడెం ॥పల్లవి॥

[3]పచ్చి నూకలు నేలా – బడితె దీనబ్బడేలు
బిచ్చగాల్ల శేశిడిశ – బిరుదు బంట్ల నీతూరి ॥అనుపల్లవి॥

మందలు గదిలె పర – మటిశీమ కెగబడి
కందులేశిరిగా శె – క్క (డ్రూక్కు పందేశి
అందులో సాంకోలే – [4]కమ్మేశిరే బిడల
కుందనంబు పైడి – కూట్టీళ్ళ కెలబోయె ॥అచ్చియ॥

శెట్టుమీద పచ్చు – లట్టు తలేలేశె
[5]సుట్టు దొంగలు వగ – తట్టగ్గిదేవర
గట్టిగా బీదోల్లకు – కలబందేగా కూడు
బట్ట మరకేడ ది – ప్పటి యాడ మాసులకు ॥అచ్చియ॥

ఆలు మొగడు గూడే – దది [6]వోరో బగురెగిచం
సాలా వుడకాడించె – [7]సప్పంనారార్ఝూలు
యీలోనా యేనుగో – పాలుని దయసేత
కాలవరసము గురిశ – కరువు [8]దెలిశ గాక ॥అచ్చియ॥

1. రయినా దానమ్మ సోనిది – శీశీ శెబ్బరయిన – దానక్క సోనిది (B).
2. సూడె (B).
3. పచ్చినుకలు నేల (B).
4. (బోగమాల్ల) కమ్మేశిరి బిడల (B).
5. సుట్టు మెగాలు (B).
6. యేమో (B).
7. శప్పన్నరాజాలు (B).
8. దీర్చెగాక.

[అక్షయనామ సంవత్సరంలో వర్షాభావ పరిస్థితి ఏర్పడి పెద్ద కరువు వచ్చింది. సారంగపాణి ఆ పెద్ద కరువు వల్ల కార్వేటినగర ప్రాంతం ఎలా అల్లాడిందో చాల వివరంగా ఈ పదంలో చూపినాడు. 1747 వ సంవత్సరంలో అక్షయ వచ్చింది. తరువాత 1807లోనూ అక్షయ వచ్చింది. సారంగపాణి జీవిత కాలాన్ని బట్టి 1807లో వచ్చిన అక్షయ కరువు పరిస్థితినే ఆయన సహజంగా వర్ణించినట్లు భావించవచ్చు]

అక్షయ పుట్టింది. అంటే అక్షయనామ సంవత్సరం వచ్చింది. ఎంతో శబ్బర (చెడుఫలితం) కలుగుతుంది. అయినా దానెమ్మసోనిది (భయాన్ని, ఆశ్చర్యాన్ని తెలియజేసేటప్పుడు పల్లెటూళ్ల స్త్రీలు ఓసి! నీయమ్మసోని అనడం వాళ్ల స్వభావాన్ని తెలిపే మాట) చూడు పచ్చినూకలు నేలలో పడలేదు. అంటే వ్యవసాయ భూముల్లో విత్తనాలు వేయలేదని అర్థం. దీనబ్బడాలు (దీని అబ్బడి ఆలు – ఇది కూడా పల్లెటూళ్ల స్త్రీల మాటల్లో తరచుగా వినిపించే మాటే) అక్షయ (అక్షయ కరువు) ఈ సంవత్సరం మోతుబరి రైతులను కూడా భిక్షగాండ్లుగా మార్చేసింది. అంటే సంపన్నులైన వ్యవసాయదారులు కూడా పంటలు పండక బీదవాళ్లయిపోయారని అర్థం.

పశువులమందలు (మేత, నీళ్లు లేక) పడమటి సీమకు ఎగబడిపోయాయి. (మెట్టపంటగా) కందులు వేశారు. ఒక రూకకు పదేసి కందులు (అమ్మినారు?). పోషించలేక (సాకలేక) తల్లిదండ్రులు బిడ్డలను అమ్మేశారు. స్వచ్ఛమైన బంగారు కూట్నీళ్లకు అమ్మవలసి వచ్చింది. (కరువు వల్ల ఆహారం దొరకక వర్తకులు ఎంతకడిగితే అంతకు బంగారు అమ్ముకోవలసి వచ్చింది).

కరువు ప్రభావం మనుషులకు, జంతువులకే కాదు పక్షుల మీద కూడా పడింది. (విపరీతమైన ఎండల వల్ల; మేత, నీళ్లు దొరకక పోవడం వల్ల) చెట్లమీద ఉండిన పక్షులు తలలు వేలాడవేశాయి. (ఊళ్ల) చుట్టూ దొంగలు దొంగతనాలకు ఎగబడుతుంటే మరోవైపు (పూరిండ్లు) కాలిపోతున్నాయి. బీదవాళ్లు కలబందను తిని ఆకలి చల్లార్చుకొన్నారు. (మంచికలబంద గుజ్జును నీళ్లలో కడిగి, నీరు పోయేటట్లు పిండి తినడం మారుమూల గ్రామాల్లో ఇప్పుడూ కనపడే దృశ్యమే).



కడుపునిండా తిండిలేక రక్తహీనతతో సతమతమయ్యే స్త్రీలకు బట్టమరక (ఋతుస్రావం) ఎక్కడుంటుంది?

(శరీరాలలో ఊపిరే సరిగా లేక చిక్కిపోయిన) స్త్రీ పురుషులు (ఆలుమగలు) రతిక్రీడలలో పాల్గొనడం అరుదైపోయింది. కరువు దక్షిణ ప్రాంతంలోని యాభైఆరు రాజ్యాలను బాగా ఉడకాడించింది (కష్టపెట్టింది). (యాభై ఆరు రాజ్యాలనడం కంటె కార్వేటినగరం చుట్టుపక్కల గల యాభై ఆరు గ్రామాలంటే సరిపోతుందేమో!). ఆ పరిస్థితులలో వేణుగోపాలస్వామి దయతో కొంత వర్షం పడింది. కరువు కొంత తగ్గింది.

# 143. మధ్యమావతి - ఆది

అగ్గరోరం శేరు పెండ్లకాణ్ణె - ఆకడెల్ల బాపన్నారే రేత్రికి ॥పల్లవి॥

అగ్గరోరపెంగయ్యకు చోబెణం -
వూరెయోర్ల కింది శప్పాల్ నంటుండ్రి ॥అనుపల్లవి॥

ఈడబొంగు సాసగ్గా కుంటె -
యిరం పరం [1]లేదేంచెన్నె
నాడిపిస్తినే కొర్లాగ సిట్టెడు -
నెడిమీ్మ ఆసకేడ బద్దము ॥అగ్గరోరం॥

[2]వరగంజాయ గింజలేడ బుట్టె -
వాపోయినే గొర్లు పూరి శిక్కక
శరవు లెండిత నిచ్చుగెలె పచ్చులు -
శేశెరంట దరమధాణం పింగళిస్తి ॥అగ్గరోరం॥

వుండింది బండింది బాయ కళగానికి -
వూడసపాయ కడమ దడమ అచ్చయ
కండలు ఒలిసేవు సనేస్రపు జీండ్రం -
గుండగొయ్యెనెడి పొడు బలు శెడగర ॥అగ్గరోరం॥

యెగ్గెం శైలోన యేలు బెట్టుకో-
యెందరి కంటని చందాగించను
పెగ్గెలు మరి శెప్పేదిని పోలె -
పెద్దమాసు డంటని సూన్నానికె ॥అగ్గరోరం॥

యేణుగోపాల చామి మమ్ముల -
నెంశైబోయి నింగమీన ముంగల
పాణాలు సక్కంగుండలె నీశోం -
పాగమేడ నక్కలెత్తపోదులె ॥అగ్గరోరం॥

1.లేదెంచె పున్నె (A). 2. వరచంబాయ (A).



[అక్షయ కరువు వల్ల గృహస్థులకే కాకుండా భిక్షగాండ్లకు కూడా ఎక్కడికి వెళ్లి అడిగినా భిక్ష దొరకని గడ్డుకాలం వచ్చింది. మొదటివర్ణం వారు వైదిక స్తోత్రాలు చెప్పుకొంటూ, అక్షింతలను తీసుకొని గృహస్థుల దగ్గరకు యాచకులుగా వచ్చేవారు. వీళ్లకు పౌరోహిత్యాది కార్యక్రమాలు లేకపోవడమే దానికి కారణం. గృహస్థునికి, గేస్తురాలికి అక్షింతలు చల్లి ఆశీర్వచన స్తోత్రాలు పఠించి భిక్షకోరేవారు. కరువు తీవ్రతవల్ల జరుగుబాటు కోల్పోయిన గృహస్థులు ఇలాంటి యాచకులకు ఏమివ్వగలరు? ఒక ఇంటికి వచ్చిన యాచకునికి ఏమీ ఇవ్వలేక ఆ ఇంటి యజమానో, యజమానురాలో వెలిబుచ్చిన అసహాయతను, దైన్యతను ఈ పదం వివరిస్తున్నది]

పెందలకడనే అగ్రహారం చేరుకో. అక్కడ ఉండే వాళ్లందరూ బ్రాహ్మణులే. అగ్రహారపు వెంగయ్యకు శోభనం జరుగుతుంది. ఊర్లోని అయ్యోర్ల కందరికి విందు పెడతారంట.

అక్కడికి వెళ్లకుండా ఇక్కడే కాళ్లు చాపుకొని కూర్చుంటే ఇరంపరం ఉండదు. అంటే ప్రయోజనం ఉండదని అర్థం. ఇంతకుముందు వచ్చినప్పుడు చిట్టెడు కొర్రలు ఇప్పించాను. (ఇప్పుడు ఇవ్వడానికి లేవు) నీ ఆశకు హద్దులేదా?

వర్షం పోయింది (వర్షం పడలేదు). గింజలు (ధాన్యం) ఎక్కడ (పండినాయి) పుట్టింది? (బీళ్లమీద) గడ్డి మొలవకపోవడం వల్ల గడ్డిలేక గొర్రెలు అరుస్తున్నాయి (పస్తుతో బాధపడుతున్నాయి). చెరువులు ఎండిపోయాయి. పక్షులు అరుపులు మాని నిశ్చేష్టితమైనాయి. దానధర్మాలు చేయడం పింగళించినట్లే ఉంది (ధర్మం పింగు చేయాల్సిందే- బాధగాను, కోపంగాను ఉన్నప్పుడు వాడే మాట ఇది).

ఉండింది, పండింది (అరకొరగా పండిన ధాన్యం కూడా) బావి తవ్వించే పనికి ఖర్చయిపోయింది. మిగిలిన దంతా అక్షయ కరువు వల్ల ఊడ్చుకొని పోయింది. కరువు పెద్ద శనిలాగా పట్టుకొని కండలు ఒలుస్తూ ఉంది. ఈ యాచకులు గుండగొయ్యిల (దుర్మార్గుల) వలె పీడిస్తూ వెళ్లడం లేదు.

(యజ్ఞం చేయిస్తానంటున్నావు) ఆ యజ్ఞంలో వేలు పెట్టుకో (తృణీకారంతో చెప్పే మాట ఇది). ఎంతమంది (యాచకులను) సముదాయించగలం లేదా చందా ఇవ్వగలం? చెప్పేది విని వెళ్లాలి. చూడడానికి పెద్దమనిషిలాగా ఉన్నావు. పెగ్గెలు చెయ్యడం (మొండికేసుకోవడం) ఎందుకు?

ఇకమీద వేణుగోపాలస్వామి మమ్మల్ని ఏమి చేస్తాడో! (అప్పటిదాకా) పాణాలు చక్కగా ఉండాలి. అంటే బతికి ఉండాలని అర్థం. నీ సొగసైన మిద్దెను నక్కలు ఎత్తుకొని పోవులే (సొగసైన మిద్దె ఆ ఊరిలోని దేవాలయమై ఉంటుంది. సాధారణంగా యాచకులు దేవాలయంలోనే గడుపుతూ ఉంటారు)



# 144. రేగుప్తి - చాపు

కొండ సుట్టొచ్చేరంటె నారాల తూరి – కొండ సుట్టొచ్చేరంటే ॥పల్లవి॥
బండారి పాపీంద్ర లాలి దాసరి శెన్ను –
వండే రంటొరికూళ్లు వారస్తాణె పైణాలు ॥అనుపల్లవి॥

ఊరూరు యిగిణిల్ను – [1]వూపుతా వాస్తా చన్నా
[2]గార నూరే మండపాన – గంటవాపి దింపగానే
తేరుమూకే [3]పరచైన – దెయేంద్ర [4]యిబమాలె
[5]గారడా లంటుండావొ – కళిగ్ణె వైకుంటమేనె ॥కొండ॥

నెగిరోరు [6]గళమెత్తి – నగరా లేపిసుకుంట
యిగతర్లె యేలాయ – యేనీగ లీవు మీన
చొగుచే యెండెంబారి – బగువాన్నె మింగోటి
మొగదంట్ణెయాలి – యింత శేపించుండారు ॥కొండ॥

చూగాచి [7]జనమాల – బోగమమ్మంగాండ్లు
రాగాలు గొణగుత – చాగెల నిలబడి
[8]తేగాలింమంటేమొ – తైతతలాడేది
[9]బాగున్నె శిన్నోన్నెం– బలి దాపి సన్నిస్తా ॥కొండ॥

పెద్దసార్ల పులి – [10]పద్దంనే శేరుండు
కద్దె మనకు సూపు – కానుగరిచ్చా లుండాయి
[11]వుద్దులుడకె గుండాయి – వుపవాస్య మేమిటికి
మద్దెన్న మీడాయ – మడికాడెద్దల్ నిడిశి ॥కొండ॥

[12]కాశిస్తె కైకెడు – కరవాల్ల పొడైనాను
[13]ఆశకైనె గేగు – లంతకన్నగ్గవా
రాసోరి శేల్లో శి – ౹్రేకు యెదిగున్నాంట
కోసపోదాం యేను – గోపాలు దలసుతా ॥కొండ॥

---

1. వూబుతా వాస్తా సన్నాయి (B).
2. గారనోరి మండపాన (B).
3. పరిసేమో (B).
4. యిబవము (B).
5. గారడాలు కాదేమే (B).
6. దళమెత్తి (A).
7. జల్మాలె (B).
8. తేగాలిమ్మంటాను తెయితక్క లాడేరు (B).
9. బాగుణ్నే శిన్ను ఆం – బలి దాగి సన్నిస్తా (B).
10. పొద్దన్నె శేరుండు (B).
11. ఉద్దులుడకేశుండాయి–ఉపాసమేటికే (B).
12. కాసుకు కయికడు – కరవాళ్ళ పొడినా (B).
13. ఆసక్క కేగు లంత – కన్నగు వంటనే (B).

[కార్వేటినగర ప్రాంతంలో జరిగే కొండచుట్టు తిరుణాళ సందర్భంలో జరిగే ఉత్సవ విశేషాలు ఈ పదంలో వర్ణింపబడినాయి]

కొండచుట్టి (కొండచుట్టూ తిరిగి) వచ్చినారంటే (అదొక గొప్ప ఆ ఉత్సవంలో). బండారి పాపి, ఈండ్ర లాలి, దాసరి శెన్ను (వీళ్లు ముగ్గురూ పక్కపక్క ఇండ్లవారై ఉంటారు. లేదా స్నేహితురాండ్లై ఉంటారు) వరి అన్నం వండుతున్నారంట. అన్నం వారుస్తూనే (గంజి వంపగానే) ప్రయాణమంట.

ఊరూరి నుండి (ఆ ప్రాంతపు గ్రామాలన్నిటి నుండి) విగ్రహాలు సన్నాయి వాద్యాలతో ఊరేగుతూ వస్తాయి. గారునూరు దగ్గర ఉన్న మండపంలో గంట వాయించగానే విగ్రహాలన్నిటిని దింపుతారు. (ఆ ఉత్సవ సందర్భంలో) తేరు (రథం) లాగడానికి పరసజనం (ఉత్సవం చూడడానికి వచ్చిన చుట్టుపక్క గ్రామాల ప్రజలు) ఎగబడతారు. (అప్పుడు చూడడానికి) దేవేంద్ర వైభవం వలె ఉంటుంది. గారడీగా చెపుతున్నా ననుకుంటావేమో గాని నిజంగా అది కలియుగ వైకుంఠమే.

నగరి వాళ్లంతా నగారాలు వాయిస్తూ ఉండగా (అక్కడికి రావడానికి) బయలుదేరే వేళ అయింది. ఏనుగుల వీపులమీద అందమైన వెండి అంబారి వేసి ఉంచారు. (ఇది గజవాహనమై ఉంటుంది). (అంబారిపైన కూర్చునే) దేవుడినే మింగే అంతటి పెద్ద వాహనంగా దాన్ని చేయించారు. (ఆ ఏనుగులు వాహనాలుగా కాక నిజమైన ఏనుగులు కూడా కావచ్చు. అంబారీలు వేసిన ఆ ఏనుగుల మీద సంస్థానం వాళ్లు కూర్చుని దేవతా విగ్రహాల దగ్గరకు వచ్చి ఉంటారని చెప్పడానికీ అవకాశముంది).

ఆ వేడుక చూచిన వాళ్లదే జన్మం. భోగం స్త్రీలు (దేవదాసీలు) పాటలు పాడుతూ నాట్యం చేస్తున్నారు. అలా చేస్తూనే జనం వైపుకు వచ్చి బహుమానాలు అడుగుతున్నారు. (జనంలో కొందరు ఇస్తే) ఇవ్వలేని వాళ్లు బిక్కముఖం వేసుకొన్నారు. ఇదంతా చూడడానికి ఎంతో వేడుకగా ఉంది. (తిరుణాళ చూడడానికి వచ్చిన పల్లెటూరి స్త్రీలలో ఎవరో ఒకామె బిడ్డ ఆకలివేసి ఏడవడం మొదలు పెట్టినట్లుంది, ఆ బిడ్డకు ముందు అంబలి తాపి తరువాత చనుబాలు ఇస్తానంటున్నది (ఆ తల్లి).



పెద్దపెద్ద చారలు గల పులి ఉదయమే వచ్చి ఉంది. (అది పులివేషం అయి ఉంటుంది). కానుగ చెట్లు (అడ్డంగా) ఉండాయి. మనకు (ఆ పులివేషం) కనిపిస్తుందా? ఉడకేసిన మినుములు ఉన్నాయి గదా ఇంక ఉపవాసం ఉండడం ఎందుకు? ఇక్కడే మధ్యాహ్నమైంది. ఇక మడికాడ ఎద్దులను నిలిపి (కొండ చుట్టి వచ్చేది ఎప్పుడు అని ఆ ప్రాంతం పరిసరాల్లో మడిదున్నుతూ ఉండే రైతులు అనుకొంటూ ఉన్నారు).

అక్కడ ఒక కాసుకు చేరడు ఎండుచేపల పొడి దొరుకుతుంది. అక్కడ గేగులు ఇంకా అగ్గవే. రాచవారి (సంస్థానం వారి) పొలంలో శిర్రాకు బాగి పెరిగి ఉంది. వేణుగోపాలస్వామిని తలచుకొంటూ కోసుకొని పోదాం (రమ్మని ఆ స్త్రీలలో ఒకరితో మరొకరు చెప్పుకొంటున్నారు).

# 145. మోహన - చాపు

ఇసబోనమ్మీన– యీదెంబ డెల్లోచ్చే - [1]దిష్టిగ్నమో యీస్పృడో
 [2]బొమ్మో లేక - యిగనేసుడో సిముడో ॥పల్లవి॥

నొసలి బూడిగొట్టి - నొష్టం గందమెత్తి
కుసునికున్నాడోడో - గుండోలె ముంగాల ॥అనుపల్లవి॥

ఏకుల బుట్టోలుందేటి - దో రాగిది చిరచూ
 [3]తాకించితే తక్కె - తాంబూలా లియల్నంట
 [4]పోకార మద్దంత - పదిలచ్చకుండు వా
డాకుసుంతుంటియ్య వ - దంటే కంభాణము ॥ఇసబో॥

గొడుగులంట [5]శాపి - గిడుగేల్నే యుండాయి
అడుగున పెబ నో - రెల్లబెట్టింది
 [6]తడిగేలే వగటుంది - అడిగే పేరెటమను
పడుసూపిన్నో ల్లేందో - పక్కలా [7]యిగిట్టి ॥ఇసబో॥

బోగమ్మోర్లోలోను - యోగమిం తీల్లదే
చూగాచి పుట్టుక - సూచ్చమింతె
నాగేడే డుండాడె - [8]నక్కిరసపోదులె
బేగిరా సూతాడి - బేమ్మా నీదిడి సొచ్చె ॥ఇసబో॥

తాలాలు వాసగ - మేలా లాగుతుండాగ
సీలేడికలు సూడ - శిత్రాలాడ
పూలంట శెడు [9]గొలు - పుట్టుగిచ్చాల్లోనో
తాలే నగారిందాంయి - తల [10]దుంటే కంచోలె ॥ఇసబో॥

దీటి లెలుగుతుండా - దోరణాల కిందూరి
యీటీ లెగబట్టుం - దేద్దె మంటనో
యేటికే అయ్యోర - కేదాలు పాట కిం
కోటి సూస్తె యేను - గోపాలు సెలుండాది ॥ఇసబో॥

---

1. ఇస్తిగ్నమో (B). 2. బెమ్మోల్యాక (B).
3. తాకించక తడికే - తాంబూలా (B).
4. పాకార మొద్దుంటె పజ యెట్టి కుండొవా (B).
5. శింపి గిడిగాలెటుండాయి (B).
6. తడికాలె వకటుంది అడిగే పేరంటమా (B).
7. యిసరగా (B). 8. నక్కేస్కోబోదులే (B). 9. గొలు (B). 10. మంటే (B).



[వివిధ వాహనాలు వీధులలో ఊరేగుతూ వచ్చే సందర్భంలో పామరులైన ప్రజలు దర్శించిన వేడుకలు ఈ పదంలో చూపబడినాయి]

వృషభవాహనం మీద వీధి వెంట ఊరేగుతూ వస్తున్న దేవుడు ఈశ్వరుడో, బ్రహ్మదేవుడో, విఘ్నేశ్వరుడో లేక శివుడో (తెలియడం లేదు). (ఈశ్వరుడు, శివుడు ఇద్దరూ ఒక్కరే నన్న విషయం కూడా తెలియని పామరులు వాళ్లు). నొసట విబూది పూసుకొని, గందం బొట్టు పెట్టుకొని ఒకాయన ఆ వాహనం ముందర గుండువలె కూర్చొని ఉన్నాడు.

నూలు కండెలు వేసుకొనే బుట్ట (ఏకులబుట్ట)లో ఏదో ఒక రాగిది (రాగి లోహంతో చేసినది) ఉంది. దానితో (అక్కడి జనం) తలలు తాకిస్తే తాంబూలాలు ఇవ్వాలంట. (ఆ రాగిది శఠకోపం అయి ఉంటుంది. శఠకోపం తలమీద పెడితే పెట్టిన వాడికి (అర్చకుడికి) తాంబూలం ఇవ్వాలి. అంటే ఏదో ఒక కానుక ఇవ్వాలి). ఆ వాహనంపై కనిపించే శిల్పపు పనితనం పదిలక్షల విలువ చేస్తుంది (ఎంతో గొప్పగా ఉంది). వాడిన తమలపాకు కొద్దిగా ఉంటే ఇవ్వవా? అదిగో బాణసంచా కాలుస్తున్నారు.

వాహనం వెంట గొడుగులు వస్తున్నాయి. (అవి చూడడానికి) చిన్నకాడలు గల (తాటాకు) గొడుగులు వలె కనిపిస్తున్నాయి. వాహనం మీద ఊరేగే విగ్రహానికి నోరు తెరచినట్లుంది. ఒక తట్టలాగా కనిపిస్తూ ఉంది. అడిగి పేరుపెట్టాలి (తెలుసుకొని పేరుపెట్టాలి). (రెండు) వైపులా (వింజామరలవాళ్లు) ఉండడం వల్ల ఊరేగే విగ్రహం సరిగా కనిపించడం లేదు.

బోగం అక్కలు ఆడతా ఉండారు. ఆ వేడుకంతా వాళ్లదే. పుట్టినందుకు ఆ వేడుక చూడాలి. జన్మ సఫలమవుతుంది. (బోగం అక్కలు దేవదాసీలు కాబట్టి, వాళ్లు నిత్య సుమంగళులుగా భగవంతుని సేవిస్తూ ఉంటారు కాబట్టి వాళ్ల జన్మే జన్మ. భగవత్సేవే జన్మకు పరమార్థం అని కూడా అనుకోడానికి అవకాశముంది). నాగేలి (మడక) ఎక్కడుండాదో. నాగేలిని నక్క ఎత్తుకొని పోదులే. చూద్దాం తొందరగా రా. బ్రాహ్మణవీధి దాటుకొని వచ్చింది. (వాహనం ఊరేగింపు

సాయంకాలం పూట జరిగినట్లుంది. దగ్గర్లో పొలాలు దున్నుతున్న వాళ్లు కూడా చూడడానికి వచ్చి ఉంటారు. పై నాలుగు వాక్యాలు వాళ్ల సంభాషణై ఉంటుంది).

తాళాలు మోగుతూ ఉన్నాయి. మేళాలు వాగుతూ ఉన్నాయి. (భోగం మేళాలు ఆడతా ఉండాయి అని అనుకోవచ్చు). స్త్రీల వేడుకలు చూడాలి. బొమ్మలు ఆడతా ఉండాయి. స్త్రీలు తలలో పెట్టుకొన్న పూలనుండి దుర్వాసన వస్తూ ఉంది. కంచెవలె నిల్చొని ఉంటే ప్రయోజనం లేదు. కొంచం పక్కకు తొలగు. నగారా విందాం. (ఇదీ జనం మధ్య జరిగిన సంభాషణే).

దివిటీలు వెలుగుతూ ఉండాయి. తోరణాల కింద దూరి ఈటెలు ఎత్తి పట్టుకొని వస్తున్నారు. (ఊరేగింపు సందర్భాలలో కత్తులు, ఈటెలు పట్టుకొని రావడం కూడా కనిపిస్తుంది). అయ్యవార్లు (వైష్ణవ స్వాములు కావచ్చు.) చదివే వేదాలు వినడం కాకుండా వేణుగోపాలుడికి మొక్కుబడి చెల్లించుకోవాలి పద.



## 146. మోహన - ఆది

మాసల కిరీదికరంగా బదలక –
మంచిగానంచల వీరందోయి ॥పల్లవి॥

యేసన దెల్దోయి రేతిరి దొరద్ద –
యీనగొట్టెయాల నిలబడడిగితె ॥అనుపల్లవి॥

నెగిరోర్లో సక్కంగ బట్టాల్నసే –
నడిమద్దె నా కొండెల కిరితికెం
బగుమాణము సేసి దండపడుదురె –
బయటికెల్ని – చాములోరి యిద్దెకు ॥మాసల॥

అచ్చయ మల్లల యీరికి దన్నాదు –
ఆరేండ్లాయ మడక కట్టెశేలో
[1]యిచ్చి లెమ్మనిరె మగతా రెణ్ణర –
యింగనెన్ని పింగళింపు అణుభోగం ॥మాసల॥

వారక సారక మంటని గింజలు –
యీరికె తిని సూపిరింత పొడగన
పేరు గనమె పొయిలో పిల్లలే –
[2]పెందలంట శెప్పరే మీ యెంట్లోడు ॥మాసల॥

పొత్తల కాలెగవూరికి దీనికి –
మొత్తొచ్చిరె మడవకాడ [3] దొంగితె
కొత్త కాపుల్నిడంటని మురిస్నా –
కొండెలు పునకల్జుపడనె యెగదల ॥మాసల॥

వేణుగోపాల చామి మిన్నే –
యెక యింతగంట్నే అరుచోద్యం
చాణలెక్కపబళము యీ చుద్దులు –
చెంజికాడ యింట్లో దబ్బరకడ ॥మాసల॥

1. యిచ్చి తెమ్మనిరె మగతారెణ్ణర (ఇచ్చి తెమ్మనిరె మక్తా రెండున్నర) (B).
2. పెందలంట శెప్పులె మీమంట్లోడు మాస (B). 3. వొంగితె (A).

[అక్షయ కరువు వల్ల వర్షాభావ పరిస్థితి ఏర్పడి చేలో మడక కట్టి ఆరేండ్లైంది. జీవనం జరగడం లేదు. రైతులు తమ గోడును వేణుగోపాలస్వామికి విన్నవించుకోవడం ఈ పదంలోని విషయం]

మనుష్యులకు కీర్తికరంగా, మంచి (ఉండాలి?). రాత్రి వీణావాద్య సమయంలో దొరదగ్గర నిలబడి అడిగానుగాని యోచన సరిగా తెలియలేదు (ఎలా మాట్లాడాలో అర్థం కాలేదు).

నగరి (సంస్థానం) వాళ్ల దగ్గరకు వెళ్లి చెప్పుకోవాలంటే మధ్యవర్తులతో అవసరం ఉంటుంది. మధ్యవర్తులైన ఆ నా కొండెలకు అతిశయం ఎక్కువ. రైతులు వాళ్లకు బహుమానాలు (లంచాలు) ఇచ్చి (ఇంకా) నష్టపడాలా?

అక్షయ కరువు ప్రభావం ఎంతో ఉంది. చేలో మడక కట్టి ఆరేండ్లైంది. (అయినా) రెండున్నర వంతున మక్తా ఇచ్చి కదలమన్నారు. ఇంకా ఇలాంటి అసహనపు అనుభవాలు ఎన్ని వస్తాయో!

అవసరమైనప్పుడు (కరువు కాటకాలు వచ్చినప్పుడు) ఇస్తామని చెప్పి రైతుల దగ్గర తీసుకొన్న ధాన్యం తిని బతుకుతూ దర్జా వెలగబెడుతున్నారు (మధ్యవర్తులు). రైతులు ధాన్యం పండించే వారని పేరే గాని వాళ్ల ఇండ్లలోని పొయ్యిల్లో పిల్లులు నిద్రపోతున్నాయి. (వంట చేయడం లేదు కాబట్టి పొయ్యి వెలిగించడం లేదని అర్థం).

ఎగవ ఊరికి ఈ ఊరికి ఒకటే కాలవ ఉంది. (నీళ్లు వేసుకోడానికి) మడవకాడ వంగితే కొట్టడానికి వచ్చారు. కొత్తకొత్త రైతులు తయారైనారు. మురికి నా కొండెలు ఎగదాల కల్జు (నీళ్లు పారే తూము) నుండి నీళ్లు రానీడం లేదు.

వేణుగోపాలస్వామి అంతా చూస్తూ ఉన్నాడు. ఇంతకంటే అరుసోద్యం (ఆశ్చర్యం) ఏముంటుంది? ఇలాంటి విషయాలు ఎన్నో ఉన్నాయి. చెంజిగాడి (చెంచయ్య?) ఇంట్లో ఇదే తగవు (నీటి కోసం అయిన రగడ).

(వర్షాలు లేనందువల్ల రైతులకు నీటి కరువు వచ్చింది. ఎక్కడో కొద్దిగా (చెరువులోనే, ఏటిలోనో) నీళ్లు ఉంటే ఆ నీటికోసం రైతుల మధ్య కొట్లాటలు జరుగుతున్నాయి. ఆ నీళ్లుకూడా రెండు గ్రామాల రైతులకు ఒకే కాలవ ద్వారా



రావాలి. ఎవరైనా ఒక రైతు ఆ నీటిని తన పొలానికి మళ్లించడానికి ప్రయత్నిస్తే మిగిలిన వాళ్లు ఒప్పుకోవడం లేదు. పైభాగంలోనే ఆ నీటిని ఆపేస్తున్నారు. రైతులని పేరు గొప్పేగాని పూట గడవడం లేదు. ఇంకా ఇలాంటి సమస్యలు ఎన్నో ఉన్నాయి. ఈ విషయాలను సంస్థానాధికారులకు విన్నవించుకోవాలంటే మధ్యవర్తుల ద్వారానే వెళ్లాలి. వాళ్లకు బహుమానాలు ఇస్తేగాని పలకరు. ఇలాంటి బాధలు ఎన్ని పడాలో! ఈ విషయాలన్నీ వేణుగోపాలస్వామి చూస్తూనే ఉన్నాడు.)

## 147. పంతువరాళి - ఆది

నగరాన తెప్పతిర్నాల్ల యేడికె సూన్ను -
నాగు నూ రాలేదంటే అపిడె ॥పల్లవి॥

అగుముడియల్లచ్చి - తొగటాయాటమ బశివి
చిగమెత్తినట్టెత్రి - [1]వొగరితో సెప్పకనే రెయ్యి ॥అనుపల్లవి॥

పదమ చరచుకాడ - పందిల్లె బగినోదం
సదురేశిందే [2]చోదెం - చామిదే యింతా
యెదురు మలుగ కూడొం - దేశి రింటెలుపున
[3]అదెశెయి సూపియ్యేశి - రాన్నే మాశి కింతతై ॥నగరాన॥

చోమాదిగులయ్యో - ర్లెమో యేటల సంపి
వోమా మగ్గిలో యేసే - రౌనముకాడా
యేమా బేమనమూక - యెక్కడి యిషమరార్ఘుం
రామానుజపజలో - రాల్నంటె యిశికేస్తే ॥నగరాన॥

[4]అంగల్ల వొరుతుకూల - అయ్యతోడే యేశగార్ల
బంగారు గరుకుమాల్ల - బారు మేలాల
చంగినీ గుఱ్ఱాల ల - చ్చులయి పల్లకేనిగల
జంగమాల్లూ బేదె - మంగలోల్లు వాశేదే ॥నగరాన॥

తెప్ప జతణము వేసి - తేంగాణె పబులట్టె
తప్పక కుసునికుండ్రి - తమ బలగంతో
అప్పుడే బోగమా - లాడ్రే యిగ్గినాలొద్ద
గుప్పున చుట్టొచ్చి - రెప్పుడో గిరుక్కున ॥నగరాన॥

యిట్టే కంబానాల - కేమగ్గి బెట్టిరో
సుట్టెసుకొనె గబ్బు - సుంచేపులో
[5]అట్టెనుగోపాలు - కాణ్ణే చెయి మొక్కేసి
[6]శెట్టుసాట్నుంటి గ - జెంద్రమొచ్చమె తెల్లె ॥నగరాన॥

1. వగర్తొ శెప్పక రెయ్యి (B).
2. చోద్యం (B).
3. అదె శెయ్యి సూపి పరణ - మని మాశి కొంతింతేశి (B).
4. ఆంగల్లోర్తకులు - అయ్యతోడి యేశగార్ల (B).
5. అట్టేను గోపాళు - కాణ్నుండి మొక్కేసి (B).
6. శెట్టుకాణ్నుండి (B).



[కార్వేటినగరంలో జరిగిన తెప్పతిరుణాళ వైభవం ఈ పదంలో వర్ణించబడింది. మారుమూల పల్లెల ప్రజలు తిరుణాళకు పోదాం రమ్మని ఒకరినొకరు పిలుచుకొన్నట్లు, తిరుణాళ చూస్తూ వేడుక విషయాలను ఒకరితో ఒకరు చెప్పుకొని ఆనందించినట్లు ఈ పదంలో చూపబడింది]

నగరాన తెప్ప తిరుణాళ వేడుక చూడడానికి ఓ నాగూ! నీవు ఇప్పుడే రావా? (రాలేవా?). అగుముడి యల్లచ్చి (అగుముడి యల్లమ్మ, అచ్చమ్మ అని ఇద్దరు స్త్రీల పేర్లై ఉండవచ్చు), తొగటాయాటమ బశివి (తొగట ఆటమ్మ, బసివి అని ఇద్దరు స్త్రీలు కావచ్చు లేదా ఆటమ్మ బసివి అయి ఉండవచ్చు) రాత్రే ఎవరికీ చెప్పకనే (తిరణాళ చూడడానికి) తొందరగా వెళ్లారు.

పద్మ సరస్సు దగ్గర వేసిన పందిళ్లు ఎంతో వినోదంగా (అందంగా) ఉన్నాయి. పందిళ్ల కింది నిర్మించిన వేదిక (చదురు)ను చూస్తే ఆశ్చర్యం కలుగుతూ ఉంది. ఇదంతా స్వామి మహిమే (ఇదంతా స్వామికి సంబంధించినదే అని కూడా భావించవచ్చు). ఇల్లంత విస్తారంగా మంచి బియ్యం కూడు వండి పోశారు. అక్కడే మనిషి కింతింత అని కూడు చేతులలో పెట్టారు.

సోమయాజులైన అయ్యవార్లు (బ్రాహ్మణులు) తోట దగ్గర యాటలను (పొట్లేండ్లను) బలిచేసి హోమాగ్నిలో వేశారు. చెప్పనలవికానంత బ్రాహ్మణ సమూహం చేరింది. రామానుజకూటం (ఉచితంగా అన్నం పెట్టే చోటు)లో అన్నం కోసం ఇసుక వేస్తే రాలనంత మంది జనం వచ్చారు.

అంగళ్లలో వర్తకులు, జట్టు నాయకునితోనే కలసి (వివిధ) వేషాలు వేసిన వేషధార్లు, బంగారు గరుడ స్తంభాలు, బ్యాండు మేళాలు, చంగినీ (వేగంగా దాటుకొంటూ పరుగెత్తే) గుర్రాలు, మంచి పల్లకీలు, ఏనుగులు (తిరుణాళలో విశేషంగా కనిపిస్తున్నాయి). జంగంవాళ్లు (శంఖాలు) ఊదుతూ ఉన్నారు. మంగలివాళ్లు (మేళం) వాయిస్తూ ఉన్నారు.

సిద్ధ పరచిన తెప్ప (తెప్పోత్సవానికి సరిపడే నావ)ను తీసుకొని రాగానే ప్రభువులు (సంస్థానాధీశులు) తమ బలగంతో వచ్చి కూర్చున్నారు. విగ్రహాలు ఉంచిన చోట బోగంవాళ్లు ఆడినారు. కొండ చుట్టి రావడానికి వెళ్లిన వాళ్లు తొందరగా చుట్టి వచ్చేశారు.

బాణాసంచాకు అగ్గి ముట్టించారు. కాసేపట్లోనే చెడ్డవాసన (బాణసంచా కాలేటప్పుడు వెలువడే వాసన) అంతటా చుట్టేసింది. అక్కడ నుండే వేణుగోపాలస్వామికి చేతులెత్తి మొక్కినాను. చెట్టు చాటున ఉండడంవల్ల (ఆడేది) గజేంద్రమోక్షమో మరొకటో తెలియడం లేదు.



## 148. పంతువరాళి - ఆది

సంగనాక మను బీమెడుండాయి –
బింగరమో యీ బాపనోల్లకు ॥పల్లవి॥

[1]అంగల్లో అచ్చింత్లోగింజలె
చంగటి కిశిరిన పిండిసమైతే ॥అనుపల్లవి॥

మొండిపీన్గె లేణ్ణుండి శడొచ్చిరో –
మోగరించుకొని లెమ్మంటె లెయ్యరు
[2]శండితన మిడు శట్టే పీడుంటె –
వుండొద్దను యింగుంటే వూరోల్ల ॥సంగనాక॥

[3]యేదాల్లో పరిచి చెంతుంటే –
యెయిటికీణ్ణె గోరుస్త పడుండవె
గోదారైతె గుడ్డెల్లిం దేమీడ
[4]గొండపొమ్మను పిండొల్నంటె వూరోల్ల ॥సంగనాక॥

[5]వోడయ్యుండిల్లు సూపించె నాయాలు –
యీడనేపడి సాయల్నంటి పిసాసులు
బూడెదీశడై మొగాన సొయింపగ –
యేడదెత్తు యంగాలన వూరోల్ల ॥సంగనాక॥

[6]సెప్పొచ్చిన గుంజిగాని సారశెం–
శాత్రికమాపి గూదెల్లగుక్కుదు
సోపణానా సూల్లేదంట మొరిగితె –
[7]శూశెరంట యాన్నోరొసెల్చెట్కోని ॥సంగనాక॥

యేనుగోపాలుని కెరికె మా కాపిరము –
యేలుకాణ్ని శీకురాయల తొత్తల
[8]యీనెలెల్ల గని కొరకొగ్గింజ్జలె –
యిగతా వుగతం తెలకుంటె వూరోల్ల ॥సంగనాక॥

---

1. అంగ్లల్లొద్దచ్చింత గింజలా (B).
2. శెండితన మిడుసు యెర్ర యేపీ డుంటె (B).
3. ఏధాల్లో పరి చ్చించించుంటే (B).
4. కొనబోను పిండొల్నంటె వూరొల్ల (B).
5. ఓడోయిలు సూపించుండాలె నాయాలు (B).
6. శప్పొచ్చిన గుంజిగాడు శేశే (B).
7. సూశేడంటేణ్నో యేలెట్టు కొని (B).
8. ఈనెల్లో కొరుక్కొ గింజలేదంటే (B).

[బ్రాహ్మణయాచకులు యాచనకు వచ్చి వెళ్లమన్నా వెళ్లక మొండిగా నిలుచుకోవడం, గృహస్థులు ఏమీ ఇవ్వలేని స్థితిలో విసుగు పడడం ఈ పదంలో కనిపిస్తుంది]

ఈ బాపనోళ్లకు బింగరమా (రోగమా?) సంకనాకమను (కోపం వచ్చినప్పుడు అనే ఒక తిరస్కారపుమాట). దానం చేయడానికి బియ్యం ఎక్కడుండాయి? అంగడిలో గింజలు (ధాన్యం) అక్షింతలు వలె ఉన్నాయి. (చాలా తక్కువగా ఉన్నాయని, కొనడానికి కూడా వీలు కావడం లేదని అర్థం). సంగటి కోసం విసరుకొన్న పిండి (రాగిపిండి) వీళ్లకు విషం వలె ఉంది. (రాగిపిండిని విషంగా భావించి భిక్షగా తీసుకోవడం లేదు).

ఈ మొండి పీనుగలు (కోపం, విసుగు కలిగినప్పుడు అనే మాట) ఎక్కడ నుండి చెడిపోయి వచ్చారో! భీష్మించుకొని కూర్చొన్నారు. లేచివెళ్లమంటే లేవడం లేదు. మా ఎర్రకుక్క ఇక్కడ ఉండి ఉంటే వీళ్ల మొండితనాన్ని విడిపించి ఉంటుంది. ఇక్కడ ఉండవద్దని చెప్పు. ఇంకా ఉంటే ఊరివాళ్ల సంకనాకమను.

వేదాలను పరీక్షగా చూచినవాడవైతే ఇంకా ఎందుకు ఇక్కడ అఘోరిస్తూ పడి ఉంటావు. మీది గోదారి (గోదావరి ప్రాంతం) అయితే ఇక్కడ గుడ్లు పిగిలి ఉన్నాయా? (అన్నీ సమృద్ధిగా ఉన్నాయా?). పిండి ఇస్తాను తీసుకొనివెళ్లమను. లేకుంటే ఊరివాళ్ల సంకనాకమను.

ఎవడో నాయాలు మా ఇల్లు చూపించాడు (మా ఇల్లు ఎవడు చూపించి ఉంటాడు అని కూడా గ్రహించవచ్చు). ఆ పిశాచులు ఇక్కడేపడి చావాలా? ముఖంమీద ఒక వీసెడు బూడిద (విబూది) పూసుకొని ఉన్నాడు. (పిండి వద్దంటే) ఇంక ఎక్కడ దెచ్చేది? ఊరివాళ్ల సంకనాకమను.

చెప్పుతీసుకొని జాడించి కొడితేగాని బాగుండేటిగా లేదు. శాస్త్రం చెప్పడం ఆపు. (వెళ్లి పోకుంటే) గూని మీద తంతాను. శోభనం చూడలేదంట (శోభనం జరిగే విషయం తెలియదట), ముందే నేను శోభనం జరిగే ఇంటికి వెళ్లు అన్నం పెడతారని చెప్పాను కదా! ఎవర్నో అడిగి చూస్తారంట (తెలుసుకొంటారంట).

మా కాపురం వేణుగోపాలునికి ఎరికే. (చాలీ చాలకుండా నెట్టుకొని వస్తున్న మా కాపురం స్థితి వేణుగోపాలునికి తెలుసు). గబ్బిలాలను ఏలుకోనీ (ఇంటి నిండా గబ్బిలాలు తిరుగుతూ ఉన్నాయి). పైరుకుగల కొనకంకులన్నీ గనిమల (గట్ల) మీదికి వంగి ఉన్నాయి. అవన్నీ ఎండిపోయిన (పనికిరాని) గింజలే. యుక్తాయుక్తం తెలుసుకొని వెళ్లు. వెళ్లకపోతే ఊరివాళ్ల సంకనాకు.



## 149. పంతువరాళి - ఆది

బాపడా మల్లోశినావు దబ్బిలి –
  పండినొద్ల నాడిపిస్తినె – మా      ॥పల్లవి॥

  యేపి బెమ్మ రాచ్చసి కనబడెనా –
  యిసనకాయలు [1] మొదటికి శప్పద్దనేవు      ॥అనుపల్లవి॥

అసిరోదం పింగళిస్తి సర్లే –
  అచ్చింతలు కోల్లేరక తిన్నాయి
  కాశికి పొయ్యొస్తే బొల్లావా –
  కరవాడై యేటికెండేవు శనేసరపు      ॥బాపడా॥

పుంజమాలెయరు దాడుల జెందెం –
  బూతమాలె యాబూది మొగాన
  శెంజి దురగమైతె యేలెట్టుకొనేవు –
  శెపితె యింటె మాసల కొడుకయేవు      ॥బాపడా॥

[2]చంచై చద్దొంటకమూ శిలలో –
  [3]సాక లెంగి ముటుకోగుంజిత్తాం
  పంచాంగం యిప్పొద్దశినిత్తెం –
  పంగ బగలదీస్తె కర్సక సాయాలె      ॥బాపడా॥

[4]పిన్న పెద్దనంట మొరిగిన కుక్కను –
  తిన్నకీడ్చకరా సవరము శేతాంయి
  కన్న లెంజకొడుకులకు పరేశకం –
  కానిమస్తి కొక్కరిస్కుంట శనేసరపు      ॥బాపడా॥

ఏనుగోపాల చామి తిరునా–
  శ్లైల్లు కూడుబెడుదురాడ మస్తుగ
  వానెగేశ గింజలీనె కిరమాయె –
  దానదరమం తూటెల్నెట్టె శెయ్యొచ్చు      ॥బాపడా॥

---

1. మొదట శెప్పలేదనేవు (B). 2. సంచేం సద్దంటకమో శిలలో (B).
3. సాగలెంక అంట్కో గుంజిత్తెం (A). 4. పిన్నపెద్దలని (B).

[కాశికి వెళ్లి వచ్చినట్లు చెప్పుకొంటూ మళ్లీ ఒక బ్రాహ్మణ యాచకుడు రావడం, ఒక గృహస్థుడైన పామరుడు భిక్ష ఇవ్వడానికి పేదరికం వల్ల వీలుగాక తన గోడు వెళ్లబోసుకోవడం ఈ పదంలో కనిపించే విషయం]

ఓ బాపడా! ముందు వచ్చినప్పుడు పండిన వడ్లు ఇప్పించాను గదా! మళ్లీ వచ్చినావే. ముందే చెప్పలేదంటావేమో చెపుతున్నాను విను. బ్రహ్మ రాక్షసి వంటి (మా) కుక్క కనపడిందా (నిన్ను చూస్తే) వృషణాలు లాగేస్తుంది జాగ్రత్త.

ఆశీర్వాదం చేస్తున్నావు. సరేలే. (నీవు) మాపైన చల్లిన అక్షింతలను కోళ్లు ఏరుకొని తినేశాయి. నువ్వు కాశికి పోయి వస్తే తెల్ల ఆవువవుతావా? (గొప్పవాడివా?) శనిలాంటి ఓ బాపడా! (ఇక్కడే ఉండి) ఎండుచేపలాగా ఎందుకు ఎండుతావు?

ఉరితాడు వంటి జందెం వేసుకొని, బూతం మాదిరి ముఖం నిండా బూడిద పూసుకొని వచ్చావు. చెంజిదుర్గం నుండి వచ్చానంటున్నావు. అయితే ఏమి? వేలుపెట్టుకోపో. మనుష్యులకు పుట్టినవాడవైతే చెపితే వినాలి (చెప్పింది విని వెళితే మనుష్యులకు పుట్టినవాడవు అవుతావు).

సంచిలో ఏముంది సద్ది అన్నమా? చాకలి వెంకి (గుడ్డలను) ముట్టుకొని గుంజినట్లు గుంజితే ఏం చేస్తావు? మాటిమాటికి పంచాంగం విప్పవద్దు (మంత్రాలు చదవవద్దు). ముడ్డిమీద ఒకటిస్తే నేలకు కరచుకొని చస్తావు.

పిన్నల దగ్గర, పెద్దల దగ్గర మొరిగిన (అరిచిన) కుక్కను మెల్లగా ఇక్కడికి ఈడ్చుకొనిరా క్షవరం చేద్దాం. (అందరినీ దేబిరిస్తున్న ఆ యాచకుని ఈడ్చుకొని వచ్చి గుండుగీయిద్దాం అని కూడా చెప్పవచ్చు). పనికిరాని వాళ్లకందరికి పరిహాసంగా ఉంది. (నువ్వు) మనిషివి కావా కొక్కరిస్తూ నిలబడ్డావు శనేసరపు బాపడా!

వేణుగోపాలస్వామి తిరుణాళ జరుగుతూ ఉంది. అక్కడికి వెళ్లు. అక్కడ అన్నం దండిగా పెడతారు. వానలు ఏమార్చాయి (వానలు పడలేదు). ధాన్యం, గడ్డి పిరమైపోయాయి (ధర ఎక్కువైంది) దానధర్మం ఎలా చేయగలం?



## 150. నాదనామక్రియ - చాపు

మనుషా ణమ్మబాకే [1]యిద్రేకాము కళేభారం –
  మనుషా నమ్మబాకే ॥పల్లవి॥

  మనుషా యీాద్రేగాము – మట్టి సట్టెంటిది
  పనిసట్టిలో నుండె – పరమాత్ము డెల్నంటె ॥అనుపల్లవి॥

తొమ్మిది సొరంఘాళ – త్రోళే నరమాశిగ
  బెమ్మగాయించింది – బెష్టకారి కట్టె ॥మనుషా॥

ఎన్నంటె యెమకాలు – యెనక ముంగి లెంటికెలు
  [2]కన్న యాదుల బుట్ట – గడగకుంటె గబ్బు ॥మనుషా॥

పయి యెన్నెలడుగున – పరమ శాంధలము
  మయిదుగ యీస్పరుడు శేశి – మబ్బి గప్పిండాడు ॥మనుషా॥

[3]తన దోషాణశెత్తి – ధరమదాణంశేశి
  యినవాలె రామాంధం – కనవాల మోచ్చంబు ॥మనుషా॥

ఎంట వగీటి రావు – యేనుగోపాలుని
  బంటై పాద కవళం – బట్టాలె యిడవక ॥మనుషా॥

---

1. యీాద్రేకము – యీాసలిలము – యీాజలమము (B).
2. కన్నయాతుల పుట్ట (B).
3. తన వోషాణ శెత్తి (A).

[శరీరం హేయమైనదని, ఆత్మ వెళ్లిపోతే అదెందుకూ పనికిరాదని, దేహంపై మమకారం తగదని, పామరులు భావించే తీరును ఈ పదం వివరిస్తుంది]

ఓ మనసా! ఈ దేహాన్ని నమ్మవద్దు. దేహం మట్టికుండ వంటిది. మట్టికుండవంటి ఈ దేహం నుండి ఆత్మ (పరమాత్మ) వెళ్లిపోతే (తరువాత ఎందుకూ పనికి రాదు).

చర్మం, నరాలు, మాసంతో కూడిన తొమ్మిది రంధ్రాల తోలు తిత్తి శరీరం. బ్రహ్మ తయారుచేసిన పనికిరాని దేహమిది. వెన్నుపూసనంటుకొని ఎముకలున్నాయి. తల, మొలల దగ్గర వెంద్రుకలున్నాయి. శుభ్రం చేసుకోకపోతే దుర్వాసన వస్తుంది.

వెన్నుకు అడుగుభాగం పరమ చండాలంగా (రోతగా) ఉంటుంది. అయినా శరీరం ఎంతో అందంగా ఉంది అనుకొంటాడు మనిషి. ఇది నిజంగా అజ్ఞానం. ఈ అజ్ఞానాన్ని దేవుడే మనిషికి కలిగించాడు. బతికి ఉండగానే దానధర్మాలు చేయాలి. రామాయణం వినాలి. మోక్షం పొందాలి. పోయేటప్పుడు వెంట ఏదీ రాదు. వేణుగోపాలుని బంటుగా మారి ఆయన పాదకమలాన్ని విడవకుండా పట్టుకోవాలి.



# 151.మోహన - చాపు

ఇచ్చేవా యీదికి లే - శొచ్చేవా ॥పల్లవి॥

రచ్చ శాయకంట - రాశ్యాలేమో యీడ
ఇచ్చలేవు రూక - యేనుగోపాల ॥అనుపల్లవి॥

సంతకాడ యీత సాపలగ్గవంట - (తిరుమల) - సనోరము నేడు
యెంత పొద్దెక్కెనే - యేయాల కాడొస్తి - యేమమ్మ యీ గోడు
శింతమానొద్ద మాశిన్నోడడిగితే - శీ పొమ్మంటివి నాడు
యంత శెప్పిన యినవు యిగనే మాశిని గాను-
సుంత కల్ల సూడు - మంచోడు ॥ఇచ్చేవా॥

బగుమాణ మిప్పించె బగిశేనా యీ మూతి - పాత శీరుందంటివి
నగర దచ్చన శిన్నాగి చేతులో బోశి - ననుశూశి దాగుంటివి
అగసాల దాంతో అన్నేల మంట న - న్నాడీ పోసుకొంటివి
యిగతంకిరే తప్పి - యేళనం శేశి సొ
మ్మెగయేతా మంటివి - మస్తవంటివి ॥ఇచ్చేవా॥

దోశాల ముందఱ నాశారి నగ దో - దాశికి రమ్మంటివి
[1]పాశము వరికూడు పాణక మింతిచ్చి - పాతికె లెక్కింటివి
ఓశె వానిమీద వొక ముప్పాతిక శెప్పి - [2]వొద్దియ్య వొద్దంటివి
[3]గాశి బెట్టి నాతో కలశుండి చీచీ యే -
బ్రాసి పో పొమ్మంటివి - లెమ్మంటివి ॥ఇచ్చేవా॥

1. పాసినోరుకూడు - (B).
2. వొద్దు యీయొద్దంటివి - (B).
3. గాశి శేశి నన్ను గలశుండి - (B).

[ఒక వేశ్య తనను సరిగా ఆదరించని తన విటునిపై దోషారోపణ చేయడం ఈ పదంలోని విషయం]

వేణుగోపాలా! రూక ఇవ్వలేవు. ఇస్తావా లేక వీధిలోకి వెళ్లిపోతావా? రచ్చ చేయకు. ఇక్కడ రహస్యాలేమీ లేవు. (వేణుగోపాలుని ఉద్దేశించినట్లు కనబడినా ఇందులో లౌకికులైన వేశ్యావిటులే కనిపిస్తారు).

ఈ రోజు తిరుమల శనివారం (తిరుమల శ్రీనివాసునికి ఒక్క పొద్దు చెల్లించే రోజు). సంతలో ఈత చాపలు అగ్గవగా దొరుకుతాయంట. ఏ వేళకాడ వస్తివి. ఎంతో సమయం అయిపోయింది. (ఇంకా ప్రియుడైన విటుడు రాలేదు) ఏమిటో ఈ గోడు. (కొంతసేపటికి విటుడు వచ్చాడు). చింతమాను దగ్గర మా చిన్నోడు అడిగితే ఛీ! పొమ్మన్నావు. (ఈ చిన్నోడు ఆ వేశ్య తమ్ముడై ఉంటాడు. అక్కను కలవడానికి రమ్మని చెప్పి ఉంటాడు). ఎంత చెప్పినా వినవే. ఇక నేను మనిషిని కాను (కోపంతో అన్న మాట). కొద్దిగా కండ్లతో చూడు. మంచివాడననిపించుకో.

బహుమానం ఇప్పించే బగిసి ఉందా నీ మూతికి? (నీకు బహుమతి ఇచ్చే గొప్పతనం ఉందా?) పాత చీర ఉందంటున్నావు. నగర దక్షిణ చిన్నాగి చేతిలో పోసి (మరొక ప్రియురాలైన చిన్న నాగికి అర్పించి) నన్ను చూచి దాక్కొన్నావు. అగసాలదాని దగ్గర (అగసాలి చిన్నది మరొక ప్రియురాలు) నన్నావేళ ఆడిపోసుకొన్నావు (నిందించావు). విహితం తప్పి (మాట మీరి) హేళన చేసి సొమ్ము (ఇవ్వవలసిన పైకం) ఎగవేద్దామన్నావు (ఎగరగొడదామన్నావు). మస్తు (ఇప్పటివరకు ఇచ్చిందే ఎక్కువ) అన్నావు.

గోశాల ముందర (కలిసినప్పుడు) ద్వాదశికి రమ్మన్నావు. ఆ మాటవిని అక్కడుండిన ఆచారి నవ్వినాడు. (తీరా అక్కడికి రాగా) కొద్దిగా పాయిసం, కొద్దిగా వరికూడు, కొద్దిగా పానకం ఇచ్చి పాతిక (రూపాయిలు), అయిందని లెక్కవేశావు. వాని దగ్గర (ఆచారి దగ్గర కావచ్చు) ముప్పాతిక ఇస్తానని చెప్పి (తరువాత అతడు ఇస్తూ ఉంటే) వద్దు, ఇవ్వవద్దు అన్నావు. నాతో కలసి ఉండి కూడా నన్ను బాధపెట్టినావు. (ఇప్పుడు) లేచి పొమ్మంటున్నావు. ఛీ! నువ్వు పనికిమాలిన వాడవు.



# 152. మోహన - ఆది

బాపనొండు శప్పేదింటుంటె – పయిక మేడ దంష్ణాడు ॥పల్లవి॥

దీపాల్ రెయి నా పక్కిలె మునుకొని –
కాపెంగిటి దేయిరింట్లో [1]సాప్పీన ॥అనుపల్లవి॥

శిరతని నచ్చత్రం బొయ్యేనంటి – శిన్నోన్నేసుకొని
వరిసంబడి రై పొద్దన్నెల్లో – పచ్చిబీమే పిస్కుని
బొరుగులు గొరుకుంటా నెమలోనమ్మీన – బొయ్యాని సూసుకొని
పరిగెచ్చేనంటె దుగ్గాల్లే తల – శరయిడు పిసుమంట శైసాపడిగితె ॥బాపనొండు॥

ఆగిత్య మనేది సొంటిదే యో – అయ్యోరంటీడు
యేగిలేస్తే యేదాలే సదతా – డెగేశ నంటాడు
యిగరీస్తు నాశేతులొ శెయ్యే – శిపు డిగిలిస్నాడు
రాగదేశి నీ యిశోస మగ్గిబడ – రాగి రూక దాపెట్టింగోతెకు ॥బాపనొండు॥

కానాలగాడ తండ్రిగాడీ – గాజులు యేపించ
తానే రాకల్లాలకు దీసపోయి – తైదలు వొణ్ణించ
గానానికి మంగలెంగు నెట్నించి – గామా నిడిపించ
కాని యేనుగోపాలుడి శారి శెం – తానే యా శిన్నో న్నిడిపించి ॥బాపనొండు॥

---

1. సాప్పీన.

[శిరతని నక్షత్రం (తిరుత్తణి ఆడికృత్తిక తిరుణాళ్లకు) పోయిన ఒక స్త్రీ పొందిన అనుభవాన్ని ఈ పదం వివరిస్తున్నది]

బాపనొండు (బ్రాహ్మణుడు?) చెప్పేది వింటూ ఉంటే పైకం ఎక్కడిదంటాడు. (ఈ పదంలో కనిపించేది వేశ్యకాకపోయినా ఒక పారమభామ. ఈమెకూ రంకు మగడు ఉన్నట్లుంది. తిరుత్తణి తిరుణాళ్లకు పోవాలనుకొని ఉంటుంది. అక్కడి విశేషాలను బాపనొండు చెపుతూ ఉంటే అక్కడ అయ్యే ఖర్చుకు పైకం ఎక్కడుంది? అంటున్నాడు ఆ రంకు మగడు). దీపావళి రాత్రి కాపు వెంకటదేవర ఇంట్లో చాప మీద నా పక్కలో పడుకొని పైకం ఎక్కడిది? అన్నాడు.

చిన్నోడిని (కొడుకు కావచ్చు) వెంటపెట్టుకొని శిరతని నక్షత్రానికి పోతానన్నాను. వర్షం పడిన రాత్రి వెన్నెలలో పచ్చిబియ్యం వేయించుకొని (బొరుగులుగా చేసుకొని) బొరుగులు తింటూ వెళ్లి నెమలి వాహనం మీద ఊరేగే దేవుని చూచి పరుగున వద్దామనుకొంటే దుగ్గాన్లు (పైకం) లేవు. చేయి చాపి అడిగితే (పైకం ఎక్కడి దన్నాడు).

ఆగిత్య మనేది ఎటువంటిదో అయ్యోరంటివాడని చూస్తే (తెలుస్తుంది). మాటిమాటికి వేదాలు చదువుతాడు. ఎగవేశాడంటాడు. వగిరిస్తూ నాచేతిలో చెయ్యివేసి ఇప్పుడు (పండ్లు) ఇకిలించాడు. నీ విశేషం అగ్గిబడినట్లే ఉంది. గడియ వేసిరా. రాగి రూక దాచిపెట్టింది లేదు.

తానే రాగి కల్లాలకు (రాగి కంకులను గుండుతో తొక్కించి రాగులు వేరుచేసే చోటు) తీసుకొనిపోయి రాగులు ఒడినిండా పోయించాడు. గానానికి (సంగీతం నేర్పడానికి కాబోలు) మంగలి వెంకును పెట్టించాడు. (ఈ పనులన్నీ తన గొప్పతనాన్ని చాటుకోవడానికి చేసినవి కావచ్చు) వేణుగోపాలుడి స్వారస్యం ఇలా ఉంది.



## 153. ఆరభి - చాపు

అగ్గితిరునాళ్ళంట – అజ్జుని కతలంట–
అవురా యంతరుసోద్దమే భారతకథ –
ఔరా యెన్నెన్నింతలే ॥పల్లవి॥

సుగ్గీజయము దీని – సుట్టు బలాదూరు
అగ్గరోరపు [1]అయ్యో –ర్నడిగే నీ సాచ్చిగ ॥అనుపల్లవి॥

యిగనేను పైనెక్కి – యీ బీసనూ డొచ్చి
బగుపెగ్గె లెన్నెన్నో – బలికి దుశ్శాసూని
మొగము చూడగానె – [2]మొర్చునాయా లట్టే
గుగురు మిగురనకుండ – గుడ్లెల్ల గుక్కెనే ॥అగ్గి॥

[3]అనుమంతెనకటోడు – అబిమన్ను డంటనె
[4]సనియు నోలబట్ట – సాము శెయిసు అట్టె
[5]యినయే యీరబద్రు – విసనకాయలు దొక్కి
కనురెప్పేశే తల్కి – కర్ణుని శించెనె ॥అగ్గి॥

యిరనేచ్చు చడ్డకు – డింద్రజిత్తొక రెయ్యి
దురవోదనుని శెయిలో – [6]దూరి ముక్కునెల్లి
అరశి పిసాసోలె – అశ్వద్దామను మింగి
[7]సురివోద మాయెనే – సూడ యేడిగున్నె ॥అగ్గి॥

[8]బేరి బూరుగలింట – గారదేవలమొద్ద
యీర పతిమెకు మొక్కి – యిటు తలెత్తే తల్కి
మారుబాసోడొకడు – మొల తిత్తొదిలించుకొని
[9]శారదైదీశె దొ– జనుల కిచ్చెనే ॥అగ్గి॥

తేనీగ గుములోలె – తెండె తెండెగ [10]పంజ
కోనచముద్రం గుంట – కొనను నిల్బడి సూడె
నానా దించంగల్లె – నానారంచంతోలె
యేను గోపాలుడు – యెటుల గాయించెనె ॥అగ్గి॥

---

1. అయ్యోర్లడిగిన సాచ్చినే (B). 2. మొగసాయబోయట్టె (B).
3. అనుమంతు డంటోడు (B). 4. సనియ నూలుబట్టి (B).
5. ఎనయ యీరభద్రు – డిసనకాయలు దొక్కి (B). 6. దూశి (B).
7. సూరోద మాయెనే – సూడడె దిగ్గున (B). 8. గారదేవల మొద్ద – బేరి బూరగలంట (B). 9. శారదేదీశిశ –జ్జనుల కిచ్చెనే (B). 10. పజ (B).

[కార్వేటినగర ప్రాంతంలో జరిగే అగ్గితిరుణాళ విశేషాలను ఈ పదం వివరిస్తున్నది]

అగ్గితిరునాళ్లంట – అర్జునుని కథలంట. ఔరా! ఎంత ఆశ్చర్యంగా ఉంది భారతం కథ. ఎన్నెన్ని వింతలు కనిపిస్తున్నాయి. సుగ్రీవ విజయం (కథ) భారతం కథ ముందు బలాదూర్ (దిగదుడుపే). నీ సాక్షిగా ఇది నిజం. కావాలంటే అగ్రహారపు అయ్యవారిని అడుగు.

విభీషణుడు విఘ్నేశ్వరునిపై ఎక్కి వచ్చాడు. ఎన్నెన్నో పెగ్గెలు (ప్రతినలు) పలికినాడు. దుశ్శాసనుని ముఖం చూడగానే మూర్ఛపోయాడు. చడీ చప్పుడు లేకుండానే కనుగుడ్లు బయటకు వచ్చాయి.

హనుమంతునికి వెనక పుట్టినవాడు అభిమన్యుడంట. శని వలె పట్టుకోగా అట్లే యుద్ధం చేస్తూ వీరభద్రుని వృషణాలను తొక్కి, కనుమూసి తెరచే లోపల కర్ణుని చీల్చివేశాడు.

హిరణ్యాక్షుని తోడల్లుడైన ఇంద్రజిత్తు ఒకరాత్రి దుర్యోధనుని చెవిలో దూరి ముక్కుగుండా బయటకు వచ్చాడు. పిశాచి అరచినట్లు అరచి అశ్వత్థామను మింగాడు. అప్పటికి సూర్యోదయమైంది. ఇవన్నీ చూడడం ఎంతో వేడుకగా ఉంది.

గార దేవాలయం దగ్గర భేరి, బాకాల శబ్దం వింటూ, వీర ప్రతిమకు మొక్కి ఇటు తలెత్తి చూచేటప్పటికి మారుబాస (ఆంగ్లభాష అయి ఉంటుంది) మాట్లాడే ఒకడు నడుముకు కట్టుకొని ఉండిన సంచి తెరచి తన చేతితో చేరెడు (కొద్దిగా వంచిన అరచేత నిండా) (అక్కడుండిన) జనానికి ఇచ్చాడు.

తేనెటీగల గుంపువలె ప్రజలు గుంపులు గుంపులుగా కోన సముద్రం గుంట గట్టున నిలబడి (ఆ వేడుక) చూశారు. అక్కడ నారాయణవనం సంతలోవలె నానాదినుసులు (వస్తువులు) అమ్మే అంగళ్లున్నాయి. ఇలాంటి వేడుకను వేణుగోపాలుడు ఎలా సృష్టించాడో!

[తిరుణాళ్ల సందర్భాల్లో వీధి నాటకాలు ఆడడం, ప్రజలందరూ గుంపులుగా వచ్చి చూచి ఆనందించడం సారంగపాణి కాలంలోనే కాదు ఇప్పుడుకూడా అక్కడక్కడా కనిపిస్తున్న అంశమే. భారత, రామాయణ కథలంటే



అప్పటి ప్రజలకు ఎంతో ఇష్టంగా ఉండేది. ధర్మరాజు తిరుణాళ్లు చిత్తూరు జిల్లా గ్రామ ప్రాంతాల్లో ఇప్పటికీ జరుగుతూ ఉన్నాయి. ధర్మరాజు తిరుణాళ్లు పేరుతో జరిగే ఈ ఉత్సవాల్లో భారతకథను పద్దెనిమిది రోజులు వీధి నాటకంగా ప్రదర్శిస్తారు. చివరిరోజు పెద్ద అగ్నిగుండం వేసి ఆవేశంతో అగ్ని మీద నడచి తమ భక్తిని చాటుకొంటారు. దీనికి 'అగ్గితిరుణాళ' అని కూడా పేరు.

ఆ ప్రజలందరూ పామరులు కాబట్టి భారత రామాయణాలలోని పాత్రలను తారుమారు చేసి, చూచి ఆనందిస్తారు. విభీషణుడు దుశ్శాసనుని చూడగానే మూర్ఛ పోయాడని అనుకోవడంలో వాళ్లకు ఆనందం ఉంది. ఆ ఇద్దరికి సంబంధం లేదని; ఆ రెండు పాత్రలు ఒకటి రామాయణంలో, మరొకటి భారతంలో ఉన్నవని తెలియదు. హనుమంతుని వెనక పుట్టినవాడు అభిమన్యుడని, హిరణ్యాక్షుని తోడల్లుడు (షడ్డకుడు) ఇంద్రజిత్తని అనుకోవడం కూడా ఇలాంటి తడబాటే. పాత్రల వరుసలు, స్వభావాలు వాళ్లకు అక్కరలేదు. ఆ ప్రదర్శనలను తిలకించి ఆనందం పొందడమే వాళ్లకు కావలసింది.

గారదేవాలయం దగ్గర వీర ప్రతిమకు మొక్కడం ఒక దేశీయాచారం. వీర ప్రతిమ 'వీరగల్లు' (Hero-stone) కావడానికి అవకాశముంది. దేశం కోసం, ప్రజల కోసం, ఏదైనా గొప్ప కారణం కోసం ఆత్మార్పణ చేసిన వ్యక్తిని పెద్ద రాతి బండమీద ఉబ్బెత్తు విగ్రహంగా మలచి, ఆ రాతిబండను ప్రాధాన్యమున్నచోట నాటి పూజించడం నాలుగైదు శతాబ్దాలనాటి సంప్రదాయం. అలాంటి రాతిబండలకు వీరగల్లులని పేరు. ఇప్పటికీ కొన్ని శైవ, శక్తి దేవాలయ ప్రాంగణాలలో వీరగల్లులు కనిపిస్తాయి.

మారుబాసవాడు తప్పకుండా ఆంగ్లేయుడే అయి ఉంటాడు. అప్పటికి ఆ ప్రాంతమంతా తూర్పువర్తకసంఘం పరిధిలోనే ఉండింది. ఆంగ్లేయులు ఉత్సవ సందర్భాల్లో ప్రజలతో కలసిపోయి తాము పరదేశీయులమనే అంశం ప్రజలకు గుర్తురాకుండా ఉండడానికి ప్రయత్నించారు. దాని కోసం ఏదో ఒకటి బహుమానంగా కొందరికైనా ఇస్తూ వాళ్లకు దగ్గరయ్యే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నంలో భాగంగానే ఒక ఆంగ్లేయుడు తన సంచి తెరచి చేరడు చేరడు అక్కడుండిన జనానికి ఇచ్చి ఉంటాడు. ఇచ్చినదేదో తెలియదుగాని బొరుగులు వంటి తినుబండారాలే అయి ఉండడానికి అవకాశముంది.]

## 154. పంతువరాళి - ఆది

నాన్నారము చంత్లో - నానాదించుందెంట
నయము గిచ్చేరంటనె - సూడే ॥పల్లవి॥

ఈన్నే పొద్దెక్కెనే - యీడేదుండాదెంటె
కోణ్ని గొండపోతె - కొందురే వొగురైన ॥అనుపల్లవి॥

ఇలనేడ సూల్లెదె - యీసుల్లేమగ్గవె
మలుగుశాపలాడ - మస్తంటనె
తలయెంటికె తాల్లు - నిలువు పొడుగైయ్యినే
అలశొచ్చేతల్కీడ - అంబలొండుండరే ॥నాన్నారము॥

అమ్మెరంటితల్లి - కమ్మలుంగరాలు
దెమ్మనిస్తి శీల్లు - తిమ్ముశాతా
కుమ్మరక్కదోట - గురువు అగుమూడెల్మీ
చొమ్ముగ సూడాలె - చోద్దం గుండాలె ॥నాన్నారము॥

మోడోల్ల శీన్నెంగు - మెట్టెల కంటొచ్చి
ఏడి దోచలు తిన్నో - రెండు కొని
ఆడనీల్లు దాగి - అగ్గేలే సురుకెత్తి
[1]సూడలె దేవుల్ని - సూడ యేడిగున్నె ॥నాన్నారము॥

ఆబిడిప్పటి కీదు - లెంత సింగారమే
నబురు కొక్కమొలు - నాన్నెముగా
పెబువె గాయించెనో - బెమ్మని మించెనో
సుబిలమైయుండు యీ - సుని దీయశాత ॥నాన్నారము॥

కాశీ పొడుగెతికిన - కలదా యీ గోపిరం
యెశశీలుగుల్లో - యెగిరేరేమె
వోశయ్యోర్లు గుములై - వాపోయెరే చిలమెద్ద
పాశపుకూడే గో - పాలుని దయశాత ॥నాన్నారము॥

1.సూడలేదే పుల్ని - (A).



[నారాయణవనంలో జరిగే సంత, ఆ సంతలో దొరికే వస్తువులు ఈ పదంలో వివరింపబడినాయి]

నారాయణవనం సంతలో నానా దినుసులు (రకరకాల వస్తువులు) ఉన్నాయంట. చౌకగా ఇస్తారంట. ఇక్కడే పొద్దెక్కింది (సమయం ఎక్కువైంది) సంత ఇక్కడ అక్కడ ఉండాదనుకొన్నావా (దగ్గరలో ఉందనుకొన్నావా). కోడిని తీసుకొని వెళితే ఒకరైనా (ఎవరైనా) కొనరా?

ఇంకెక్కడా చూడలేదుగాని అక్కడ ఇసుళ్లు ఎంతో అగ్గవ. ఆ సంతలో మలుగు చేపలు మస్తుగా (అధికంగా) దొరుకుతాయంట. పొడవైన సవరాలు దొరుకుతాయి. (మేము సంతకు వెళ్లి వస్తువులు కొనుక్కొని) అలసిపోయి వచ్చేటప్పటికి అంబలి వండి పెట్టండి.

అమ్మవారువంటి తల్లికి కమ్మలు, ఉంగరాలు ఉన్నాయి. (సంత జరిగే చోట అమ్మవారి ఆలయం ఉండి ఆలయంలోని అమ్మదేవతను దర్శించి ఉంటారు. అమ్మవారి విగ్రహం మీద (పెద్ద) కమ్మలు, ఉంగరాలు కనిపించి ఉంటాయి. లేదా - మట్టితో చేసిన అమ్మతల్లి విగ్రహాన్ని, కమ్మలు, ఉంగరాలను కొనుక్కోవాలనుకొని ఉండవచ్చు). చీరలు (కొని) తెమ్మని తిమ్ము (తమ్ముడు గావచ్చు లేక తిమ్ము అనేది ఒకరి పేరుగావచ్చు) చేతికి (పైకం) ఇచ్చాను.

మోడోళ్ల చిన్న వెంకు (ఒక వ్యక్తి పేరు) మెట్టెలు కొనడానికి వచ్చి తినడానికి రెండు వేడిదోశలు కొన్నాడు. (ఆ దోశలు తిని) అక్కడే నీళ్లుతాగాడు. (వేడిదోశలు కాలడం వల్ల) అగ్గి తగిలినట్లు నోరు మంట పుట్టింది. అందువల్ల చూడడానికి ఎంతో వేడుకగా ఉన్నా (అక్కడ కొలువై ఉండిన) దేవతలను చూడకుండానే (వచ్చేశాడు).

నారాయణవనంలో అప్పటికి, ఇప్పటికి (సారంగపాణి కాలం నాటికి) వీధులు ఎంతో అందంగా ఉన్నాయి. నగరుకు అందంగా మలాం (సున్నపుపూత) వేసి ఉండారు. ఈ పనిని ప్రభువు (నారాయణవనం పాలకుడు) చేయించాడో లేక బ్రహ్మదేవుడు చేయమని ప్రభువును నియమించాడో! దేవుని దయవల్ల సురక్షితంగా ఉండుగాక (లేక శుభ్రంగా ఉండుగాక).

(దేశంలో) కాశీపట్టణం వరకు వెదకినా (ఇంత పెద్ద) గోపురం ఉంటుందా? (లేక ఇంత అందమైన గోపురం ఉంటుందా?) (వివిధ) వేషాల తొడుగులు ధరించి ఎగురుతూ ఉండారు. అయ్యవార్లు గుంపులు గుంపులుగా (వేదాలు చదువుతూ) అలసి పోతున్నారు. వేణుగోపాలుని దయతో పాయసం, కూడు (దొరికింది).

(సారంగపాణికి ఎంతో ముందు కాలం నుండి నారాయణవనంలో శ్రీవేంకటేశ్వరుని దేవాలయం ఉంది. పూజాదికాలు జరుగుతూ ఉన్నాయి. ఆ ఊరి సంతకు వెళ్లిన ఆ ప్రాంతపు గ్రామ ప్రజలు సరుకులు కొనడమేగాక దేవాలయానికి కూడా వెళ్లి స్వామిని కూడా దర్శించుకొనేవారు. నిత్యమూ ఉత్సవాలు జరిగేవి. ఆ దేవాలయ గోపురం ఎంతో అందంగా కనిపించింది. ఆ ప్రజలకు వీధులు కొత్త సింగారాన్ని (అందాన్ని) సంతరించుకొని కనిపించాయి. అయ్యవార్లు ఉత్సవం వెంట వేదమంత్రాలు చదువుతూ సాగుతున్నారు. భక్తులకు ప్రసాదంగా పాయసం, కూడు పంచినారు.)



# 155. పున్నాగవరాళి - చాపు

నచ్చత్రం బొయ్యెత్తామె చంద్రూమాశి –
నచ్చత్రం సూశొత్తామె ॥పల్లవి॥

[1]లచ్చుము శన్నారుద్ర – రవునేమా గొల్లెంగు
పచ్చిబీ మిసిరిపుడే – పైణామంటుంటారు ॥అనుపల్లవి॥

బోగమాల్లాడేరంటే శిరతని గొల్లో – వాగనా లేడికంటె
[2]నూగింజై య్యెడముండ – నూకట మిపరీతం
తాగనీల్లుండెంట – దనలొట్టలేదంట ॥నచ్చత్రం॥

గురుగులగ్గ వంటనె శిన్నెంద్రూక్కు – స్తొరుగు పండేశెంటనే
యెరమొక్కొస్తాదంట – యేపి నెంటేస్కొని
అరిచంద్ర కత గట్టి – ఆడేరంటేశ్కాలు ॥నచ్చత్రం॥

తొగరు శీల్లుందంటనె [3]కాశిశిరెస్తె – తగర వుంగర మోటంట్లే
[4]యిగనేసుమండప – మెనకలింటో రుందాయి
నెగిరో రొచ్చెరంట – బగుయేడిగుణ్ణంట ॥నచ్చత్రం॥

కొత్త చింబాలంటనే శేపించింది – శిత్తూరి కాడంటనే
[5]యెత్తెడు రతమాను సూడలంటుండావొ
నెత్తిపాగీడు త – లెత్తి సూసేతల్కి ॥నచ్చత్రం॥

నందొనలుందంటనే [6]దుగ్గానికి – శందిర మింతంటనె
వుందేంటీత బెల్ల – మేశిన నిప్పట్లు
కొందాం రాయే యేను – గోపాలు దుండాడు. ॥నచ్చత్రం॥

1. లచ్చుమా శిన్నుద్రి రమణి మా గొల్లెంగు (B).
2. నూనెగింజ యిడమదు (B).
3. దుగ్గానిసే (B).
4. ఇగనేశు మండపా – నెనక తేరుందంట (B).
5. ఎత్తుడు రదమును – నూర్రాలంటుండేరు (B).
6. కాశిశిరేస్తే (B).

[పామరుడైన ఒకవ్యక్తి తిరుత్తణి నక్షత్రం (ఆడికృత్తిక) చూచి వద్దామని తన భార్యనో లేక ప్రియురాలినో పిలిచి, ఆడికృత్తిక తిరుణాళ్లలో అక్కడ జరిగే సంబరాలను వివరించడం ఈ పదంలో వర్ణితమైంది]

నక్షత్రానికి (ఆడికృత్తిక తిరునాళ్లకు) వెళ్లి చూచి వద్దాం. లక్షుమ (లక్ష్మమ్మ) శన్న (చెన్నమ్మ) రుద్రవరం నేమ (వేమమ్మ), గొల్లవెంగు (వెంకమ్మ) పచ్చిబియ్యం విసరుకొని ఇప్పుడే ప్రయాణం అంటున్నారు. (పచ్చిబియ్యంపిండి అంబలి తయారు చేయడానికి కావచ్చు).

తిరుత్తణి గుడిలో బోగంవాళ్లు ఆడతారంట. (ఊరేగే) వాహనాలు వేడుకగా ఉంటాయంట. (విపరీతంగా) జనం రావడం వల్ల నువ్వుగింజంత సందు కూడా ఉండదు (నువ్వుగింజ వేసినా కిందికి రాలనంత జనం వచ్చారని అర్థం). ఎక్కువగా తోసుకొంటారు. దొనలో (మడుగులో) నీళ్లు నిండా ఉండడం వల్ల తాగడానికి నీళ్లున్నాయంట. (నీటి కొరత లేదని అర్థం).

మట్టి పిడతలు (ఆడపిల్లలు ఆడుకొనేవి) అగ్గవంట. ఒక రూకకు ఒరుగులు వీసెడు (దొరుకుతాయంట). ఎరమొక్క (ఎర్రమక్క గావచ్చు లేక ఎరక్క గావచ్చు) కుక్కను వెంటబెట్టుకొని వస్తాదంట. వేషాలు వేసుకొని హరిశ్చంద్ర కథ ఆడతారంట (ఇది హరిశ్చంద్ర వీధినాటకం కావచ్చు).

ఎర్ర చీరలు ఉన్నాయంట. ఒక కాసుకు తగరంతో చేసిన ఉంగరం ఒకటి దొరుకుతుందంట. మనం విఘ్నేశ్వరుని మండపానికి వెనక ఉన్న ఇంట్లో ఉందాం. నగరివాళ్లు (కార్వేటి నగర సంస్థానాధీశులు) వస్తారంట. ఎంతో వేడుకగా ఉంటుందంట.

కొత్త సింహాలంట (కొత్త సింహవాహనాలు). చిత్తూరులో చేయించారంటనే. ఎత్తైన రథాన్ని చూడాలన్నావు కదా! తల ఎత్తి రథాన్ని పూర్తిగా చూస్తే తలపాగా పడిపోతుంది (అంత ఎత్తు ఉందని అర్థం).

చెక్క పిడతలు ఉంటాయంట. ఒక దుగ్గానికి (ఆంగ్లేయుల కాలం నాటి నాణెం. దుగ్గానికి రెండు దమ్మిడీలు) ఇంత కుంకుమ ఇస్తారంట (ఇంత



అంటే దండిగా అని చెప్పాలి). ఈతబెల్లంతో చేసిన నిప్పట్లు (అరిశెలు) ఉన్నాయంట కొందాం రా. మనలను కాపాడడానికి వేణుగోపాలుడే ఉండాడు.

(ఆడికృత్తిక తిరునాళ్ల సందర్భంలో నగరి (కార్వేటి నగరం) వాళ్లు రావడానికి కారణం అప్పటికి తిరుత్తణి దేవాలయ ఆధిపత్యం వాళ్ల స్వాధీనంలో ఉండడమే.)

# 156. నాదనామక్రియ - ఆది

కిన్నరవాస్తా నిలబడుకుంటె –
[1]గింజలేడ దైతం యాడ ॥పల్లవి॥

అన్ని లేవె యెందొల్లడ బెట్టిన
ఆగిత్తెమ తెల్లొరకతల్కె ॥అనుపల్లవి॥

వరచాలేమంటని యెగబెట్టెనొ –
దరయీ నిక్కెరం శేశిరి నరకలు
శరవల్లో శాపలు [2]శారేశిరి –
శాలల్లో కర్ర బయిటి కెల్లలే ॥కిన్నర॥

కొలువులంట సూస్తె అబము సుబములె –
కొంప లిడిశి యెల్లలేకుండడమే
చలిగి వొగిరికై నంతపాతలె –
సారశములే సిగ్గుపాట్లు జెప్పితె ॥కిన్నర॥

ఉప్పుగల్లదె ముత్తికేభలు పిరం –
వుపాశమున్నా యే మంటడగరు
యిప్పుడే చంతలో యెగబగలైతె –
యీ కాపిర మెట్లా యెల్దోయను ॥కిన్నర॥

మూనాలయ శంగిటేశి యేపికి –
ముశిలిది లెయిలా సంటిద్దిగలా
[3]పానంలే గొడ్ల సూన్నశింగేం–
పందెన్నో గూటి గూటి బొబ్బొభో ॥కిన్నర॥

ఈడ యెల్లుకుంటేగా దరమం –
యిన్నాల్లలె పోసపోతె కులుకుదు
నాడిస్తి నెసగ బెట్టిన తైదలు –
నా శారతో మీకినోస మేడది ॥కిన్నర॥

వోరా యిద్దర చందాగించను –
వారాయన కీయాల కెంటికై
కూరాకంటెనె సదలయ్యోరికి –
బారబోసుకొనె శిలికె శిక్కలె ॥పల్లవి॥

ఏగిలేస్తె బుట్టి సంగనేసక –
యిట్లా వుడకాడిస్తే మాసల
బోగమీది కొల్లబోలె యేలు నీ –
రాగ  మేణుగోపాలుడె యినాలె ॥కిన్నర॥

---

1. గింజలేడ దెత్తాయి (B). 2. సల్లేసిరి (B).
3. పానములా గుడ్లగూర్ల శింగను – పందిగూటి కోడిబొబ్బొబ్బొబ్బొ (B).



(భిక్ష వేయలేని పేదరాలైన ఒక ఇంటి యజమానురాలు యాచకుడు వచ్చి యాచించినప్పుడు అతనితో తన దైన్యపు స్థితిని చెప్పడం ఈ పదం వర్ణించింది).

కిన్నర వాయిస్తూ నిలబడి ఉంటే గింజలు ఎక్కడ నుండి తెస్తాం? ఇక్కడ ఏమీ లేవు. ఏందో లొడపెట్టినట్లు మాట్లాడుతున్నావు. ఇది ఆగిత్యం కాకపోతే తెల్లవారకతలికే వచ్చావే!

వర్షాలు ఏమని కురవకుండా మానేశాయో వర్తకులు (సరుకుల) ధరలు పెంచేశారు. చెరువులలో చేపలన్నీ పట్టేశారు. పొలాల్లో కర్రలు (పైరు మొలకలు) బయటికి రాలేదు.

ఉద్యోగాలకు వెళదామని చూస్తే ప్రయోజనం కనపడడం లేదు. ఇండ్లు విడిచి (ఎక్కడికీ) వెళ్లలేకుండా ఉన్నాం. చలికి కప్పుకోడానికి కూడా చినిగిపోయిన పాతగుడ్డలే. చెప్పుకోడానికి సిగ్గు అడ్డం వస్తూ ఉంది.

ఉప్పుగల్లు కూడా ముత్యాలవలె ప్రియమైపోయింది. (ధర ఎక్కువయింది). ఉపవాసమున్నా (పస్తులుండినా) ఎలా ఉండారని ఎవ్వరూ అడగరు. ఇప్పుడే సంతలో సరుకుల ధరలు ఇలా పెరిగిపోతూ ఉంటే ఇంక ఈ కాపురాన్ని ఎలా గడుపుకోగలం?

కుక్కకు సంగటి వేసి మూడురోజులైంది. ఇంట్లో ముసలిది (అమ్మగావచ్చు, అత్తగావచ్చు, అవ్వగావచ్చు) మంచంలో పడి లేవలేకుండా ఉంది. చంటిబిడ్డ చంక దిగడం లేదు. గొడ్లకు (పశువులకు) తాగడనికి నీళ్లు లేవు (లేదా పశువులు ఊపిరి లేకుండా ఉన్నాయి). పశువులను చూడాలంటే సిగ్గుగా ఉంది. (మేతవేయలేక పోయామే అనే దిగులు). గూటిలో కోళ్లు (కూడా) బొబ్బొబ్బో అని (మేత లేక పోవడం వల్ల) అరుస్తున్నాయి.

ఇక్కడ వెసులుబాటు ఉంటే గదా ధర్మం చేయగలం. ఇంతకు మునుపులాగా అనుకొంటే వీలుగాదు. ముందు వచ్చినప్పుడు నా చేరతో చేరెడు మంచి రాగులు ఇచ్చాను గదా! మీకు కృతజ్ఞత లేదు.

తెల్లవారితే చాలు బుట్ట సంకన బెట్టుకొని మనుష్యుల్ని ఇలా ఉడకాడిస్తా (బాధపెడుతూ) ఉండారు. బోగం వీధి కొల్లబోలేదు. నువ్వు పాడే పాట వేణుగోపాలుడే వినాలి.

# 157. ముఖారి - త్రిపుట

తేరు శేశెనంట – తెచ్చిన పైకమీ –
తెరువు శేశెగదవె – యిట్లా ॥పల్లవి॥

వోరుగంటికి పోగా – పొగమాశి బరువుగ
బెరోలిచ్చెరే కరిం –బేటి యీసురునికిగా। ॥అనుపల్లవి॥

పసుపు నిగ్గుగా బూసి – బైరలంట శెవునేశి
అసలు కాటుక రాశి – అట్టే సొగసు దీశి
కసరు బుద్దులు రోశి – గౌరి పూజలు జేసి
వసుధలో నిటుదూశి – వడుగు పెండ్లి జేసి ॥తేరు॥

సురుగీవునితో సమము – సూసెనంటి దీ జగము
తిరిగి తెచ్చిన దనము – దిగ మింగేశ దిందినము
శరపరము నీ యితము – శేశిం తెల్పునరతము
అరయ నీ సాహసము – అంటె బల్‌రోసము ॥తేరు॥

సీనోసుమంటోడు – శెప్పిందింతొకనాడు
యీనెల్ కొడ్డికి పైదు – యేశనంట నీతోడు
కాని మస్తిసూడు – గనము గీవల మిపుడు
యేనుగోపాలుడు – వోరికిచ్చునో యిపుడు ॥తేరు॥



[కరియంబేడు శివాలయానికి రథం తయారు చేయించాలని ప్రజల నుండి విరాళాలు సేకరించారు. ఆ పనికి బాధ్యత తీసుకొన్నవాడు ఆ ధనాన్ని రథ నిర్మాణం కోసం కాకుండా తన స్వంత ఖర్చులకు వాడుకొని వృథా ఖర్చులు చూపించి మోసం చేసే ప్రయత్నం చేశాడు. ఆ ఊరివాడొకడు ఆ విషయాన్ని అందరికీ తెలియజేసే ప్రయత్నం చేసినట్లుంది. ఈ పదం ఆ విషయాలను తెలుపుతూ ఉంది.]

తేరు చేయిస్తానని తెచ్చిన (వసూలు చేసిన) పైకం మరొక రకంగా ఖర్చు చేశాడు గదమ్మా! కరియంబేటి శివునికి చేయించిన (ఈ రథం) పొగచూరి పోయి కనిపిస్తున్నది. (పైకం మిగిలించుకొని సరిగా చేయించక పోవడం వల్ల రథం ఉండవలసిన విధంగా లేదని అర్థం). శివుని (గుడిని) సంపన్నం చేయాలని అనుకోలేదే.

అందంగా పసుపు పూసి భుజాల మీద వేసే ఉత్తరీయం తగిలేటట్లుగా చెవులు చేశారు. మంచి కాటుక పెట్టారు. సొగసుగా కనిపించేటట్లు చేశారు. దోషాలు దొరలకుండా గౌరి పూజలు చేశారు. (ఈ అలంకరణ అంతా రథంలో ఊరేగవలసిన గౌరి (పార్వతి) విగ్రహానికి సంబంధించినదై ఉంటుంది). అందరిని ఆహ్వానించి వడుగు పెండ్లి (శివుని పెండ్లి) – అంటే శివపార్వతుల కల్యాణోత్సవం జరిపించారు.

ఈ జగత్తు సుగ్రీవునితో సమానంగా చూచింది (ఏమిటో సరిగా అర్థం కావడం లేదు). అక్కడక్కడా తిరిగి వసూలు చేసిన ధనాన్ని రోజూ కొద్దికొద్దిగా దిగమింగేశాడు (ఖర్చు చేశాడు). దైవకార్యాన్ని దృష్టిలో పెట్టుకొని (ధనం) సరఫరా (వసూలు) అయింది. ఈ ధనాన్ని నువ్వు ఏం చేశావో చెప్పు. దేవుడి ధనం (నీ సొంత) ఖర్చులకు పెట్టుకొన్నావే నీ కెంత ధైర్యం? ఆ మాటంటే రోషం వస్తూ ఉందే!

ఈ జరిగిన విషయమంతా ఒకనాడు శ్రీనివాసుడనేవాడు చెప్పిందే. ఈ నెల వడ్డీకి వేశానన్నావంట. దానికి నువ్వే సాక్ష్యం (ఎవరికీ నమ్మకం లేదని అర్థం). ధనం ఇంకా ఎక్కువగానే ఉండాలి. గొప్పధనం (ఇప్పుడు) కేవలం అయిపోయింది. (గొప్పవాళ్లను కూడా నమ్మలేని పరిస్థితి ఏర్పడింది).

వేణుగోపాలుడు ఇప్పుడు ఎవరికి ఇస్తాడో! (ఆలయ పెత్తనం ఎవరికి ఇస్తాడోననే భావం కావచ్చు).

(కొత్త తేరు చేయించి ఆ తేరుమీద శివపార్వతుల విగ్రహాలు పెట్టి ఊరేగించే ఏర్పాటు చేసినట్లుంది ఆ ఊరి ప్రజలు. ఈ పదంలోని మొదటి చరణంలో అలా తయారు చేయించిన పార్వతి విగ్రహానికి సమకూర్చిన అలంకరణ కనిపిస్తున్నది. వడుగు పెండ్లిచేయడమంటే శివపార్వతుల కల్యాణమని చెప్పడానికి కారణముంది. వడుగు అంటే బ్రహ్మచారి అని అర్థం. శివునికోసం పార్వతి తపస్సు చేసిన సందర్భంలో శివుడు ఆమెను పరీక్షించడానికి వటుడు (వడుగు) అంటే బ్రహ్మచారి రూపంలో వచ్చాడు. కాబట్టి వడుగు అంటే ఈశ్వరుడనే అనుకోవాలి.

రెండవ చరణంలో సుగ్రీవునితో సమానం అనే మాట ఉంది. తేరు చేయించడం, విగ్రహాలు చేయించడం వంటి దైవకార్యాలకు బాధ్యత వహించినవాడు సుగ్రీవునితో సమానమని అనుకోవాలేమో! సుగ్రీవుడు శ్రీరామునికి నమ్మదగిన స్నేహితుడు. అంటే సుగ్రీవుడు నమ్మదగినవాడన్నమాట. సుగ్రీవుని వలె ఆ దైవకార్యాన్ని నిర్వర్తించేవాడు కూడా నమ్మకస్థుడుగా పేరున్నవాడే. అయితే రోజుకింత చొప్పు వసూలైన పైకంలో కొంతభాగం స్వంతఖర్చులకు వాడుకొన్నాడు.

మూడవ చరణంలో ఒక నెల వడ్డికి వేయడం అనే మాట ఉంది. దేవాలయానికి కొంత ధనం నిలువ ఉంటుంది. ఆ ధనంలో ఎవరైనా అవసరమైనంత తీసుకొని నెలనెలా వడ్డీ కడుతూ ఉండాలి. ఈ పదంలో ప్రస్తావించబడిన ఆ పెద్దమనిషి తాను దేవాలయధనం నుండి తీసుకొన్న అప్పుకు ఒక నెల వడ్డీ జమ వేశానని చెప్పినట్లుంది. దానికి సాక్ష్యం లేదు. ఎవరూ చూడలేదు దానికి ఆవ్యక్తే సాక్షం.



# చతుర్థభాగం - కీర్తనలు

## 158. శంకరాభరణం - చాపు

వేణుగోపాలుని విడువము - మరి (మేము) -
వేరే వక్కరి పేరు నుడువము ॥పల్లవి॥

వీణుగ కాశికి నడువము - ఖలుల -
విత్తము కొంగున [1] గట్టము - మా ॥అనుపల్లవి॥

పాపకర్ముల కడప మెట్టము -
పతిత పావనుడే మాకు చుట్టము
గోపబాలుని భజన దిట్టము యమునిని -
గొడవెందు [2]కిది వేరే ఘట్టము - మా ॥వేణు॥

పరమ భక్తుల దండ వీడము - నర -
పతుల మేమిక కొని యాడము
హరిని వినా వేరే పాడము - దుర -
హంకారుల మోము జూడము ॥వేణు॥

కర్మపాశములు సళ్ళింతుము - లోని -
కలుషము కడిగి గాలింతుము
ధర్మమార్గ మనుసరింతుము పరం-
ధాముని మదిలో బంధింతుము - మా ॥వేణు॥

నారాయణదివ్యనామము - యె -
న్నటికి మరువమను నీమము
తారక మిది మాకు క్షేమము - శ్రీ -
ధరుని సేవే పూర్ణకామము - మా ॥వేణు॥

రక్షించుమని రవ్వసేతుము - యెదుట -
రాకుంటె వక చెయ్యి చూతుము
పక్షివాహన యని కూతుము - మారు -
బలక కుంటె సిగ్గు దీతుము - మా ॥వేణు॥

1. ముడువము (B). 2. కని వీడగొట్టేము (B).

## 159. శంకరాభరణం - చాపు

మాటాడరా వేణుగోపాలా యింత -
మౌనమేమిర వేణుగోపాలా - యిది ॥పల్లవి॥

ఏటిమర్మము వేణుగోపాలా - యికమా -
కెవరు దిక్కు వేణుగోపాలా ॥అనుపల్లవి॥

మోము జూపర వేణుగోపాల - నీ సొ -
మ్మేమి బోదుర వేణుగోపాలా
యేమి జెప్పవు వేణుగోపాలా - ముం -
దేమి బుద్ధి వేణుగోపాలా ఒక్క ॥మాటాడరా॥

రక్షించరా వేణుగోపాలా - నన్ను -
పేక్ష సేయకు వేణుగోపాలా
కక్షి గట్టకు వేణుగోపాలా సుంత -
కరుణ జూడర వేణుగోపాలా ఒక్క ॥మాటాడరా॥

చేరదీయర వేణుగోపాలా - నన్ను -
చెట్టబట్టర వేణుగోపాలా
వేరుసేయకు వేణుగోపాలా - కా
ర్వేటి నగర వేణుగోపాలా ఒక్క ॥మాటాడరా॥



## 160. శంకరాభరణం - చాపు

[1] కొలచితే వేణుగోపాల దేవుని -
కొలువు కొలువవలెను ॥పల్లవి॥

తలచితే విష్ణు చారిత్రంబులు
తలచుచుండవలెను - ఓ జనులారా[2] ॥అనుపల్లవి॥

నిలిచితే శౌరిదాసుల సంగతి -
నిలిచి యుండవలెను
పిలిచితే చిన్నికృష్ణా రమ్మని -
పిలుచుచుండవలెను - ఓ*జనులార ॥కొలచితే॥

నడచితే వాసుదేవుని గుడి చుట్టు -
నడచు చుండవలెను
విడిచితే హరిభక్తి వర్జితుల -
విడిచి యుండవలెను - ఓ*జనులార ॥కొలచితే॥

చూచితే వనజాక్షుని దప్పక - చూచు చుండవలెను
కాచితే వైకుంఠుని సన్నిధి -
గాచి యుండవలెను - ఓ*జనులార ॥కొలచితే॥

పాడితే [3]జగన్నాథునిపై పదము - బాడు చుండవలెను
అడితే పురుషోత్తమునే కొని -
యాడు చుండవలెను - ఓ*జనులార ॥కొలచితే॥

వ్రాసితే నేమముతోటి రామకోటి - వ్రాయుచుండవలెను
చేసితే శ్రీమన్నారాయణ స్మరణ -
చేయు చుండవలెను - ఓ*జనులార ॥కొలచితే॥

---

1.కొలచితే వేణుగోపాలుని కొలువు - గొలుచుచుండవలెను (B).
2.పామరులార (B). *పామరులార (B).
3.జగన్నాథునిపయి పాట (B).

## 161. ఆనందభైరవి - త్రిపుట

నిన్ను దైవమనుచు యెట్లా నమ్ముదునయ్యా
యిన్నాళ్ళవలె యికను - మదిలో ॥పల్లవి॥

ఉన్న సంశయమెల్ల - విన్నవించెద నిపుడె
వెన్న ద్రుచ్చిలి దిన్న - వేణుగోపాలదేవ ॥అనుపల్లవి॥

చెల్లబో జమదగ్ని - చెప్పిన నెపమున
యెల్లభూతములు - తల్లడ మందగ
నుల్లము చెదర క - త్యుగ్ర కోపమున
తల్లిని ఖడ్గమున - తలద్రుంచితి వకటా ॥నిన్ను॥

వేదశాస్త్రముల ప్ర - వీణుడై యరుదెంచి
పేదవటుడై బలిని - ప్రార్థించి వేడగ
పాదత్రయం బుర్వి - పాత్రుడని యర్పించ (ప)
నాదట పాతాళ - మణగబెట్టితి వయ్యో ॥నిన్ను॥

యే లోకమున నైన - యిట్టి వింతలు గలవా
యీలాగు సుగ్రీవు - డితవు బల్కగానె
నీలావు దెలియుటకై - నిరపరాధియైన
వాలి నొక్కమ్మున - వసుధ గూల్చితి వహహా ॥నిన్ను॥



## 162. పంతువరాళి - చాపు

కరుణ నీకు నామీద గలుగుటకు -
కారణ మేమయ్యా ॥పల్లవి॥

పరమాత్మ వేణుగోపాల నీదు నామ -
స్మరణైన జేసితినా - యేవగనైన ॥అనుపల్లవి॥

అల కుచేలునివలె నటుకులు దెచ్చి మి -
మ్మారగించ మంటినా
చలవ గంధము కుబ్జ - వలె దేవర వక్ష -
స్థలమున నలదితినా
విలసితముగ యా - విదురుని వలె మీకు -
విందొనరించితినా
కులుకుచు నారదువలె పారిజాత -
కుసుమ - మర్పించితి నా - యేవగనైన ॥కరుణ॥

పరికించి చూడ శ - బరివలె మామిడి -
పండ్లు గైకొమ్మంటినా
దరిలేక రావణు - తమ్మునివలె మిమ్ము -
శరణు వేడు కొంటినా
కరిరాజువలె నీవే - గతియని పలుమారు -
మొరలు బెట్టు కొంటినా
పరుల బాధలకై ద్రౌ - పదివలె హా కృష్ణ -
పాహి పాహి యంటినా - యేవగనైనా ॥కరుణ॥

అతిబాలుడైనట్టి - యల్ల ధ్రువునివలె -
వెదకుచు తిరిగితినా
మతిమంతుడగు హను - మంతునివలె మిమ్ము -
సతతము గొలిచితినా
చెతురుడైన గుహుని - గతి నావ దాటించి -
చెయ్యెత్తి మ్రొక్కితినా
[1]పతిత పావనుడనుచు లోకములెల్ల -
ప్రఖ్యాతి జేసితినా - యేవగనైన ॥కరుణ॥

---

1.పతిత పావనుడైన - ప్రహ్లాదు వలె మిమ్ము
భక్తి గొలిచి యుంటినా - యేవగనైన (B).

## 163. గౌళిపంతు - చాపు

నీకే సమ్మతి గాని యిటువంటి నడతలు –
మా కెవ్వరికి సరిపోదయా ॥పల్లవి॥

తాకనాడితిరని – తప్పు లెంతురని వి
వేకానికి ముందు – వేణుగోపాల ॥అనుపల్లవి॥

అబ్జముఖులు పద – హారు వేలుండగ
కుబ్జను మరుకేళి – గూడితివీ ॥నీకే॥

మొలను పీతాంబరము – చెలువొందు చుండగ
అల గోపికల చీర – లందితివి ॥నీకే॥

పాలకడలి యందు – పవ్వళించి యుండి
బాలుడై యు – ట్లెగ బ్రాకితివి ॥నీకే॥

తేజోరాశియైన – దేవుడవై యుండి
రాజీగ నరుని సా – రథివైతివి ॥నీకే॥

వాటమైన పరమపదము – వదలి కా
ర్వేటి నగరమున – వెలసితివి ॥నీకే॥



## 164. పంతువరాళి - ఆది

నీవారి నడతలన్నియు – నేనే మెరుగనా ॥పల్లవి॥

భావజజనక వేణుగో– పాల నాతో [1]దాచితేనే ॥అనుపల్లవి॥

తల్లి నిన్ను రోలగట్టె – తండ్రి యావుల మేపబంపె
యిల్లాలు సడ్డసేయక – యిల్లిల్లు విహరించసాగె ॥నీవారి॥

అత్తగారు నరనాథుల – కందరికీ పొత్తులబాయె
ఉత్తముడౌ మీ యన్న నాగే – లెత్తుకొని తిరుగులాడె ॥నీవారి॥

కోడలందటి నోళ్ళ నిలచె – కొడుకు తలగొట్లమారాయె
నాడే నీ సోదరి యొక స – న్యాసి నంటుకొని జరిగె ॥నీవారి॥

కూతురు పారుబోతాయ – నీతి దప్పి నడిచేను మరిది
భూతేశుడైన మీ బావ – చేతగాక బిచ్చమెత్తె ॥నీవారి॥

హింసకు వెరువని కాల – కంసుడు మేనమామ నీ
సంసార మిటువంటిదయ్యో – స్వామి వేణుగోపాల ॥నీవారి॥

1. దాచెద వేల (B).

## 165. గౌళిపంతు - చాపు

పట్టవలెనయ్యా - గట్టిగ మనసు - పట్టవలెనయ్యా ॥పల్లవి॥

పట్టవలె వేణుగోపాలు పదములు -
కట్టవలెను వైకుంఠానికి మెట్లు
నెట్టవలెను సద్వృత్తితో దినములు -
మెట్టవలెను పుణ్యభూములు భక్తితో ॥పట్టవలె॥

సేయవలెను గంగాజలములో స్నానము -
త్రోయవలెను మదమోహమాత్సర్యము
వ్రాయవలెను హరికథలు గంటముబట్టి -
కాయవలెను భాగవతుల సముఖము ॥పట్టవలె॥

చూడవలెను సద్గతి దొరికే మార్గము -
పాడవలెను శౌరినామసంకీర్తన
కూడవలెను సాధుసజ్జనసంగతి -
నాడవలెను కృష్ణగోవింద యనుకుంట ॥పట్టవలె॥

చీరవలెను పలుమాఱు ముకుందుని -
చేరవలెను శ్రీపతి నభయ మిమ్మని
కోరవలెను యేవేళ మాధవుసేవ -
నేర్వవలెను వాసుదేవుని మంత్రము ॥పట్టవలె॥



## 166. భైరవి - ఆది

భక్తితో పిలిచి పెట్టిన యన్నము -
పట్టెడైన చాలు - చెవులకు ॥పల్లవి॥

రక్తిగా హితవైన పాట -
పల్లవి విన్నా చాలు కృష్ణా ॥అనుపల్లవి॥

భావము దెలిసిన నాయకురాలితో-
భాషించిన చాలు - తెలిసిన
కోవిదులకు కరుణ నిచ్చు దానము -
కొంచెమయిన చాలు కృష్ణా ॥భక్తితో॥

కులము వెలయ సత్కీర్తి వహించే -
కొడు కొక్కడె చాలు - ప్రజలను
అలమట బెట్టక ఆర్జించిన ధన-
మణు మాత్రమె చాలు కృష్ణా ॥భక్తితో॥

అచ్చుదలై తాత గట్టిన జాగా -
అడిగెడైన చాలు - యిది
గచ్చుగాదు సద్గురు వాక్యమలర -
గడియ విన్న జాలు కృష్ణా ॥భక్తితో॥

వచ్చినపుడె యాచకునికి వక తృణ -
మిచ్చెనంతె చాలు - సతులకు
హెచ్చు వలదు భర్త దైవమని వూ -
హించిరైన చాలు కృష్ణా ॥భక్తితో॥

దురితము లణగేటందుకు దామో -
దరుని భజన చాలు - మీదట
పరతత్వము దెలుపుటకు వేణుగో -
పాలుడె చాలు కృష్ణా ॥భక్తితో॥

## 167. గౌళిపంతు - ఆది

దాతను వాజులు[1]జెరిపే దబ్బిలి -
తల మీదనె సొద్దు - చెయ్యి ॥పల్లవి॥

ధాతువు [2] దెలియని వైద్యము -
జేసే - ధగిడీ కొక సొద్దు - గట్టిగ ॥అనుపల్లవి॥

పని లేకను పొరుగిండ్లకు తిరిగే -
పణతికి వక సొద్దు - చెప్పిన
మనవులు భూపతి కెరుగించని దు -
ర్మంత్రికి వక సొద్దు - గట్టిగ ॥దాతను॥

కలిగియుండి పొట్టకు దినజాలని -
కఠినుని కొక సొద్దు - తన
వెలదిని పరపురుషుల తార్చే మగ -
వెధవకు నొక సొద్దు - గట్టిగ ॥దాతను॥

లంచము దిని పనులు చక్కసేయని -
లండికి వక సొద్దు -మాట
మించనాడి చై వెలకల వేసే -
వంచకునికి సొద్దు - గట్టిగ ॥దాతను॥

తన పద్యము విని బహుమతి సేయని -
మనుజుని కొక సొద్దు - పెద్దల
గని దండము బెట్టక జుణిగే గణి-
కాంగన కొక సొద్దు - గట్టిగ ॥దాతను॥

మాపురే పనుచు నర్థుల ద్రిప్పే -
మడియకు వక సొద్దు- వేణు
గోపాలు భక్తుల దూషించే -
కొంటెల కొక సొద్దు - గట్టిగ ॥దాతను॥

1.వాదులు (B). వాజులు (A). 2.దెలియక (B).



## 168. పంతురవాళి - ఆది

హరినామ స్మరణే సేయకుంటే -
అవతల గతి యేమి - ఈ ॥పల్లవి॥

వెరవు దెలసి సత్సంగతి వదలక
వేణుగోపాలుడైన - శ్రీనర ॥అనుపల్లవి॥

అన్నదమ్ము లెడబాయక మునుపే -
[1]యాలు నిష్ఠురోక్తు లనక మునుపే
కన్న కొడుకు దండించక మునుపే -
కాయము వ్యాధుల చివుకక మునుపే ॥హరి॥

వృద్ధాప్యము ప్రాప్తించక మునుపే -
వుత్సాహము బలముడుగక మునుపే
నిర్ధనుడై దిగులు బడక మునుపే -
నేత్రాలు పొరగప్పక మునుపే ॥హరి॥

కఱ్ఱ నూనుకొని దిరుగక మునుపే -
కంఠధ్వని తగ్గిపోక మునుపే
అఱ్ఱు ముందరికి వంగక మునుపే -
అంగము తల వణుకెత్తక మునుపే ॥హరి॥

దవడలు లోనికి బోవక మునుపే -
దంత పటుత్వము తప్పక మునుపే
చెవులకు మందము దట్టక మునుపే -
[2]చెల్లబో నడవ జేరక మునుపే ॥హరి॥

అప్పుల కాపులు కదియక మునుపే -
అన్నమొకరు దినిపించక మునుపే
దొప్పలోన చై కడగక మునుపే -
దోవతి బరువై తోచక మునుపే ॥హరి॥

1. ఆలు నిష్ఠురము లాడక మునుపే (B).
2. చెల్లుబోయి (B).

## 169. పంతువరాళి - చాపు

ఇంత కంటే - చోద్యమిక వేరు యున్నదె -
యెంత ఆశ్చర్యమయ్యా - చూడ ॥పల్లవి॥

వింతలు నీ కథలు - విన విన వేడుకలు
కంతుని గన్న చ - క్కని వేణుగోపాల ॥అనుపల్లవి॥

భృగురాముడై యల - జగతి కశ్యప మునికి
తెగువ నర్పించిన - దేవుడవూ
మగటిమి చెడి బలిని - మధుర భాషణముల
వగ లేక ధర మూడ - డుగులు వేడినావంటె ॥ఇంత॥

అక్షయ వలువలు - అల్ల ద్రౌపతి కిచ్చి
రక్షించినట్టి శ్రీ - రమానాథుడా
కక్షి కట్టుక గోప - కామినుల మైలలు
నిక్షేపమ్ముగ బట్టి - వృక్ష మెక్కినావంటె ॥ఇంత॥

శంకాటంకము లేక - జలరాశి బంధించి
లంకేశు నణచిన రణధీరుడా
కంకపత్రము దొడిగి - కాలయవనుడు దరుమ
బింకేల బోయి కొండ - బిలము జొచ్చినావంటె ॥ఇంత॥



## 170. పంతువరాళి - త్రిపుట

కదలివచ్చెను జూడరే - వేణు
గోపాలుడు - కనుల పండుగగాను ॥పల్లవి॥
పదిలుడై గరుడుని - పై నెక్కి భక్తుల
ముదమంద జేయుచు - ఇదిగో రాజమార్గమున ॥అనుపల్లవి॥

సురలు నుతింపగను వేదము లవనీ - సురులు పఠింపగను
ధరణీశు లతిభక్తి - తను సేవింపగాను
సరసిజాక్షులు నాట్య - సరణి నభినయింపగాను ॥కదలి॥

పగలు వత్తులు వెలుగగా ఛత్రచామరములు -
బాణవిద్యలు మెరయగా
మృగమద తిలకము - మోము కళలూరగ
వగగా కీర్తనలు భాగ - వతులు పాడుచు రాగా ॥కదలి॥

భేరి దుందుభులు మ్రోయ వందిమాగధులు -
చేరి హెచ్చరికె సేయా
వారణ హయములు - వరుస గుంపులై డాయ
మీరి సంతోషమున - మింట చందురుడు గాయ ॥కదలి॥

## 171. పంతువరాళి - ఆది

మంచివా డనుచు కీర్తి వహించే -
మానవుడే ఘనుడు - ప్ర ॥పల్లవి॥

పంచ మంత కొనియాడగ నీ పద -
భజనచే వేణుగోపాల॥ ॥అనుపల్లవి॥

తన కులాచారము బో విడువక-
తల్లిదండ్రి మాట నిగ్రహించక
మనసు తప్పు త్రోవల చొరనీయక -
యనుదినంబు సత్సంగతి వదలక ॥మంచి॥

అప్పు తీసుకొని సొమ్మెగనాడక -
ఆప్తజనులతో నన్నృతము లాడక
తప్పు సాక్షి బలికి యాఖ్య జెందక -
ధర్మకార్యములు [1]విఘ్నము సేయక ॥మంచి॥

ఆస జెప్పి చై వెలికిల వేయక-
అన్యాయము చేసి తగవు దీర్చక
భూసురోత్తములతో వాదించక -
మోసగాండ్ల గూడి చెలిమి సేయక ॥మంచి॥

అర్థులతో కఠినోక్తులాడక -
యాడ బిడ్డలను యుసురనిపించక
వ్యర్థముగా ప్రొద్దులు పోగొట్టక -
వాలాయము సతిని తప్పులెంచక ॥మంచి॥

పరుల మేలు జూచి లోన గుందక -
బంధుకోటి మెచ్చని పని బూనక
ధరణీశ్వరు కరుణ నమ్మి పొంగక -
దాయాదుల క్రూరదృష్టి జూడక ॥మంచి॥

1. విఫలము (B).



## 172. భైరవి - త్రిపుట

నీ పాదపద్మముల నిలిపేనంటే మనసు -
నిమిషము నిలువదయ్యా ॥పల్లవి॥

పాపకృత్యములకే - పరుగిడుచున్నది
నాపాలి శ్రీ వేణు - గోపాల నిజముగ ॥అనుపల్లవి॥

నరహరి నీ నామ స్మర - ణంటె కనరాయె
పరమ భక్తుల చెలిమి - సరిపోదాయె
మురవైరి నీమూర్తి - దరిశింపనీదాయె
గరుడగమన నన్నే - గతి కడతేర్చేవో ॥నీ పాద॥

కామక్రోధములచే - గర్వమ ధనమాయె
తామస మింతైన - తరగదాయె
పామర మిప్పటికి - పట్టు వీడదాయె
సామజవరద యే - చందాన బ్రోచేవో ॥నీ పాద॥

వనజాక్షుల మీది - వాంఛ వదలదాయె
తనువు లస్థిరమని - దలచదాయె
జనన మెత్తిన మొదలు - మనుజుల సేవాయె
పనిబూని నన్ను నే - పగిది రక్షించేవో ॥నీ పాద॥

# 173.గౌళిపంతు - త్రిపుట

## (నిందా స్తుతి)

ఎంత పేదవాడే - వేణుగోపాలు - డెంత పేదవాడే ॥పల్లవి॥

అంత పేద గాకుంటె - అలనాడా కుచేలుని -
అటుకులకు చేసాచునా - ఓ జనులారా ॥అనుపల్లవి॥

పండ మంచమె యుంటె భావజ జనకు డీ -
పాముపై [1]నిద్రించునా
అండ వేరే యుంటె అచ్యుతుడా [2]దనుజుని -
ఆవని దానమడుగునా
వుండ నిల్లే వుంటే పుండరీకాక్షుడు
యుదధి వాసము జేసునా - ఓ జనులారా ॥ఎంత॥

కట్ట వస్త్రమె యుంటె కంసవైరి గో -
పాంగనల చీర లాశించునా
గొట్టు బడక యుంటె - [3]గోవిందు డీగతి -
గోవుల తాగాచునా
పొట్ట నిండితె శౌరి - పొరుగిండ్ల జొరబడి
పొంచి వెన్న మ్రుచ్చిలునా - ఓ జనులారా ॥ఎంత॥

పరిపాటి వాహన మీ - ప్రద్యుమ్నునికే వుంటె-
పక్షి నెక్కి తిరుగునా
దరి వేరే వుంటే శ్రీ - ధరు దనిశము నిజ -
దాసుల పంచ జేరునా
గురియైన సాయక మీ - మురవైరికే యుంటె
గరికె పోచ బట్టునా - ఓ జనులారా ॥ఎంత॥

1. బవళించునా (B).
2. బలిని (B).
3. గోవిందు డా నాడు (ఊరివారి) గోవుల దాగాచునా (B).



# 174. కాంభోజి - ఆది

పాపాత్ముని ధర్మాధికారిగా -
బంపే దొాక రోత - సతతము ॥పల్లవి॥

కోపము జేసే నరనాథు కొలువు
గొలిచే దొాక రోతా - ఛీ ఛీ ॥అనుపల్లవి॥

వలసిన భాగ్యము లుండి భుజించని -
వాని కలిమి రోత - ఇంట్లో
కులకాంతలు వుస్సురనగ వేశ్యల -
గూడే దొాక రోతా - ఛీ ఛీ ॥పాపాత్ముని॥

జారస్త్రీ గర్భంబున సుతుడై -
జనియించుట రోత - ధరలో
వారక యాచక వృత్తిని దిరిగే -
వాని బ్రతుకు రోత - ఛీ ఛీ ॥పాపాత్ముని॥

పుట్టి నింట ననవరతము భార్యను -
బెట్టే దొాక రోత - వగజెడి
పట్టెడు కూటికి చుట్టాల కడప -
మెట్టే దొాక దోత - ఛీ ఛీ ॥పాపాత్ముని॥

హీనుల పంచమహాత్ములు గాచుట -
యెంచ తగని రోత - తన
[1]మానిని వుద్దికి నన్య పురుషులను -
మాట్లాడుట రోత - ఛీ ఛీ ॥పాపాత్ముని॥

తాపసియై యరిషడ్వర్గంబుల -
దగిలే దొాక రోత - వేణు
గోపాలు పదములు నమ్మియు ముం-
గోపి యగుట రోత - ఛీ ఛీ ॥పాపాత్ముని॥

1. మానినితో నన్యపురుషులను - మాట్లాడించుట రోత (B).

## 175. సౌరాష్ట్ర - ఆది

హరి నారాయణ గోవిందాయని -
స్మరణ సేయవే వో మనసా ॥పల్లవి॥

పురుషోత్తమ దామోదర కేశవ -
భోగిశయన వేణుగోపాల ॥అనుపల్లవి॥

ధర్మమందు నిశ్చలమతి నుంచి -
దయయు శాంతి సత్యమనుసరించి
నిర్మల జ్ఞాన మాక్రమించి -
కర్మఫలము రామున కర్పించి ॥హరి॥

పరమ భాగవతుల సేవించి -
భక్తి మార్గమున ప్రవర్తించి
అరిషడ్వర్గము మొదలుగ ద్రుంచి -
[1]అంతటను విష్ణువని తలచి ॥హరి॥

ఇతర చింతలన్నియు తొలగించి -
ఇహ సుఖంబు తుచ్ఛమని త్యజించి
ధృతి వీడక శౌరిని ధ్యానించి -
దుష్ట నరుల సంగతి వదలించి ॥హరి॥

1. అంతా విష్ణుమయమని యెంచి (B).



## 176.ఆనందభైరవి - ఆది

ధర్మకార్యముల కడ్డము బలికే -
దబ్బిలి దొంక బ్రతుకా - శుద్ధ ॥పల్లవి॥

నిర్మలాత్మకుల మది నొప్పించే -
నీచుల దొంక బ్రతుకా- హరి హరి ॥అనుపల్లవి॥

మగనికి వంచన జేసి భుజించే -
మానిని దొంక బ్రతుకా - సభలో
తగవారిని లంచముగొని మొరిగే -
ధగిడీ దొంక బ్రతుకా - హరి హరి ॥ధర్మకార్య॥

తన సతి సంపాదన కాసించే -
మనుజుని దొంక బ్రతుకా - గురువుల
మనమున దలచుచు పూజింపని యు -
న్మత్తుల దొంక బ్రతుకా - హరి హరి ॥ధర్మకార్య॥

న్యాయరీతిగా ధనమార్జింపని -
నరపతి దొంక బ్రతుకా - కలిగీ
హాయిగ తా దిని యొకరికి బెట్టని -
యధముని దొంక బ్రతుకా - హరి హరి ॥ధర్మకార్య॥

తల్లిదండ్రుల బుద్ధుల విననొల్లని -
తనయుని దొంక బ్రతుకా - ఒక్కరి
బలిమి కలిమి జూడగ సైచని ని -
ర్భాగ్యుని దొంక బ్రతుకా - హరి హరి ॥ధర్మకార్య॥

తాపత్రయముల నంటించుకొనే -
తపసిది యొక బ్రతుకా - వేణు
గోపాలుని భక్తుల దూషించే -
కొంటెల దొంక బ్రతుకా - హరి హరి ॥ధర్మకార్య॥

## 177. కల్యాణి - ఆది

నిన్ను గొల్చి యొరుల వేడబోయితే - నీ కపకీర్తి గాదా ॥పల్లవి॥

పన్నగవైరివాహ వేణుగో -
పాలరాయ యాపన్న సహాయ ॥అనుపల్లవి॥

ఎంచితీ ఇష్టదైవమని భా - వించితీ ప్రణమిల్లి భక్తిగా
వించితీ త్వన్నామ మంత్రము జ - పించితీ పూజించితీ
పొంచితీ ప్రాపు దొరుకుట కనుస - రించితీ రక్షింతువనుచు నా
సించితీ దాసదాసు లనువర్తించితీ - మిగుల సంతసించితీ ॥నిన్ను॥

దేవరా మునుల కీప్సితార్థము - లివ్వరా యల ద్రౌపతి మానము
గావరా గజరాజును సత్కృప - బ్రోవరా లక్ష్మీవరా
సేవ రాజిల సేయగాను వర - మీవరా ధీవరా యనుచు సం
జీవరాయని బ్రహ్మగాను బహు - తీవరాన దేవరాజ వందిత॥నిన్ను॥

చేరితీ శుభము లిమ్మనుచు చల - పోరితీ భూపతుల బొగడి గో
జారితీ అజ్ఞానుడనై బహు - దూరితీ వేసారితీ
కోరితీ హరికథ వీనుల విన - మీరితీ దుష్టనరుల సంగతి
దారితీ మాయ దెలియుటకు మిము - జేరితీ భారతీశనుతపద ॥నిన్ను॥



## 178. గౌళిపంతు - చాపు

నన్ను నీ విక నెడబాయకా - నెర -
నమ్మితిరా జగన్నాయకా ॥పల్లవి॥

కన్నతండ్రి వేరుసేయకా - పాద -
కంజములను మరువనీయకా ॥అనుపల్లవి॥

నరుల సేవ సెయలేనయ్య - పద్మ - నాభ దండాలు బెట్టేనయ్యా
కరుణ ఇంచుక చూడవేమయ్యా - ఇంత -
కఠిన చిత్తము కారాదయ్యా ॥నన్ను॥

పాపాత్ముడని మదినెంచకా - చే - పట్టవయ్య నిరసించకా
మాపు రేపని జరిపించకా - నీ - మాయ వలలు తగిలించకా ॥నన్ను॥

వేణుగోపాల విన్నావుగా - కా - ర్వేటి నగరాన మున్నావుగా
ప్రాణి కోటికి దిక్కు నీవేగా - పావన బిరుదందినావుగా ॥నన్ను॥

# 179.ధన్యాసి - చాపు

నిన్ను నే విడవాను – నీ పేరు మరువాను –
నీ బంటు బంటైనానూ ॥పల్లవి॥

అన్న యెన్నటికి ప్ర– సన్నడ వౌదువో
వెన్న మ్రుచ్చిలి దిన్న – వేణుగోపాలా ॥అనుపల్లవి॥

నలుగురు బంధువులు దలచక యున్నను – నరనాథు డలగినాను
కులసతి మెండొడ్డు – కొని పలుక కున్నను
చెలికాండ్లు బుద్ధులు – చెరుప వచ్చినాను ॥నిన్ను॥

పాపాత్ముడనుచు కృ – పా రహితుడైనాను – భాషించ కుండినాను
కోపగించి లక్ష – కొదవ లెంచినాను
మాపు రేపనుచు యే – మరి యూరకున్నాను ॥నిన్ను॥

కామ క్రోధాదు లె – క్కడ వదలకున్నాను – స్వాములు దూరిననూ
లేమి వచ్చి యొకరు – లెక్క సేయకున్నాను
ప్రేమ మరచి సుతులు – యేమరి యున్నాను ॥నిన్ను॥



# 180. గౌళ పంతు - ఆది

భక్తిలేని పూజ లేమిటికి – పత్రి దొరకగానే
భక్తిలేని పూజ లేమిటికి ॥పల్లవి॥

భక్తి లేని పూజలేమిటికి – భాషించని మగడుండేమిటికి
రక్తిగ పాడని పద మేమిటికి – రహిని వేణుగోపాలుని పాద ॥అనుపల్లవి॥

జీతము ముట్టని కొలువేమిటికి –
చిలుక లేని పంజర మేమిటికి
దాతలు దొరకని యూరేమిటికి –
దైవము చేరని గుడి యేమిటికి ॥భక్తిలేని॥

ఆకలిగాని కూడేమిటికి –
అర్థము దెలియని చదువేమిటికి
మూకలు గూర్చని దొరయేమిటికి –
ముసలి రండలకు[1]సొగసేమిటికి ॥భక్తిలేని॥

మాట వినని తనయుండేమిటికి –
మదిరా నడువని సతి యేమిటికి
చోటు చాలని యిల్లేమిటికి –
సొద్దు బెట్టు చుట్టాలేమిటికి ॥భక్తిలేని॥

అక్కర కొదగని సఖుడేమిటికి –
ఆశలేని పుట్టిల్లేమిటికి
సొక్కి సోలని వలపేమిటికి –
సోమరి లంజల పొందేమిటికి ॥భక్తిలేని॥

[2]మూళి చెవికి బావిలి యేమిటికి –
ముక్కిడి తొత్తుకు నత్తేమిటికి
పేలతలకు కురువే రేమిటికి –
పిరికి బంటు కాయుధ మేమిటికి ॥భక్తిలేని॥

1. కులుకేమిటికి (B).
2. మూళి చెవులకు బవిరె లేమిటికి (B).

# 181. గౌళ పంతు - ఆది

పోరాని తావులకు పోరాదు – బుద్ధిమంతులైతే
 పోరాని తావులకు పోరాదు ॥పల్లవి॥

 పోరాని తావులకు పోతె – నీలాప నిందలు వచ్చు[1]
 వేరే యవమానము పనిలేదు – వేణుగోపాలుని సాక్షిగ ॥అనుపల్లవి॥

పగవా నింట కుడవరాదు – బలవంతుల కెడమియ్యరాదు
 మగువల యాలోచనలు వినరాదు – మానఘనుల పోనాడగరాదు ॥పోరాని॥

అప్పులు మెండుగ సేయరాదు – ఆవల పండ్లిగిలించగరాదు
 [2]మెప్పులు వకరికి దోపరాదు – మెచ్చని నడతలు నడవరాదు ॥పోరాని॥

[3]చేతగాని పని పట్టరాదు – చేసినమేలు [4]చెప్పరాదు
 ఘాతకాని కొడిగట్టరాదు – కాయము సతమని నమ్మరాదు ॥పోరాని॥

కలిమి గలిగెనని త్రుళ్ళరాదు – గాసి వచ్చెనని వగవరాదు
 వలవని వాదుకు బిలువరాదు – వంచనగా వడ్డించరాదు ॥పోరాని॥

పేదల కాస జెప్పరాదు– పెద్దల మది నొప్పించరాదు
 బీదల హాస్యము సలుపరాదు – బిచ్చానికి అడ్డము పోరాదు ॥పోరాని॥

---

1. రారాని నిందలు వచ్చు (B).
2. మెప్పులు నెవరికి జెప్పగరాదు (B).
3. చేతగాని పని సేయగరాదు (B).
4. దెప్పరాదు (B).



# 182. ధన్యాసి - చాపు

మనసా చపలము మానవా – యీ ॥పల్లవి॥

 తనువు నిత్యము గా – దని యెంత చెప్పిన ॥అనుపల్లవి॥

[1]చయ్యన సుకృతము – సంగ్రహించలేక
 అయ్యయ్యో మితిమీరి – పొయ్యేవారిని జూచి ॥మనసా॥

మూడుదినంబుల – ముచ్చటకై అనృత
 మాడ వలదనుచు – వేడుకొన్నగాని ॥మనసా॥

పరకాంతలపొందు – నరకహేతువని
 పరిపరి విధముల – మొరలు బెట్టిన గాని ॥మనసా॥

ధర్మచింత [2] విడిచి – దయాదాక్షిణ్యము లేక
 దుర్మార్గ వృత్తి నీ – దుట కొరగా దంటే ॥మనసా॥

 పనిబూని వేణుగో – పాలదేవుని పాద
 వనజములకు నిన్ను – పెనవేయకగాని ॥మనసా॥

---

1.వెయ్యెయ్యి సుకృతములు (B).
2.మరచి (B).

## 183. గౌళిపంతు - ఆది

అన్నిటికిది సులభమార్గము సుమీ
హరినామ స్మరణా ॥పల్లవి॥

పన్నగశయనుడైన వేణు -
గోపాలుని సన్నిధి జేరేటందుకు ॥అనుపల్లవి॥

చన్నీళ్ళలో మునుగుట కంటె -
చలిలో జపము జేసుటకంటె
మిన్ను జూచి ధ్యానించుట కంటె -
మిగుల జన్నములు సలుపుట కంటె ॥అన్నిటి॥

వేదశాస్త్రములు చదువుట కంటె అతి -
వీరుడై యవని ద్రెళ్ళుట కంటె
భేదవాదముల పోరలుట కంటె -
పెక్కు వ్రతమ్ముల స్రుక్కుట కంటె ॥అన్నిటి॥

దివ్యదేశముల దిరుగుట కంటె -
తీర్థయాత్రలు పోవుట కంటె
ద్రవ్యదానము లిచ్చుట కంటె -
తాపసియై గుహలు జేరుట కంటె ॥అన్నిటి॥



## 184. మధ్యమావతి - ఆది

భక్తి లేని వ్రతము లెన్నిజేసిన
ఫలము లేదు సుమ్మీ వి ॥పల్లవి॥

రక్తులమని వేసాలు ధరించుచు
రహిని వేణుగోపాలుని పాద ॥అనుపల్లవి॥

జడలు వెనక జీరాడిన నేమి -
జాహ్నవి లోపల మునిగిన నేమి
కడుపు గట్టి నటియించిన నేమి -
కాళ్ళ పాదుకలు మెట్టిన నేమి ॥భక్తి॥

కావివస్త్రములు గట్టిన నేమి -
కండ్లు మూసుకొని గొణిగిన నేమి
లావుగ తిరుమణి మెత్తిన నేమి-
లక్షతులసి నర్పించిన నేమి ॥భక్తి॥

మేని నిండ భస్మ మలదిన నేమి -
మెడ రుద్రాక్షలు వూగిన నేమి
నానా భూముల తిరిగిన నేమి -
నదులు నిధుల గనుగొంటే నేమి ॥భక్తి॥

# 185. అసావేరి - త్రిపుట

నీ దివ్యమంగళ మూర్తి ధ్యానము భక్తి -
నిత్యముగ కృప సేయవే ॥పల్లవి॥

వేదోద్ధారకుడైన - వేణుగోపాల - నీ
పాద ద్వంద్వము నా హృ-త్పద్మ మందున జేర్చి ॥అనుపల్లవి॥

పుట్టినది మొదలుగ భూ - పాలకుల గొలిచి
పట్టెడన్నానికై - పరుగులెత్తి
పొట్టనించుక మతిలో - పొంగుచుంటిని గానీ -
పట్టుగ నొకనాడు - ప్రద్యుమ్న యననైతి ॥నీ దివ్య॥

నరక హేతువులైన - దురిత కృత్యములకు
మరిగి కండ్ల - కావరమునను
పరకాంతల మోము - లరసి భ్రమసితిగాని -
పురుషోత్తమ నీపై - బుద్ధి నిలుపనైతి ॥నీ దివ్య॥

పరమ భాగవతుల - ప్రల్లదములు బల్కి -
గురువుల నిందించి - కుటిలుడనై
అరయక తలిదండ్రు - లాజ్ఞ మీరితి గాని -
స్థిర చిత్తమున హరిని - స్మరణ సేయనైతి ॥నీ దివ్య॥

అపకారములకు నే - నగ్రగణ్యుడనై -
యుపకృతి మాటంటె - నుగ్రుడనగుచు
అపకీర్తులకు నే - నర్హుడైతిగానీ -
కపటవామన నీదు - కథ చెవుల విననైతి ॥నీ దివ్య॥

యతుల దూషణ జేసి - యెదటి మేలోర్వక -
కృతులు మానవుల - కర్పితము జేసి
గతవాసరము లీ - గతి దాటించితి గానీ -
పతిత పావన స - ద్గతి జూపు మననైతి ॥నీ దివ్య॥



# 186. గౌళిపంతు - ఆది

ఇట్టి పనులు సేతురా యెట్టివారైన - యేమి యెరుగ ॥పల్లవి॥

నట్టు లున్నావు కార్వేటి - నగర వేణుగోపాలా ॥అనుపల్లవి॥

అచ్యుతుడనుచు చాలా - హర్షించితి గాని వెన్న
ముచ్చిలించే దెరిగితే నే నీ - మోము జూతునా ॥ఇట్టి॥

నారాయణుడనుచు నిన్ను - సారెకు వేడితిగాని
చీరలు దోచిం దెరిగితే - చేర నిత్తునా ॥ఇట్టి॥

భావజజనకుడంచు - ప్రణమిల్లితిగాని - పూరి
యావుల మేపిం దెరిగితే - సేవ జేతునా ॥ఇట్టి॥

వారిజనాభుం డనుచు - వర మిమ్మంటిగాని - నరుని
సారథివైన దెరిగితే - సద్ద సేతునా ॥ఇట్టి॥

పీతాంబరధరుడనుచు - పిలిచితిగాని - పాండవ
దూత వని దెలిసితే యిల్లు - దూరనిత్తునా ॥ఇట్టి॥

# 187. గౌళిపంతు - ఏక

హరిదాసులను పాపా - లంటవు సుమీ - మదిలో నర ॥పల్లవి॥

కొర లెందు కిక వేణు -గోపాలుడైన నర ॥అనుపల్లవి॥

ఏదో పొమ్మని నవ్వి - యెగతాళి జేసేది
గాదు బూడిదలోన - గచ్చుకాయ పగిది ॥హరి॥

పరికించి చూడ న - బ్బురమా బురద మట్టి
దిరుగుచు నుండు కు- మ్మర పురుగు చందాన ॥హరి॥

తజిబిజి సేయక - దైవము సాక్షిగ
నిజము తామర పాకు - నీటముంచి యెత్తినట్లు ॥హరి॥

వింతగ జూచేవు - యింతే దీని కీలు
చింత బుట్టలో పండు - చేరి వొదిగినట్లు ॥హరి॥

అంతరంగమున నీ - కనుమాన మేల వ
నాంతరమున నుండే - తంతుకీటము భంగి ॥హరి॥



# 188. యదుకుల కాంభోజి - ఆది

జలజాక్షుని చింతించని మానవ - జన్మము వ్యర్థము ॥పల్లవి॥

విలసిల్లు కార్వేటి నగర - వేణుగోపాల కృష్ణా యని ॥అనుపల్లవి॥

ఉపకారము దలచని కఠినాత్ముడు - వుండి వ్యర్థము - మదిలో
చపలము విడువక వ్రతములు తపములు -
జేసుట వ్యర్థము నిజముగ ॥జలజా॥

తలిదండ్రుల పోషించని కొడుకులు - గలిగీ వ్యర్థము - రిక్తుడు
బలవంతుల నెదిరించి ప్రతిజ్ఞలు -
బలుకుట వ్యర్థము నిజముగ ॥జలజా॥

సమరభూమి జొరని పిరికిబంటు -
సాధన వ్యర్థము - దశ విధ
గమకములతో వాయించని వీణా - గానము వ్యర్థము నిజముగ ॥జలజా॥

సరసులు విని శాబాసని మెచ్చని - చదువు వ్యర్థము - షండుడు
వరుడై రతిసుఖ మెరుగని సతి యౌ - వనము వ్యర్థము నిజముగ॥జలజా॥

దానధర్మము సేయక దాచే - ధనము వ్యర్థము యేండ్లు
శానా చెల్లిన వృద్ధుకు పెండ్లి - జేసుట వ్యర్థము నిజముగ ॥జలజా॥

## 189. ధన్యాసి - చాపు

హరితానే వున్నాడన్నిటికీ – యే ॥పల్లవి॥

వెరవు లేదిక మాకు– వేణుగోపాలుడౌ ॥అనుపల్లవి॥

వేడుచు కుజనుల – వెంట దిరిగితే నేమి
నాడు వ్రాసిన వాడు – నేడు వేరే వ్రాసునా – నర ॥హరి॥

పట్టెడన్నానికై – పరితాప మెందుకు
పుట్టించినవాడు – పూరి మేపునా – నర ॥హరి॥

అదయు లొక్కరి శ్రమ – ఆర్చేర తీర్చేర
మొదట బుట్టిన చావ – తుదనెందు గల్గు – నర ॥హరి॥

ఒదిగినంతే చాలు – నొక లక్ష తృణమైన
పదిలముగ ధ్రువరాజ్య – పట్టమేలగ వలెనా ॥హరి॥

జంట బాయక ప్రభువు – నంటి తిరిగిన రాదు
కొంటే రాని సొమ్ము కొసరితే వచ్చునా – నర ॥హరి॥



## 190. ధన్యాసి - ఆది

అద్దెకొంప వంటిది యీ దేహ – మనిత్యమే మనసా ॥పల్లవి॥

మిద్దె మీది పరుగులు రెణ్ణాళ్ళు సు – మీ వేణుగోపాలుని సాక్షిగ ॥అనుపల్లవి॥

బందెగొడ్ల వంటిది సంసారము – భ్రమయకే మనసా
[1]యెవరున్న నడమంత్రమె జీవుని –
కెవరు లేరు మనసా – ముమ్మాటికి ॥అద్దె॥

పువ్వువంటిది యౌవన మనగా – పొంగకే మనసా
నవ్వుగాదు సిరులు మెరుపు వంటివి–
నమ్మకే మనసా – ముమ్మాటికి ॥అద్దె॥

పతితపావనుని పదపంకజములు – పట్టవే మనసా
మదిని వేణుగోపాలుని మంత్రము –
మరువకే మనసా – ముమ్మాటికి ॥అద్దె॥

1. యెందరున్న (B).

## 191. పంతువరాళి - ఆది

గుత్త లంజలను మరిగిన వారికి – దుత్తే కడపటను – వరాల ॥పల్లవి॥

తిత్తి వుత్తదైన వెనక బోతే – బెత్తమె వేణుగోపాల ॥అనుపల్లవి॥

కావలసిందిచ్చే దినముల –
కాళ్ళు రెండు కనుల నొత్తుకొందురు
యీవులుడిగి యిలు దూరితె గౌరీ –
దేవి వాయనము దడువు కొందరు ॥గుత్త॥

బేరసారము లుడిగి బికారై –
బిక్కి కాయదిన్న కోతివలె బోయి
కారు బారు సేయవచ్చెనా శృం[1] –
గారకట్ట దెమ్మని దిగ తీతురు ॥గుత్త॥

[2]కడకు బోయిన మూడు దినములైనా –
యదముగా పవళించక గూడి
విడువలేక వొదిగళ్ళ [3]బడితె –
మెడకు అర్ధచంద్రుని నియమింతురు ॥గుత్త॥

1. తారుమారు మాటలాడితే శృం (B).
2. కడకు బోయిన మూడు దినాలు – ఎడముగా బవళించుచుందురు (B).
3. బారితె (B).



## 192. పంతువరాళి - చాపు

కడుపా నీ వింత ఘనమైతివా యే – ॥పల్లవి॥

కడ గురుత లేదాయె – కలికాల మునందు[1] ॥అనుపల్లవి॥

పాతకాలు జేసేది – ప్రజల బాధించేది
నీతి యేట కలిపేది – నిష్ఠ మానేది
జాతకాలు వ్రాసేది – జలధిలో మునిగేది
కోతి నాడించేది నీ – కొరకే గదవే ॥కడుపా॥

పేటలు గట్టేది – బేరము లాడేది
మూటలు మోసేది – మ్రుచ్చిలించేది
పాటలు పాడేది – పయిరు పచ్చ జేసేది
కోటివిద్యలు నీ – కొరకే గదవే ॥కడుపా॥

[2]ఎలికి బొక్కలు ద్రవ్వి – యెన్ను వ్రెళ్ళ దీసేది
శిలలు భేదించేది – శివమాడేది
పులుల బట్టుకొని – పు[3]రములు దిరిగేది
కొలువు కొలిచేది నీ – కొరకే గదవే ॥కడుపా॥

యే వేళ ధనికుల యిండ్ల చుట్టు దిరిగేది
నావ దాటించేది – నవ్వించేది
తావు విడిచి దేశాం – తరమున నుండేది
గోవుల గాచేది నీ – కొరకే గదవే ॥కడుపా॥

ధారుణి యేలేది – దండు దాళ్లు దిరిగేది
[4]వారిజాక్షుల విటుల – వలపించేది
భారకుడౌ వేణుగో – పాలుని దూరేది
[5]కోరి ముష్టెత్తేది నీ – కొరకే గదవే ॥కడుపా॥

1. పొద్దు (B).
2. ఎలుక బొక్కలు త్రవ్వి – యిలు వెళ్ళదీసేది (B).
3. పుర మెల్ల (B).
4. వారకాంతలు విటుల – వలపించేది (B).
5. ఘోర ముష్టెత్తేది (B).

# 193. గౌళిపంతు - ఆది

పాపాత్ముల కెక్కడ దీ కాలము - పారమార్థికము - వేణు ॥పల్లవి॥

గోపాలా[1]దోవగాచి దొంగలు - గొట్టరా సన్యాసుల నైన ॥అనుపల్లవి॥

కులకాంతల వ్రతము భంగము జేతురు -
బలిపీఠము గొట్టేమని లేతురు
పిలువనంపి నెత్తిన పదివేతురు -
పులిదాసళ్లకు బెట్టిన కతగా ॥పాపాత్ము॥

శంకించక పనులు వరగ దోతురు -
శంబర మాయలు కల్పన జేతురు
జంకక లంచానికి చెయి సాతురు -
రంకు మొగుడు కడుపు నొప్పి జూచునా ॥పాపాత్ము॥

పెద్దల సొమ్మపహరింప జూతురు -
సద్దులేక యడిగితె తలయూతురు
రద్ది జేసి రచ్చలోకి దీతురు -
యెద్దు పుండు కాకికి ముద్దౌనా ॥పాపాత్ము॥

తప్పు లేని దండగ దెమ్మందురు -
తమ ప్రజ్ఞలు తామె పొగడుకొందురు
అప్పటముగా సొంట్లు వెతకు చుందురు -
కుప్పలు కాలిచి పేలాలు తినే ॥పాపాత్ము॥

ఇరుగు పొరుగు వారిని వేధింతురు -
యెగరవేసి మాట్లాడి జయింతురు
వురగమువలెనే పగ సాధింతురు -
గురువుకు పంగనామము బెట్టే ॥పాపాత్ము॥



పోటీ జేసి యొకరి కూడు దీతురు -
పొంచులుండి విని జాబులు వ్రాతురు
పీట మీద పెండ్లి నొరగ దోతురు -
మోటుగాలి ఎండైనా వెరచునా ॥పాపాత్ము॥

కన్నతల్లి యనుచు జేరవత్తురు -
కల్లపసిడి జూపి మోసబుత్తురు
చిన్న చిన్న పనులకు లో జొత్తురు
తిన్న ఇంటికే రెండు దలంచే ॥పాపాత్ముల॥

మగనికి పెండ్లానికి  పగజేతురు -
తగులు కొంటిరని కేకలు వేతురు
తగవు దీర్చుకొమ్మని వెలిదోతురు-
యిగురు బొడిచి నెత్తురు ద్రావేటి ॥పాపాత్ముల॥

వండి వండి తోడితే కబళింతురు -
వచ్చి వచ్చి వాసాలే యెంతురు
పుండువలెనే ప్రజలను బాధింతురు -
యెండిన నోటికి నీళ్ళు లేవనే ॥పాపాత్ముల॥

పిలువని విందుకు బిరబిర లేతురు -
బిచ్చగాండ్ల తరిమి తలుపు మూతురు
చలువ పాగా జుట్టి చికిలి జేతురు -
చలిపందిరి కుండ బగుల గొట్టే ॥పాపాత్ముల॥

కుటిలభావ మొక నాటికి మానరు -
కుంభీపాకమున బడుట గానరు
యెటు జూచిన సత్క్రియలకు బూనరు -
యిటు రమ్మంటే యిల్లు జేకొనే ॥పాపాత్ముల॥

వాసి దెలిసి విహితము నడిపించరు –
డాసి వేడుకొన్నా మన్నించరు
చేసిన మేలొక్కటి మది నెంచరు –
కోసిన వేలికి సున్నము బెట్టని ॥పాపాత్ముల॥

ఒట్టు బెట్టుకొని మోసము జేతురు –
వంచనచే కొంప ముంప జూతురు
జుట్టు చేత చిక్కెననుచు యేతురు
నట్టేటికి దీసి పుట్టిముంచే ॥పాపాత్ముల॥

చిట్టెలు గట్టుక యోచన సేతురు –
పట్టిన పని సాధింపనె జూతురు
గుట్టు బైట వేసి సిగ్గుదీతురు –
చెట్టు కెక్కమని నిచ్చెన దీసే ॥పాపాత్ముల॥

సుడుగాడికి పన్ను దీసుకొందురు –
గుడి మేర మిరాశి నిలుపమందురు
తడయక బ్రాహ్మణుల బోరుచుందురు–
తడిబట్టలతో గొంతులు గోసే ॥పాపాత్ముల॥

రట్టు బడితిమని మదిలోదట్టదు –
రవలేశము దాక్షిణ్యము బుట్టదు
చుట్టు పట్టు నౌకరి మేలు గిట్టదు –
పుట్టినబుద్ధులు పుడకలతో సరి ॥పాపాత్ముల॥

1. దోవగాచి (B).



## 194. సౌరాష్ట్ర - చాపు

అక్షయపాత్రకు పోతే కదలని వొక –
భిక్ష వేయ రయ్యా!– మూల ॥పల్లవి॥

నిక్షేపము త్రవ్వి – నెత్తిన బెట్టెదరా
కుక్షింభరులు వేణు – గోపాల నా స్వామి ॥అనుపల్లవి॥

తెచ్చుకోవలెనని కొందరు రాలే – తేబోయినా రంట కొందరు – ఒట్టి
గచ్చులకైనాను – కడకు బోయినానని
ముచ్చు వలెనె తలుపు – మూలకు వొదిగేరు ॥అక్షయ॥

లేవ పాలుమాలి కొందరు లోన – దేవర వుందని కొందరు – నడవ
దోవ కడ్డమె వచ్చి – వట్టి – దోసిళ్ళు ముడుచుక
నీ వొల్లోని గింజ – లేవి సూపనేరు ॥అక్షయ॥

తెల్లవార లేదని కొందరు ఇది మా –
ఇల్లు గాదను వారు కొందరు – అయ్య
మళ్ళి రమ్మని తడికె – మరుగు బెట్టుకొని,
గిల్లి విదళించరు – గీపెట్టిన గాని ॥అక్షయ॥

నిండుకొన్నదని కొందరు అరువు –
నీ యబ్బ తోడని కొందరు – తైంద
పిండిసరాలె శిత్త – యండలో నిలబడి
వుండొద్దు మా యేపి – వుదురు మిడుకనేరు ॥అక్షయ॥

వాసొద్దు వద్దని కొందరు –సూతాం–
తీసుక పోయేదని కొందరు
దాసరోల్ల వలస – తరమా కాపిరం సేయ
యిసుల్ల పుట్టేన్నో – యిరబడిందనె రహహా ॥అక్షయ॥

చెయ్యి తీరదని కొందరు - నేడు-
వెయ్యనే రాదని కొందరు - బిగ్గె
కుయ్యి వద్దు నోరు - ముయ్యనుచు రాగ
గయ్యాళి బైటికి - గదిమి పొమ్మనె కృష్ణా ॥అక్షయ॥

పెద్దలు లేరని కొందరు - నేడు -
తద్దిన మనేవారు కొందరు - నిలువు
టద్దములో కొప్పు - దిద్ది చూడనె గాని
కద్దు లేదనరు యీ - కలికాల మహిమేమో ॥అక్షయ॥

మించింది వేళని కొందరు - వద్దు -
మీకు బెత్రాదని కొందరు - అపుడే
సంచి నిండవచ్చె - సైరా సైయని అనుమా
నించి రేపు రమ్మనే - వింత యిది యేమో ॥అక్షయ॥

పూజవేళ యని కొందరు - యేమి -
పూడ్చి పెట్టావని కొందరు - సరిగా
గాజడాళ్లు బిచ్చ - గాల్లకీ యితమాయ
గోజారకేశింది - కొంపొమ్మనే రకటా ॥అక్షయ॥

ఈ ప్రొద్దు పొమ్మని కొందరు - కాని
ఇంకోనాడైనాని కొందరు - ఇట్టి
పాపాత్ముల యముడు - పట్టి కట్టక మునుపే
కాపాడే దేలాగో - గోపాల నా స్వామి ॥అక్షయ॥



## 195. శంకరాభరణం - ఆది

ఉంఛవృత్తితో బ్రతికేవారికి - వుగ్రము కారాదు ॥పల్లవి॥

పంచసాయకు గన్న వేణుగో -
పాలదేవ యెందున వగలేక ॥అనుపల్లవి॥

అమ్మా! అక్కా!అయ్యా! యనవలె -
పొమ్మంటే తల వంచుక పోవలె
రొమ్మున తంబుర మీటుచు బాడుచు -
రోస పడక ఇల్లిల్లు దిరుగవలె ॥ఉంఛ॥

ప్రొద్దెక్కక మునుపే రారాదు -
పొంచులు విని బైట చెప్పరాదు
హద్దు మీరి లోనికి పోరాదు -
ఆడంగుల జూచి నవ్వరాదు ॥ఉంఛ॥

వెంట వొకని బిలుచుక రారాదు -
వేయకుంటె హఠము సేయరాదు
కొంటెలతో వాదుకు పోరాదు -
కోరని కోరికలు కోరగరాదు ॥ఉంఛ॥

కొంచమనుచు గోజారరాదు -
కొట్లాడే చోట నిలువరాదు
సంచి జూచుకొని యెదబడరాదు -
చాలదనుచు తిరుగ రారాదు ॥ఉంఛ॥

చెయ్యిదుడుకు సాహసము కారాదు -
చేత తలుపు తట్టి పిలువరాదు
బియ్యమమ్మేది తెలియరాదు-
భీష్మీకరించుక పోరాదు ॥ఉంఛ॥

ఇచ్చి పెట్టినది దొరికిందనవలె -
ఇప్పటి కిది పదిలక్ష లనవలె
తెచ్చినందులో ముష్టి వేయవలె -
దేవుడే రక్షకు డనుకోవలె ॥ఉంఛ॥

# 196. భైరవి - ఝంపె

శ్రీ రమా రమణీ మనోహర – చిర కృపాన్వయ భాషణా
నారదాది మునీంద్ర వందిత – నవ్యమణిగణ భూషణా
శారదాభ్ర శరీర దానవ – జన మదాంబుధి శోషణా
భారతాన్వయపాల వేణుగో –పాల దీనజనావనా ॥శ్రీ రమా॥

కాంత నిన్నెడబాసి దినమొక – కల్పముగ భావించురా
చింతచే పవళించురా పై – చెక్కిటను గీలించురా
కంతుబారి చెలించురా నిను – కౌగిలించగ నెంచురా
పంత మేలర రార వేణుగో – పాల దీనజనావనా ॥శ్రీ రమా॥

వెలది గంధము విరులటన్నను – వెగటుగా తిలకించురా
కలికి చిలుకల పలుకులకు మది – దలకి యులికి భ్రమించురా
పలుకరించిన చెలులతో ప్రతి – భాషలుడిగి తపించురా
పలుకరా చలమేల వేణుగో– పాల దీనజనావనా ॥శ్రీ రమా॥

చిన్నపాయమునాడు చేసిన – చెలిమి దలచక యుందురా
కన్నె బంపిన పూలబంతులు – కానుకలు వలదందురా
విన్నపము వినవైతి విక మా – వెలదితో నేమందురా
పన్నగాధిపశయన వేణుగో – పాల దీనజనావనా ॥శ్రీ రమా॥

పక్కజేర్చుక నాడొసంగిన – బాసలవి యేమాయెరా
నిక్కముగ పరికించి చూచిన – నీది రావణ మాయరా
యెక్కువైన విలాసవతిపై – యేల యిటు కనరాయెరా
పక్కిజక్కిని నెక్కు వేణుగో– పాల దీనజనావనా ॥శ్రీ రమా॥

రాక యిటుల పరాకుజేసి ని – రాకరించుట న్యాయమా
యీ కరణి సాధింపగా నీ – కేమయిన నాదాయమా
మా కలికి నీ పొందు సేయక – మాని యుండే పాయమా
పాకశాసన వినుత వేణుగో – పాల దీనజనావనా ॥శ్రీ రమా॥

సాటి బోటులలోన మాటికి – చౌక జేసితె దూరమా
మాటిమాటికి మ్రొక్కి వేడితె – మరిమరీ గంభీరమా
ఆటపాటల మేటియగు మా – బోటి యిలు బహు దూరమా
పాటలాధరి నెనయ వేణుగో – పాల దీనజనావనా ॥శ్రీ రమా॥

ఎన్నడైనను నీదు కూటమి – నెనయుటకు మై దాచెనా
నిన్న మొన్నటి చెలుల నేస్తము – నీకు హితమై తోచెనా
అన్నిటిను నెరజాణ వన తగి – నందుకా యీ యోచనా
వన్నె మీరగ రార వేణుగో– పాల దీనజనావనా ॥శ్రీ రమా॥



# 197. కేదారగౌళ - ఝంపె

హెచ్చరికె బహు పరా – కిందిరారమణా ॥పల్లవి॥

హెచ్చరికె జతనంపు – హేమాబ్జచరణా
పచ్చవిల్తుని గన్న – భవపాశ హరణా ॥అనుపల్లవి॥

పొలుపొంద తిరువీసము – పొందుగ భుజించి
తిలకించి మణుల వే – దికను వసియించి
కలపంబు మైనిండ – కలయ నలరించి
విలసిల్లు కర్పూర – వీడెము గ్రహించి ॥హెచ్చరికె॥

బంగారుచాయ దు – ప్పటి చుంగు జీరా
శృంగారమగు మోము – చెలువు కళలూరా
రంగలరు విడిది కతి – రాజసము మీరా
పొంగుచును వచ్చేవు – భువనైక వీరా ॥హెచ్చరికె॥

మగువ లిరుగడల చా – మరలు వీవగనూ
సొగసుగా వేరొకతె – సురటి వేయగనూ
గగనమున నుండి సుర – గణము పొగడగనూ
వగలు గులుకుచును దే – వముని బాడగనూ ॥హెచ్చరికె॥

మొలక లేనగవు వె – న్నెలల నిరసింపా
చెలరేగి యప్సరలు – చేరి నటియింపా
తులలేని వైభవము – తో సందడింపా
వలచి త్రిదశులు విరుల – వాన గురియింపా ॥హెచ్చరికె॥

వాణీశు కరుణించి – వర మొసగినావు
ప్రాణికోటుల నెల్ల – బ్రబల జేశావు
నాణెమున కార్వేటి – నగరమున నీవు
వేణుగోపాలుడై – వెలసియున్నావు ॥హెచ్చరికె॥

# 198. సావేరి - రూప

శ్రీలలనామణిరమణా - శ్రితపోషణసుగుణా
శీలాఖిలమయ వేణుగో- పాల హెచ్చరికె ॥శ్రీలలనా॥

మురళీరవలోలా సుం - దరలలితకపోలా
పరమాత్మా శ్రీవేణుగో - పాలా హెచ్చరికె ॥శ్రీలలనా॥

దివిజార్చితచరణా సమ - ధిక దివ్యాభరణా
భవపాశహరణా వేణుగో- పాలా హెచ్చరికె ॥శ్రీలలనా॥

నవకాంచనచేలా దా - నవగర్వవిపాలా
భవసన్నుత శ్రీవేణుగో - పాలా హెచ్చరికె ॥శ్రీలలనా॥

కరుణారసభవనా! ముర -హర! శూర త్రిభువనా
పరిపాలన శ్రీవేణుగో - పాలా హెచ్చరికె ॥శ్రీలలనా॥

వ్యాళాధిపశయనా స్ఫుట - వారిజదళనయనా
బాలేందువదనా వేణుగో- పాలా హెచ్చరికె ॥శ్రీలలనా॥

దోషాభ్రసమీరా హిత - భాషాచలధీరా
భాషాధిపనుత వేణు - గోపాలా హెచ్చరికె ॥శ్రీలలనా॥

హరినీలనిభాంగా వి - హంగరాజతురంగా
పరమోత్సవ శ్రీవేణుగో - పాలా హెచ్చరికె ॥శ్రీలలనా॥

సొగసౌ శ్రీకార్వేటి - నగరమున వెలసిన
భగవంతుడవగు వేణుగో - పాలా హెచ్చరికె ॥శ్రీలలనా॥



# 199. నవరోజు - దివ్యజాతి లఘువు

లాలనుచు వూచేరు - లలన లింపునను
శ్రీల చెన్నలరు ను - య్యాల పొన్పునను
గోల రుక్మిణిదేవి - కోరి సొంపునను
బాళితో వచ్చె నీ - పై తలంపుననూ ॥లాలెనుచు॥

జోల పాడెద మనుచు - జోడు గూడుకొని
బాలికలు తమలోన - పంత మాడుకొని
మేలిమిగ నిన్ను యే - వేళ పొగడుకొని
తాలిమితొ వచ్చేరు - దయను వేడుకొని ॥లాలెనుచు॥

కరమునను రత్నాల - కంకణము మ్రోవా
హరిణాక్షి మరువంపు - సురటి గొని వీవా
మరి ప్రొద్దు బోయె నె - మ్మది నిదురబోవా
పరమపావనుడైన - పరవాసుదేవా ॥లాలెనుచు॥

చిన్నబాలులతోటి - చెలిమి సేయకురా
కన్నికామణుల ద - గ్గరికి బిలువకురా
మన్ననతొ మీ తల్లి - మాట మీరకురా
వెన్నె యిచ్చేను నీ - వెందు దిరుగకురా ॥లాలెనుచు॥

ధరలోన వసుదేవు - తనయుడై పుట్టి
శరణాగత త్రాణ - బిరుదు చేపట్టి
వరుస సద్భక్తులకు - వరమొసగినట్టి
దొరవనుచు సుజను లెం - తురు గంటగట్టి ॥లాలెనుచు॥

జారచోరత్వముల - చతురడైనావు
ధీరుడై ఇల్లిల్లు - దూరి వచ్చేవు
వారు కోపించితే - వగల బొయ్యేవు
దూరగావలె ననుచు - దుడుకు జేసేవు ॥లాలెనుచు॥

అసురులను శిక్షించి - అవని రక్షించి
మసలకను కౌరవుల - మదము లణగించి
పొసగ ధర్మజుచేత - భూమి నేలించి
రసికుడై చెలగితివి - రాజసము మించి ॥లాలెనుచు॥

వాణీశ రుద్రాది - వందితుడవీవు
ప్రాణికోటుల నెల్ల - ప్రబల జేసేవు
నాణెముగ కార్వేటి - నగరమున నీవు
వేణుగోపాలుడై - వెలసి యున్నావు ॥లాలెనుచు॥

## 200. భైరవి - ఝంపె

జయమంగళము – నిత్య – శుభమంగళం ॥పల్లవి॥

ఇందిరా రమణునకు – నిభరాజవరదునకు
మందరోద్ధారునకు – మాధవునకూ
నందనందనుడైన – నవనీత చోరునకు
కందర్ప శతకోటి – సుందరునకూ ॥జయ॥

అసుర సంహారునకు – నంభోజనాభునకు
అసహాయునకు చక్ర – హస్తునకునూ
వసుమతీకాంతునకు – వనజాతనేత్రునకు
కుసుమాస్త్రు గన్న యదు – కుంజరునకూ ॥జయ॥

ఖగరాజగమనునకు – కనకమయచేలునకు
సుగుణాలవాలునకు – సుచరిత్రుకూ
అగణితవిలాసునకు – అఖిలదేవాత్మునకు
జగదేక వీరునకు – జయశాలికీ ॥జయ॥

దీనమందారునకు – దివ్యమణిహారునకు
మానితాఖిల లోక – మాన్యునకునూ
గానలోలునకు నా – గమ నిగమవేద్యునకు
దానవారికి తులసి – ధామునకునూ ॥జయ॥

దరహాసవదనునకు – దారిద్ర్యశమనునకు
పురుహూతవంద్యునకు – పూజితునకు
కరుణాసముద్రుడై – కార్వేటినగరమున
పరగు శ్రీవేణుగో – పాలునకునూ ॥జయ॥



## 201. రాగమాలిక - ఆదితాళం

కన్నతల్లి కరుణించి బ్రోవుమిక –
నన్నుడని మనసా వేరెంచక ॥పల్లవి॥

సన్నుతింతు నరుణాద్రిపురి వెలయు –
సాంబశివుని ముద్దు మోహనాంగీ ॥అనుపల్లవి॥

శాంతరూపి శరదిందుకళాధరి –
చండభైరవీ త్రిశూలినీ
సంతోషముగ ముద్దుగా నభీష్టమొసగు –
సన్నుతాంగి సాధుపోషణీ
పంతముగను రంభాది కాంతలు –
పంతువరాళి పదచాలిని
వింతగాను కొలువుండు వేళలో –
వేడ్కమీర నానందభైరవి ॥కన్నతల్లి॥

కంబుకంఠి కలహంసగామిని –
కౌమారి పరమకల్యాణి
అంబుజాక్షులెల్ల వేగ సురటి విసరే –
టందము గనుగొని
తుంబురు నారదులెల్ల నీ మహిమ –
తొలి జాముస వీణను బిలహరిని
గంభీరముగ శంకరాభరణమును –
గానములను సేయుదు రనుదినమును ॥కన్నతల్లి॥

నగరాజకుమారి నీతోడి –
నాణెముగల దైవము లేదనుచు
జగతిలోన జనులెల్ల పొగడగను –
జలజనేత్రి మధ్యమావతి
సొగసుగాను సారంగ నయనలు –
సొంపుమీర సారంగ మీటుచు
బాగుగాను పాడ నసావేరి –
బాల వేణుగోపాలసోదరి ॥కన్నతల్లి॥

## 202. కల్యాణి - చాపు

ఏమి కులికీనే - యీ పడుచు తా - నెంతో కులికీనే ॥పల్లవి॥

సీమవారివలె చీర - సొమ్ములె యుంటె
భామ యెందరినైన - బడగల్గునోగాని ॥అనుపల్లవి॥

కురులు చక్కగ - గూడలేదు -
మంచివిరులు చక్కగ - ముడువలేదు
నెరికురులు వెన్నున - నిడివిగ జారితే
తరుణి యీ పడుచెంత - తళుకు జేసునోగాని ॥ఏమి॥

పొన్నకాయలంత - చన్నులయితె పయిట -
ప్రొద్దుకు పదిమార్లు చూచునే
చెన్నుమీరగ బూల - చెండ్లంత లైతేను
మిన్నంది యీ పడుచు - మిట్టిపడునోగాక ॥ఏమి॥

చక్కనివాడని చూచునే - సామి వేణుగోపాలుని గోరునే
ఎక్కువవాడని - యెంచి చూచిన మనసు
యెప్పుడెప్పుడు - యెప్పుడనుచు బదిరి ॥ఏమి॥



## 203. నవరోజు - ఆది

రారా చక్కని సామి ఆ చెలి పయిని - నేరమెంచే వదేమి ॥పల్లవి॥

రారాపుసేయమేరా - రారా వేణుగోపాల
సారసాక్షి నిటు నిరాకరింపకు -
ధరావరా - నెరామరులు జెందెను ॥అనుపల్లవి॥

నిన్న మాపటివేళ - నీవు తేజి నెక్కి
వన్నెమీరగ రాగా - కన్నియజూచి
నిన్నుగోరెను బాగా ఆచెలిపయినేర -
మెన్నగనింత జాగాయెరోరి జాణ
మన్నింపు మికవేగ భోగదేవేంద్ర -
వన్నెకాడ దాని - వద్దకి రమ్మని
చిన్ననాటివలె - చికిలి జనింపగ -
జనావనా దీనాన చనవీరా ॥రారా॥

వగలాడి చూపులు - వలరేని తూపులు -
నగవు వెన్నెలగేరు రదము సౌరు
మగరాల జిగిదేరు నూగారు తీరు -
నెగడు చీమలబారు మోవి పలుమారు
పగడముల మీరు సామి యెవ్వారు -
సొగసుకాడ దాని - సోయగమెన్న దరమా
చిగురుబోణి నె -మ్మొగమునకు సరి -
జగాన గా - న గానరసలోల ॥రారా॥

మదిరాక్షి చక్కని చక్కెర కెమ్మో వాని -
మాటికి కళలూర వేణుగోపాల
గుదిగొన్న తమిమీర సామిగా వేగ -
మదవతి నేలుకోర - మదనావతార
పదిరి చిలుకల గుములు - రొదలు సేయగ నెంతో -
మదవతి మదిలోన
బెదురుచున్న దిక విరాళి కోర్వదు -
గదా సదా - ముదంబెనయ నిపుడు ॥రారా॥

## 204. సురటి - త్రిపుట

ఎంత చవుక జేసినే సకియ నేడెంత
కంతుని గన్న చ - క్కని వేణుగోపాలు డెంత ॥పల్లవి॥

సంతము నను గూడి యా - సకిని ముద్దిడి నాడట ॥అనుపల్లవి॥

చిన్న మోమున మోము - జేర్చి మోవి నొక్కునే -
యెన్నెన్నో వగల సొక్కించునే
పొన్నపువ్వులు దెచ్చి - పొలతి గైకొమ్మను
పన్నగ శయనుడు యా - కన్నె బోధన వినెనే ॥ఎంత॥

పదము బాడుచుండ - సదయుడు తనుమెచ్చి
మదనకేళిగూడు - మమత దాల్చెనే
అది తెలిసి యా చేటి - పదురుకొనుచు వచ్చి
మది కలత జేసెనే - మగువ నేనెటుల సయితునే ॥ఎంత॥



## 205. మోహన - చాపు

దండమురా నీకు నాదు చను - కొండల నంటకురా ॥పల్లవి॥

ఉండరా యత్తవా - రండనే నున్నాను
దుండిగములు సేయ- దొరకొనే వయ్యయ్యో ॥అనుపల్లవి॥

కన్నెప్రాయముదానరా నాతో - కనుసన్నలేల మానురా
విన్నకన్నవారు - విభునకు జెప్పిన
వెన్నవంటి మనసు - వెగటై తోచీని ॥దండము॥

జులుముసేయ వత్తురా - చూచినవారు - చెలుడవని నినుమెత్తురా
అలివేణి రమ్మని - చలువ గంధము మేన
నలద వచ్చే విది - నాయమా మొగనాల ॥దండము॥

తియ్యని కెమ్మోవి నొక్కి పూల - శయ్య పయినను రీవీ
వయ్యారి వగలనను - వలపించి కూడితి
వియ్యెడ కొమరాలి - వేణుగోపాలసామి ॥దండము॥

## 206. గౌళిపంతు - ఆది

మోమాట మేమిరా దానితో నీకు ॥పల్లవి॥

మోమాట మేమి నీ విచ్చిన –
ముదుపు దెమ్మనుము సామి
ఏమరి యుండ వలదిక –
వేమారు వేణుగోపాల ॥అనుపల్లవి॥

మొదలు నీ వంపిన – ముద్దుటుంగరము
పదియారువేలది – బన్నసరము
ఇదిగో ఎనిమిదినాళ్ల – కిపుడు గయికొని యొక్క
నిదురకు సరియనే – నెలతతో నీ కింక ॥మోమాట॥

గట్టి నూరుమాళ్ల – కంటసరము
కట్టాణి ముత్యాల – కమ్మల జోడు
ఇట్టె దీసుకొని – ఇదిగో వచ్చెదనని
వట్టి సుద్దులు చాల – వదరే దానితో నీకు ॥మోమాట॥

అన్నకు వజ్రాల – అంగి యున్నది గాక
చిన్నతమ్మునికి– చిలుక తాళియును
మొన్ననే నాచుక – మూల నుంచుకొని
సన్నసైగ మాలిన – సకియతో నీ కింక ॥మోమాట॥

సరిగంచు చీరెలు – జాళువా తళుకులు
సురటీలు మరికొన్ని – సూర్యపుటములు
పరపలర దీసి – భావజుకేళికి
తిరుగ బిల్వరాని – తరితీపులాడితో నీకు ॥మోమాట॥

వినరా సందె ప్రొద్దు – వేళ నీ వటుజేరి
వనిత రమ్మని చాల – వాతెర నాని
మనసిజుకేళి ము – మ్మారు గలిసిన నీవు
తనివిదీరక నొక్క – దారిగ నను రమియించి ॥మోమాట॥



## 207. భైరవి - చాపు

బొట్టుగట్టినవాని యింటికి – పోయి వచ్చెద నాసామి ॥పల్లవి॥

పుట్టినింటనే యుండుట సతులకు –
పొసగునా వేణుగోపాల ॥అనుపల్లవి॥

చెలియలిపెండ్లికి దిరుగా వచ్చెద –
నెలదినములలో నేను
చెలిమి యింతలో మరువక యుండుమీ –
చెలువుడ నీ మదిలోను
కలుగజేసె నీ నడవడి దైవము –
కులభామల కెల్లను
నిలువరముగ నీ దయ యిందుండితే –
నీ సొమ్మేగాదా యీ మేను ॥బొట్టు॥

తిరునాళ్ళనుచు నీవయినా యొక –
పరి యందాక రారా
గురుతు జూచుచుండుదు నీ వేలి యుం –
గరమయినా యీరా
విరహ మోర్వలేనంటివి యేరా –
యిరువరులకు సరిపోరా
మరిమరి సెలవిమ్మని యడిగితే నా –
మాటలు బట్టవు వోరి నాసామి ॥బొట్టు॥

కోరిక లొకసారి తీరెగదా యిక –
గొబ్బున సెలవీయరాదా
శౌరి వేణుగోపాల తిరుగా చల –
పోరుట మరియాదా
వారు వీరు మన జాడలు జూచితే –
యేరా మోసము గాదా
తీరదింక నేనేమిసేయుదు –
దేవుడలిగిని మనమీద ॥బొట్టు॥

## 208. బిలహరి - ఆది

తిన్నగా మాటాడరా వేణుగోపాల – పున్నెమబ్బీని నీకు ॥పల్లవి॥

మొన్నరేయి నీ – సన్న దెలుసుకొని –
కొన్నమగడు నాపయి – కోపించేర సామి ॥అనుపల్లవి॥

ఎంతో వేడుకతో – నెనసి ముచ్చటలాడి
వింతరతుల గూడవేళ – సంతనగాదు
వంతకారి బావ – వచ్చేటి వేళాయె
రంతులు సేయకు – రచ్చకోర్వను సామి ॥తిన్నగా॥

విరుల పాన్పు పయిని – వేడుక లలరగను
గురుకుచముల చేర్చు – కొందు నింకొకసారి
మరుగులేక – యెరుపుగా నుండితే చాలు నాసామి ॥తిన్నగా॥

గుత్తగానివలె – నింతింతై వచ్చేవు
అత్త కంటె మోస – మంగడిబెట్టు
చిత్తాన నెనరుంటె – చేరి యుండగవచ్చు
వత్తురెవ్వరైన – వడిగ గూడర సామి ॥తిన్నగా॥



## 209. కల్యాణి - చాపు

హరికీర్తన సేయవే నీ భవరోగ – పరితాపము తీరును ॥పల్లవి॥

పరిపూర్ణుడయినట్టి వేణుగోపాలుని –
పదపద్మములు నమ్మవే ఓ మనసా ॥అనుపల్లవి॥

చెడిపోయేటి దేహమె నే ననజాల –
జాలములకు లోనయితిని
కడపట్ల యమకింకరులు తన్ను దగిలిన
విడిపించు వారెవరె ఓ మనసా ॥హరికీర్తన॥

ఆలుబిడ్డలందు బహుశా దు –
రాశల దగలకవే
కాలుగాలిన పిల్లివలె దిరిగి చింతచే –
గాసివడగ నేలనే ఓ మనసా ॥హరికీర్తన॥

## 210. పంతువరాళి - ఆది

సూడ బోదమే గంగూ– సూడ బోదమే ॥పల్లవి॥

బండితిఱ్ఱునాల్లంట – బారుకోతి బాపలంట
శిండ పూలదండ లంట –శెలియ సాముందు నంట ॥సూడబో॥

ఈరనాల మోతలంట – యినప దండ్ల దీయలంట
బోరుబోరున వూపేరంట – బోగమక్క లాడే రంట ॥సూడబో॥

ఇలుకు గబ్బు గీములోను – పులుసు నీలు శాత బోసి
తలల శిప్పలంట బొడిశి – దచ్చనా ల్లడిగే రంట ॥సూడబో॥



[ఈ పదంలో సారంగపాణి బండి తిరునాళ్లను (రథోత్సవాన్ని) వర్ణించాడు]

ఓ గంగూ! (రథోత్సవం) చూడడానికి వెళదామా! బండి తిరనాళ్లంట. వరుసలు వరుసలుగా బ్రాహ్మణులు నడుస్తూ ఉంటారంట. చెండుమల్లె పూలదండలు అలంకరించినారంట. (బండిలో) స్వామి కొలువుదీరి ఉంటాడంట.

చర్మవాద్యాల మోతలు వినపడుతా ఉంటాయంట. ఇనుప కమ్ముల దివిటీలు వెలుగుతూ ఉంటాయంట. వేగంగా (రథాన్ని) ఊపుతారంట (లాగుతారంట). బోగం స్త్రీలు ఆడతా వస్తారంట. ఒక రకమైన వాసన వచ్చే ఇరుకైన గదిలో పులుసునీళ్లు (తీర్థం) (అక్కడికి వచ్చిన వాళ్ల) చేతులలో పోసి, తలలమీద శఠకోపం పెట్టి, దక్షిణలిమ్మని అడుగుతారంట.

# ముఖ్యమైన పదాలకు అర్థాలు

కొన్నిముఖ్యమైన పదాలకు సారంగపాణి పదాల క్రమసంఖ్యను
అనుసరించి ఇవ్వబడిన అర్థవివరణలు

1. సామజయాన = ఏనుగు నడకవంటి నడకగల స్త్రీ
పంచసాయకుడు = ఐదు బాణాలు గలవాడు, మన్మథుడు
(ఉన్మాదనం, తాపనం, శోషణం, స్తంభనం,
సమ్మోహనం అనేవి ఐదు బాణాలు)

2. హొంతకారి = నేర్పరి
మగరాల పతకము = మంచి మణులు పొదిగిన పతకం
మగరాల అనే ఊరిలో తయారైన పతకం.

3. దంతికొమ్ము = ఏనుగు దంతం
ఘాతకులు = బాధించేవాళ్లు, హింసించేవాళ్లు
నీమంగా = నియమంగా
సుంత = కొంతైనా

4. కులుకులాడి = విలాసంగల స్త్రీ, విలాసిని
చక్కట్లు = సమర్థించుకొనే పనులు, అనుకూలపు పనులు
కక్కసము = బాధ
అక్కరకంటు = అవసరానికి ఉపయోగపడునది
ఇక్కువ = ఉనికి
ఎల = లేత
చలపట్టి = పట్టుబట్టి
రుజువుగా = తిన్నగా

5. జగడగొండి = జగడాలమారి, పోట్లాడే స్వభావం కలది
సుద్ది = వృత్తాంతం
నలితిండి = చిరుతిండి

6. తిరువీధి = దేవుడు ఊరేగే వీధి, తిరువీధి అనే ప్రాంతం.
ఆరుదూరు = నింద, అల్లరి
అయిరాలేదు = కలసిరాలేదు
రంతులుజేసి = అల్లరిచేసి
ఉసురనిపించు = బాధ కలిగేటట్లు చేయు
దరిశించు = కానుక ఇచ్చు

7. అలకాళి = (అలక + ఆళి) ముంగురుల సమూహం
పొక్కిలి = బొడ్డు
మృగాంక = (మృగ + అంక) జింకగుర్తుగా కలవాడా, చంద్రుడా

8. కంకణము గట్టు = పట్టుదల వహించు
కొంకు కొసరు = సంకోచం
కమ్మలు = జాబులు
సమ్మతి = ఒప్పుదల
గంటీలు = చెవిపోగులు
కుంటెనలు = తార్పుడు పనులు
పక్కాపడెడు = నికరమైన పడి (కొలత)
ముక్కారాటం = మూడు కారులు, మూడు పంటలు
కార్యకర్త్రె = సాధకురాలు

9. జడియక = బెదరకుండా
కీల్జడ = వెంద్రుకలను నాలుగు పాయలుగాచేసి వేసిన వంకీజడ (A Woman's plaited tress of hair)
అలివేణి = తుమ్మెదల బారు వంటి పెద్దజడగలది
మదన జనకుడు = మన్మథుని తండ్రి, విష్ణువు

10. కందువ = జాడ, గుర్తు
కందువు = చూస్తావు
సంమందం = సంబంధం
సతమని = శాశ్వతమని



11. దుద్దుబెట్టి = మోసగించి
నుడి = మాట
కనరు = వెగటు, కోపం
నెనరు = ప్రేమ, వలపు
సంచున = అందంగా, శ్రావ్యంగా
ఈడా = ఈ చోటా

12. కమ్మవిల్తుడు = చెరకు విల్లు కలవాడు, మన్మథుడు
గూట = గూటిలో
పాలుమాలుచు = బద్ధకిస్తూ, సోమరితనంతో ఉంటూ
సుమారుగా = తేలికగా

13. బీరము = పరాక్రమం
మనసందురా = (మనసు+అందురా) మనసు తెల్లమవుతుంది కదరా
కుందురా = బాధపడుతుందిరా
శివమెత్తు = రౌద్రం పూను
రవ్వలు = జగడాలు, రచ్చలు
వశీలరా = లోబడినావురా

14. గంటీలుబెట్టి = చెవిపోగులు ధరించి
త్రాణ = బలం, శక్తి
అక్కసు = కోపం
రాకట్ల ఉంగరం = రాళ్లు (మణులు) తాపిన ఉంగరం

15. బంగరు గెట్లు = బంగారు దిమ్మలు (గట్టు బంగారు అని వాడుకలోని మాట. అంటే స్వచ్ఛమైన బంగారని అర్థం)
చేకట్లు = చేతికి ధరించే నగలు
కట్లయిండ్లు = గుండ్రంగా నిర్మింపబడిన ఇండ్లు
కట్లమారి = కట్లమారెమ్మ అనే గ్రామదేవత
సౌరు = అందం
కీళ్లమంచం = మరలతో బిగించి తయారుచేసిన మంచం

వట్టివేళ్ల చప్పరము = వట్టి వేళ్లతో నిర్మితమైన పైకప్పుగల మండపం
అచ్చాలిగా = స్వతంత్రంగా, జంజాటం లేకుండా
పదచాళి = ఒక నృత్య విధానం
కేళిక = నాట్యం

16. మళ్లచీర = నలుచదరపు గడులుండునట్లు నేసిన చీర
మళ్లాదోవ = తిరిగి వెళ్లే దారి (వేరేదోవ)
కొదవ = తక్కువ
కొదవపరచి = చిన్నబుచ్చి
కొదవ సొమ్ము = మిగతా సొమ్ము (కుదువబెట్టిన సొమ్ము?)

17. మందగ = గుంపుగా
ఆరడి = నింద (కష్టం, బాధ)
మారాముళ్లు = చిక్కులు
వాలాయము = నిర్బంధం
రవ్వాలాయె = రచ్చలాయెను

20. రారాపు = (రాపు + రాపు) ఎక్కువ రాయిడి (రాపిడి)
మదిరా = మనస్సుకు నచ్చినట్లు
విన్నాణగత్తె = సమర్థురాలు, నేర్పరి
రద్దాయ = నిలిచి పోయె

22. మందరధరుని = కూర్మావతారమైన విష్ణుని
మేమందరాడకు = మేమందరం అక్కడకు
పోతగదు = పోకూడదు
ఆడెకలు = బాసలు, ప్రతిజ్ఞలు

23. మచ్చుమీద = మిద్దెమీద
మచ్చుమీద జల్లిన = మచ్చు (మర్లు) మందు ఒంటిపై చిలకరించిన
ఇందుకాక = చంద్రతాపం
సీమాటి = భాగ్యశాలిని



24. అగ్గలమైన = ఎక్కువైన, పుష్కలమైన
మేనమ్మితిగా = (మేను + అమ్మితిగా) శరీరాన్ని అర్పించితిని కదా
మరుగా = రహస్యమా

25. వాతెర = పెదవి
ఐదువరాలు = ముత్తైదువ, సుమంగళి, సౌభాగ్యవతి
చీటి = లేఖ (కమ్మ)
ఆనవాలు = గుర్తు
వాలుగంటి = విశాలాక్షి, పొడవైన కళ్లు గల స్త్రీ

26. వెచ్చానికి = దినసరి ఖర్చుకు

27. మచ్చకంటి = మత్స్యకంటి, చేపలవంటి కండ్లు గలది
మురిపెము = సంతోషం
విభున కేవహించుక = విభునకు వశమై (విభునకే వహించుక)
మాటపట్టు = మాటలలో పట్టుదల, ఒట్టు
బోటి = స్త్రీ, చెలికత్తె
సుద్దులు = ముచ్చట్లు
సన్నుతాంగి = పొగడబడిన అంగములు గల స్త్రీ, అర్హురాలు
డాయ = సమీపించ

28. సురటీలు = విసనకర్రలు
మేలుమెచ్చులు = పొగడ్తలు
చలపెట్టు = పగబూను

29. చిలుకల తాళి = పైభాగంలో రెండువైపులా చిలుక రూపం కలిగిన తాళిబొట్లు
పూసల కొలికి = పూసల దండ
నార పవ్వళి చీర = ఎరుపు తెలుపు గళ్ల చీర
పద్దు జూచెదవు = పంతంతో చూస్తావు

30. హౌసు = సొగసు
ఎగ్గు = కీడు (చెడ్డ)
జుణిగేవు = దాగేవు
పుడక విరచు = కొండెములు చెప్పి మనసు విరచు
మేలువానిచేత = ప్రియమైన వానిచేత
మెచ్చులు = పొగడ్తలు

31. తొడవులు = నగలు
చేడె = చెలి
గద్దరితనము = దిట్టతనం, పొగరు, ధైర్యం
మడుపులు = మడచిన తమలపాకు చుట్టలు (తాంబూలాలు)
తొడరి = పూనుకొని
ఇష్టాలాపములు = సరస సంభాషణలు

32. చలము = పట్టుదల
తమి = కోరిక
తడవేల = ఆలస్యమెందుకు
కాయజుడు = శరీరంలో పుట్టేవాడు (మన్మథుడు)

33. సంచుపాట = ఇంపైన పాట

34. ఎమ్మెకాడు = విలాసవంతుడు
చై వేసేవు = చేతిలో చేయివేసి ప్రమాణం చేశావు
ఉపముగా = ఉపాయంగా

35. ముంగిళ్ల బెట్టితివి = బహిరంగం చేశావు
వాదు = కలహం
అగడు = నింద
చేడెలు = పరిచారికలు
ఆకుమడుపు = మడచిన తమలపాకు చుట్టలు
వలపుమందు = తనమీదనే మోహం ఉండడానికి స్త్రీ పురుషునికి పెట్టే మచ్చుమందు
గడిదీరి = మర్యాదలేకుండా
కోడిగములు = కొంటెతనాలు



36. తమకము = మోహము
ఎండమావి = మృగతృష్ణ, మధ్యాహ్నసమయంలో బయళ్లలో నీళ్లలా కనిపించే దృశ్యం
పులగము = పెసరపప్పు బియ్యం కలిపి చేసిన వంట
రాలుగాయ = తుంటరి

37. కందు = మాలిన్యం, ముగ్గర (వెండిలో కల్తీ)
కరకంచు చీర = కరక్కాయ రంగులో అద్దిన చీర
ఉచ్చుపాతలు = పీలికలు
గోనె = ధాన్య పరిమాణం (గోనెడు వడ్లు, గోనెడు బియ్యం)
వేలాంత్రాలు = రాజభోజనాలు
ఆసుబోసిన కోవి = పడుగు తోడడానికి ఉపయోగించే చట్రంలో నూలు చొప్పించే గొట్టం.

38. చండితనము = మొండితనం, మూర్ఖత్వం
జక్కుల సంతోషము = యక్ష (ఇంద్రజాల) విద్యలవల్ల కలిగే వేడుక
చట్రాతికి = బండరాతికి

39. గొంటుకాడు = కఠినుడు, మోసగాడు

40. మరుడు = వలపు పుట్టించేవాడు (మన్మథుడు)
మరులు పుట్టించి = వలపు కలిగించి
బాళి = కోరిక, వలపు

41. వేకట = చూలు, గర్భం
సందేల = సాయంసంధ్యవేళ
నజరు = కానుక
అద్దమరేయి = అర్ధరాత్రి
పెడసరము = మూర్ఖత్వం, మొరటుతనం

42. వులికీనంటివి = బెదిరిపోయానన్నావు
కూడివీడ = కలుసుకొని విడిపోవడం
మోడిసేయు = అనాదరం చూపు

చాడిసుద్దులు = చాడీలతో కూడిన మాటలు
ఆడిక = నింద
యడము = అవకాశం

43. తచ్చనలు = కపటాలు, మోసాలు
కొంచెగాడు = అల్పుడు, నీచుడు
ఎకసక్కెములు = పరిహాసాలు

44. గచ్చులాడి = మాయలాడి
జాలిబెట్టు = కష్టపెట్టు

46. గారడము = మాయ, అసత్యం
ముచ్చిలి = దొంగిలించి
సొమ్ములు = నగలు
మగనాండ్లు = మగడున్న స్త్రీలు, కులస్త్రీలు, భర్తతో కలసి జీవిస్తున్న స్త్రీలు

47. కసటు = వెగటు
బాగాలు = వక్కలు
అల్లిబిల్లిగా = ప్రేమగా
అరమర = భేదభావం

48. అలయించు = బాధించు
యెమ్మెకాడు = విలాసవంతుడు
హితవు = మేలు
ననబోణి = పూవువంటి మేను గలది, సుందరి
మదిరా = మనస్సుకు నచ్చినట్లు

50. వడిసుళ్లు బెట్టు = మిక్కిలి బాధించు
ఏచేవు = బాధపెట్టేవు
కీరవాణి = చిలుక పలుకుల వలె మధురంగా మాట్లాడేది



51. దందనకాడు = మాయచేసే వాడు, మోసగాడు
కక్కసము = బాధ
అగడైతి = (అగడు + ఐతి) నిందల పాలైతి

52. చెల్లుబడి = అధికారం సాగడం, సమర్థత
అసురుసురనుకొంటె = శ్రమ అనుకుంటే
పదరేవు = కోపించేవు

53. ఎమ్మెలు = విలాసాలు
తార్కాణ = సాక్ష్యం
వీడెము = తాంబూలం
ముచ్చువగలు = కపట ప్రేమలు

54. పాళి = ప్రేమ
సొంట్లు = దోషాలు, తప్పులు
సడ్డ = లక్ష్యం
మంటి ముక్కాయె = (మంటి + ముక్క = ఆయె) తగిలితేనే విరిగి పోయినదైంది
కల్ల = అబద్ధం.

55. జలజగంధి = పద్మం వాసనవంటి వాసనగల శరీరం గల స్త్రీ
పదరుకొను = తొందరపడు
తడయక = ఆలస్యం చేయకుండా
అంటుకోడట = తగలడట, స్పృశించడట
నాటియుండితే = దృఢంగా ఉంటే

56. చంచలాక్షి = చలించు కనులు గల స్త్రీ
మడుగులు = చలువ వస్త్రాలు
సురటి = విసనకర్ర
తిన్నగ = బాగుగా

57. సేతుయాత్ర = రామేశ్వర యాత్ర
చాంద్రాయణము = చాంద్రాయణ వ్రతం, చంద్రుని వృద్ధి క్షయాలను అనుసరించి నియమంగా ఆహార పరిమితిని హెచ్చిస్తూ, తగ్గిస్తూ చేసే వ్రతం.
చెరియించిన = పాటించిన

58. వగ = ఊహ
ఉసురు = ప్రాణం

60. దందనమా = మోసమా

61. రాజకిరీటి = రాజశ్రేష్ఠుడు
వరగుణపేటీ = గొప్పగుణాలకు నిలయమైన వాడా
ఎన్నుదురు = లెక్కింతురు
నదురు = కానుక
మొగడు తమ్ముల = ముకుళించిన తామరల
చేతికిలి = చేతి దురద
సౌరు = అందం
శృతులు = చెవులు

62. వగలు = విలాసాలు
అగడు = నింద
తతి = తగిన సమయం
హొయలు = విలాసాలు
తనిసి = తృప్తిపడి

63. విటరాయడు = రంకు నేర్చిన వాడు, విటుడు
విటుకులాడి = విటురాలు, కులుకులాడి
చాకటులు = చెవికమ్మలు
ఎమ్మెలాడి = విలాసవతి
హొంతకారి = జాణ
పంతగించి = పోటీపడి



64. కుందరదన = మొల్లలవంటి పలువరుస గలది
ముచ్చువగలు = కపటప్రేమలు
అల్లిబిల్లిగా = కలసిమెలసి
కార్పణ్యములు = దీనత్వాలు (కార్పణ్యం = దీనత్వం)

65. గొంటుకాయై = కఠినుడై
గంటీలు = చెవికమ్మలు
సరిపెణ = మెడలో వేసుకొనే బంగారు గొలుసు
తావులు = కళాస్థానాలు

66. నగవులాడు = పరిహాసం చేయు
మరులు = ప్రేమ, మోహం
సరసజేరి = దగ్గర చేరి

67. ఆనలిడుకొని = ఒట్టుబెట్టుకొని
లాహిరి = మైకం, మత్తు
డింకి = అణగి
చైచై = చేయిచేయి

68. బాస = చేసిన ప్రతిజ్ఞ
దోసకారి = తప్పుచేసినది, తప్పుచేసినవాడు
నాసరైన = (నాసరి + ఐన) నాకు సరివారైన
ఇరవు = నివాసం

69. తమకము = తాపం
నెలరాజు = చంద్రుడు
శుకశారికలు = చిలుకలు, గోరువంకలు
రవళించు = ధ్వనించు, శబ్దించు
నడిమీకి = మధ్యలోకి
హేయము = అల్పమైంది
చెట్టబట్టు = పెండ్లాడు, పాణిగ్రహణం చేయు

70. రాజీవాక్షి = (రాజీవ + అక్షి) పద్మం వంటి కన్నులు గలది
రాజసము = ఠీవి
ఎగబోయు = పురికొల్పు
ఊరట = ఓదార్పు
ఈవరదాక = ఇప్పటి వరకు

71. సరసిజముఖి = పద్మముఖి
ఒక్క తేప = ఒకసారి
ఎగ్గుబెట్టు = తప్పు పట్టు, అవమానం చేయు
మొగ్గలపని చీర = మొగ్గలు వరుసగా పడునట్లు నేసిన చీర
నేమము రేపైనీ = నియమం రేపు అయినా
నేవళము = మణులు గూర్చిన హారం
అన్నుణసరసు = అప్పలాయగుంట (తిరుపతికి సమీపంలో ఉన్న ఊరు. ఇక్కడ ప్రసన్నవేంకటేశ్వరస్వామి దేవాలయం ఉంది)

72. ఘనవేణి = మేఘంవలె నల్లని జడ, పెద్దజడ
సంధానము = కూడమని పంపే రాయబారం
ఇగురుబోడి = చిగురు వంటి శరీరం కల స్త్రీ
తలిరాకు = చిగురుటాకు
ఇసుమంత = కొద్దిగా
గిలకల మంచము = నాలుగు కాళ్లకు చిన్న గంటలు అమర్చిన మంచం (A cot with small bells hung on the legs)
తలతడివి = మోసగించి
పరిమళవతి = సువాసన వెదజల్లే శరీరం గల స్త్రీ
ఉప్పరిగె = మేడ
సుంత = కొంచం
కంతుకేళి = మన్మథకేళి, రతి
తొలిచూలు = మొదటి కానుపు



73. దిటవు = శక్తి
కుటిల కుంతల = వంకరలు గల వెంట్రుకలు గలిగిన స్త్రీ, అరాళ కుంతల
బాళి = కాంక్ష
చెలువరాయడు = అందగాడు
తొడవులు = ఆభరణాలు
చిలుకతేజిరౌతు = మన్మథుడు
మేలువాడు = మంచివాడు, ప్రియుడు

74. చిరుతని = తిరుత్తణి
చెంగల్వరాయ = సుబ్రహ్మణ్యస్వామి
సొలయు = పారవశ్యం చెందు
వలరాయడు = వలపును కలిగించే వాడు (మన్మథుడు)

75. అలగియుండు = కోపంతో ఉండు
తరితెలిసి = సమయమెరిగి

76. విరులు = పూలు
ప్రతిన = ప్రతిజ్ఞ
ఈడా = ఇక్కడ
కండ్లెర్రసేయు = కోపగించు
బూటకాలమారి = మోసగత్తె
మోటుబారుకొని = బిర్రబిగుసుకొని, మొద్దుబారిపోయి

77. ఈ కాడికి = ఇప్పటికి
మంకుగుణము = మొండి గుణము
కూడేది = కలియడం

78. రాకడి = జడ బిళ్ల
వెర్రి పోకడలు = పిచ్చి ప్రవర్తనలు
రెప్పపాట్లు = (ఆశ్చర్యంతో) కనురెప్పలు మూయడం
బిరబిర = వేగంగా
పారగుమ్మి = పారవేసి

79. దాపురమాయె = దొరికెను, పొందెను
చేకట్లు = చేతులకు ధరించే ఆభరణాలు
వెళుపు = వెడల్పు
దుడ్డు సెలవు సేయలేక = డబ్బు ఖర్చుపెట్టలేక
ఎనసెను = పొందెను
సడ్డ లేదు = శ్రద్ధలేదు
జుణుగు = సంకోచించు

80. పల్లవాధరి = (పల్లవ + అధరి) చిగురువంటి మోవి గలది
పల్లిపట్లు = పడకలు, మంచాలు

81. కొల్లారిండ్లు = మధ్యలో ఖాళీస్థలం వదలి నాలుగు వైపుల కట్టిన ఇండ్లు
గొట్టుపడితివే = అల్లరిపాలైతివే
ఖజ్జాయము = ఒకరకమైన పిండి వంట
ఖొజ్జ = పేడి, నపుంసకుడు

82. పలువిత్తు = పలువురకు పుట్టినది
నత్తు = ముక్కుపుడక
సెలవుకైపాయతే = ఖర్చుకు అయిపోతే
కొంటెకాయ = అకార్యాలు చేసేవాడు

83. సవిగాదట = ప్రియం కాదట, ఇష్టం కాదట
కట్టువర్గములు = (శరీర అలంకరణ కోసం) దాచిపెట్టుకొన్న చీరలు, నగలు
పెరిమల దనమాయె = అధికంగా ధనం కలిగింది
నేతి ఉగ్గాలు = నేతి కుండల మూతులకు కట్టే తాళ్లు
వట్టాకు = (వట్టి + ఆకు) ఆహారంగా తినడానికి ఎండబెట్టిన ఆకు
కణజలు = గాదెలు, ధాన్యం ఉంచే పాతరలు
దెప్పు = నిందించు
మనవులు = విన్నపాలు



84. చిత్తజుడు = చిత్తం (మనస్సు) లో పుట్టేవాడు, మన్మథుడు
నీవి బంధం = పోకముడి
కుసుమాయుధుడు = పుష్పబాణుడు, మన్మథుడు
పంచప్రాణముగ = ప్రాణంతో సమానంగా, ఎంతో ప్రియంగా
పంచప్రాణాలు = ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానాలు
గడిసేపు = ఎక్కువసేపు, ఎంతోసేపు (గడియ కాలం కావచ్చు)

85. కోమటి విశ్వాసము = నమ్మవీలుకానిది, అపనమ్మకం
దబ్బరకాడు = అబద్ధాలాడేవాడు
తిరపతి చుట్టరికం = తాత్కాలిక సంబంధం

86. మోడి = మోసం, గారడి
ముల్లియ యెనమిస్తి = (రూకల) మూట ఇనాంగా ఇచ్చాను
ఏనిగ దాహం = ఎక్కువ దప్పిక, అత్యాశ
దివాలెత్తు = నష్టపడు
కొంచెగత్తె = అల్పురాలు
సంచితము = చేర్చి పెట్టినది
సంగ్రహించుకొని = దోచుకొని
గుడిసెవంచు = ఇల్లు కూల్చు

87. ఎంబెరుమావారు = వైష్ణవ దాసరి
కోకస్తని = చక్రవాకాలవంటి చన్నులు గలది
రాకేందుముఖి = పున్నమి నాటి చంద్రబింబం వంటి ముఖం కలది
గొడ్డు అంబలి = రుచిలేని అంబలి

88. నిష్కర్షగా = తప్పకుండా, కరాఖండిగా
నిష్కాలు = రూకలు (డబ్బు)
ముష్కరి = కుటిలుడు
శుష్కప్రియాలు = వ్యర్థపు మాటలు
తురుష్కులు = మహమ్మదీయులు
లష్కరు = సైన్యం

పండుటాకులు = పక్వమైన తమలపాకులు
ముడియ = మూట
కౌజులబుట్టలు = కముజు పిట్టలను ఉంచే బుట్టలు
నీరెండ = సాయంకాలపు ఎండ
(The soft Sunshine of evening)
బుక్క = సువాసన ద్రవ్యం
ఈలోపంపించి = ఈ లోపల పంపి
మునిమడుగు రవికెలు = మునిమడుగు గ్రామంలో తయారైన రవికెలు
తేటద్దము = (తేట + అద్దము) నిర్మలమైన అద్దం

89. మాపె = సాయంకాలమే
ఏణాక్షి = జింక కనులవలె చలించు కనులు గలది
కాణాచి = నివాస స్థానం

90. తేసుపండ్లు = అరిగిపోయిన దంతాలు
కటికాలు = కాళ్ల కడియాలు
చదురు = రంగస్థలం, సభ
పొట్టివాకున = (కొద్ది మాటలతో) మెల్లగా మాట్లాడుతూ

91. తడవని = తాకని, అనుభవించని
అడ్డమాజ్జ లేదు = అదుపు లేదు

92. తేరకు = ఖర్చు లేకుండా, ఉచితంగా
మదురు = గోడమీద కప్పు
శింబోతు = మేకపోతు
శారి = శాలువ
వుడకాడించి = కష్టపెట్టి
అల్లాపనికి = అలా ఆ పనికి
దుద్దుబెట్టు = మోసగించు
తిరుమల కొప్పు = శరకోపం



93. కండెచీర = మంచి నూలుతో చేసిన చీర
భన్న సరము = మణులు పొదిగిన హారం
తొడిమలు = కాడలు
పంజ = నీచురాలు
బసివి = విచ్చలవిడిగా తిరిగే స్త్రీ, స్వైరిణి (A female dedicated in infancy to Siva as a prostitute)
వెన్నుడు = విష్ణువు, కృష్ణుడు
విరివి = విశాలం

94. తేవాకులయ్యవారు = ఉత్సవం జరిపించే అయ్యవారు, పూజారి (తేవాకులయ్య అనే పేరుగలవాడు కావచ్చు)
శిద్దె = తోలుసంచి
ఉగ్రాణము = దేవాలయంలో నైవేద్యాలకు కావలసిన సామానులు ఉంచే గది
నాంచారు = అమ్మవారు, ఒక దేవత
సాతియున్న = కట్టి ఉన్న, చుట్టి ఉన్న
వీణుగా = వ్యర్థంగా

95. నట్టువు = నటుడు
బారుకు సుబేదారుడు = సైన్యానికి అధికారి
కొత్వాల్గిరి = పోలీసు ఉద్యోగం
శృంగారతోట = ఉద్యానవనం
ఖల్దారోగా = ముఖ్యాధికారి, పోలీసు అధికారి కావచ్చు.
పల్లికూటానికి = పాఠశాలకు
చౌలబిడ్డ = వెంద్రుకలు తీయించని చిన్నబిడ్డ
తకతకలాడు = నిలకడలేక తిరుగు

96. వెక్కులు = ఆశలు
బూటకములు = అసత్యాలు
నీటు = (ఆంగ్లపదం) పరిశుభ్రత
తెట్టెనోరు = తెరచుకొని ఉండే నోరు

97. గొడ్డుమతము = మొరటుతనం, మూర్ఖత్వం

సరిపడదు = వీలుగాదు

ఈడుపడదు = వీలుగాదు

98. సాగుబడి = జరుగుబాటు

ముదిమిని = వార్ధక్యంలో

99. గాసిబెట్టి = శ్రమపెట్టి

సొద్దు = దెబ్బ

వెంటికె = వెంద్రుక

సీసపురూకలు = చెల్లని కాసులు, సీసం లోహంతో చేసిన నాణాలు

100. ఎంత దోపిన = ఎంత ఇచ్చినా

మైజారు చీర = దూరదూరంగా అడ్డకమ్ములు ఉండేటట్లు నేసినచీర

ఇల్లు మల్లు కడిగి బెట్టితి = ఇంట్లో ఉన్నదంతా పూర్తిగా ఇచ్చాను.

శివుని ముట్టితి = శివలింగం తగిలి ప్రమాణం చేశాను.

పైనమట = ప్రయాణమట

మళ్లిరా = మళ్లీ రావడానికి

తోట తొరువు వొప్పగించితి= తోటలు, దొరువులు స్వాధీనం చేశాను

నాటేరి చెన్‌రాజు = నెట్టేరి చిన్నరాజా

పడవేటి జాతర = పడవేడు వద్ద జరిగే ఉత్సవం

చిరుతని తెప్పలకు = తిరుత్తణి తెప్పతిరునాళ్లకు

సోమేశ్వరుని కొండ= పల్లిపట్టు సమీపంలో కుశస్థలి ఒడ్డున గల కొండ

101. పంచాంగముచెప్పు = తిథి వార నక్షత్రాల ననుసరించి మంచి సమయం నిర్ణయించి చెప్పు

కందువ = జాడ

కంచి గరుడసేవ = ప్రయాసతో కూడిన పని, నెరవేరని పని

ఇరుచెవ్వెరుగనీక = రెండవ చెవికి తెలియకుండా, రహస్యంగా

ఒత్తికిల = పక్కకు



102. పుణ్యానికి రాదు = తేరగా రాదు

తాను = గుడ్డముక్క

పావడగూర్చి = పరికిణిగా కుట్టించి

పాతరలాడు = గంతులువేయు

103. సుంత = కొద్దిగా

బింకాలబొయ్యేవు = బిగుసుకొనేవు, గర్వించేవు

ఓడెరాయల కూతురువ = ఒడ్డె యువరాణివా

బిక్కరించు = నిక్కించు

104. కొదవ = కొరత

కుంటెనకత్తె = తార్పుడు పనిచేసే స్త్రీ

శారస్యము = సరసం

పోగులు = చెవికమ్మలు (మగవాళ్లు ధరించేవాటిని పోగులు అంటారు)

మొరపగుణము = మూర్ఖత్వం

తడుకు = తడుకు అనే పేరు గల ఊరు

దుంబాలుగ = ఇనాముగా

105. నడితి = నడత, ప్రవర్తన

తార్కాణము = సాక్ష్యం, ఉదాహరణం

ఈవికాడు = దాత

106. ప్రస్తుతి = పొగడ్త

పాచ్ఛాబిడ్డవా = పాదుషా కూతురివా

శింగిలీకము = పెద్ద నల్లకోతి

మదిరాక్షి = మదము కప్పిన కండ్లు గల స్త్రీ

107. బేసరాలు = ముక్కుపుడకలు

పట్టుతాను = పట్టుగుడ్డ

అరికాటిరామి = ఆర్కాడుకు చెందిన రామి అనే స్త్రీ

108. అసమశరుడు = మన్మథుడు, బేసిబాణాలు కలవాడు
దొడ్డది = గొప్పది
బడుగు = బలహీనుడు
అతనుకేళి = మన్మథకేళి (అతనుడు = తనువు లేనివాడు, మన్మథుడు)

109. కసరు = కోపించు
తుసకారము = తిరస్కారం
కరుచూకు = ఖర్చుకు
సంబళాలు = జీతాలు
జీవదంతము = బతికి ఉన్న ఏనుగు దంతం

110. నాచుకొని = పుచ్చుకొని
సున్నపాకు = సున్నం పూసిన తమలపాకు
నెరదాత = గొప్పదాత
సంబ్రాలు పడుకొంట= సంబరపడుతూ
జారిచెంబు = జరీచెంబు, వెండిచెంబు
జముఖానా = మంచంపై పరిచే మందమైన పెద్ద వస్త్రం
పట్నూలు = పట్టునూలు
తుంగలో ద్రొక్కి = మరచిపోయి, నిరసించి
సీమాటి = భాగ్యశాలి అయిన స్త్రీ (Honourable woman)
ఓరగండ్ల = పక్కచూపుల

111. పొడుగున = ఉన్నత స్థానంలో
మిట్టిపడి = మిడిసిపడి
ఝుడుపు = భయం
సురతవో = ప్రావీణ్యం కలదానవో
జతి = సంగీతంలో తాళానికి చెందిన పదం
పేరిణి = పేరిణి నృత్యం
పైజారు = ముచ్చె, పాదరక్ష



మడికౌనా = (మడికి + ఔనా) పవిత్రమవుతుందా, మడుగు వస్త్రం అవుతుందా?
కోడిగాల = విలాసచేష్టలు గల
పోడిమైన = (పోడిమి + ఐన) అందమైన, చక్కనైన

112. వేకటి = గర్భం
వాలాయము = నిర్బంధం
కంబి దీస్తివి = ఉడాయించితివి

113. బోర్లపాటు = మడిసిపాటు
గోళ్ళు మీటుచు = చేతి గోళ్ళు పైకి కనిపించేటట్లుగా చేస్తూ

114. బడాయి = అతిశయం
సరిగ బుటేదారి చీర= పూలు కుట్టిన పట్టు చీర
జీరుకొను = పడి పొరలు
గుత్త = ఒకరి ఆస్తిని లేదా సొమ్మును ధనమిచ్చి తన అధీనంలో (అనుభవంలో) ఉంచుకోవడం
నలుపులెంచు = లోపాలు కనిపెట్టు

115. కీలుగంటు = జారుగా ముడిచిన వెంట్రుకల ముడి, దూముడి (A knot or crest of hair )
గీరు నామము = గోటితో తీర్చే నుదుటి బొట్టు
పిడచ = అన్నం ముద్ద
ఒయ్యారము = విలాసం
విత్తళి = ఇత్తడి

116. పోణిమి = అనుభవం, సౌఖ్యం
గాంధారితనం = చూచీ చూడకుండా, ఏమీ పట్టించుకోకుండా ఉండడం.

117. కంజభవుడు = పద్మగర్భుడు, బ్రహ్మ
ఖాసా = ప్రత్యేక మర్యాదతో కూడిన
పాగ = తలపాగ

చిమటాపని = క్షౌరం చేయించుకోవడం
పైజారు = పాదరక్ష, చెప్పు
స్వాలు జవాబులు = సవాలుగా ఇచ్చే సమాధానాలు
జెట్లు = మల్లులు, శరీరం మాలీషు చేసేవాళ్ళు

118. అందలాలు = పల్లకీలు
తాళీలు = చెవికి వేసుకొనే ఆభరణాలు (మాటీలు కావచ్చు)
మూళి = అంగలోపంగల చెవి, చెవుడు ఉన్న చెవి
పూర్వీకుల పని బుట్టలోకి వచ్చె = పూర్వసంప్రదాయం తరిగిపోతున్నది

119. ఏబ్రాసి = రోత కలిగించేది
పడిగెము = తమ్మ ఊసేపాత్ర, కళాచిక
పల్లు కుత్తుకొని = దంతాల మధ్య (పుల్లతో) పొడుచుకొని
కరుకులు = వరహాలు
వల్లమాల్నె = ఎంతో ఎక్కువగా

120. భావజు తూపులు = మన్మథ బాణాలు
ఉగ్గబెట్టి = పక్కన పెట్టి
మేరువగా = మేరుపర్వతం లాగా, గొప్పగా
దబ్బిలి = మోసం
పంచతిన్నె = ఇంటిముందు భాగపు వసారా
కంచి పరుష = కంచికి పోయే యాత్రికుల గుంపు
బొల్లిమాటలు = పనికిరానిమాటలు

121. దిమ్మరి = తిరుగుబోతు
ఎమ్మెకాండ్లు = విటులు

122. దేవరింపుచు = దైన్యంతో యాచన చేస్తూ
ధుత్తెరి = కోపంతో మాట్లాడేటప్పుడు వాడే పదం
రేకడి బిళ్ల = బంగారు బిళ్ల (పాపటి బిళ్ల కావచ్చు)
సుమశరకేళి = సురతపు పని
తిమిరికోట = తిమిరి అనే పేరుగల ఊరి కోట



123. చిన్నాట్లకు = పోకిరి పనులకు
తర్లమంటివి = వెళ్లమన్నావు
మీదుగట్టెను = ముడుపు కట్టెను
పద్దుబట్టి = పట్టుదలతో
బైసి = గౌరవం, గొప్పతనం (Respect)

124. కుంటెనకాడు = తార్చువాడు, తార్పుడుగాడు
మిణుకు = తళతళ ప్రకాశించు
అర్లుమర్లు = తడబాటు
వెలవాణి = వేశ్య, వెల వెలది

125. ఝుడుతునా = భయపడుదునా
మల్లాడు = తగవులాడు
కూళ్లమారి = కుత్సితుడు, కుత్సితురాలు
కడకుబోవు = ఇంటికి దూరమగు (నెలసరి ముట్టు అగు)

126. విటుకలాడి = వేశ్య
కప్పురబాగాలు = కర్పూరముతో కలిసిన వక్కలు (Scented Arecanut)
మందెమేలము = ఉపేక్ష

127. కృతిగూడు = బాగుపడు
పోకిరాట్లకు = కొంటె చేష్టలకు
భూతికి = బతకడానికి
బైసాట్లు = గౌరవహీనమైన పనులు
పొంచులు విను = మాట్లాడే వాళ్లకు కనపడకుండా ఉండి వాళ్ల మాటలు వినడం

128. సగబాలు = అర్ధ భాగం
చత్వారి = దృష్టి మాంద్యం (చూపు సరిగా కనిపించక పోవడం)
చికిలిచేయు = సొగసుగా చేయు

129. దొరలు = ప్రభువులు, ఆంగ్లేయులు
చలివేంద్ర = చలిపందిరి, బాటసారులకు మజ్జిగ లేక మంచినీళ్లు ఇచ్చే కేంద్రం
కలిచారు = పులిసి పోయిన రసం
పరగడుపు = ఉదయం నుండి ఏమీ తిండిలేని కడుపు, ఆహారం లేని కడుపు (Empty Stomach)
బ్రాహ్మణార్థము = శ్రాద్ధకార్యాలు జరిగే ఇండ్లకు భోజనాలకు వెళ్లడం, పితృకార్యాల్లో భోక్తలుగా బ్రాహ్మణులను నియమించడం

130. బడవాతనాలు = తార్పుడు పనులు
బసివిమాలిన = అభిమానం లేని
తొత్తు = బానిస
వేకటి కమ్మని = గర్భవతివి కమ్మని
శగరోగము = ఒక రకమైన సుఖవ్యాధి, లైంగికంగా సంక్రమించే రోగం
చెరగుమాయు = ఇంటికి దూరమగు
ఇరువర్లకు = ఇద్దరికి
మిండడు = విటుడు
కుశిపించు = అసంతృప్తి కలిగించు

131. అమడ పిల్లలు = కవల పిల్లలు
ఇల్లు వురుపు = ఇల్లు వురవడం, ఇంటికప్పు నుండి నీళ్లు కారడం
ఉప్పరిగె = మేడ పైభాగం
తాటాకు = జాబు, ఉత్తరం (అప్పట్లో ఉత్తరం తాటాకు మీద రాసేవారు)
శివరాత్రిగ నుండు = మేల్కొని ఉండు
అనంత వ్రతము = తాడుతో కట్టివేయడం



132. కన్నపాట్ల బడి = అనేకకష్టాలుపడి
కండకావరము = గర్వం
గుంటకాసులు = ప్రతికాసు మీద గుంటలు కనిపించే ఒక కాసుల పేరు, అప్పటి చెలామణిలోని ఒక రకమైన నాణేలు
గతుకు = తిండి

133. పేట నట్టుడు = పేటలోని నాట్యాచార్యుడు
గవిసెన = ముసుగు, తొడుగు (Cover)
పైఠాని సరిగ = పైఠాని అనే ఊరిలో తయారైన సరిగ (పైఠాని మహారాష్ట్ర రాష్ట్రంలోని ఒక పట్టణం)

134. సెల్లా = కొంగు, పైట
గూడకంబడి = గూడగా చేసిన కంబడి (వానలో తడవకుండా కంబడిని గూడగా చేసి నెత్తిన వేసుకొని పోయేవారు)
కోడిగాల = విలాసవంతమైన

135. తిన్న యింటికి రెండు దలచడం = తిన్న ఇంటికి వాసాలు లెక్కబెట్టడం అనే సామెత లాంటి మరో సామెత. (ద్రోహం చేయడం)
చీరపోతులు = బట్టను అంటి ఉండే తెల్లని పురుగులు, (చాలనాళ్లు అపరిశుభ్రంగా ఉండడం మూలంగా శరీరంలోని వెంట్రుకలు గల భాగాల్లో కనిపించేవి)

136. గొడ్డుబోతు = బిడ్డలు లేనిది, గొడ్రాలు
కక్కసకాండ్లు = హింసించే వాళ్లు
మారునీళ్లు = కడకు పోయిన స్త్రీ చేసే స్నానం
చాదుచుక్క = ముఖం మీద పెట్టుకొనే సాదుబొట్టు (కొమ్మిఆకును ఉడికించిన నీళ్లను గట్టిపరచి చేసిన నల్లటి పదార్థం)

137. బీరముడిగి = బింకం తగ్గించుకొని
గుములై = (గుములు + ఐ) సమూహమై
కాసారము = కొలను
ధృతిమాలి = ధైర్యం కోల్పోయి

పదపడి = తరువాత
అనిలము = గాలి

138. ఉగదెలియని = ఊహ తెలియని
మన్నె కాపురము = గౌరవంగా సాగే కాపురం
దుద్దులుబెట్టి = మోసగించి
చల్లవుగ్గము = మజ్జిగ కుండ మెడకు కట్టిన తాడు
ఒల్లె = చీర కొంగు
తల్లడబెట్టి = కలతపెట్టి, బాధపెట్టి
రోచిక = రోత
తేవణి = కేంద్రం
హూణులు = విదేశీయులు (ఆంగ్లేయులు)

139. తడయక = ఆలస్యం చేయకుండ

140. చిలుము = తుప్పు, మురికి

141. చవుశీతి యుపమలు = ఎనభై నాలుగు రతిబంధాలు
అవిధి పడి = కష్టపడి

142. శబ్బర = కీడు
దీనబ్బడేలు = (దీని + అబ్బడి + ఆలు) సాధారణంగా వినిపించే తిట్టుమాట
శేశిడిశ = (శేశి + ఇడిశ) చేసి వదిలిపెట్టింది
మందలు = పశువుల మందలు
పరమటి సీమ = పడమటి ప్రాంతం
సాంకోలే కమ్మేశిరే = సాకు కొనలేక (పోషించుకోలేక) అమ్మేసినారు
కుందనంబు పైడి = స్వచ్ఛమైన బంగారం
కూట్లీళ్ల కెలబోయె = చౌకగా అమ్ముడు పోయింది
బట్ట మరక = కట్టువస్త్రానికి అంటిప రక్తంమరక (ముట్టుకావడం)
మాసులకు = మనుష్యులకు
బగురెగిచం = బహు రహస్యం
సప్పంనారార్ఝులు = ఏభై ఆరు రాజ్యాలు



143. అగ్గరోరం = అగ్రహారం
పెండ్ల కాణ్ణె = పెండల కడనే
ఆకడెల్ల బాపన్నారే = అక్కడ అందరూ బ్రాహ్మణులే
చోబెణం = శోభనం
కొర్లొగ సిట్టెడు = ఒక సిట్టెడు కొర్రలు (సిట్టె ఒక ధాన్యపు కొలత)
పూరి శిక్కక = గడ్డి దొరక్క
శరవు లెండిత = చెరువులు ఎండిపోయాయి
పచ్చులు = పక్షులు
బాయకళగానికి = బావి తవ్వించే పనికి?
సనేస్రపు జీంద్రం = పెద్ద దురవస్థ (శని పట్టి వదలకపోయే స్థితి)
కండలు ఒలిసేవు = శరీరాన్ని బాధిస్తున్నావు
గుండగొయ్యి = దుష్టుడు
యెగ్గెం = యజ్ఞం
చందాగించను = సముదాయించగలను, చందా (దానం) ఇవ్వగలను (చేయగలను)
పెద్దమాసుడంటని = పెద్ద మనిషి అని
సూన్నానికె = చూడడానికె
నెంశైబోయి = ఏమి చేయబోయి
నింగమీన = ఇకమీద
ముంగల = ముందట
నీషోంపాగమేడ = నీ సొగసైన మిద్దె

144. వండేరంటొరికూళ్లు = వరికూడు (అన్నం) వండినారట
వారస్తాణె పైణాలు = వార్చిన వెంటనే ప్రయాణాలు
ఊరూరి యిగిణిల్లు = (చుట్టూ ఉన్న) అన్ని గ్రామాల విగ్రహాలు
వాస్తాచన్నా = సన్నాయి వాయిస్తూ
గారనూరే మండపాన = గారనూరు దగ్గర ఉన్న మండపంలో
గంటవాపి = గంట వాయించి
తేరుమూకే పరచైన = తేరు (రథం) లాగే పరసజనం (పరసజనం తేరులాగేవారైనారు)

దేయేంద్ర యిబమాలె = దేవేంద్ర వైభవంవలె
గారడాలంటుండావొ = గారడి అని అనుకుంటున్నావో
నెగిరోరు = నగరి వారు (సంస్థానంలోనివారు)
నగరాలేపిసుకుంట = నగారాలు వాయింప జేస్తూ
యిగతర్లె = ఇక బయలు దేరే
యేనీగలీపు మీన = యేనుగుల వీపుల మీద
చొగుచే యెండంబారి = సొగసైన వెండి అంబారి
బగువాన్నె మింగోటి = భగవంతునే మింగు నంతటి
మొగదంట్లె యాలి = సామర్థ్యం గల వాహనం (మొగలాయి వాహనం)
చాగెల = పక్కల
తేగాలు = కానుకలు
శిన్నోన్నెంబలి దాపి సన్నిస్తా = చిన్నోడికి అంబలి తాపించి చనుబాలు ఇస్తాను
కద్దె మనకు చూపు = మనకు చూపు ఉన్నదా (మనకు కనిపిస్తున్నదా)
కానుగి రిచ్చాలు = కానుగ వృక్షాలు
వుద్దులు = మినుములు
మద్దెన్న మీడాయ = ఇక్కడే మధ్యాహ్నం అయ్యింది
కైకెడు = చేతినిండా
కరవాల్ల పొడి = ఎండు (ఉప్పు) చేపల పొడి
గేగులు = తేగలు, తాటికాయ ముట్టి నుండి పుట్టే మొలకలు
శిరేకు = శిరాకు (అనే పేరు గల ఆకుకూర)
అగ్గవ = చవక (ధర తక్కువ) (Cheapness)

145. ఇసబోనమ్మీన = వృషభవాహనం మీద
యీదెంబడెల్లొచ్చె = వీధి వెంట బయలుదేరి వస్తున్నది
నొష్టం గందమెత్తి = నొసటి మీద గంధం పూసుకొని
కుసునుకున్నాడోడొ = ఎవడో కూర్చుని ఉన్నాడు
గుండోలె ముంగాల = ముందర గుండు మాదిరిగా
చిరచూ తాకించితే తక్కె = తలను తాకించేటప్పటికి



పోకార మద్దంత = (పోకారము + అది + అంత) శిల్పపు పనితనమంతా (పోకారం = నగిషీ చేయడానికి వాడే పనిముట్టు. దీన్ని పోగిరం అనికూడా అంటారు)
పది లచ్చ కుండు = పదిలక్షల విలువ ఉండును గదా
వాడాకు సుంతుంటియ్యవదంటే = వాడిన తమలపాకు కొంచెమైనా ఇవ్వాలి కదా
కంభాణము = ఒక రకపు బాణసంచా
గిడుగు = కాడచిన్నదైన లేక కాడలేని గొడుగు
పెబ = ప్రభ, ఊరేగింపబడే విగ్రహం
తడిగేలే వగటుంది = తడికె లాగా ఒకటుంది
అడిగే పేరెటమను = అడిగి (తెలుసుకొని) పేరు పెట్టమను
చూగాచి పుట్టుక = సుఖవంతమైన జన్మ
బేగీరా సూతాడి = తొందరగా చూద్దాం రా
బేమ్మానీదిడి సొచ్చె = బ్రాహ్మణవీధిని దాటి వచ్చింది
సీలేడికలు = స్త్రీల వేడుకలు
శిత్రాలాడ = బొమ్మలు ఆడుతుండగా
పూలంట శెడుగౌలు = పూలనుండి చెడ్డ వాసన
పుట్టుగిచ్చాల్లోనో = లోపల నుండి పట్టుకొని వస్తున్నది
తాలే = తాళవే (కొంచెం ఆగవే)
నగరారిందాం = నగారా వాద్యం (ధ్వని) విందాము
కంచోలె = ఇవతల కంచెవలె (అడ్డంగా) నిల్చొని ఉంటే
దీటి లెలుగుతుండా = దివిటీలు వెలుగుతూ ఉండగా

146. మాసల కిరీది కరంగా = మనుష్యులకు కీర్తికరంగా
యేసన దెల్దోయి = యోచన తెలియదోయి
రేతిరి = రాత్రి
దొరద్ద = దొర దగ్గర
యీన గొట్టెయాల = వీణ వాయించే సమయంలో
బయటకెల్ని = బయటకు వెళ్లిన

దండపడుదురె = సాష్టాంగపడతారా
నాకొండెల = నాకొడుకుల
బగుమాణము = బహుమానం
మగతారెణ్ణర = మక్తా రెండున్నర
అణుభోగం = అనుభవం
మీ యెంట్లోడు = మీ అటువంటి వాడు
మొత్తొచ్చిరె = కొట్టడానికి వచ్చారు గదా
కల్జు = తూము (నీరు పోయేదారి)
మడవ కాడ = పొలాలకు నీళ్లు పారే కాలువ దగ్గర
అరుచోద్యం = ఆశ్చర్యం
పబళము = ప్రబలం, ఎక్కువ
చుద్దులు = విషయాలు
యింట్లో యిదబ్బరగడ = ఇంటిలో ఇదేనబ్బా తగాదా

147. తెప్ప తిర్నాల్ల = తెప్పతిరునాళ్లు (Floating Festival)
యేడికె సూన్ను = వేడుక చూడడానికి
చిగమెత్తినట్టెళ్రి = శివమెత్తినట్లు (ఆవేశంతో ఊగిపోతూ) వెళ్లారు
పదమ చరసు కాడ = పద్మసరస్సు దగ్గర
పందిల్లె బగినోదం = పందిళ్లు ఎంతో వినోదం (గా ఉంటాయి)
సదురేశిందె = (పందిళ్లు) చదురుగా (వేదికగా) వేయడమే
మలుగ కూడు = మంచి బియ్యం (మొలకొలకులు?) తో వంటిన అన్నం
మాశి కింతతై = మనిషికి ఇంతింత అని
చోమాదిగులయ్యోర్లు = సోమయాజులైన అయ్యవార్లు (బ్రాహ్మణులు)
యేటల సంపి = పొట్టేళ్లను నరికి
వోమా మగ్గిలో యేసేరు = హోమం అగ్నిలో వేశారు
బేమనమూక = బ్రాహ్మణుల సమూహం
వొరుతుకూల = వర్తకుల
చంగినీ గుఱ్ఱాల = వేగంగా పరిగెత్తే గుఱ్ఱాల



లచ్చలయి = లక్షలుగా (ఎక్కువగా)
జంగమాల్లూబేదె = జంగాలు ఊదుతూ ఉన్నారు (బూరలు లేదా శంఖాలను ఊదుతున్నారు)
మంగలోల్లు వాసేదే = మంగలివాళ్లు (మేళం) వాయిస్తున్నారు
జతణము సేసి = సిద్ధపరచి
తేంగాణె = తీసుకొని రాగానే
పెబులట్టె = ప్రభువులు వెంటనే
కుసునికుంద్రి = కూర్చుండినారు
గబ్బు = చెడ్డవాసన
సుంచేవులో = కొద్దిసేపట్లోనే
శెట్టుసాట్నుంటి = చెట్టు చాటున ఉంటిని
తెల్లె = తెలియలేదు

148. సంకనాకమను = కోపంతో అనే ఒక తిట్టుమాట
బింగరమొ = రోగమా
అంగల్లో అచ్చింత్లో గింజలె = అంగళ్లలో గింజలు (ధాన్యం) అక్షింతలు లాగా ఉన్నాయి (అంగట్లో బియ్యం లేదా ఇతర ధాన్యాలు తక్కువగా ఉన్నాయి)
పిండిసమైతే = రాగిపిండి విషం అయితే
శడొచ్చిరొ = చెడిపోయి వచ్చారో
మోగరించుకొని = వదలకుండా నిలబడి, ప్రతిఘటించి
శండితనము = మొండితనం
ఏపి = కుక్క
యింగుంటే = ఇంకా ఉంటే
యెయిటికీణ్ణె = ఎందుకు ఇక్కడే
గోరుస్త = అఘోరిస్తూ, పీడిస్తూ
గోదారైతె గుడ్డెల్లిం దేమీడ = గోదావరి ప్రాంతమైతే ఇక్కడ గుడ్డు పిగిలిందా (గుడ్డు పిగిలిందా = సమృద్ధిగా ఉన్నాయా)
గొండ పొమ్మను = తీసుకెళ్లమను

పిండొల్నంటె = (రాగి) పిండి ఒల్లను (వద్దు) అంటే

వోడయ్యుండిల్లు సూపించె = ఇల్లు చూపించిన వాడు ఎవడై ఉంటాడు

సొయింపగ = చొప్పింపగా (చొప్పించుకొని, పూసుకొని)

సెప్పుచ్చిన గుంజగాని సారెశం = (సెప్పు +ఉచ్చిన + గుంజగాని + సారెశం) చెప్పు పుచ్చుకొని గుంజితే గాని (కొడితే గాని సారస్యంగా ఉంటుంది.

శాత్రికమాపి = (శాత్రికము + ఆపి) శాస్త్రం చెప్పడం నిలిపి

గూదెల్ల గుక్కుదు = (గూద + ఎల్ల + కుక్కుదు) ముడ్డి మీద తన్నెదను

సోపణానా = శోభనాన్ని

కాపిరము = కాపురం

యేలుకాణ్ణి = ఏలుకొననీ

శీకురాయల తొత్తల = గబ్బిలాలతో

యీనెలెల్ల = (పైరుకు గల) కొన కంకులన్నీ

గనికొర కొగ్గింజలె = (గనికి + ఒరగు + ఒగ్గ గింజలె) గనిమల మీదికి ఒరిగిన ఎండు గింజలే

యిగతా వుగతం = యుక్తాయుక్తాలు

149. పండినొడ్ల = (పండిన + ఒడ్ల) పండిన వడ్లను

అసిరోదం = ఆశీర్వాదం

కోల్లేరక = (కోల్లు + ఏరక) కోళ్లు ఏరుకొని

కాశికి పొయ్యొస్తే బొల్లావా = (బొల్లు + ఆవా) కాశికి వెళ్లి వచ్చినంత మాత్రాన తెల్ల ఆవు అయినావా (పవిత్రుడవైనావా)

యిసనకాయలు = వృషణాలు

శెంజిదురగమైతే = చెంజి కోట అయితే

మాసల కొడుకయేవు = మనిషికి పుట్టిన వాడవవౌతావు

చంచై = సంచిలో

సాకలెంక = చాకలి ఎంకి



ముటుకో గుంజిత్తాం= ముట్టుకో (పట్టుకో) (గుంజి + ఇత్తాం) గుంజి పెడదాము (నీళ్లు పిండి ఇద్దాము)

అశినిత్తెం = మాటి మాటికి

సవరము శేతాంయి = సవరం (క్షౌరం) చేద్దాం

పరేశికం = ఎగతాళి

కర్సక సాయాలె = (నేల) కరచుకొని చావాలి

వానెగేశ = (వాన + ఎగేశ) వాన ఏమార్చింది (వాన పడలేదు)

గింజలీనె = (గింజలు + ఈనె) ధాన్యం, గడ్డి

కిరమాయె = ప్రియమాయె (వెల ఎక్కువయింది)

పుంజమాలె యరు దాడుల జెందెం = (పుంజమ + అలె + అరుతాడుల) ఉరితాడులా జందెం (యజ్ఞోపవీతం)

కాని మస్తి = మనిషివి కావా

కొక్కరిస్కుంట = వెక్కిరిస్తూ

150. మనుషా = మనసా

యిద్రేకాము = ఈ దేహం (శరీరం)

సొరంగాళ = రంధ్రాల

నరమాసిగ = నరాలు, మాంసంగా

తోళే = తోలే (చర్మమే)

బెమ్మ = బ్రహ్మ

బెష్టకారి కట్టె = పనికిమాలిన శరీరం

ఎన్నంటె = వెన్ను (వీపు) వెంట

యెముకాలు = ఎముకలు

పరమ శాండలము = పరమ చండాలం, ఎక్కువ రోత, అసహ్యం

మయిదుగ = మాయగా

మబ్బిగప్పిందాడు = అజ్ఞానాన్ని ఆవరింపజేసి ఉండాడు, చీకటి కప్పి ఉండాడు

యివాలె రామాంధం = రామాయణం వినాలి

| | | |
|---|---|---|
| | పాదకవళం | = పాదకమలం |
| 151. | సనోరము | = శనివారం |
| | సుంత కల్లజూడు | = కొంచెం కండ్లతో చూడు |
| | బగుమాణం | = బహుమానం |
| | నగర దచ్చన | = నగరంలో వసూలైన దక్షిణ |
| | శిన్నాగి | = చిన్న నాగి |
| | యిగతంకిరేతప్పి | = విహితం గురి తప్పి (హద్దుమీరి) |
| | మస్తంటివి | = (మస్తు + అంటివి) ఎక్కువ అన్నావు |
| | పాశము | = పాయసం |
| | పాణకము | = బెల్లం కలిపిన నీళ్లు |
| | గాశిబెట్టి | = కష్టపెట్టి |
| | ఏబ్రాసి | = పనికిమాలినది, పనికిమాలిన వాడు |
| 152. | దీపాల్‌రెయి | = దీపావళి రాత్రి |
| | నా పక్కిలె మునుకొని | = నా పక్కలో పండుకొని |
| | కాపెంగిటి దేయిరింట్లో | = కాపు వేంకటదేవర ఇంట్లో |
| | సాప్మీన | = చాప మీద |
| | వరిసంబడి | = వర్షం పడి |
| | రైపొద్దెన్నెల్లో | = రాత్రిపూట వెన్నెలలో |
| | నెమిలోనమ్మీన | = నెమలి వాహనం మీద |
| | పరిగిచ్చేనంటె | = పరుగెత్తి వస్తానంటే |
| | దుగ్గాల్లేతల | = దుగ్గాండ్లు లేవు (డబ్బు లేదు) |
| | శైసాపడిగితే | = చేయి చాపి అడిగితే |
| | దిసొంటిదేమొ | = ఇటువంటిదేమో |
| | యేదాలేసదతా | = వేదాలు చదువుతూ |
| | రాగడేసి | = రాత్రి గడియ వేసి |
| | రాకల్లాలకు | = రాగి కల్లాలకు (రాగి కంకులను గుండుతో తొక్కించి రాగి ధాన్యాన్ని వేరుపరిచే చోటు) (Thrashing floor) |



| | | |
|---|---|---|
| | తైదలు వొణ్డించ | = రాగులు ఒడి నింపగా |
| | గానానికి | = పాడడానికి |
| | మంగలెంగు నెట్నించి | = మంగలి ఎంకు (వెంకట) ను పెట్టి |
| | శారిశెం | = సారస్యం |
| 153. | అజ్జుని కతలు | = అర్జునుని కథలు |
| | యంతరుసోద్దెమే | = ఎంత ఆశ్చర్యమే |
| | సుగ్గీజయము | = సుగ్రీవ విజయం |
| | యిగనీసుపైనెక్కి | = విఘ్నేశ్వరుని మీద ఎక్కి |
| | యిాబీసనూడొచ్చి | = విభీషణుడు వచ్చి |
| | పెగ్గెలు | = గర్వాలు, గొప్పలు |
| | మొర్చనాయాలట్టే | = ఆవేళ (ఆ సమయంలో) అట్లే మూర్ఛపోయాడు |
| | | గుగురు మిగురనకుండ= చడీ చప్పుడూ లేకుండా |
| | గుడ్లెల్ల గుక్కెనే | = (గుడ్లు + ఎల్ల + కుక్కెనే) కనుగుడ్లు బయటకి వచ్చాయి |
| | అనుమంతెనకటోడు | = హనుమంతునికి వెనుక పుట్టినవాడు (భీముడు) హనుమంతునికి, భీమునికి వాయుదేవుడు తండ్రి. అందువల్ల వారిరువురు అన్నదమ్ములు. |
| | సనియు నోలబట్ట | = శనివలె పట్టుకోగా |
| | యిారబద్రు | = వీరభద్రుని |
| | యరనేచ్చు చడ్డకుడు | = హిరణ్యాక్షుని తోడల్లుడు |
| | దురివోదనుని శెయిలో | = దుర్యోధనుని చెవిలో |
| | పిసాసోలె | = పిశాచి (దయ్యం) వలె |
| | సురివోదమాయనే | = సూర్యోదమయింది |
| | సూడయేడిగున్నె | = చూడడానికి ఎంతో వేడుకగా ఉంది |
| | బేరి బూరుగలింట | = భేరివాద్యాలు, బూరగల చప్పళ్లు వింటూ |
| | యిార పతిమెగు | = వీరప్రతిమకు |
| | మారు బాసోడొకడు | = మారు (తెలుగేతర) భాష మాట్లాడే ఒకడు (సాధరణంగా ఆంగ్లేయుడై ఉంటాడు) |

మొలతిత్తొదిలించుకొని = (మొలతిత్తి + ఒదిలించుకొని) నడుముకు కట్టుకొని ఉండిన సంచి తెరచి
తేనీగ గుములోలె = తేనెటీగల గుంపువలె
తెండె తెండెగ = గుంపు గుంపుగా
పంజ = ప్రజ (ప్రజలు)
నానాదించంగల్లె = రకరకాల వస్తువులు అమ్మే అంగళ్లు
నానారం చంతోలె = నారాయణవనం సంతవలె

154. నయముగిచ్చేరంటనె= చౌకగా ఇస్తారంట
ఈన్నె పొద్దెక్కెనె = ఇక్కడనే వేళ అతిక్రమించింది, పొద్దు ఎక్కువైంది
యీడేదుండాదంటె = (యీడ + ఏడ + ఉండాది + అంటె) ఇక్కడ అక్కడ ఉండాదనుకుంటున్నావా (దూరంగా ఉందని అర్థం)
కోణ్ణి గొండపోతె = కోడిని తీసుకొని పోతే
ఇలనేడ సూల్లెదె = ఇక్కడెక్కడా చూడలేదు
యీసుల్లు = ఇసుళ్లు (వానాకాలం పుట్టలమీద గుంపులు గుంపులుగా తిరిగే రెక్కల పురుగులు. కొందరు వీటిని వేయించుకొని తింటారు)
మలుగుశాపలు = ఒక రకం చేపలు
మస్తంటనె = అధికమట గదా
తల యెంటికె తాల్లు= సవరాలు
అలశొచ్చే తల్కీడ = (అలశి + వచ్చే + తలకి + ఈడ) అలసిపోయి వచ్చేటప్పటికి ఇక్కడ
శీల్లు = చీరలు
మెట్టెలు = వివాహితలైన స్త్రీలు కాళ్ల రెండవ వేళ్లకు పెట్టుకొనే చుట్టలు (Toe rings)
ఏడిదోచలు = వేడి దోసెలు
తిన్నో రెండుకొని = తినడానికి రెండు కొనుక్కొని
అగ్గేలే సురుకెత్తి = అగ్గివలె మంటపుట్టి



సూడలేదే పుల్ని = పులివేషాన్ని చూడలేదు
అబిడిప్పడికీదులు = అప్పటికి ఇప్పటికి వీధులు
నబురుకొక్క మోలు = నగరుకు ఒక్క మలాం (సున్నపు పూత)
నాన్నెముగా = నాణ్యంగా, అందంగా
సుబిలమైయుండు = శుభ్రంగా ఉండు
యీసూనిదీయ శాత = ఈశ్వరుని దయచేత

155. నచ్చత్రం = నక్షత్రం, తిరుత్తణి దేవాలయంలో జరిగే ఆడికృత్తికోత్సవం
నూగింజైయ్యేడముండ = నువ్వు గింజంత చోటుకూడా ఉండదు
నూకట మిపరీతం = తొయ్యడం ఎక్కువ
లొట్టలేదంట = లోటు లేదట
గురుగులు = ఆడపిల్లలు ఆడుకొనే చిన్న మట్టి పిడతలు
తొగరు శీల్లు = ఎర్ర చీరలు
ఎనకలింటో రుందాంయి= వెనుక ఇంట్లో ఉందాము
చింబాలు = సింహాలు (సింహ వాహనాలు కావచ్చు)
యెత్తుడు రతమాను = ఎత్తైన రథం
నెత్తిపాగీడు = తలపాగా వీడిపోతుంది (పడిపోతుంది)
నందొనలు = చెక్క పిడతలు
దుగ్గానికి = రెండు దమ్మిడీలకు (ఆంగ్లేయుల కాలంనాటి నాణెం. రూపాయకు 192 దమ్మిడీలు, 96 దుగ్గానీలు)
శందిరము = కుంకుమ
వుందెంటీత బెల్లమేశిన నిప్పట్లు = (వుందెంట + ఈతబెల్లము + ఏసిన నిప్పట్లు) ఈత బెల్లంతో చేసిన నిప్పట్లు (అరిసెలు) ఉన్నాయంట

156. గింజలేడ దైతం = గింజలు (ధాన్యం) ఎక్కడ నుండి తెస్తాం
తెల్లొరక తల్కె = తెల్లవారక ముందే

| | | |
|---|---|---|
| శరవల్లో | = | చెరువుల్లో |
| శారేశిరి | = | సారివేశారు, పూర్తిగా తీసేశారు |
| కొలువులు | = | ఉద్యోగాలు |
| పాతలె | = | పాత గుడ్డలే |
| యెగబగలు | = | ఎక్కువ కావడాలు |
| ముత్తికేభలు పిరం | = | ముత్యాలవలె ఎంతో ప్రియం (ధర ఎక్కువ) |
| యెల్‌దోయను | = | గుడుపుకోగలను |
| పందెన్నో | = | పంజరంలో |
| పానంలే | = | ఊపిరి లేదు |
| యెల్లుకుంటేగా | = | (కాపురం) వెళ్లదీసుకుంటే గదా |
| ఏగిలేస్తే | = | ఆకలి వేస్తే |
| వుడకాడిస్తే | = | కష్టపెడితే |
| 157. తేరుశేశెనంట | = | రథం తయారు చేశాడంట |
| తెరువు శేశె | = | ఖర్చుపెట్టాడు |
| కరింబేటి యీసురునికిగా | = | కరియంబేడు ఈశ్వరునికోసం |
| బైరలంట | = | (బైరలు + అంట) భుజాలు తగిలేటట్లు |
| దిందినము | = | దినదినమూ (ప్రతిరోజూ) |
| యీనెల్‌కొడ్డికి | = | ఈనెల వడ్డికి |
| గనము గీవలమిపుడు | = | ఇపుడు గొప్పతనం కేవలమై (తగ్గి) పోయింది |
| 158. వీణుగ | = | వృథాగా |
| ఖలుల | = | దుర్మార్గుల |
| దిట్టము | = | స్థిరము |
| మెట్టము | = | తొక్కము |
| దండ | = | ప్రాపు, ఆశ్రయం |
| సల్లింతుము | = | సడలింతుము |
| నీమము | = | నియమం |
| కూతుము | = | మొరలిడుదుము |



| | | |
|---|---|---|
| 159 కక్షి గట్టకు | = | పగ పూనవద్దు |
| 160. నేమము | = | నియమం |
| 161. ముచ్చిలి | = | దొంగిలించి |
| నెపమున | = | కారణంచేత |
| తల్లడమందగ | = | భయపడగా |
| ఇతవు | = | హితం |
| లావు | = | పరాక్రమం |
| అమ్ము | = | బాణం |
| 162. యేవగనైన | = | ఏవిధంగానైనా |
| అలదితినా | = | పూసితినా |
| దరిలేక | = | దిక్కులేక |
| 163. తాకనాడిరని | = | మనస్సును నొప్పించే విధంగా మాట్లాడినారని |
| పీతాంబరము | = | పసుపు పచ్చని వస్త్రం |
| పాలకడలి | = | పాలసముద్రం |
| పరమపదము | = | వైకుంఠం |
| 164. భావజజనక | = | మన్మథుని తండ్రి |
| సడ్డసేయక | = | లక్ష్యపెట్టక |
| తలగొట్లమారి | = | శిరచ్ఛేదనం పొందినవాడు |
| భూతేశుడు | = | శివుడు |
| 166. రక్తిగా | = | శ్రావ్యంగా |
| పట్టెడు | = | చేరడు |
| కోవిదులు | = | పండితులు |
| అలమట | = | కష్టం |
| అచ్చుదల | = | ఒప్పుదల, అచ్చిరావడం, కలసిరావడం |
| గచ్చుగాదు | = | అసత్యం కాదు |

| | | | |
|---|---|---|---|
| | దురితము | = | పాపం |
| | పరతత్తము | = | దేవుని గురించిన విషయం |
| 167. | సొద్దు | = | దెబ్బ |
| | చెయ్యి ధాతువు | = | చేతి స్వభావం |
| | భగిడి | = | నీచుడు |
| | మనవులు | = | విజ్ఞాపనలు |
| | లండి | = | కుత్సితుడు |
| | చైవెలకలవేయు | = | లేదని చెప్పు |
| | గణికాంగన | = | వేశ్య |
| | మడియ | = | మూర్ఖుడు |
| 168. | వెరవు | = | భయం |
| | సత్సంగతి | = | భక్తులతో కూడి ఉండడం |
| | కాయము | = | శరీరం |
| | అఱ్ఱు | = | మెడ |
| | అంగము | = | శరీరం |
| | కదియక | = | సమీపించక |
| | దొప్ప | = | విస్తరిగా ఉపయోగించే దొన్నె |
| 169. | కంతుడు | = | మన్మథుడు |
| | భృగురాముడు | = | పరశురాముడు |
| | మగటిమి | = | పరాక్రమం |
| | వగలేక | = | గతిలేక |
| | మైలలు | = | మలిన వస్త్రాలు |
| | శంకాటంకము | = | ఆటంకం, సంకోచం, సందేహం |
| | కంక పత్రము | = | బాణం |
| 170. | అవనీసురులు | = | బ్రాహ్మణులు |
| | వత్తులు | = | దివిటీలు |
| | మృగమదతిలకము | = | కస్తూరి బొట్టు |
| | వగగా | = | శ్రావ్యంగా |



| | | | |
|---|---|---|---|
| | వారణ హయములు | = | ఏనుగులు, గుర్రాలు |
| | మింట | = | ఆకాశంలో |
| 171. | అనృతము | = | అబద్ధం |
| | ఆఖ్య జెందక | = | పేరు పడక |
| | వాలాయము | = | నిర్బంధం |
| | దాయాదులు | = | రక్త సంబంధీకులు |
| 172. | కనరాయె | = | (కనరు + ఆయె) వెగటు అయింది |
| | తామసము | = | తమోగుణం, అజ్ఞానం |
| | సామజవరద | = | గజేంద్రునికి వరమొసగిన వాడు |
| | వాంఛ | = | కోరిక |
| 173. | ఉదధి | = | సముద్రం |
| | పరిపాటి వాహనము | = | సుమారైన వాహనం |
| | దరి | = | దిక్కు |
| | శ్రీధరుడు | = | లక్ష్మిని ధరించినవాడు, విష్ణువు |
| | సాయకము | = | బాణము |
| 174. | కులకాంతలు | = | సంసార స్త్రీలు |
| | జారస్త్రీ | = | వెలయాలు |
| | అనవరతము | = | ఎల్లప్పుడు |
| | వగజెడి | = | గతి తప్పి, ఆధారంలేక |
| | వృద్ధికి | = | జతకు |
| | అరిషడ్వర్గములు | = | కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు |
| | ముంగోపి | = | ప్రతి దానికీ వెంటనే కోపపడేవాడు |
| 175. | భోగిశయన | = | ఆదిశేషునిపై శయనించినవాడు |
| | ధృతి వీడక | = | ధైర్యం కోల్పోక |
| | యిహసుఖంబు | = | ఈ లోకపు సుఖం |
| 176. | దబ్బిలి | = | మోసగాడు, వంచకుడు |
| | ఉన్మత్తులు | = | పొగరుబోతులు |

తాపత్రయము = ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధిదైవికం అనే మూడింటికి సంబంధించిన దుఃఖం
కొంటెలు = తుంటరులు

177. పన్నగవైరివాహ = పాములకు శత్రువైనవానిని వాహనంగా కలవాడు, గరుడ వాహనుడు, విష్ణువు
ఆపన్న సహాయ = ఆపదలలో సహాయం చేసేవాడు
ప్రాపు = ఆధారం
ఈప్సితార్థము = (ఈప్సిత + అర్థము) కోరిన కోరిక
దేవరాజవందిత = ఇంద్రునిచే స్తుతింపబడినవాడా
చలపోరితి = పట్టుదలతో ప్రయత్నించాను
గోజారితి = విసిగించితి
దూరితి = నిందించితి
వేసారితి = విసిగిపోతి
భారతీశ = (భారతి + ఈశ) సరస్వతి భర్త, బ్రహ్మ

178. పాదకంజములు = పాదపద్మాలు
నిరసించక = తృణీకరించక

179. కులసతి = భార్య
మెండొడ్డుకొని = (మెండు + ఒడ్డుకొని) = ఎదిరించి
కృపారహితుడు = దయలేని వాడు

180. పత్రి = తులశాకు, తులసిపత్రి
రహిని = ఆనందంతో, రక్తితో
మూకలు = సేనలు
రండ = వేశ్య
మదిరానడువని = మనసెరిగి ప్రవర్తించని
సొడ్డుబెట్టు = నిందలు మోపు
మూళిచెవికి = వంకరపోయిన చెవికి
బావిలి = చెవికమ్మ



కురువేరు = సువాసనగల ఒక రకం ఔషధం

181. నీలాపనిందలు = అకారణంగా వచ్చే నిందలు, అపనిందలు
ఘనులు = గొప్పవారు
పోనాడగరాదు = తిరస్కరించి మాట్లాడరాదు, అవమానంగా మాట్లాడరాదు
ఘాతుకానికి = హింసకు
గాసి = కష్టం

182. తనువు = శరీరం
సుకృతం = పుణ్యం
సంగ్రహించలేక = సంపాదించుకోలేక
అనృతము = అబద్ధం

183. జన్నములు = యజ్ఞాలు
మిన్ను = ఆకాశం
దివ్యదేశములు = ప్రముఖ వైష్ణవ క్షేత్రాలు. ఇవి 108 గా గుర్తింపబడినాయి.
ద్రవ్యం = డబ్బు

184. జాహ్నవి = గంగానది
లావుగ = మెండుగా
తిరుమణి = తిరునామం, తిరుమృత్తిక, నామంలో పెట్టుకొనే సుద్దకోపు
లక్ష తులసి = లక్ష తులసి నోము
భస్మము = విబూది
నిధులు = పుణ్యక్షేత్రాలు

185. దురిత కృత్యములు = పాపపు పనులు
కండ్ల కావరము = పొగరు, గర్వం
ప్రల్లదములు = పరుష వాక్కులు
ఉపకృతి = మేలు

కృతులు = గ్రంథాలు
గతవాసరములు = గడచిపోయిన దినాలు

186. సడ్డసేతువా = లక్ష్యపెడుదువా
నరుడు = అర్జునుడు

187. అరకొరలు = కొరతలు, అసంపూర్ణాలు
తజిబిజి = గజిబిజి?
కీలు = రహస్యం
అంతరంగమున = మనస్సులో
వనాంతరమున = (వన + అంతరమున) నీటి లోపల
తంతుకీటము = సాలెపురుగు

188. చపలము = చాంచల్యం
దశవిధగమకములు= సంగీతశాస్త్రానికి చెందిన ఆరోహణ అవరోహణాదులు
షండుడు = పేడి, నపుంసకుడు

189. వెరవు = భయం
కుజనులు = దుర్మార్గులు
ఒదిగినంతే = దొరికినంతే
ధ్రువరాజ్యం = శాశ్వతపదవి

190. బందెగొడ్లు = బందిలిదొడ్డిలో (నిర్బంధంలో) ఉన్న పశువులు

191. తిత్తివృత్తదైన = సంచి ఖాళీ అయితే
యీవులుడిగి = (యీవులు + ఉడిగి) ఇవ్వడాలు అగిపోయి
గౌరీదేవి వాయనము= చేట
తడువుకొను = వెదకుకొను
శృంగారకట్ట = చీపురు కట్ట
యడముగా = వేరుగా
అర్ధచంద్రుని నియమింతురు = మెడబట్టి గెంటేస్తారు

192. శిలలు భేదించేది = రాళ్లు కొట్టేది
దేశాంతరమున = మరొక దేశంలో



దండుదాళ్లు = సైన్యంలో ఉండి దాడులు చేయడాలు
భారకుడు = బరవు మోసేవాడు, పోషించేవాడు

193. శంబరమాయలు = రాక్షసమాయలు
రద్దిజేసి = అల్లరిచేసి
దండగ = దండువు, అపరాధం
సొంట్లు = నిందలు
ఒరగదోతురు = పక్కకు తోస్తారు, జరగకుండా చేస్తారు
కబళింతురు = గ్రహింతురు, తిందురు
కుంభీపాకము = నరకంలో పాపులకు విధించే ఒక రకమైన శిక్ష

194. కుక్షింభరులు = తమ కడుపు నింపుకొనే వారు
గచ్చులు = డంబాలు
పాలుమాలి = బద్ధకించి
నిండుకొన్నదని = అయిపోయిందని
శిత్తయండ = శిత్రినెల (ఏప్రిల్ నెల) ఎండ
యేపి వుదురు = కుక్క విజృంభిస్తుంది, పైనపడుతుంది
మిదుకమనేరు = కదలమంటారు
వాసొద్దు = వాయించ వద్దు
యిరబడింది = వృద్ధిచెందింది
చెయ్యితీరదని = చెయ్యి తీరికగా లేదని, పనిలో ఉన్నానని
గాజాడాళ్లు = మూగవాళ్లు
గోజారక = పీడించకుండా

195. ఉంఛవృత్తి = భిక్షమెత్తి జీవించే వృత్తి
ఉగ్రము = కోపం
వగలేక = గతిలేక
పొంచులు = పొంచి ఉండి వినడాలు
ఆడంగులు = స్త్రీలు
హఠము = మొండి
తెలియరాదు = తెలుసుకోకూడదు

భీష్మీకరించుక = పట్టుబట్టి
ముష్టి = భిక్షం

196. భారతాన్వయ = భరత వంశానికి చెందిన
కల్పముగ = యుగంగా
దీనజనావనా = (దీనజన + అవనా) దీనజనులను రక్షించేవాడా
విరులు = పూలు
వెగటు = చేదు, అయిష్టం
ప్రతిభాషలు = జవాబు మాటలు
చెలిమి = స్నేహం
బాసలు = ప్రతినలు
పక్కిజక్కి = పక్షివాహనం, గరుత్మంతుడు
పరాకు = ఉపేక్ష
పాకశాసనుడు = దేవేంద్రుడు
చౌకజేయు = తేలికపరచు
పాటలాధరి = (పాటల + అధరి) ఎరుపైన పెదవులు గలది
ఎనయ = సమీపించ
కూటమి = కలయిక

197. పచ్చవిల్తుడు = మన్మథుడు, చెరుకుగడ విల్లుగా గలవాడు
భవపాశహరణ = సాంసారిక బంధాలను హరించేవాడా
కలపంబు = లేపన ద్రవ్యం (పరిమళ ద్రవ్యాలను చేర్చి కలిపిన చందనం) (Scented paste)
చెలువు = అందం
ఇరుగడల = రెండు వైపుల
చామరలు = వింజామరలు
సురటి = వీవన, విసనకర్ర
దేవముని = నారదుడు
త్రిదశులు = దేవతలు

198. శ్రీలలనామణి = లక్ష్మి



వ్యాళాధిపశయనా = (వ్యాళ + అధిప) సర్పరాజు (ఆదిశేషుడు) శయ్యగా కలవాడా
బాలేందువదనా = (బాల + ఇందు) బాలచంద్రునివంటి ముఖము కలవాడా
దోషాభ్రసమీరా = (దోష + అభ్ర) తప్పు అనే మేఘాలకు వాయువు వంటివాడా (వాయువుమేఘాలను చెదరగొట్టినట్లు తప్పులను చెదరగొట్టువాడా)
భాషాధిపనుత = (భాషా + అధిప) సరస్వతి అధిపుని (బ్రహ్మ) చే స్తుతింపబడువాడా
విహంగరాజతురంగా= పక్షిరాజు వాహనంగా కలవాడా

199. తాళిమి = ఓరిమి, ఓర్పు
మరువంపు సురటి = సువాసన గల మరువపు ఆకులతో తయారైన విసనకర్ర
మన్నన = గౌరవం
మసలక = ఆలస్యం చేయక

200. కందర్పుడు = మన్మథుడు (కుత్సితమైన దర్పం కలవాడు)
కుంజరము = ఏనుగు
ఆగమనిగమ వేద్యునకు = వేదవేద్యునకు
దానవారి = (దానవ + అరి) రాక్షసులకు శత్రువు
పురుహూత వంద్యునకు = ఇంద్రునిచే స్తుతింపబడేవానికి

201. అరుణాద్రి = తిరువణ్ణామలై, అరుణగిరి
శరదిందుకళాధరి = శరత్కాలపు చంద్రకళను ధరించినది
కంబుకంఠి = శంఖంవంటి మెడ గలది
అనుదినము = ప్రతిరోజూ
సారంగనయనలు = తుమ్మెదలవంటి కనులు గలవారు

202. నెరికురులు = అందమైన వెంట్రుకలు
పదిరి = తొందరపడి

203. రారాపు = రాపిడి
ధరావరా = రాజా
వలరేని తూపులు = మన్మథుని బాణాలు
సోయగము = సౌందర్యం
గుదిగొన్న = హెచ్చైన
విరాళి = వలపు

204. పదరుకొనుచు = ఆక్షేపిస్తూ

205. అండ = ప్రాపు
దుండిగములు = ధూర్తపు పనులు
దొరకొను = పూనుకొను
జులుము = దౌర్జన్యం, బలాత్కారం

206. మోమాటము = మొగమాటం, సంకోచం
వేమారు = పలుమారు
బన్నసరము = మణిహారం
కంట సరము = మెడలో ధరించే ఒక రకం హారం
కట్టాణి ముత్యాలు = మేలు రకపు ముత్యాలు
సుద్దులు = కబుర్లు
చిలుకతాళి = చిలుకల బొమ్మలుగల తాళి (A gold buckle in the form of a pair of parrots)
జాళువా = మేలిమి బంగారం, అపరంజి
తరితీపులాడి = వలపులాడి
సూర్యపుటములు = ఒక రకం ఆభరణాలు

207. నిలువరముగ = స్థిరంగా



ఇరువరులకు = ఇద్దరికి
గొబ్బున = శీఘ్రంగా
జాడలు = నడవడికలు

208. సన్న = సంజ్ఞ, చేతితో చేసే సైగ
వంతకారి = సంతాపం కలిగించేది
రంతులు = ధ్వనులు
యెరువుగా = బదులుగా
అంగడిబెట్టు = గుట్టు రట్టుజేయు
నెనరు = ప్రేమ
వడిగ = తొందరగా

209. భవరోగము = ప్రాపంచికమైన కష్టం, శారీరక వ్యథ
జాలము = మాయ
కడపట్ల = చివర
గాసి = శ్రమ, కష్టం

210. ఈరనాలు = ఒక రకం చర్మ వాద్యాలు
భోగమక్కలు = భోగం స్త్రీలు
ఇలుకు గమ్ముగీము = దుర్వాసనతో నిండిన ఇరుకైన ఇల్లు
పులుసునీలు = పుల్లని నీళ్లు
శాతబోసి = చేతిలో పోసి
శిప్పలంటబొడిశి = చిప్పలతో గట్టిగా తగిలించి (శఠకోపం పెట్టి)
దచ్చినాల్లు = దక్షిణలు, కానుకలు

* * *

# జాతీయాలు


ఉసురనిపించు (6)
రావణమాయలు (11)
మారామల్లబెట్టు (16)
లోనిగుట్టుజెప్పు (18)
మాట పట్టు చేసుకొను (27)
రాణివాసము బెట్టు (28)
ఆకు మడుపులు (33)
మోవి పానకము (33)
ముంగిళ్లబెట్టు (35)
ఇంటింటి చంద్రుడవు (35)
ఎండమావుల సామ్యము (36)
ఆసుబోసిన కోవి (37)
చిందులు ద్రొక్కు (37)
ఉచ్చుపాతలు చేయు (37)
కన్నులెఱ్ఱ జేయు (37)
వట్టి దనిపించు (39)
మరులు బుట్టించు (40)
అరచేత వైకుంఠము (40)
నమ్మినానబోయు (40)
పందిలి బెట్టు (40)
చిందులు ద్రొక్కు (41)
వెలవెలబోవు (42)
చాడిసుద్దులు (42)
ఎకసక్కెములాడు (43)
మచ్చుజల్లు (44)
జాలిబెట్టు (44)
మనసురానిమాట (45)
అల్లిబిల్లిగా (47)
చెవినిల్లుగట్టు (48)
వడిసుళ్లుబెట్టు (50)
అడుగులకు మడుగులొత్తు (50)
చల్లగయుండు (51)
ముచ్చువగలు (53)
అక్కరలేని కాపురము (54)
ఆపరానిముత్యము (54)
పుడక ద్రుంచివేయు (55)
అడుగులో వేయి గుణములు (55)
ముండ్ల మీది వలువ సామ్యం (56)
కోతి చేతి మాణిక్యము (56)
పూసలలోని దారమువలె (57)
మెచ్చరాని చుట్టము (59)
తేనెలూరు మాటలు (60)
పుట్టుకదినుసేమో (64)
ఆనలిడుకొను (67)
కూడిమెలగు (68)
తొలుచూలు కొడుకు (72)





కండ్లెఱ్ఱసేయు (76)
చేతిసొమ్ము (79)
పిల్లి దిన్న కోడి (79)
సెలవుసేయు (79)
ఉప్పుచట్టి అమ్మించు (82)
చిప్పకొలత గంజి (83)
బంగారు చెరువాయె (83)
కోమటి విశ్వాసం (85)
మాఘస్నానం (85)
ఏనిగదాహం (86)
తిరుపతి చుట్టరికం (85)
రచ్చబెట్టు (85)
అతుకులగుడ్డ (87)
దినుసువారి పప్పు (88)
పట్టపేనుగు (89)
ఇల్లు బంగారుగాదా (89)
రాణివాసము (90)
తమదింత గంపెడు దాచుకొని (91)
సున్నజుట్టిన (92)
నామము బెట్టిన (92)
దుద్దుబెట్టిన (92)
తిరుమల కొప్పు బెట్టించు (92)
పప్పుచిముడు (93)
తుండుగుడ్డ (93)
సుద్దులాడు (94)
అయ్యతోడు (94)
వెక్కులు పుట్టించు (96)
గూటమువలెతిని (96)
గోడమీదిపిల్లి (98)
తావులంటు (99)
తోటదొరువు (100)
ఈతగింజకథ (102)
సంసారితనము (105)
సున్నపాకు (110)
తుంగలో ద్రొక్కి (110)
తలదడివి (110)
గుడిసెవాటైనది (111)
వెట్టికాని బుద్ధులు (112)
కుళ్లాయి బెట్టు (116)
గుడుగుడు ఆలోచనలు (116)
గాంధారితనం (116)
పూర్వీకులపని బుట్టలోకి వచ్చె (118)
చెల్లగట్టు (119)
నానబియ్యం (119)
బొల్లి మాటలు (120)
మీదుగట్టు (123)
పద్దుబట్టి (123)

బైసిదీసుకొను (123)
రూకలెగజల్లు (124)
మొలకనవ్వు (126)
బడవతనం (130)
బసివి మాలిన తొత్తు (130)
పోకిరి ముచ్చట్లు (130)
చెరగుమాయు (130)
అనంత వ్రతము గావించు (131)
కన్న పొట్లబడి (132)
ఇరికించుకొను (133)
బైశార్చు (134)
వాదాడు (134)
నసనసలు (134)
అల్లిబిల్లిజేసి (134)
సారెసారెకు (137)
ఉబ్బితబ్బిబ్బై (138)
వేలువంచు (138)
చిలుము వదలు (140)
ఉండిండి బండింది (143)
కదమ దడమ (143)
ఇగతా వుగతం (148)
చేతులోబోసి (151)
అబము సుబములేదు (156)
రవ్వసేయు (128)
తాకనాడు (163)
బింకేలబోయి (169)
మాపురేపనుచు (178)
కొదవలెంచు (179)
పండ్లిగిలించు (181)
అరకొరలు (187)
మీద్దెమీది పరుగులు (190)
కారుబారుసేయు (191)
తడిగుడ్డలగో గొంతులుగోయు (193)
చెయ్యిదుడుకు (195)
కళలూరు (203)
కొన్నమగడు (208)
కాలుగాలిన పిల్లివలె (209)

* * *

# సామెతలు

## (బ్రాకెట్లలో ఉన్నవి పదములను సూచించే సంఖ్యలు)

అందరాని పండ్ల కాశించి నట్లాయె (17)

కొండకేగే వాని మొలను కొడవలి చెక్కినట్లాయె (36)

పులగము మీది పప్పు సామిత ఆయె (36)

ఆలి మీద లంజరికము (36)

కొండను దొవ్వి ఎలుకను బట్టుదురా (38)

చక్కలి గింతలు చత్రాతికి గలవా (38)

ఈతాకు రాలునా ఏ యాకు రాలినా (38)

నెయ్యము సేతురా నెనరు లేని చోట (38)

కొయ్య బొమ్మను చేర కోరికలిచ్చునా (38)

వ్రేలు నాకి వ్రతము చెరచుకొను (50)

వెనక చింతించేది వెర్రితనము కాదా (52)

చెడ్డచేనికి ఇంటివద్ద పొంగలి (58)

ఉడుము పోతే పోయినది చై మాత్రము విడిచితే చాలు (58)

ఉసురుంటే ఉప్పమ్ముకోగలను (58)

నక్క వినయములు చేసే వారికి చక్కని మరియాదా (60)

పెరటి చెట్టు మందుకు గైకోరు (60)

కలిమిలేములనగ కావడి కుండలు (59)

కలకాలమొకరీతి గానవచ్చునా (59)

కాలము బోవును కడకు మాట నిలుచు (59)

ఓడలకు బండ్లొచ్చు బండ్లనోడలు బోవు (59)

కలిగిన మాటంటె రోసమెందుకు (68)

అతి వినయమెల్ల ధూర్త లక్షణము (68)

ఈనగాచి నక్కలకిచ్చినట్లు (79)

పిల్లి దిన్నకోడిని రారమ్మని పిలిచితే పలుకునా (79)

వడ్డి కాశించి మొదలు పోయిన వార్త నిక్కము (79)

సుంతసడ్డలేదు గదవే చదువ బెట్టిన (79)

పట్టిన పనులెల్ల బంగారు చెఱువాయె (83)

బలవంత మాఘ స్నానమాయె (85)

దబ్బరకాని విందాయె (85)

అందరాని మాని పండాయె (85)

వేముల తీయదనమాయె (85)

ఇల్లు చేరకమునుపె ఎలుక రావిదన్నట్లు (85)

మంచిమాటల గుడిసె వంచునట్లు (86)

నెత్తిన తిరుమల కొప్పు పెట్టించినట్లు (92)

మెతుకులు చల్లితే క్షితిలో కాకులు బాతే (వలె) (102)



వానలు కురిసితే వాతలు మానునా (102)

ఏతము వంగేది లోతు నీళ్లకె గాద (102)

గదిశే కాళ్లమీద గంజి వొలికినట్లు (106)

కొండ త్రవ్వి యెలుక బట్టినట్లు (106)

వంకాయకు వచ్చిన చాలే గద టెంకాయకు వచ్చేది (107)

అన్నిటికి కాసుగదా దొడ్డది (108)

పందెంత బలిసిన నందితో సరియౌనా? (111)

పట్టుగూర్చితేనే పైజారు మడికౌనా (111)

కూడు గలిగితేనే కుక్క గోపిదేవౌనా (111)

ప్రాణ మెక్కువటె మానము కన్నను (124)

ఇల్లలికితేనే పండుగాయెనా (125)

కాగల పనులకు గంధర్వులున్నారు (135)

కాలికి గాని చెప్పెక్కడ దొర్లితేనేమి? (135)

తలకు బాసిన కురులు తాకయోగ్యమె (135)

పేరు గనమే పొయిలో పిల్లి లే(వలేదు) (146)

బూడిదలోన గచ్చకాయపగిది (187)

బురదమట్టి దిరుగుచుండు కుమ్మరపురుగు చందాన (187)

తామరపాకు నీటిముంచి యెత్తినట్లు (187)

చింతబుఱ్ఱలో పండు చేరి వొదిగినట్లు (187)

వనాంతరము నుండే తంతు కీటము భంగి (187)

నాడు వ్రాసిన వాడు నేడు వేరే వ్రాసునా (189)

పుట్టించిన వాడు4 పూరి మేపునా (189)

మొదట పుట్టిన చావు తుద నెందు కల్గునా (189)

పదిలముగ ధ్రువరాజ్య పట్టమేలగ వలెనా (189)

కొంటేరాని సొమ్ము కొసరితే వచ్చునా (189)

బిక్కికాయ తిన్న కోతి వలె (191)

పులి దాసర్లకు బెట్టిన కతగా (193)

రంకు మగడు కడుపునొప్పి చూచునా! (193)

ఎద్దుపుండు కాకికి ముద్దౌనా ! (193)

కుప్పలు కాలిచి పేలాలు తినే(టట్లు) (193)

గురువుకు పంగనామము బెట్టు (193)

మోటుగాలి ఎందైన వెరచునా (193)

తిన్న ఇంటికి రెండు దలంచడం (193)

ఇగురబొడిచి నెత్తురు ద్రావు (193)

ఎండిన నోటికి నీళ్లు లేవ (నడం) (193)

చలిపందిరి కుండ బగుల గొట్టించినట్లు (193)

ఇటు రమ్మంటే ఇల్లు చేకొన్నట్లు (193)

కోసిన వేలికి సున్నము పెట్టినట్లు (193)



నట్టేటికి దీసి పుట్టి ముంచునట్లు (193)

చెట్టు కెక్కమని నిచ్చెన దీయు (193)

తడిబట్టలతో గొంతులు కోయు (193)

పుట్టిన బుద్ధులు పుడకలతో సరి (193)

* * *

# పదాల అకారాది పట్టిక


అంత మాత్రమున నేనీయనటె 181
అందరు నాయకురాండ్లైరి 205
అంబలి దాగేవు నెత్తివ్రాత నీకు 174
అక్కరలేని కాపురమాయె 140
అక్షయపాత్రకుపోతే 283
అగ్గితిరునాళ్లంట 240
అగ్గరోరం శేరు పెండ్లకాణ్ణె 230
అచ్చయ బుట్టింది బూమికి 229
అట్లాగే కావలె దానికి 227
ఆడకే పోరాయెదురాడకే పోరా 111
అద్దె కొంపవంటిది యీ దేహము 277
అన్నిటికి సులభమార్గము సుమీ 270
అరుదు గాదట వేమే 157
అలుకజేసి పలుకడేమో 152
ఆ వాలుగంటిమాట 90
ఇంకా వాని చెలిమి సేతురా 194
ఇంచుబోణి నను నవ్వేరట 178
ఇంటికి రానిచ్చేనా యీ మేనితో 125
ఇంటి మగడు కుంటెన గాడైతే 211
ఇంతకంటె చోద్యమిక వేరు యున్నదె 256
ఇంతకంటె యింకా యవడిచ్చునే 191
ఇంత నిర్దయుడవట ఇది నానోము 134
ఇంత మోహమేమిరా యిందరి కన్న 119
ఇంతసేసిన యింతి యికనెంత సేయదే 114
ఇందుకానీకు పంచాంగం చెప్పింది 188
ఇందుబోణిరో వినుమీ 228
ఇచ్చినా మంచిదే ఇవ్వకున్నా మంచిదే 145
ఇచ్చేనా ఈదికి లేశొచ్చేవా 238
ఇట్టి పనులు సేతురా యెట్టివారైన 273
ఇన్నాళ్లు జరిపింది యీ భాగ్యానికేనా 192
ఇన్నూరు వరహాలు తిన్నగ నాచుకొని 197
ఇప్పుడు గాక యింకెప్పుడు 170





ఇసబోనమ్మీద యీదెంబడెల్లొచ్చె 232
ఈ కాపురమెట్లా కృతి గూడునే 214
ఈ భాగ్యానికి రాణివాసమెందుకే 218
ఈ సీమ హరిణాక్షుల వలె గాదు 87
ఉంఛవృత్తితో బ్రతికే వారికి 285
ఎంత ఏబ్రాసైతేనేమి 206
ఎంత చవుక జేసినే సకియ 294
ఎంత దుదుకు జేసెనే ఓ భామ 100
ఎంత పేదవాడే వేణుగోపాలుడు 260
ఎంత వేడుకొన్న పలుకడేమి సేతు 130
ఎందుకు బొంకేవురా లేదని నాతో 139
ఎందుకో రాక అలగినది 104
ఎక్కడి నుండి దాపురమాయెనె 183
ఎవడైన వచ్చునటే పోపో 171
ఏమి కులికేనె యీ పడుచు 292
ఏమి జూచిన బోర్లపాటే 200
ఏమిటికే నీ పేరేమని అడిగేవు 95
ఏమిసేతు మోసమాయెగా 172
ఏమిసేతు విరహ వేదన ఎంతని
తాళుకొందు 131
ఏ రమామణి బోధ వింటివి 99
ఏరా ఏ రామ బోధింప 106
ఏలనే ఈ చలమేలనే 149
ఒక ధూపము లేదే నీ సాక్షిగ 203
ఒచ్చేవో రావో దెల్పవే 221
ఒట్టి చేతుల నేడు వచ్చినానని 176
ఒట్టు బెట్టుదు సుమ్మీ వలదు
యీ సరసాలు 137
కంకణము గట్టినవాడు దగనే 94
కందువలెంచి ఈడకురా 96
కడప దాటి రానీయకే 92
కడుపా నీవింత ఘనమైతివా 279
కదలి వచ్చెను జూడరే 257
కన్నతల్లి కరుణించి బ్రోవుమిక 291

కరుణ నీకు నా మీద కలుగుటకు 249
కలిగిన కాసు గుంజుకోవే 185
కిన్నెర వాస్తా నిలబడుకుంటె 243
కుందరదన నాపై కూరిమి మరచితో 136
కులకాంతలు విడబడి నలుదిక్కుల 225
కొండ సుట్టొచ్చేరంటే 231
కొలిచితే వేణుగోపాలదేవుని 247
గట్టి వాడవు సైరాసై 199
గుత్త లంజలను మరిగిన వారికి 278
గొడ్డుబోతు వొకతె బిడ్డలకై 223
చండితనము జేసే సరసిజాక్షితో 124
చక్కని సామిగనాతో 105
చాలు చాలు వానినేస్తము 154
చిటికె వేసితే నీ వంటి చెలులు 213
చిన్నదాననే చెనకే విందరిలో 132
చెప్పినంత మాట చెల్లించుకొన్నాడు 133
చేతి సొమ్మెరవైన యిత్తురా 166
జయమంగళం నిత్య శుభమంగళం 290
జలజాక్షుని చింతించని మానవ జన్మము 275
తటుకు తటుకుమని యదిరీనె 159
తడవాయె పోయిరా యీ తడవా 110
తనచిత్తము వచ్చినట్లు దయసేయ మనవే 141
తప్పించుకొంటేనే విడుతునా 212
తరుణి కేమని దారబోసి వచ్చెనె 89
తల్లి చెప్పిన బుద్ధి దలచితే 167
తిన్నగా మాటాడరా వేణుగోపాల 298
తిన్న యింటికి రెండు దలచే 222
తిరుగాయే చెలిని పొమ్మందునే 108
తెలిసె నెవరు లేని జాడలు 129
తేనెలూర మాటలాడకు 146
తేరు సేసెనంట తెచ్చిన పైకమీ 244
తొలుతటి బ్రతుకెల్ల దోచదో యిపుడు 216





తోడి తెచ్చెదనే వాని 117
త్రాణదానవే వాడింతగా బతిమాలితే 127
దండమురా నీకు 295
దాతను వాజులు జెరిపే దబ్బిలి 254
దానికెవ్వరు సాటి 147
దాని పాయము పదారేండ్లు 88
దోసకారివి పోవే 123
ధర్మకార్యముల కడ్డము పలికే 263
నగరాన తెప్పతిర్నాల 234
నచ్చత్రం బొయ్యెత్తామే 242
నను గురుతు తెలియనిచ్చున 158
నన్ను నీవిక నెడబాయకా నెరనమ్మితిరా 265
నాన్నారము చంత్లో 241
నమ్ముదురటే తెలిసి తెలిసియుండి 209
నాపేరంటె నీకు దొరకదు 115
నాయక సాసైనందుకు 177
నిన్ను ఏమనెనె ఓ కన్నెరో 168
నిన్ను గొల్చి యొరుల వేడబోయితే 264
నిన్ను దైవమనుచు యెట్లా 248
నిన్ను నే విడువాను 266
నిష్కర్షగా రాత్రి కొచ్చేవాడవైతే 175
నీ కూతురి నడతలు నీకే సరి 164
నీకే సమ్మతిగాని యిటువంటి 250
నీ దివ్యమంగళమూర్తి ధ్యానము 272
నీ పప్పేమి చిమిడిందిపుడు 180
నీ పాదపద్మముల నిలిపేనంటే 259
నీ పాదాలకు దండం 173
నీ పొందు సేయక విడిచేనా 163
నీ యింటికి నీవు వచ్చేటందుకు 160
నీవారి నడతలన్నియు 251
నీవు రాకుంటేనే నిన్ను మించిన దొకతె 190
నీవేనా శాస్త్రము 189

నెరనమ్మితి గదె నీమాట 126
నేడు నీవు విన్నవించి నందుకు 128
నేను నీ కనుగొన్న వేళే 153
నేరుతునని మాటలాడరాకు 121
పట్టవలెనయ్యా గట్టిగ మనసు 252
పడతి నేస్తము వేణుగోపాల 91
పదిమంది కొడుకులు గన్న 182
పయ్యెద తొలిగించినదే నేరము జేసి 138
పాపాత్ముని ధర్మాధికారిగా 261
పాపాత్ముల కెక్కడిదీ కాలము 280
పిలిచిననాడెల్ల బింకాలపోయి 215
పిలుచుకు రావమ్మ సామినీవేళ 98
పుట్టిన పుట్టుక వచ్చిన రాకడ 202
పూసలలోని దారమువలె 143
పొదుగున కూర్చున్నానని మిట్టిపడి 198
పోరాని తావులకు పోరాదు 268
బడవాతనాల కేర్పడినావటె 217
బాపడా మల్లోసినావు 236
బాపనొండు శెప్పేదింటుంటే 239
బారలు సాచుక జగడానికి రావే 219
వారస్త్రీ నీ ప్రక్కలోనికి 179
వారివలె చక్కని వాడైతే 226
వింటిరేమే చెలులారా
వాని చెరియలు 151
వేణుగోపాలుడీవేళ వచ్చినాడు 116
వేణుగోపాలుని విడువము 245
వేరుసేతురా వేణుగోపాలా 107
శ్రీరమారమణీ మనోహరా 286
శ్రీలలనామణి రమణా 288
సంకటి యిది తిరువీసము గాదు 224
సంగనాకమను బీమేడుండాయి 235
సత్యమింతైన లేదాయెగా 187
సరసాలు సేయవద్దిక చాలు
పోపోరా 112





సరిగ చీర గట్టి కులికినట్టే 220
సామి యీ కోపమేల 120
సీసపు రూకలు కొంగున గట్టితే 186
సూడబోదమే గంగూ 300
హరికీర్తన సేయవే 299
హరి తానే వున్నాడన్నిటికీ 276
హరిదాసులను పాపాలంటవు 274
హరినామ స్మరణే చేయకుంటే 255
హరినారాయణ గోవిందాయని 262
హెచ్చరికె బహుపరా
కిందిరారమణా 287
బారు బూరుమని పరుగులెత్తితే 208
బిఙ్ఞబిగుసుకొని పిలిచితే రావు 165
బొట్టుగట్టిన వానియింటికి 297
బొట్టువేలు సున్నమైతే 201
భక్తితో పిలిచి పెట్టిన యన్నము 253
భక్తిలేని పూజలేమిటికి 267
భక్తిలేని వ్రతములెన్ని చేసిన 271
మంచివాడనుచు కీర్తివహించే 258
మందగమన చెలుల మందగ
గూర్చేవు 103
మట్లవారిసీమ చీర 101
మడ్డిస్వరూపమా ఇట్లాడ తగునటే 184
మనసా చపలము మానవా 269
మనసు నొచ్చుకొని అసురుసురంటె 210
మనుషా నమ్మబోకే 237
మాటాడరా వేణుగోపాలా 246
మాసల కిరీదికరంగా 233
ముసలి బడుగుమీద యెంత
మోహమే 195
ముసలివాడైతేనే కసరేదా 196
మోమోటమేమిరా దానితో నీకు 296
మోసము పోవద్దురా 169
రమ్మనే ఈ మేను వానిసొమ్మదె 155

| | | | |
|---|---|---|---|
| రమ్మనే సామిని రమ్మనే | 109 | వంచనలకు గురుపీఠమురా | 142 |
| రాజీవాక్షిరో సామిని | 156 | వచ్చునా మునుపటి నెనరుంచి | 113 |
| రారా కొడ్లాడితేనే రారా | 97 | వట్టి చూపులతోనే | 150 |
| రారా చక్కని సామి | 293 | వక్కకైన నాస లేదు గదవే | 144 |
| రారా సామి నీకు మ్రొక్కేరా | 118 | వరకన్యాతిలక మీ వనిత పేరు | 93 |
| రావద్దటే నీవు జేసిన మేలుకు | 207 | వలచితినే నీపై ముద్దుబాలా | 135 |
| రావద్దు పొమ్మనవా మాయింటి | | వలచి యుండితే నీవు | 122 |
| దోవ | 102 | వలచి వచ్చిన దానరా | 161 |
| లంజవారి తమ్ములకే యిప్పుడు | 204 | వలదు యీ మాటలేలరా | 148 |
| లాలనుచు పూచేరు లలనలింపునను | 289 | వస్తే యెంతలోది రాకపోతే యెంత | 193 |


* * *